సర్వం సర్వేశ్వరుని సర్వోన్నతి కొరకే



భారత దేశ కతోలిక

# ఆణి ముత్యాలు

(పునీతుల చరిత్రలు)



సంపాదకులు:



ఫాదర్ వట్టి జోజి రెడ్డి SJ
ఫాదర్ బూరుగు సుధాకర్ SJ





Saints are not "Supermen"
who are "Born Perfect",
But rather are "Ordinary People"
who followed God
"With all their Heart".

We have a Lord
who is capable of crying with us,
capable of walking with us in the
most difficult moments of life.

Let us ask the Holy Spirit
to pour out upon us
a fervent longing to be saints
for God's greater glory,
and let us encourage one
another in this effort."

జగద్గురువులు
**ఫ్రాన్సిస్**



## ఫాదర్ రేమండ్ అంబ్రోస్

**Date of Birth & Place : 18th June, 1945 Pondicherry**
**Date of Ordination: 22nd December, 1971**
**Slept in the Lord : 7th July, 2020**

**Home for Disable** - నీడలేని నిర్భాగ్య దివ్యాంగులకు కొండంత అండగా,
**Amrutha Vani** - "కరుణామయుడు" సినిమా, భారతమిత్రం సమర్పకులుగా,
**APSSS** - అణగారిన దైవ ప్రజల బోధకశక్తిగా,
**Radio Veritas** - సుధలొలికించే సువార్త ప్రచారకులుగా,
**FABC** - ఆసియా దేశాల సమాచార సాధనాల ప్రయోక్తగా,
**Jeevan Press** - తెలుగు కతోలిక ఆధ్యాత్మిక సాహిత్య మిత్రునిగా,

విశ్వాస పురిత విశ్వవరునిగా తెలుగు శ్రీసభ నెంతో ప్రేమించి, యాభైయేండ్ల గురు జీవితంలో కతోలిక వికాసానికి బాటలు వేసి, 'దైవం మానుషరూపేణ' యని వివిధ మేత్రాసనములలో ఇతోధిక సేవలందించి, మోక్షగామి అయిన నిత్యకృషీవలుడు రేమండ్ అంబ్రోస్ గురు వర్యులకు మా ఆత్మీయ ప్రార్థనాపూర్వక నివాళి.

సెయింట్ పాట్రిక్స్ స్కూల్, సికింద్రాబాద్

## భారత దేశ కతోలిక

# ఆణి ముత్యాలు

## (పునీతుల చరిత్రలు)

**సంపాదకులు :**

**ఫాదర్ వట్టి జోజి రెడ్డి S.J.**

**ఫాదర్ బూరుగు సుధాకర్ S.J.**

Nihil Obstat :
**Fr. Koppala A.Stanislaus SJ**
Provincial
Andhra Jesuit Province

ప్రథమ ముద్రణ : జూలై 2020
ప్రతులు : 4000
వెల : రూ. 100
కవర్ రూప కల్పన : ఫాదర్ ఎస్. జ్వాకీమ్ రాజా S.J.
ముద్రణ : జీవన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్, సిక్ విలేజ్, సికిందరాబాదు
ప్రతులకు : ఫాదర్ దాసరి పాపయ్య S.J.
సత్యోదయం, 12-5-33, సౌత్ లాలాగూడ,
సికిందరాబాదు - 500 017, ఫోన్ : 9490658181

ప్రచురణ :
**జేసుసభ మండలము**
**(ఆంధ్ర - తెలంగాణ)**
సత్యోదయం, 12-5-33, సౌత్ లాలాగూడ, సికిందరాబాదు - 500 017

# విషయ సూచిక

**ముందు మాట** - *మహా ఘన. తుమ్మా బాల, హైదరాబాదు అగ్ర పీఠాధిపతులు*

**అభినందన** - *ఫాదర్ కొప్పుల అబ్రహాం స్టనిస్లాస్ S.J.,*
*ప్రొవిన్షియల్, ఆంధ్ర-తెలంగాణ జేసుసభ మండలం*


| | | | |
|---|---|---|---|
| 1. | పునీత తోమాసు, అపోస్తులులు | - *ఫాదర్ A. ఇలంగో, S.J.* | 01 |
| 2. | పునీత ఫ్రాన్సిస్ శౌరి, *S.J.* | - *ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* | 06 |
| 3. | ధన్య రుడాల్ఫ్ అక్వవీవా, *S.J.* | - *ఫాదర్ దాసరి పాపయ్య, S.J.* | 10 |
| 4. | పునీత గొన్సాలో గార్సియా, *OFM* | - *బ్రదర్ కొండవీటి అంతోని రాజు S.J.* | 12 |
| 5. | రాబర్ట్ డి నొబిలి, *S.J.* | - *కొటే వంశీధర్ & డోల సాగర్ బాబు (SJ Pre-Novices)* | 16 |
| 6. | పునీత జాన్ డి బ్రిట్టో, *S.J.* | - *ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* | 27 |
| 7. | పునీత జోసఫ్ వాస్, *ఒరేటరీ* | - *బ్రదర్ పొన్నకంటి అరవింద్ కుమార్ S.J.* | 30 |
| 8. | సంజీవనాథ స్వామి, *S.J.* | - *ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* | 34 |
| 9. | సత్యబోధ స్వామి, *S.J.* | - *ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.* | 44 |
| 10. | పునీత దేవ సహాయం, *గృహస్తులు* | - *ఫాదర్ పామిశెట్టి విజయరాజు, S.J.* | 51 |
| 11. | పునీత కురియాకోస్ చావరా, *CMI* | - *ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* | 56 |
| 12. | దైవ సేవకులు తాటిపత్రి జ్ఞానమ్మ, *గృహస్తులు* | - *ఫాదర్ బెల్లంకొండ ఇన్యాశ శౌరయ్య, S.J.* | 61 |
| 13. | దైవ సేవకులు ఎలీష్వా, *CTC / CMC* | - *ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.* | 71 |

**14.** **దైవ సేవకులు ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్,** *MHM*

*- బ్రదర్ మెట్టి ఆశీర్వాదం, S.J.* 76

**15.** **దైవ సేవకులు కాన్‌స్టంట్ లీవెన్స్,** *S.J. – ఫాదర్ దాసరి తంబి క్రాంతి కుమార్, S.J.* 81

**16.** **దైవ సేవకులు సిల్వియో పాస్క్వాలి,** *PIME – ఫాదర్ గోపు కిరణ్ కుమార్, S.J.* 89

**17.** **పూజ్యులు ఆగ్నెలో డి సూజ,** మేత్రాసన గురువు *-బ్రదర్ దుర్గం వంశీ S.J.* 96

**18.** **దైవ సేవకులు రేమండ్ మస్కరేనస్,** మేత్రాసన గురువు

*- ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* 99

**19.** **పునీత మరియం త్రెసియా,** *తిరుకుటుంబ సభ-బ్రదర్ కాట్రు పళ్లంరాజు S.J.* 103

**20.** **పునీత యుఫ్రేసియా,** *CMC -పోకల మోజెస్ & కొండెపోగు అంతోనిరాజు* 106
*(SJ Pre-Novices)*

**21.** **దైవ సేవకులు లూయి లెవె,** *S.J. - ఫాదర్ పాము విద్యాసాగర్, S.J.* 111

**22.** **దైవ సేవకులు మేరి గ్లోరి,** *JMJ -ఫాదర్ బుల్లా రమేష్ బోస్కో, S.J.* 119

**23.** **దైవ సేవకులు జోసఫ్ తంబి,** *OFM (Cap)*

*- ఫాదర్ నాగోతు శౌరి కిశోర్ కుమార్, S.J.* 126

**24.** **ధన్య అగస్టిన్,** మేత్రాసన గురువు *- ఫాదర్ గోగులపాటి అవినాష్, S.J.* 131

**25.** **దైవ సేవకులు పీటర్ రెడ్డి,** *OFS (Cap) - ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* 136

**26.** **పూజ్యులు స్టీఫెన్ ఫెర్రాండో,** *SDB - ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* 143

**27.** **పునీత మదర్ తెరెసా,** *MC - ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.* 146

**28.** **పునీత అల్ఫోన్సా,** *FCC - ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* 154

**29.** **దైవ సేవకులు పేత్రా మ్యోనిగ్మాన్,** *DSS - ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.* 160

**30.** **ధన్య రాణి మరియ,** *FCC - ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.* 166

# FOREWORD



"Again, the kingdom of heaven is like a merchant in search of **Fine Pearls**, who, on finding one pearl of great value, went and sold all that he had and bought it." (Mt 13:45-46). This spiritual book "**Aani Muthyalu**" (Fine pearls), is about the lives of Saints, Blesseds, Servants of God and Holy Men & Women who were born, or worked in our great land, INDIA. They worked tirelessly to quench the thirst of the times. This book enables us to be acquainted with lesser known Saints, Blesseds, Servants of God and Holy Men & Women honored by the Mother Church. In this complex world where values systems are getting blurred, the life testimony of these holy men and women enables us to find timely and integral answers to surmount contemporary problems. They found meaning in their lives by following the crucified Lord and with that strength and grace they spread the kingdom of God which was their sole life-goal. Reading and learning about the lives of these Holy men and women will put us in the right direction in a world that seems to be more disoriented by the day. Their contribution to the Indian Catholic Church in particular, certainly gives us joy and instills faith, hope and charity in us.

Sometime in the past, I was pondering on how the lives of "our" saints, *Aani Muthyalu,* can be made popular, especially in the Telugu region, so that the reader can be edified by their ability to integrate the Catholic spirituality with contemporary

Indian way of living. I feel God has used the services of Fr Vatti Joji SJ and Fr Burugu Sudhakar SJ in responding to this pastoral yearning. The well-known charism of St. Ignatius of Loyola, the founder of the Society of Jesus, to rise to the signs of the times has been positively realized in this spiritual treasure, *Aani Muthyalu.* Telugu Catholic Bishops' Council (TCBC), I think will certainly rejoice, and all readers, over this book as it makes available for the local Church an edifying spiritual enhancement. I congratulate Fr. Vatti Joji Reddy, SJ, Superior of St. Patrick's High School, Secunderabad and Fr. Burugu Sudhakar, SJ, Vice-Principal of Loyola (YSRR) College, Pulivendula, for taking the lead to bring out this book with the help of other Jesuit writers.

The local Church is indebted to the Society of Jesus for their invaluable contribution to the spread of the gospel message in the Telugu region. I am grateful to Fr Koppala A Stanislaus, SJ, the Provincial of Andhra Jesuit Province and the members of his province for their loving and unfailing support to the local church at all levels.

I wish you all a prayerful reading to savor the spiritual treasure, *Aani Muthyalu.* May the maternal intercession and assistance of Fatima Mata always be with us, so that God's blessings of peace and joy may be granted in abundance.

Yours in Christ Jesus,

+ Thumma Bala

**+ Thumma Bala**
Archbishop of
Hyderabad

July 3, 2020
Feast of St. Thomas



# APPRECIATION

**Saints** in the Catholic Church are like precious pearls (ఆణిముత్యాలు) adorning the crown of Christ the King, a servant leader. Our country is a land of divinity filled with great saints, sages and gurus of the past and present inspiring millions of mortals to realize our true self. This book is a list of lives of Catholic Saints, Blesseds, Venerables, and Servants of God both men and women religious and clergy born in various parts of India and the world but lived, served and died in our Mother land.

Gripped by the birth, life, suffering, death and resurrection of Christ our Lord, these holy men and women, during their earthly pilgrimage were closer to a company of innumerable angels and saints to bear witness to Lord in whom they believed. What seems to be common among them is that holiness is both a gift and an invitation and that they possessed Christ our Lord and were irresistible to share the same experience with others in various forms of charism and ministry. Being Indians or adapting to Indian culture, understanding the spirituality of the East, inculturating and adapting to various regions, languages, cultures, etc. they maintained and propagated Christian faith and belief blending with Indian ethos and spirituality.

Saints are not unreachable human beings. They've walked the difficult paths of life along which we travel, with all its successes and failures. Holiness cannot be achieved through our own strength. It is the fruit of God's grace and our free response to it, making it both a gift and a call. They seemed to have lived ordinary lives with extraordinary simplicity, humility and

nobility. They worked indefatigably to reach out to many people to share the value of Christ and the Gospel like the merchant of the Gospel (Mt 13:45-46) in search of fine Pearl, spent their lives for the sake of others while ultimately attaining the One Pearl that is Christ.

This collection of Indian Saints is a rare book in Telugu. It will be received well and read extensively. It will help numerous faithful to know the way God has led these noble men and women to offer their lives for God's work to be sown like a Gospel seed to sprout in the hearts of people of our Telugu land. It will inspire countless faithful to experience God and to know God's Will in their lives.

I appreciate all writers and **Frs Vatti Joji SJ & Burugu Sudhakar SJ,** the editors, for their efforts and perseverance in bringing out this volume. May God continue to reward them with more energy and strength to work for more such literature in Telugu for Telugu Catholics across the world. I implore these saints to intercede for all who contributed. I thank sincerely **His Grace Thumma Bala,** Archbishop of Hyderabad, for his Foreword to this valuable addition to Telugu Catholic Literature. May his blessings and guidance continue to guide us to work for the Kingdom of God in our Telugu land.

Let's raise our eyes to heaven without forgetting the realities of the earth, but to face them with more courage and hope at the current global health crisis of Covid-19. We'll beseech our Blessed Mother, to accompany us as a sign of consolation and sure hope.

**Fr Koppala A Stanislaus SJ**
Provincial
Andhra-Telangana Jesuit Province
Satyodayam, 12-5-33,
South Lallaguda,
Secunderabad 500 017

31st July, 2020
Feast of St. Ignatius

# సంపాదకుల పలుకులు

"మీరు వెళ్లి, సకల జాతి జనులకు పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున జ్ఞానస్నా మొసగుచు, వారిని నా శిష్యులను చేయుడు" అను ప్రభు యేసు అంతిమ సందేశాన్ని అనుసరించి పునీత తోమాసు గారు, పునీత ఫ్రాన్సిస్ శౌరి గారలు మన భారతదేశం ఏతెంచి, మనకు క్రీస్తు ప్రభుని బోధలను అందించి, దైవరాజ్య విలువలతో, మంచి విశ్వాసముతో నిండిన భారత శ్రీసభను స్థాపించారు. వారి అడుగు జాడలలో ఎందరో విదేశీ సువార్తా బోధకులు విచ్చేసి, శ్రీసభను సుస్థిర పరచారు. క్రమేణా స్థానిక భారతీయులే శ్రీసభ సంరక్షకులుగా, బోధకులుగా ఎదిగారు. ఎందరో పుణ్యశీలురు తమదైన విశిష్ట శైలిలో యేసుప్రభుని శిష్యరికం చేసి శ్రీసభ మనుగడకు, వ్యాప్తికి తమ వంతు ప్రయత్నించి, భారతీయ కతోలిక చరిత్రలో ఆణి ముత్యాలుగా చిరంజీవులై నిలిచారు. అట్టి వారిలో కొందరిని కతోలిక శ్రీసభ దైవ సేవకులు, ధన్యులు, పూజ్యులు, పునీతులుగా ప్రకటించి, క్రైస్తవులకు ఆదర్శంగా నిలిపింది.

వారిలో మన తెలుగు శ్రీసభకు ఇతోధికంగా సేవలందించిన తాడిపత్రి జ్ఞానమ్మ, ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ MHM, ఫాదర్ సిల్వియో పాస్క్వాలి PIME, బ్రదర్ జోసఫ్ తంబి OFM (Cap), సిస్టర్ మేరి గ్లోరి JMJ లను దైవ సేవకులుగా ప్రకటించింది. వారితో పాటు భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో సేవలందించి శ్రీసభ గుర్తింపు పొందిన పూజ్యుల జీవితాలను, మన తెలుగు శ్రీసభకు ముఖ్యులైన జేసుసభకు చెందిన సంజీవనాథ స్వామి, సత్యబోధ స్వామి వారల సంక్షిప్త జీవిత చరిత్రలను ఈ పుస్తకంలో పొందుపరచి, మీకందిస్తున్నాం. ఇందులో పాల్గొన్న మా సహచర జేసు సభ సభ్యులందరికి ప్రత్యేక ధన్యవాదములు.

మేము చేసిన ఈ చిన్న ప్రయత్నాన్ని ఆశీర్వదించి, అభినందిస్తూ తొలి పలుకులు వ్రాసిన హైదరాబాదు అగ్రపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ తుమ్మా బాల ఏలినవారికి, తమ పరిచయ వాక్కులనందించి, మమ్ము అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న మా జేసుసభ ప్రొవిన్షియల్ ఫాదర్ కొప్పల అబ్రహాం స్టనిస్లాస్ SJ గారికి హృదయపూర్వక ధన్యవాదములు. ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్న సెయింట్ పాట్రిక్స్ పాఠశాల, అందలి జేసుసభ సభ్యులకు, ముఖ్యంగా ఫాదర్ A. ఇలాంగో SJ కు ధన్యవాదములు. దీనిని అందంగా ముద్రించిన జీవన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ యాజమాన్యమునకు, సిబ్బందికి మా నమస్సులు.

**- ఫాదర్ వట్టి జోజిరెడ్డి SJ, ఫాదర్ బూరుగు సుధాకర్ SJ**



## భారతదేశ అపోస్తులులు

# 1. పునీత తోమాసు

(పరలోక ప్రాప్తి 72)

ఫాదర్ A. ఇలంగో, S.J.

పునీత తోమాసు యేసుప్రభుని పన్నెండుమంది అపోస్తులలో ఒకడు. అతడు గలిలయ ప్రాంతమందలి ఒక యూద కుటుంబంలో జన్మించాడు. సువార్తలలో అతనిని దిదీము అనబడు తోమాసుగా వ్యవహరించారు. గ్రీకు భాషలో దిదీము అనగా కవల పిల్లలలో ఒకడు. అతడు చేపలు పట్టే జాలరి కాదని తెలుస్తుంది. తోమాసు యేసుప్రభువుని శిష్యుడని నాలుగు సువార్తలలోను, అపోస్తులుల కార్యములలో స్పష్టంగా చెప్పబడింది.

అపోస్తులుడైన తోమాసు దైవరాజ్యమునకు సంపూర్తిగా అంకితమయ్యాడు. యేసుప్రభుని అనుసరించటంలో ఎంతో ధైర్య సాహసాలను ప్రదర్శించాడు. అతడు ఏ విధంగా ప్రభుని పిలుపు పొందాడో బైబులులో వ్రాయబడలేదు. కాని అతడు ప్రభుని శిష్యునిగా ఎంతో చక్కని పాత్రను పోషించాడు. అతడు కొంత దుందుడుకు స్వభావం కలవాడు. సత్యాన్వేషణలో ఎప్పుడూ ముందున్నాడు. అతడు గ్రుడ్డిగా ఏదీ నమ్మలేదు. పిల్లల మనస్తత్వంతో, ప్రశ్నలు మీద ప్రశ్నలు వేసే తత్వం అతనిది. తెలివిగా ప్రశ్నలు వేసి, ప్రభుని నుండి చక్కని సమాధానాలు రాబట్టి, పూర్తిగా విశ్వసించటంలో ఘనుడు.

పునీత యోహాను సువార్తలో తోమాసును రెండు ముఖ్య సంఘటనలలో ప్రస్తావించారు. మొదటిది లాజరు వృత్తాంతం. రెండవది యేసు ప్రభుని పునరుత్థానం. యూదా సీమలోని బెతానియాలో లాజరు, అతని సోదరీమణులు మరియమ్మ, మార్తమ్మల కుటుంబం ఉంది. వారంతా ప్రభుని అమితంగా ప్రేమించి, దైవ రాజ్యమును గురించి చక్కని అవగాహన ఉన్నవారు. ప్రభునికి పలుమార్లు ఆశ్రయమిచ్చిన కుటుంబం వారిది. లాజరు మరణించిన వార్త వినగానే యేసు వెంటనే బెతానియా వెళ్ళ నిర్ణయించుకున్నాడు. యేసుని రాళ్ళతో కొట్ట యూదులు ప్రయత్నించిన సంఘటన శిష్యుల కళ్ళముందు మెదలాడింది. శిష్యులు కొద్దిగా భయకంపితులయ్యారు. కనుక యేసుని వెళ్ళవద్దని వారించారు. కాని ప్రభువు వెళ్ళటానికి నిశ్చయించుకోగానే, తోమాసు ధైర్యంగా ముందుకు వచ్చాడు. "మనము కూడా వెళ్ళి, ఆయనతోపాటు చనిపోవుదము"

అని యేసుని మాటలకు వత్తాసు పలికి, గురువుతోనే శిష్యులు కూడా అని చెప్పి, యేసుకు మనోధైర్యం కలిగించాడు. ఆ విధంగా తోమాసు, మరణానికి భయపడే పిరికివాడు కాదు. ఎంతో గుండె ధైర్యం కలిగిన విశ్వాస పాత్రుడు.

యేసుని కడరా భోజనానికి ముందటి ఉపదేశాలు క్రైస్తవులకు చాలా ముఖ్యమైనవి. యేసు పరలోక నిత్య నివాసము గురించి వివరించే సమయంలో తోమాసు అడ్డు తగిలి 'ప్రభూ! మీరు వెళ్ళు స్థలమేదో మాకు తెలియదు. ఇక మార్గమెట్లు ఎరుగుదము?'' అని అమాయకంగా ప్రశ్నించాడు. యేసుని మరణ పునరుత్థానముల అంతరార్థాన్ని ఇతర శిష్యులవలె తోమాసు కూడా గ్రహించక అడిగిన ప్రశ్నలకు, ప్రభువెంతో చక్కగా సహనంతో అందరికీ అర్థమయ్యేలా ''నేనే మార్గం, సత్యం, జీవం. నా మూలమున తప్ప, ఎవడును తండ్రి వద్దకు రాలేడు'' అని తన రక్షణ మార్గాన్ని, తన దైవత్వాన్ని తేటతెల్లం చేశాడు.

తోమాసు సందేహశీలి యని జగమెరిగిన విషయం. యేసుని పునరుత్థానం పిమ్మట ప్రభువు, శిష్యులకు దర్శనమైనా ప్రభుని పునరుత్థానం నమ్మని వ్యక్తి తోమాసు. ''యేసుని గాయాలు చూడాలి. వానిలో చేయి, వ్రేలు పెట్టాలి. అప్పుడే నేను విశ్వసిస్తాను'' అని తోమాసు పునరుత్థానంపై అపనమ్మకం వ్యక్తం చేసాడు. తోమాసు కోసం ప్రభువే స్వయంగా మరోమారు తోమాసు, ఇతర శిష్యులకు దర్శనమిచ్చి ''నీ వ్రేలు ఇక్కడ ఉంచు. నీ చేయి నా ప్రక్కలో ఉంచు'' అని తోమాసును కోరగా, ''నా ప్రభూ! నా దేవా!'' అని పునరుత్థానుడైన ప్రభువుపై కొండంత విశ్వాసాన్ని తోమాసు కనబరచాడు. ఈ వృత్తాంతమంతా తోమాసు అవిశ్వాసం కంటే, అతని గట్టి విశ్వాసాన్ని బయలు పరుస్తుంది. ''చూడక పోయినను, నన్ను విశ్వసించువారు ధన్యులు'' అని యేసు ఒక్క అనుగ్రహ వచనంతో తరతరముల క్రైస్తవ విశ్వాసులను ధన్యులను చేయటానికి తోమాసు మూల కారణమయ్యాడు. తిబెరియా సరస్సు తీరమున ప్రభువు దర్శనమై, చేపల వేటను ఆశీర్వదించి, రొట్టెను విరిచి శిష్యులకు పంచి, యేసు స్వయంగా భుజించిన వృత్తాంతంలో, తోమాసు కూడా మరోమారు ప్రభుని గాంచి, స్థిర విశ్వాసానికి ప్రతీకగా నిలిచాడు.

తోమాసు యేసుని మోక్షారోహణానికి ఒక ప్రత్యక్ష సాక్షి అయ్యాడు. ఆ మహత్తర ఘటన అనంతరం తోమాసు, ఇతర శిష్యులతో, యేసు తల్లి మరియమ్మతో కలసి ఎడతెగక ప్రార్థించినట్లు అపోస్తులుల కార్యములలో గ్రంథస్థం చేయబడింది. పేతురు నాయకత్వాన్ని తోమాసు అంగీకరించాడు. మరియతల్లి మాతృకను తోమాసు నిండుగా విశ్వసించాడు. నూతన నిబంధనలో తోమాసు జీవితాన్ని గురించిన ప్రస్తావన ఇంతటితో ముగుస్తుంది.

పెంతెకోస్తు పండుగనాడు అపోస్తులులపై పవిత్రాత్మ అగ్ని నాలుకల రూపంలో దిగివచ్చి, వారందరిని యేసుప్రభుని యందలి విశ్వాసంలో ఎంతో బలపరిచింది. అప్పటి వరకు భయభ్రాంతులై ఉన్న శిష్యులంతా ఆత్మ విశ్వాసంతో ధైర్యవంతులై, ప్రభు సువార్తను ప్రపంచ నలు దిశలా ప్రకటించ ఉద్యుక్తులయ్యారు. శ్రీసభ సంప్రదాయానుసారం, తోమాసు పార్తియులకు, మిదీయులకు, పర్షియా వాసులకు ప్రభువాక్యము బోధింప పంపబడ్డాడు. చాలా పూర్వకాలం నుండే తోమాసు వ్రాసినట్లు కొంత అనధికార సాహిత్యం ప్రచారంలో ఉంది. అందులో ఒకటి ''తోమాసు వారి కార్యములు.'' అందులో అపోస్తులులు ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రభుని రాజ్యం ప్రకటించాలని, దాని కోసమై ఒక్కొక్క అపోస్తులునికి ఒక్కో ప్రాంతం కేటాయించబడింది. అందులో భాగంగా తోమాసుకు భారతదేశం వెళ్ళే వంతు వచ్చింది. కాని తోమాసు తనకు ఆరోగ్యం సరిగాలేదని తప్పుకోవాలని భావించాడు. క్రీస్తు ప్రభువే దర్శనమై ప్రోత్సహించినా, తోమాసు మనసు మారలేదు. ప్రభువు ఒక వ్యాపారస్థునికి దర్శనమిచ్చి, బానిసగా తోమాసుని అమ్మినట్లు, అతడు తిరిగి తోమాసును భారతదేశంలోని ఓ రాజుకు అమ్మినట్లు ఒక కథనం.

''తోమాసు వారి కార్యములు'' అను గ్రంథంలో తోమాసు ఉత్తర భారతదేశంలోని గొండోఫరస్ రాజు వద్దకు వచ్చి, రాజుకొక చక్కని రాజభవనం కట్టిస్తానని ధనం తీసుకుని, ఆ డబ్బంతా పేదలకు దానం చేసాడని, కట్టిన రాజభవనాన్ని చూపమని కోరినపుడు, తాను భవనం కట్టడం వాస్తవమని, కాని ఆ రాజభవనం ఈ లోకంలో కాదు, పరలోకంలో నిర్మించానని సెలవు ఇచ్చాడంట. పిమ్మట దైవ చిత్తాన్ని అనుసరించి, తోమాసును ఆ రాజు బానిసత్వం నుండి విడుదల చేయగా, యేసుప్రభుని పేరిట అనేక క్రైస్తవ సంఘాలు ఏర్పరచి, వారికోసం పలు దేవాలయాలు కట్టించాడని కొందరి నమ్మకం. ఆ తరువాత లభించిన చారిత్రక ఆధారాల ప్రకారం గొండోఫరస్ అనే రాజు క్రీ.శ. 46లో హిమాలయాలకు ఉత్తర భూభాగాన్ని పాలించాడని, ఆ కాలంనాటి నాణెములు దాదాపు ఆ పేరుగల రాజు క్రీస్తు శకం 20 నుండి 46 వరకు నివసించాడని కొందరు పరిశోధకుల అభిప్రాయం. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదు. అదంతా అప్పటి చారిత్రక నేపథ్యంతో, తరువాత మూడు శతాబ్దాలకు వ్రాసిన అభూత కల్పన యని మరికొందరి భావన.

అపోస్తులుడైన తోమాసు భారతదేశమందలి ప్రస్తుత కేరళలోని మలబారు తీరంలో ప్రభుని సువార్తను స్వయంగా ప్రకటించి, చక్కని కతోలిక సంఘాన్ని స్థాపించాడని పలువురి చరిత్రకారుల అభిప్రాయం. తోమాసు క్రీస్తు శకం 52లో హెబ్బన్ అను ఒక యూదా వ్యాపారితో కొడుంగల్లూరు చేరుకున్నాడు. అప్పటికే కొడుంగల్లూరులో యూదుల నివాస స్థావరం ఉండటంతో, యూదుల చెంతకు తోమాసు ఏతెంచాడు. క్రైస్తవులైన యూదులకు మెసపటేమియా, పర్షియా దేశస్తుల సహాయ సహకారాలు చాలాకాలం నుండి ఉన్నాయి.

కేరళ ప్రాంత క్రైస్తవులను ప్రాచీన కాలం నుండి ‘తోమాసు వారి క్రైస్తవులు” అని పిలవటం ఆనవాయితీగా వస్తుంది. ఆ తోమాసు మరెవరో కాదు, సాక్షాత్తు యేసుప్రభుని పన్నెండు మంది శిష్యులలో ఒకడని గట్టి నమ్మకం. తోమాసు సముద్ర మార్గాన గురువాయూరు సమీపంలోని పాలయూరు రేవు చేరుకున్నాడు. అక్కడ ధనవంతులు, చాలా పలుకుబడి గలిగిన నాలుగు హిందూ కుటుంబాలకు తోమాసు స్వయంగా జ్ఞానస్నానమిచ్చాడని తెలుస్తుంది. పిమ్మట తోమాసు పాలయూరును విడచి దక్షిణ కేరళకు వెళ్ళాడు. అతడు మొత్తం మీద కేరళలో “ఏడున్నర దేవాలయాలను” నిర్మించాడు. ఆ దేవాలయాలు ఏమనగా: కొడుంగల్లూరు, కొల్లం, నిరానం, నీలకల్ (చాయల్), కొక్కమంగళం, కొట్టక్కాయల్ (పరవూరు), పాలయూరు (చట్టు కులాంగరై). తిరువితింకోడు (ట్రావన్కూరు)లో సగం దేవాలయం మాత్రమే నిర్మించాడు. “తోమా పర్వం” అనే పద్యకావ్యంలో కేరళలోని ప్రథమ క్రైస్తవ మత స్వీకారం గురించి, తోమాసు వారు మలబారు ప్రాంతమునకు వచ్చి పలు దేవాలయాలు నిర్మించటం గురించి వ్రాయబడింది. అందులో ఇంకా యూదులు, స్థానికులు, కొడుంగల్లూరి రాజకుటుంబీకులు ఏవిధంగా తోమాసు వారి పవిత్ర హస్తాల మీదుగా జ్ఞానస్నానం స్వీకరించారో విపులంగా చెప్పబడింది. అప్పటి తోమాసు వారి క్రైస్తవులు ఉన్నత వర్గాలైన బ్రాహ్మణులు. కాబట్టి వారు మధ్యయుగం వరకు అగ్రవర్ణాల ఆచార వ్యవహారాలను ఆచరించారు. ముఖ్యంగా పవిత్ర జంధ్యం వేసుకుని, పిలకను ధరించారు.

ప్రభుని శిష్యుడైన తోమాసు తన రెండవ భారతదేశ యాత్రలో తూర్పు తీరమందలి ప్రస్తుత మద్రాసు నగరంలో ఉన్న మైలాపూరు ప్రాంతం చేరుకున్నాడు. అక్కడ దైవ వాక్కును ప్రకటించి, పలువురిని క్రైస్తవ మతంలోకి స్వీకరించాడు. దానితో స్థానిక హిందూ గురువులు ఆయనపై కన్నెర్ర చేశారు. కనుక తోమాసు మైలాపూరుకు నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ప్రస్తుతం సెయింట్ థామస్ మౌంట్‌గా పిలువబడుచున్న పెద్ద కొండకు వెళ్లాడు. తోమాసు కొన్ని నెలలు, అడయార్ నదీ తీరాన లిటిల్ మౌంట్ (చిన్న కొండ)గా వాడుకలో వున్న ప్రాంతమందు కొన్ని నెలలు ప్రార్థనలో లీనమయ్యాడని ప్రతీతి. తోమాసు వారి శత్రువులు, ఆయనను వెదికి, పెద్ద కొండలోని ఒక రాతి బండపై ప్రార్థించుచున్న తోమాసును చూచి, అతనిని ఈటెతో పొడిచి చంపారు. తోమాసు క్రీస్తు శకం 72వ సంవత్సరం జూలై 3వ తారీఖున మరణించాడు. అతని మరణానంతరం, తోమాసు వారి భౌతిక కాయాన్ని మైలాపూరులో తాను నిర్మించిన దేవాలయంలోనే భూస్థాపితం చేశారు. తోమాసు వారి సమాధిపై పోర్చుగీసు వారు 16వ శతాబ్దంలో శాంతోమ్ చర్చిని నూతనంగా నిర్మించారు. అదే నేటి మద్రాసు అతిమేత్రాసన కతెడ్రల్‌గా రూపొందింది.

అపోస్తులుడైన తోమాసు కాలంనాటి మెసపటోమియాలోని ఇడెస్సా నగరం

భారతదేశ క్రైస్తవ సంఘానికి ముఖ్య నగరం మరియు కేంద్ర బిందువు. ఇడెస్సాకు, భారతదేశానికి సంబంధ బాంధవ్యాలు చాలా ప్రాచీనమైనవి. క్రీ.శ. 232లో మైలాపూరును మొదటి వాసుదేవ రాజు పరిపాలించాడు. అతడు తోమాసు వారి భౌతిక అవశేషాలను ఇడెస్సాకు పంపగా, వారు వాటిని భక్తియుతంగా స్వీకరించి భద్రపరిచారు. తరువాత ఆ అవశేషాలలో కొన్నింటిని 1258లో గ్రీసు దేశపు ద్వీప వాణిజ్య కేంద్రమైన చియోస్‌కు పంపారు. మరికొన్నింటిని ఇటలీ దేశంలోని ఒర్తోనాకు పంపారు. అవి ఒర్తోనా లోని పునీత తోమాసు వారి కతెడ్రల్‌లో నిక్షిప్తపరిచారు. తోమాసు వారి కపాలమును గ్రీసు ద్వీపమైన పట్‌మోస్ నందలి వేదాంత పండితుడగు పునీత యోహాను గారి సన్యాస ఆశ్రమంలో ఉన్నదని శ్రీసభ విశ్వాసం.

మరియమాత మరణించినపుడు అందరు అపోస్తులులు ఆమె చెంతనే ఉన్నారు. అపుడు తోమాసు భారతదేశ సువార్త సేవలో ఉన్నాడు. పునీత తోమాసు వారు కొంతకాలం తరువాత మరియమాత సమాధిని సందర్శించే సమయంలో మరియమాత మోక్షారోహణమైందని, ఆ సంఘటనను తోమాసు వారు మాత్రమే ప్రత్యక్షంగా చూశారని ఒక గ్రంథంలో చెప్పబడింది. అప్పుడు ఆ సమాధిలో ఆమె నడుంకు కట్టుకున్న త్రాడు మాత్రమే మిగిలింది. కనుకనే తోమాసు వారి చిత్రపటాలలో తోమాసు వారితోపాటు, మరియతల్లి నడుం త్రాడును కూడా చిత్రీకరించటం మధ్యయుగంలో గమనిస్తాం. తోమాసు వారిని, సువార్తతో కూడిన తోలు ఫలకం తోను, యేసుప్రభుని గాయాలను స్పర్శిస్తున్న వ్యక్తి గాను పలు చిత్రాలలో చిత్రీకరించారు. తోమాసుగారు భారతదేశానికి, భవన ఆకృతి శిల్పులకు, పాలక పునీతులు. పునీత తోమాసు వారి పండుగను విశ్వవ్యాప్తంగా జూలై 3న జరుపుతారు.





ఆసియా దేశాల ఆశాజ్యోతి

# 2. పునీత ఫ్రాన్సిస్ శౌరి

(1506-1552)

ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.

భారత దేశములో ఫ్రాన్సిస్ శౌరివారి పేరు తెలియని కతోలికులెవరైనా ఉంటే, అది ప్రపంచంలోని ఎనిమిదవ వింతయని చెప్పక తప్పదు. ఎందుకనగా భారతదేశ శ్రీసభ చరిత్రలో ఫ్రాన్సిస్ శౌరి వారికి అంతటి విశిష్ట స్థానముంది. ఫ్రాన్సిస్ శౌరివారు ఏప్రిల్ 7, 1506న స్పెయిను లోని జేవియర్ కోటలో యువాన్, మరియలకు అయిదవ సంతానముగా జన్మించాడు. శౌరివారి బాల్యంలో, ఆ రాజ వంశము ఫ్రాన్సు దేశంతో చేతులు గలిపి, స్పెయిను దేశంపై యుద్ధం చేసి తీవ్రంగా నష్టపోయింది. వారి ప్రాబల్యంలోనున్న నవారా కోటను, స్పెయిను వారు చేజిక్కించుకునే నాటికి, ఫ్రాన్సిస్‌కు పందొమ్మిదేళ్ళు. ఆ వయసులో ఫ్రాన్సిస్ పారిస్ విశ్వ విద్యాలయం చేరి, అయిదేండ్లు కష్టించి చదివి. ఎం.ఎ. పట్టాన్ని పుచ్చుకున్నాడు. చదువులలో ప్రజ్ఞావంతుడైన ఫ్రాన్సిస్ శౌరి, కొలదికాలములోనే తత్వ శాస్త్రంలో డాక్టరేట్ పట్టాన్ని 1530లో పొంది, ఆ విశ్వ విద్యాలయములోనే బోధించసాగాడు.

మంచి పేరు ప్రఖ్యాతుల కోసం, సుఖ జీవనం కోసం, విశ్వ విద్యాలయము లోను, శ్రీసభలోను చక్కని భవిష్యత్తు కోసం, ప్రాకులాడుతున్న ఫ్రాన్సిస్‌లోని పట్టుదలను, అసమాన పాండిత్యాన్ని గమనించిన ఇగ్నేషియస్ లొయోలా, అతణ్ణి సంపూర్తిగా మార్చి, దేవుని వైపు మరల్చాలని పట్టువదలని విక్రమార్కునిలా అతని వెంటబడ్డాడు. ఫ్రాన్సిస్ కోసం ఇగ్నేషియస్ దారిలో కాపుగాచి "ఫ్రాన్సిస్! ప్రపంచాన్నంతటిని జయించి, నీ ఆత్మను కోల్పోయిన నీకేమి లాభం?" అని నిత్యం ప్రశ్నించేవాడు. ఫ్రాన్సిస్‌లోని చక్కని గుణగణాలను, స్థిరసంకల్పాన్ని, కార్యదీక్షను దేవుని సంపూర్ణ సేవకు వినియోగించాలని, ఫ్రాన్సిస్‌పై ఇగ్నేషియస్ సాగించిన సమరంలో, ఫ్రాన్సిస్ ఓడిపోయాడు. ఫ్రాన్సిస్ శౌరివారు అప్పటి నుండి (1534) ఇగ్నేషియస్‌కు చక్కని మిత్రుడయ్యాడు.

ఇగ్నేషియస్, తదితర సహచరులతో కలిసి, ఫ్రాన్సిస్ 1534 ఆగష్టు 15న పేదరికము, బ్రహ్మచర్యము, పాలస్తీనా సందర్శన అను మూడు వ్రతాలను తీసుకుని, తన అనుంగు మిత్రుడు ఇగ్నేషియస్ ఇచ్చిన "ఆధ్యాత్మిక సాధనలు" అనే ముప్పది రోజుల ధ్యానాన్ని

కడునిష్ఠతో గావించి, ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని, దైవానుభూతిని పొందాడు. ఫ్రాన్సిస్ జూన్ 24, 1537న గురు పట్టాభిషేకం పొందాడు. పరిస్థితులు అనుకూలించనందున, వారందరు పాలస్తీనా వెళ్ళలేక పోయారు. అప్పుడు ఫ్రాన్సిస్ కొంతకాలం బొలొగ్నా పట్టణములో బోధించాడు. పిమ్మట ఫ్రాన్సిస్‌కు ఆరోగ్యము సరిగా లేనందున, ఇగ్నేషియస్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా కొంతకాలం పనిచేశాడు.

ఆ కాలంలో పోర్చుగల్ రాజు, తూర్పు దేశాలకు కొందరు బోధకులను పంపమని, తన రోము నగర రాయబారి ద్వారా, ఇగ్నేషియస్‌కు వర్తమానం పంపగా, ఇగ్నేషియస్, రాజుగారి విజ్ఞప్తిని మన్నించి, రోడ్రీగ్వస్, బొబడిల్లా గురువులను ఎంపిక చేశాడు. సుదీర్ఘప్రయాణం చేసి, రోము నగరం చేరుకున్న బొబడిల్లా అస్వస్థుడు గాకా, మార్గాంతరం లేక ఇగ్నేషియస్, తన ప్రియ శిష్యుడైన ఫ్రాన్సిస్ శౌరి వారిని పంప నిశ్చయించాడు. ఒక్క రోజులోనే సామానంతా సర్దుకొని, 1540 మార్చి 16న ఫ్రాన్సిస్ రోమును వీడి, పోర్చుగల్‌కు ప్రయాణమయ్యాడు. రోము నుండి బయలు దేరిన రెండు సంవత్సరాలకు, ఫ్రాన్సిస్ శౌరి 1542 మే ఆరున, గోవా పట్టణంలో తన పవిత్ర పాదాన్ని మోపాడు.

గోవాలోని పోర్చుగీసు వారి మధ్య ఫ్రాన్సిస్ అయిదు నెలలు పనిచేసి, అనంతరము తమిళ భాష కొంచెము నేర్చుకొని, ప్రస్తుత తమిళనాడు తూర్పు తీరాన గల పరవలనే వారిని క్రైస్తవ మతం లోనికి మొట్ట మొదట స్వీకరించాడు. భాష తెలియని ఫ్రాన్సిస్, ఇద్దరు అనువాదకులతో ఒక పద్ధతి ప్రకారము ప్రతి పట్టణము, ప్రతి పల్లె తిరిగి, పిల్లలకు, పెద్దలకు సంక్షేపము నేర్పించి, విశ్వాస సత్యాలను ఎరుకచేసి, అటు పిమ్మట పది ఆజ్ఞలను, జపములను వివరించి, కొలది సంవత్సరాలలోనే పది లక్షల మందికి జ్ఞాన స్నానమిచ్చి, చక్కని శ్రీసభ సంఘాన్ని తయారు చేశాడు. ఫ్రాన్సిస్ క్రైస్తవ గ్రామాలలో ఉపదేశులను నియమించి, క్రైస్తవుల ఆలనా పాలనా బాధ్యతలను వారికి అప్పగించి, 1544లో మలబారు తీరమున గల ట్రావన్కూరు రాజ్యం వైపు పయనించి, అక్కడ క్రీస్తు వేదాన్ని బోధించి, లక్షమందికి జ్ఞానస్నాన భాగ్యం కల్పించాడు. 1545 జనవరి మాసాన, కొచ్చిన్ పరిసర ప్రాంతాలలో బోధించు చున్నప్పుడు, ఒక విదేశీ యాత్రికుని ద్వారా మలక్కా దీవులు మత బోధకు అనువైన ప్రాంతమని తెలుసుకున్నాడు. అటు పిమ్మట మైలాపూరులో గల పునీత తోమాసు వారి సమాధిని దర్శించి, అక్కడ నాలుగు నెలల పాటు ఏకాంతంగా ప్రార్థించి, ప్రభుని దీవెనలు సమృద్ధిగా పొంది, 1545 సెప్టెంబరులో మలక్కా దీవులకు ఫ్రాన్సిస్ పయనమయ్యాడు.

1546లో సుగంధ ద్రవ్యాలకు నిలయమైన మలక్కా తదితర దీవులలో క్రీస్తు వాక్యాన్ని బోధించి, వెయ్యి మందికి పైగా జ్ఞానస్నానమిచ్చాడు. మత ప్రచారమునకై

అక్కడకు ఇద్దరు జేసుసభ గురువులను రప్పించాడు. అక్కడ ఉన్న సమయంలో, అంజిరో అను జపాను దేశీయుని ద్వారా, జపాను దేశమును గురించి విని, ఫ్రాన్సిస్ శౌరి జపాను వెళ్ళ నిశ్చయించుకున్నాడు. దానికి ముందుగా గోవా చేరుకుని, భారతదేశ జేసుసభ గురువుల పెద్దగా, చేయవలసిన కార్యములు చక్కబెట్టి, నూతనంగా వచ్చిన జేసుసభ గురువులను వివిధ ప్రాంతములలో సువార్త ప్రకటనకు పంపి, తాను 1549లో జపానుకు ప్రయాణమయ్యాడు.

సముద్రమార్గంలో అనేక ఇబ్బందుల పాలై, మలక్కా చేరుకుని, అక్కడనుండి ఒక సముద్రపు దొంగకు చెందిన పడవను అద్దెకు తీసుకుని, ఆగష్టు 15న జపానులోని కగోషిమా చేరుకున్నాడు. ఫ్రాన్సిస్ ముందుగా తన మిత్రుడు అంజిరోను కలిసి, అతని సహాయంతో స్థానిక రాకుమారుని సందర్శించి, క్రైస్తవ మతాన్ని బోధించ అనుమతి పొందాడు. కాని ఫ్రాన్సిస్ అంతటితో సంతృప్తి పడక, జపాను దేశ చక్రవర్తినే కలిసి, అతనిని, అతనితోబాటు ప్రజలందరిని క్రైస్తవ మతాన్ని స్వీకరించేలా చేయాలని తలంచి, చక్రవర్తి దర్శనార్థము తీవ్రంగా ప్రయత్నించినా, ఎవరూ రాజధాని మియాకో నగరాన్ని ప్రవేశింప మార్గాన్ని చూపలేదు. కాని సమయాన్ని వృధా చేయక, ఒక సంవత్సరం కగోషిమాలో పనిచేసి వందమందికి, అటు పిమ్మట హిరాడో దీవిలో రెండు నెలలు పనిచేసి, మరో వందమందికి జ్ఞానస్నానమిచ్చాడు. అనంతరం జపానులో రెండవ పెద్ద నగరమైన యమగుచి చేరి, ఒక వర్తకుని సహాయంతో రాజధాని నగరంలో ప్రవేశించాడు. కాని తీరా అక్కడకు చేరిన పిమ్మట, జపానులో అధికారము, పలుకుబడి గలవాడు చక్రవర్తిగాక, యమగుచి రాజేనని తెలుసుకుని యమగుచి చేరుకున్నాడు.

అంతకుముందు యమగుచి రాజును సందర్శించటానికి ప్రయత్నించి విఫలుడైనందున, ఈసారి ఫ్రాన్సిస్ పథకం మార్చాడు. ఐరోపాలోని పలు రాజసభలలో సంచరించిన అనుభవంతో, పేద ఐరోపా వాసుల మాదిరిగా కాకుండా, రాజ లాంఛనాలతో రాజులా వెళ్ళాలని నిశ్చయించి, మేలు జాతి గుర్రాలను కొని, రంగురంగుల సిల్కు బంగారు వస్త్రాలను ధరించి, మందీ మార్బలంతో యమగుచి చేరుకున్నాడు. అంతకు ముందు ప్రవేశం లభించని ఐరోపా వాసులే, ఈ ప్రభువులని తెలియని రాజ సిబ్బంది, వారికి ఘన స్వాగతమిచ్చి, తమ రాజు వద్దకు తోడ్కొని పోయారు. ఫ్రాన్సిస్, రాజుగారికి గడియారము, చక్కని వాయిద్యాలను, అద్దాలను, మేలిమి వస్త్రాలను కానుకగా నిచ్చాడు. పిమ్మట పోర్చుగల్ రాజగు మూడవ జాన్ వద్ద నుండి, మూడవ పాల్ జగద్గురువుల వద్దనుండి వచ్చిన రాయబారిగా తన అధికార ధృవపత్రాలను సమర్పించాడు. దానితో రాజు క్రైస్తవ సువార్తా బోధకులకు, తన రాజ్యంలో మతబోధ హక్కును ప్రసాదించాడు.

గురువుల నివాసానికి గాను, రాజధానిలోనే ఒక ఆశ్రమాన్ని కూడా కానుకగా నిచ్చాడు. ఫ్రాన్సిస్ యమగుచిలో ఆరునెలలు బోధించి, అయిదు వందలమందిని క్రైస్తవులనుగా జేశాడు. ఈ విధంగా ఫ్రాన్సిస్ ప్రభుసేవలో, సామాన్యులలో సామాన్యునిగా, రాజులలో రాజుగా ప్రవర్తించిన విషయం మనకు విస్మయం కలిగించక మానదు. శౌరి వారిలో గల ఆ కార్యదీక్ష, పట్టుదలే అతనిని పునీతునిగా తీర్చి దిద్దింది.

ఆ సమయంలో ఫ్రాన్సిస్ కన్ను, చైనా దేశం మీద పడింది. ‘‘మీ మతం నిజమైన మతమైతే, ఇంకా ఎందుకు మీ మతం, మా చైనా దేశంలో అడుగుపెట్టలేదు?’’ అని కొందరు చైనా వాసులు ఫ్రాన్సిస్‌ను ప్రశ్నించగా, దానికి ప్రతిస్పందించి చైనాను తప్పక దర్శించాలని నిశ్చయించుకున్నాడు. కాని కొన్ని పనులు చక్కదిద్దవలసి ఉన్నందున, ఫ్రాన్సిస్ ముందుగా భారతదేశం బయలుదేరాడు. ఆత్మల సంరక్షణలో నిమగ్నమై ఫ్రాన్సిస్, చైనాను సందర్శించాలని 1552 ఏప్రిల్ నెలలో భారతదేశాన్ని, వీడి, సాన్సియన్ ద్వీపము చేరుకున్నాడు. ఫ్రాన్సిస్ అక్కడగల అక్రమ రవాణాదారులను మంచి చేసుకుని, తనను చైనా దేశమునకు తీసుకొని వెళ్ళమని అర్థించినా, ఎవరూ ఫ్రాన్సిస్‌ను తీసుకొని వెళ్ళే సాహసం చేయలేదు. కొంతకాలానికి ఒకడు అందులకు అంగీకరించగా, ఫ్రాన్సిస్ అతనికి ముందే డబ్బు చెల్లించాడు. ఆ తరువాత అతడు తిరిగి కానరాలేదు. ఫ్రాన్సిస్ తన చరమ దినాలు సమీపించాయని గ్రహించక, చైనా దేశం ఎప్పుడెప్పుడు చేరదామా యనే తలంపుతో నుండగానే, నవంబరు 21న జ్వర పీడితుడైనాడు. అంతోనియో అనే చైనా క్రైస్తవ సేవకుడు, ఫ్రాన్సిస్ శౌరి వారిని ఆ చివర రోజుల్లో శ్రద్ధగా చూచుకున్నాడు. తీవ్ర జ్వరంతో ఫ్రాన్సిస్ శౌరివారు నవంబరు 28న అపస్మారక స్థితిలోనికి వెళ్ళాడు. తిరిగి డిసెంబరు 1న తెలివి లోనికి వచ్చి, మేల్కొని ఉన్న సమయమంతా ప్రార్థనలో గడిపి, డిసెంబరు 3, 1552న పరమపదించాడు. ఫ్రాన్సిస్ భౌతిక దేహాన్ని మలక్కాకు, అక్కడి నుండి గోవా పట్టణానికి తీసుకుని వచ్చి, దేవాలయంలో భద్ర పరచారు.

క్రీస్తు నాథుని పైగల ప్రేమతో ఎన్నో కష్టముల కోర్చి, ఎన్నో వేల మైళ్ళు సముద్రాలపై పయనించి, లక్షల మందిని క్రైస్తవ మతం లోనికి స్వీకరించి, పరిశుద్ధ జీవితం జీవించి, ప్రపంచ శ్రీసభ చరిత్రలో నూతన అధ్యాయాన్ని సృష్టించిన ఫ్రాన్సిస్ శౌరివారిని, ఐదవ పాల్ పాపు గారు 1619 అక్టోబర్ 25న ధన్యులుగా ప్రకటించారు. ఫ్రాన్సిస్ శౌరి వారిని 1622 మార్చి 12న పదిహేనవ గ్రెగరి జగద్గురువులు పునీతులుగా ప్రకటించారు. పునీత ఫ్రాన్సిస్‌శౌరి వారిని సకల వేదవ్యాపక ప్రాంతాలకు పాలక పునీతులుగా శ్రీసభ ప్రకటించింది. పండుగ డిశంబర్ 3న ప్రపంచమందలి సకల దేశాలలో, ముఖ్యంగా భారతదేశమంతటా ఘనంగా చేస్తారు.



మొగలాయి ఆస్థాన సందర్శకులు

# 3. ధన్య రుడాల్ఫ్ అక్వవీవా

**(1550-1583)**

ఫాదర్ దాసరి పాపయ్య, S.J.

మన భారతదేశము వివిధ సంస్కృతులకు, వివిధ మతాలకు పుట్టినిల్లు. ఇట్టి విభిన్న మతాల మూల సూత్రాలను సమన్వయపరచి, సకల జనామోదమైన నూతన మతాన్ని స్థాపించి, శాంతియుత సహజీవనానికి నాంది పలకదలచాడు ప్రముఖ మొగలాయి చక్రవర్తి అక్బర్. బెంగాలులోని జేసుసభ గురువులు, మొగలాయి ప్రభుత్వాన్ని మోసం చేయదలచిన క్రైస్తవ వ్యాపారస్థులను తీవ్రంగా ఖండించారు. ఆ విషయం తెలుసుకున్న అక్బరు చక్రవర్తి, క్రైస్తవ గురువులంటే ఇష్టపడి, క్రైస్తవ మత సత్యాలను తెలుసుకునేందుకు కలకత్తా నుండి ఒక గురువును, తన కోటకు రప్పించాడు. ఆ గురువు సూచనల మేరకు, అక్బరు 1571లో గోవా జేసుసభ గురువులలో ఇద్దరిని ఫతేపూర్ సిక్రీ కోటకు పంపవలసినదిగా సందేశం పంపాడు. ఆ ఇద్దరు గురువులు క్రైస్తవ మత సిద్ధాంతాలను పూర్తిగా నెరిగిన వారై, తనకు క్రైస్తవ వేదాన్ని బోధించగలవారై యుండాలని కూడ అక్బరు సూచించాడు.

అక్బరు సందేశాన్ని అందుకున్న గోవాలోని పోర్చుగీసు అధికారులు, మేత్రాణులు, జేసుసభ గురువులతో సమావేశమై, అక్బరు కోటకు రుడాల్ఫ్ అక్వవీవా, అంతోని మోన్‌సెరాతు, ఫ్రాన్సిస్ హెన్రిక్వెజ్ అను జేసుసభ గురువులను పంప నిశ్చయించారు. ఆ రాయబార బృందానికి అధిపతియైన రుడాల్ఫ్ అక్వవీవాకు రాజాస్థానములను సందర్శించటం, రాజ మర్యాదలను పాటించటం క్రొత్త ఏమీకాదు. ఎందుకంటే అతడు ఇటలీలోని ఓ ప్రభువుల కుటుంబంలో అక్టోబరు 2, 1550న జన్మించాడు. అతని తండ్రి ఆత్రి నగర ప్రభువు. అతనికి స్పెయిను, ఇటలీ దేశ రాజవంశాలతో దగ్గరి బంధుత్వం ఉంది. అతని తండ్రి సోదరుడైన క్లాడ్ అక్వవీవా, పాపుగారి పవిత్ర రోమన్ సామ్రాజ్యానికే ప్రధానిగా సేవలు చేసి, అనంతరము జేసుసభలో చేరి, ఐదవ సభాధినేతగా జేసుసభను చాలాకాలం నడిపించాడు. అట్టి ఉన్నత వంశాన జన్మించిన రుడాల్ఫ్, ప్రాపంచిక భోగభాగ్యాలను కాలదన్ని, 1569లో జేసుసభలో చేరాడు.రోమాపురిలో తత్వశాస్త్రాన్ని, జర్మనీలో వేదాంత విద్యను క్షుణ్ణంగా అభ్యసించి, సువార్త ప్రచారకుడుగా రుడాల్ఫ్ 1578లో మన దేశానికి వచ్చాడు. గోవాలోని పునీత పౌలు గారి గురు విద్యాలయములో

తత్వశాస్త్ర బోధకుడుగా పనిచేసే సమయంలో, ప్రస్తుత రాయబార బృందానికి నాయకునిగా రుడాల్ఫ్ అక్వవీవాను ఎన్నుకున్నారు.

అక్బరు, ఫతేపూర్ సిక్రీ కోటలో గురువులను సకల రాజ మర్యాదలతో ఆహ్వానించి, వారికి రాజ భవనములోనే బస ఏర్పాటుచేశాడు. రుడాల్ఫ్ అక్వవీవా ఏడు సంపుటాల పరిశుద్ధ బైబిలు గ్రంథాన్ని అక్బరుకు అందించగా, అక్బరు భక్తి మర్యాదలతో బైబులు గ్రంథాన్ని ముద్దిడి, తలకు హత్తుకుని స్వీకరించాడు. మణులు, మాణిక్యాలతో పొదిగి, భూతల స్వర్గంగా యున్న ఆ కోటలో, ప్రతి శనివారం అక్బరు, అక్వవీవాలు గంటల తరబడి, క్రైస్తవమత సత్యాలపై చర్చలు జరిపారు. ఆ చర్చలలో అక్బరు చక్రవర్తి క్రైస్తవ మత సిద్ధాంతాల ఆధిక్యతను గుర్తించాడు. అయినా అతడు అనేక కారణాల వల్ల క్రైస్తవ మతం స్వీకరించలేదు. అందుచేత రుడాల్ఫ్ అక్వవీవా బృందము, 1583 ఫిబ్రవరి మాసము వరకు రాజాస్థానంలోనే ఉండి, నిరుత్సాహంతో గోవాకు తిరిగి వచ్చింది.

అక్వవీవా ఫతేపూర్ నుండి తిరిగివచ్చిన కొద్ది రోజులకు, ప్రస్తుత గోవా పట్టణమందలి సాల్సెట్టి ప్రాంతానికి అధిపతిగా నియమింపబడ్డాడు. ఆ ప్రాంతం పోర్చుగీసు వారి ఆధిపత్యంలోనికి 1550లోనే వచ్చింది. కాని వారు చేసిన అకృత్యాల వలన, అక్కడి ప్రజలకు క్రైస్తవులన్నా, క్రైస్తవ మతమన్నా ఏవగింపు కలిగింది. 1583 జూలైలో క్రైస్తవ మత వ్యాప్తిని అక్వవీవా సమీక్షించి, సాల్సెట్టి ప్రాంతములోని గ్రామాలనన్నింటిని సందర్శించి,క్రైస్తవ మతాన్ని స్థానికులకు పరిచయం చేసేందుకై, సిలువలను ప్రతిష్ఠించదలచాడు. అతడు మరో నలుగురు జేసుసభ సభ్యులతో కలిసి జూలై 25న కుంకోలిమ్ బయలుదేరాడు. అక్కడి వారికి అక్వవీవా రాకడ గురించి ముందుగా తెలిసినా, వారెవరూ వచ్చి స్వాగతం పలుకలేదు. గ్రామ సరిహద్దులలో చేరిన కొంతసేపటికి, ఆ గ్రామస్థులు కత్తులు, గొడ్డళ్ళు, ఈటెలు చేతబట్టుకుని, అక్వవీవా బృందంపై దాడికి దిగారు. అది గమనించి రుడాల్ఫ్ అక్వవీవాతోనున్న పోర్చుగీసు సైనికులు, వారిపై మందుగుండు సామగ్రి పేల్చబోగా, అక్వవీవా “మనం వారితో యుద్ధానికి రాలేదు కదా! కనుక వారిని ఏమీ చేయవద్దని” వారించాడు.

కాని వారు ‘చంపండి, చంపండి’ అని పెద్దగా కేకలు వేస్తూ అక్వవీవా బృందాన్ని అన్నివైపులా చుట్టుముట్టారు. పోర్చుగీసు వారి బృందానికి అక్వవీవా నాయకుడని తెలుసుకున్న వెంటనే, ఒకడు కత్తితో అతని కాళ్ళు తెగనరికాడు. క్రింద పడిన వెంటనే రుడాల్ఫ్ అక్వవీవా వేదసాక్షి మరణం పొందబోతున్నాడని గ్రహించి, ఎంతో ఉత్సాహంతో అంగీ మెడపట్టీ గుండీ తీసి, తనను నరకమని, మెడ చూపించాడు. వెంటనే రెండు కత్తి వేటులు అతని మెడపై పడగా, అక్వవీవా తలతెగి దూరంగా పడింది. అక్వవీవా వయస్సు అప్పటికి ముప్పది మూడు మాత్రమే. తిరుసభ కొరకై రక్తాన్ని చిందించిన రుడాల్ఫ్ అక్వవీవాను, మిగిలిన నలుగురు అనుచరులను పదమూడవ సింహరాయులు పాపుగారు 1893 ఏప్రిల్ 30న ధన్యులుగా ప్రకటించారు. వారి పండుగ ఫిబ్రవరి 4.



ప్రథమ భారతీయ పునీతులు - జపాను దేశ వేదసాక్షి

# 4. పునీత గొన్సాలో గార్సియా

**(1557-1597)**

బ్రదర్ కొండవీటి అంతోని రాజు S.J.

గొన్సాలో గార్సియా భారతదేశమందలి పోర్చుగీసు వలస భూభాగమైన బసీన్ (వాసై) నందు ఫిబ్రవరి 5, 1557న జన్మించాడు. బసీన్ ప్రస్తుత ముంబాయికి 60 కి.మీ దూరంలో ఉన్న రేవు పట్టణం. అతని తండ్రి పోర్చుగల్ దేశమునకు చెందిన క్రైస్తవుడు కాగా, తల్లి కొంకణి ప్రాంతమునకు చెందిన భారతీయ మహిళ. పోర్చుగీసు వారికి భారతదేశంలో గోవా, బసీను పట్టణాలు చాలా ప్రముఖ వాణిజ్య నగరాలు. గొన్సాలో 1564 నుండి 1572 వరకు "ఫోర్ట్ బసిన్" (కోట)లో నివసించాడు. ఆ కోటలో పోర్చుగీసు వారు మాత్రమే నివసించవచ్చు. అతడు జేసుసభ గురువులు నడుపుచున్న పాఠశాలలో విద్యనభ్యసించాడు. సెబాస్టియన్ గొన్సాలెస్ అను జేసుసభ గురువు ఆధ్వర్యంలో గొన్సాలో చదివాడు. ఆ గురువు గొన్సాలొకు మంచి మిత్రుడయ్యాడు. ఆ గురువే గొన్సాలొ జీవిత పర్యంతం మార్గదర్శకుడై, అతనిని ప్రభుసేవలో నడిపించాడు. బసీనులోని జేసుప్రభు దివ్యనామ దేవాలయంలో అతడు భక్తిగా ప్రార్థించేవాడు. చిన్ననాటి నుండే దేవాలయంలో జరిగే దివ్య బలిపూజలకు తన సహాయం అందించాడు.

గొన్సాలో 1569లో జపాను దేశమునకు యేసుప్రభుని సువార్త ప్రచారం చేయ జేసుసభ బోధకులతో వెళ్లాలని అభిలషించాడు. అప్పుడు అతనికి పన్నెండేళ్లే. అందువలన అతని కోర్కెను వారు మన్నించలేదు. 1572 కల్లా గొన్సాలొకు పదిహేను సంవత్సరాలు నిండాయి. తూర్పు దేశాలలో సువార్తను ప్రకటించాలన్న ఆశయంతో, గొన్సాలొ తన గురువైన సెబాస్టియన్ గొన్సాలెస్‌తో చేతులు కలిపి, జపాను దేశానికి మత బోధకునిగా 1572 మార్చిలో బయలుదేరి, జూలై నెలలో జపాను చేరుకున్నాడు. గొన్సాలొ గార్సియా వారితో ప్రయాణించిన ఓ జపాను దేశీయుని సహాయంతో జపాను భాషను తమ సుదీర్ఘ సముద్ర ప్రయాణంలో నేర్చుకున్నాడు.

జేసుసభ సువార్తా బోధకులు గొన్సాలొను జపానులో ఉపదేశిగా నియమించారు. అతడు సువార్త బోధకునిగా బహిరంగ ప్రదేశాలలో స్థానిక జపాను భాషలో చక్కగా బోధించాడు. అతని వాగ్ధాటికి, భాషా పటిమకు, దయార్ద్ర హృదయానికి ఎందరో జపాను

దేశీయులు అతని చెంతకు ఆకర్షింపబడ్డారు. పెద్దలు పిన్నలు అతి త్వరలో గొన్సాలో అంటే చాలా ఇష్టపడ్డారు. అతడు యేసుప్రభుని శిష్యునిగా సువార్తను జపాను దేశంలో ఎనిమిదేళ్ళపాటు చక్కగా బోధించాడు. గొన్సాలో జేసుసభలో చేరాలని ఎంతో కాంక్షించాడు. అతడిని జేసుసభలో చేర్చుకోవాలని సిద్ధమయ్యే తరుణంలో, అతని తల్లిదండ్రుల జాతీయత అడ్డు వచ్చింది. అతని తండ్రి పోర్చుగల్ దేశానికి చెందిన వాడే. కాని అతని తల్లి మాత్రం భారతీయురాలు. అప్పటికింకా స్థానిక క్రైస్తవుల సంతతికి గురువులయ్యే అర్హత లేదు. కనుక అతడు జేసుసభలో గురువు కావాలనే ఆశకు నీళ్లు వదులుకుని, మార్గాంతరం ఆలోచించాడు.

గొన్సాలో గార్సియా అలకావొ అను పోర్చుగీసు వలస ప్రాంత పట్టణం చేరుకున్నాడు. అది ఆనాటి చైనా రాజ్యంలో ఉంది. అక్కడ గొన్సాలో కొంతకాలం ఓ వ్యాపారికి అనువాదకుడుగా ఉన్నాడు. సువార్త బోధను విడచిపెట్టి, వర్తకుడైనా, అతడు తన ప్రార్థనను, దానధర్మాలను, క్రైస్తవ జీవనాన్ని విడచి పెట్టలేదు. క్రమక్రమంగా అతని వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెంది, దక్షిణ ఆసియా దేశంలో అనేక పట్టణాలలో శాఖలు తెరిచాడు. జపాను దేశ పాలకులంతా అతనికి పరిచయమ్యారు. ఆ సంబంధాలతో అతడు మరింత ధనవంతుడయ్యాడు. కాని అతని హృదయంలో క్రీస్తు ప్రభునికి ప్రముఖ స్థానమిచ్చాడు. వ్యాపార రీత్యా అతడు ఫిలిప్పైన్స్ నందలి మనిలా నగరం అప్పుడప్పుడు వెళ్ళేవాడు. ఆ తరుణంలో అతడు ఫ్రాన్సిస్ వారి మతసభలో చేరి, ఒక సన్యాసి కాదలచాడు. తన ఆశయ సిద్ధికి ఫిలిప్పైన్స్ నందలి మనిలాలో ఫ్రాన్సిస్కన్ గురువు పీటర్ బప్తిస్టా అతనికి తోడ్పడ్డాడు.

గొన్సాలో గార్సియాకు ఫ్రాన్సిస్ వారి సభలో వ్రతాలను తీసుకొని, సభ్యత్వమివ్వడానికి అంగీకరించటంతో, అతని ఆనందం అంతా ఇంతా కాదు. 1586లో మనిలాలోని ఫ్రాన్సిస్కన్ సన్యాసుల మఠంలో మాటపట్టు ఇచ్చాడు. గొన్సాలో జూలై 3, 1588న ఒక బ్రదరుగా శాశ్వత వ్రతాలను తీసుకొన్నాడు. అక్కడ కొన్నాళ్లు కుష్ఠరోగుల మధ్య పనిచేశాడు. అక్కడ కూడా ఉపదేశిగా తన సేవలందించాడు. గార్సియాకు జపాను భాషలో చక్కని పాండిత్యముండటంతో, తమ దేశానికి రమ్మని జపాను దేశీయులు ఆహ్వానించారు. స్పెయిను రాజు ఆశీస్సులతో మనిలా గవర్నరు గారు జపాను దేశానికి పీటర్ బప్తిస్టా నాయకులుగా ఒక అధికార దౌత్య బృందాన్ని పంపారు. పీటర్‌కు జపాను భాష రానందున గొన్సాలోను సహచరునిగా, అనువాదకునిగా తన బృందంలో చేర్చుకున్నాడు. దానికి గొన్సాలో ఎంతో సంతోషించాడు. ఆ బృందం మనిలా పట్టణాన్ని మే 21, 1593న విడచిపెట్టి, జపాను దేశపు హిరాడా ఓడరేవును జూలై 8, 1593న చేరుకుంది.

గొన్సాలో జపాను భాషలో దైవరాజ్యాన్ని గురించి అనర్గళంగా ఉపన్యసించేవాడు. జపానులో గొన్సాలో గార్సియా అందరికీ ఎంతో ఇష్టమైన బోధకుడయ్యాడు. ఆ బృందం

కొన్ని బాలారిష్టాలను దాటి తరువాత క్యోటొ, ఒసాకో పట్టణాలలో సువార్తను ప్రకటించింది. అక్కడి రాకుమారుడు టొయొటొమి, ఫ్రాన్సిస్కన్ గురువుల పట్ల ఎంతో ఆదరాభిమానాలు కనబరచాడు. ఆ సమయంలో జేసుసభ గురువుల సువార్తా పరిచర్యకు ఎన్నో అవరోధాలు కలుగుతున్నా, చాలా సాదాసీదాగా, సువార్తను ప్రకటిస్తున్న ఫ్రాన్సిస్కన్ బోధకులకు ఏ మాత్రం ప్రతిఘటన ఎదురుకాలేదు. దానితో వారు తమ బోధనా వేగాన్ని పెంచారు. జపాను దేశంలో రాజులు, జమిందారులు మొదలుకొని సామాన్యుల దాకా ఎందరో క్రైస్తవులయ్యారు. అతి త్వరలోనే ఫ్రాన్సిస్కన్ గురువులు జపాను దేశాన్ని తమ ముఖ్య సువార్తా కేంద్రంగా ఎన్నుకొని, సువార్తను అంతటా బోధించసాగారు.

ఫ్రాన్సిస్కన్ గురువుల బోధను స్థానిక మతనాయకులు క్రమేణా వ్యతిరేకించసాగారు. ఆ గురువులపై చర్య తీసుకోవాల్సిందిగా వారు హిదయోషిపై వత్తిడి తెచ్చినా, అతడంతగా స్పందించలేదు. సాన్ ఫెలిప్పె అను స్పెయిన్ దేశ ఓడ తుఫానులో చిక్కుకుని, జపాను తీరమునకు కొట్టుకొని వచ్చింది. అది వాస్తవంగా మనిలా నుండి అకపుల్కొ అను రేవునకు వెళ్ళ వలసి ఉంది. అది బంగారు, వెండితో నిండి వుంది. ఆ ఓడ ప్రధానాధికారి అక్కడ జపాను దేశ వర్తక పన్నుల అధికారితో తమ స్పెయిను చక్రవర్తి ప్రపంచ నలుమూలలా ఎన్నో దేశాలను జయించాడని గొప్పలు చెప్పాడు. మత బోధకులు ప్రజలను స్థానిక రాజులపై కుట్ర పన్నేలా పురిగొల్పేవారని, దానితో స్పెయిన్ దేశం స్థానిక రాజ్యాలను సులభంగా కబళించేదని లేనిపోని విషయాలు చెప్పాడు. ఆ విషయం కాస్తా హిదియోషి చెవినబడి, అతడు ఎంతో రౌద్రుడయ్యాడు. రాజు గారి వైద్యుడు, సలహాదారైన యొకిన్ జెన్సో దానిని అవకాశంగా మలచుకుని, జపాను రాజ్య సరిహద్దులందున్న క్రైస్తవ మత బోధకులను బంధించి, చంపాలని శాసనం తెచ్చాడు. దానితో పీటర్ బప్తిస్టా, గార్సియా, మరికొందరిని మియాకో (క్యోటో)లో డిసెంబరు 8, 1596న గృహ నిర్భంధంచేసి, 1597 జనవరిలో మరణ దండన విధించారు. స్థానిక జపాను దేశీయుడు, జేసుసభ గురువిద్యార్థి అయిన పాల్ మీకితో బాటు మరో ఇద్దరు జేసుసభ సభ్యులకు కూడా మరణ శిక్ష విధించారు.

మరణ శిక్ష పొందిన 26 మంది ఖైదీలను జనవరి 3, 1597న క్యోటో నగరం నుండి 600 మైళ్ళ దూరంలో నున్న నాగసాకికి తరలించారు. వారి ప్రయాణానికి ముందుగా వారందరి ఎడమ చెవులను తెగ నరికారు. దారిలో వారిని ఎన్నో చిత్ర హింసలు పెడుతూ, సకాయి, ఓకయామా, హిరోషిమా మొదలగు పట్టణాలలో వారిని హేళన చేస్తూ ఊరేగించారు. వారంతా నాగసాకి ఫిబ్రవరి 4, 1597న చేరారు. వారంతా మంచి పాపసంకీర్తనం చేసారు. మరుసటి రోజు ఉదయాన్నే వారందరిని వధించనున్న కొండవద్దకు కొనిపోయారు. అక్కడ 26 సిలువలు వారి కొరకు వేచి ఉన్నాయి. వారు గ్లోరియా గీతమును ఆలపించి, ప్రభువును స్తుతించిన మీదట ఆ సిలువలను ముద్దాడారు. ఆ

సమయంలో గొన్సాలొ గార్సియా “ఫోర్ట్ బసిన్”లో తన స్నేహితుడైన ఫ్రాన్సిస్ రోడ్రీగస్ పింటో ను కలిసాడు. అతనితో “మిత్రమా! దేవుని దీవెన నీపై ఉండునుగాక! నేను మోక్షానికి వెళ్తున్నాను. మన మిత్రుడైన సెబాస్టియన్ గొన్సాలెస్ గురువులకు నా అభినందనలు తెలుపు” అని చివరగా తనకు భారతదేశంలో చదువు సంధ్యలు చెప్పి, ఆధ్యాత్మిక మార్గదర్శియైన జేసుసభ గురువును స్మరించుకున్నాడు.

26 మంది క్రైస్తవ బోధకులకు మరణ శిక్షలు అమలుపరచటం 1597 ఫిబ్రవరి 5న, ఉదయం 10 గంటలకు మొదలైంది. గొన్సాలొ గార్సియా, పీటర్ బప్తిస్టా, ఇతర గురువులు, ఫ్రాన్సిస్కన్ సభకు చెందిన 15 మంది గురువిద్యార్థులు, ఇంకా ముగ్గురు జేసుసభ గురువులు వేదసాక్షి మరణం పొందారు. వారంతా చిత్రహింసల పాలై బక్కచిక్కి ఉన్నందున, దాదాపు అర్ధగంటలోపే అందరూ మరణించారు. ఇద్దరు సైనికులు ఈటెతో వారి రొమ్ములపై పొడిచి, అందరూ చనిపోయారని నిర్ధారించుకున్నారు. ఆనాటి వేదసాక్షి మరణాలను కళ్లారా చూచి సాక్షులుగా ఉన్న పోర్చుగీసు, జపాను దేశ క్రైస్తవులు వెంటనే రక్షక భటులను దాటి పరుగెత్తుకుంటూ వెళ్ళి, మరణించిన గురువుల వస్త్రములను, అంగీలను చించి, వేదసాక్షుల రక్తంతో తడిపి, వానిని ఆ పుణ్యమూర్తుల పవిత్ర అవశేషాలుగా, భక్తిభావంతో భద్రపరచుకున్నారు. ఆ కతోలిక వేదసాక్షుల భౌతిక దేహాలను ఆ సిలువలపై నలుబది రోజులుంచారు. ఆ శరీరాలు రాబందులకు ఆహారం అవుతాయని భావించారు. కాని అవి చెక్కు చెదరక ఉండటంతో అందరూ ఆశ్చర్యపోయారు. గొన్సాలొ గార్సియా తలను పోర్చుగీసు వారు ‘ఫోర్ట్ బసిన్”కు కొని వచ్చారు. బసీన్ ను 1739లో పూర్తిగా విడచి వచ్చే సమయంలో, గార్సియా తలను గోవా పట్టణంకు తీసుకు వచ్చి భద్రపరచారని ఒక భావన.

ఆ వేదసాక్షులు మరణించిన నాగసాకి కొండపై పలు అద్భుతాలు జరగటం మొదలైంది. కనుక వారు మరణించిన 35 సంవత్సరాలకు అనగా 1627లో ఎనిమిదవ అర్బన్ జగద్గురువులు వారందరిని “పూజ్యులు”గా, 1629లో “ధన్యులు”గా ప్రకటించారు. తొమ్మిదవ భక్తినాధ పాపుగారు గొన్సాలొ గార్సియాను జూన్ 8, 1862న “పునీతులు”గా ప్రకటించారు. వారి పేరిట బసీన్ (వాసై)లో 1942లో పెద్ద దేవాలయాన్ని నిర్మించారు. వారు పునీతులుగా ప్రకటించబడిన 150 సంవత్సరాల జూబిలీని జూన్ 8, 2012న చాలా ఘనంగా కొనియాడారు. వారి పండుగ ఫిబ్రవరి 5న బొంబాయి, గోవా ప్రాంతాలలో చాలా వైభవోపేతంగా జరుపుతారు.



## వేద పారంగతుడు

# 5. రాబర్ట్ డి నొబిలి

**(1577-1656)**

కొటే వంశీధర్, డోల సాగర్‌బాబు
(SJ Pre-Novices)

రాబర్ట్ డి నొబిలి ఇటలీ దేశమందలి టస్కనీ ప్రాంతమునకు చెందిన మొంటె పుల్సియానో అను పట్టణమందు 1577లో ఒక ప్రముఖ రాజ వంశపు కుటుంబంలో ప్రథమ పుత్రునిగా జన్మించాడు. నొబిలి కుటుంబం రాజకీయంగా చాలా పలుకుబడి గల కుటుంబం. ఆ కుటుంబం కతోలిక శ్రీసభకు ఎంతో అండగా ఉంటూ, ఎందరో గురువులను, పలువురు కార్డినళ్ళను, ఇద్దరు జగద్గురువులను అందించిన చక్కని కతోలిక కుటుంబం. అతని తండ్రి జగద్గురువుల ఆధ్వర్యంలో పరిపాలింపబడుతున్న పవిత్ర రోమను సామ్రాజ్యంలో ఉన్నత సైనికాధికారిగా గొప్ప పదవులు అలంకరించాడు. అతని తండ్రి, రాబర్ట్ పదహారేళ్ళ ప్రాయంలో ఉండగా మరణించాడు.

రాబర్ట్ చిన్నతనం నుండే చాలా చురుకైన వాడు. తెలివి గలవాడు. పాఠశాల చదువులలో ఎప్పుడూ ప్రథముడుగా ఉండేవాడు. రోమన్ సామ్రాజ్యంలో రాబర్ట్‌కి మంచి భవిష్యత్తు ఉందని, గొప్ప గొప్ప పదవులను జగద్గురువుల మహా సామ్రాజ్యంలో పొందబోతున్నాడని అతని కుటుంబం అతనిపై ఎంతో ఆశలు పెట్టుకుంది. కాని వారి ఆశలను తలక్రిందులు చేస్తూ, జేసుసభలో చేరి ప్రాచ్య దేశాలలో సువార్తను బోధించాలని రాబర్ట్ సంకల్పించుకుని, తన నిర్ణయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పినపుడు, వారెవరూ అంగీకరించక అతనిని నిరుత్సాహ పరిచారు. కాని రాబర్ట్ తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళన్నాడు. “దేవుడు పిలిచినపుడు, మానవ మాత్రులెవరూ దానిని ఆపకూడదు” అని స్థిర మనస్సుతో దైవ చిత్తానికి, పవిత్రాత్మ ప్రేరణకు విధేయించాడు. పదహేడేళ్ల ప్రాయములో దైవసేవనే పరమావధిగా భావించి, తన కుటుంబ సభ్యులతో చెప్పా పెట్టకుండా మారు వేషంలో నేపుల్సు పట్టణం చేరుకున్నాడు. కొంతకాలం ప్రాథమిక శిక్షణానంతరం రాబర్ట్ 1596లో జేసుసభ నొవిషియేట్‌లో చేరాడు. లొయోలా పురి ఇన్యాసివారి జేసుసభ స్థాపనా ఉద్దేశ్యమగు ‘ఆత్మల సంరక్షణ’ అను మహా యాగంలో తాను కూడా ఉత్సాహంగా శ్రమించాలని, ప్రాచ్య దేశాల వేద ప్రచారకునిగా ఫ్రాన్సిస్ శౌరివారు చేపట్టిన వేద వ్యాపకమనే మహత్తర పుణ్యకార్యంలో తాను కూడా భాగస్వామి కావాలని, నొవిషియేట్‌లో ఎన్నో కలలు గన్నాడు, ఆ కలలను నిజం చేయటానికి అవసరమయ్యే విద్వత్తును, దైవజ్ఞానాన్ని, దేవునిపట్ల ఉదాత్త హృదయంతో, అలుపెరుగక

శ్రమించే గట్టి ఆధ్యాత్మికతను రాబర్ట్ నిండుగా పొందాడు. రాబర్ట్ గురు విద్యార్థిగా తత్వ, వేదాంత శాస్త్రాలు ఆసాంతం పఠించి, వానిలోని సారాంశాన్ని గ్రహించి, యేసుప్రభుని ద్రాక్షా తోటలో పని చేయుటానికి అవసరమైన పాండిత్యాన్ని సంపాదించాడు. గురుపట్టాభిషేకం పొందిన తరువాత రాబర్ట్‌ను జపాను దేశానికి వేద ప్రచారకునిగా పంపాలని ముందుగా సభ పెద్దలు నిర్ణయించారు. కాని భారతదేశంలో గురువుల కొరత ఎక్కువగా ఉందని, అక్కడ గురువులు అత్యవసరమని తెలిసి, సభ పెద్దలు భారతదేశానికి పంప నిశ్చయించారు.

రాబర్ట్ డి నొబిలి 1604లో ఇటలీలోని నేపుల్సు ఓడరేవు నుండి పునీత జసింతా అను ఓడలో భారతదేశానికి ప్రయాణమయ్యాడు. వారి సముద్ర ప్రయాణం సజావుగా సాగలేదు. దారిలో వారి ఓడ ప్రమాదానికి గురి అయ్యింది. కనుక మొజాంబిక్‌లో ఆగి, చాలా కాలం దానికి మరమ్మత్తులు చేసుకుని, అతి కష్టం మీద వారంతా మే 20, 1605లో గోవా పట్టణము చేరుకున్నారు. రాబర్ట్ గోవా నుండి కొచ్చిన్ మీదుగా దక్షిణ తమిళనాడులోని మధురై మండలం చేరుకున్నాడు. అక్కడ పోర్చుగల్ చక్రవర్తి ఆధ్వర్యంలో జేసుసభ గురువులు సువార్తను బోధిస్తూ, వేద వ్యాపకం చేస్తున్నారు. రాబర్ట్ 1606 నవంబరులో మధురై పట్టణం చేరుకున్నాడు. ఆ పట్టణమందు జేసుసభ గురువైన గొన్సాలో ఫెర్నాండెజ్ నివాసముంటూ, పిల్లలకు ఒక పాఠశాల, రోగుల కొరక వైద్యశాల నిర్వహిస్తూ, సముద్రతీర ప్రాంతం నుండి వలస వచ్చిన బెస్తవారైన పరవల ఆధ్యాత్మిక అవసరాలు తీర్చేవాడు. అతడు క్రైస్తవుల పాప సంకీర్తనాలు విని, ఒక్క చిన్న దేవాలయంలో దివ్యపూజా బలులు సమర్పించేవాడు. అప్పటి నాయక రాజుల బంధువుల కుటుంబాలకు, అగ్రవర్ణాల ప్రజలకు క్రీస్తు వేదాన్ని పరిచయం చెయ్యాలని ఫెర్నాండెజ్ ప్రయత్నించినా, ఎటువంటి ఫలితమూ కనిపించలేదు. అగ్ర కులాలలో ఏ ఒక్కరూ క్రైస్తవత్వం పుచ్చుకోలేదు. అతని పరిచర్య అంతా పరవలు మరియు పోర్చుగీసు వారికి మాత్రమే పరిమితమైంది.

రాబర్ట్ అప్పటి వేదవ్యాపక స్థితి చూచి అచ్చెరువొందాడు. కించిత్తు బాధ పడ్డాడు. క్రీస్తు సువార్తను విజయవంతంగా ఎలా బోధించాలి, ఏ విధంగా క్రీస్తు ప్రభుని రాజ్యం భారతదేశంలో నెలకొల్పాలి అన్న ప్రశ్నలకు సమాధానాలు కరువయ్యాయి. అంతలో అక్కడ పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు పరిచయమయ్యాడు. రాబర్ట్ తన మనసులోని ఆవేదనను అతనితో పంచుకున్నాడు. దైవరాజ్యం విస్తరించకుండా ఉండటానికి కారణం గురువులేనని, వారి సంస్కృతి, కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లు, మద్యసేవనం, కులవ్యవస్థను, కట్టూబొట్టులను అర్థం చేసుకోకపోవటం మున్నగు ఎన్నో విషయాలు ప్రతిబంధకాలుగా ఉన్నాయని, దానితో బాటు గురువులు అల్ప వర్గాలతో కలివిడిగా ఉన్నందున మైలపడుతున్నారని, మైల పడిన గురువులను అగ్రవర్ణాల వారు

తక్కువగా చూస్తూ, అంటుపడినవాడు కనుక 'ఫరంగి'' అని నీచంగా పిలుస్తున్నారని తెలిపాడు. క్రైస్తవ గురువులు ఎంతో ఉన్నతమైన క్రీస్తు ప్రభుని సువార్తను బోధిస్తున్నా, దాని ఫలితాలు మాత్రం ఎంతమాత్రం పొందకున్నారని, వారి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉందని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, ఆనాటి సంఘ పరిస్థితులను కూలంకషంగా అర్థం చేసుకున్న, అనుభవమున్న సమాజ శాస్త్రవేత్తగా విషయాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పాడు. కుల వ్యవస్థ అప్పటి సమాజంలో బలంగా వేళ్ళూనుకున్నది. సమాజం అగ్రవర్ణాలుగా, అల్పవర్గాలుగా చీలిపోయింది. క్రీస్తు ప్రభుని రక్షణ అల్ప వర్గాలకేనా? అగ్రవర్ణాలను ప్రభుచెంతకు ఆకర్షించలేక, క్రైస్తవ పరిచారకులు చేతులు ముడుచుకు కూర్చోవాలా? అగ్ర వర్ణాల వారికి సువార్తను అందించలేమా? క్రీస్తు వేద ప్రచార పద్ధతులలో మార్పులు చేర్పులు తీసుకువచ్చి, ప్రభుని సువార్తలోని మాధుర్యాన్ని, మకరందాన్ని పంచుతూ, సర్వజనులకు ప్రభువు అందరివాడుగా పరిచయం చేయలేమా? అనే ప్రశ్నలు అతని మస్తిష్కంలో దాడి చేశాయి. ఎలా చేయాలి? ఏమి చేయాలి? ఎవరి కోసం భారతదేశం వచ్చాము? మన చేతులలో చేయదగినది ఏమీ లేదా అని తనను తాను తీవ్రంగా ప్రశ్నించుకున్నాడు. కాని సమాధానాలు కరువయ్యాయి. తాను చూస్తే భారతదేశం గురించి, ఇక్కడ వర్ణ వ్యవస్థ గురించి, ఆచార వ్యవహారాల గురించి ఇక్కడి హిందూ పవిత్ర గ్రంథాల గురించి ఏమీ తెలియని ఒక విదేశీ యువ గురువు మాత్రమే. తాను నమ్మిన క్రీస్తుప్రభువు తనకొక పరిష్కార మార్గం చూపకపోడు అని దీక్షగా ప్రార్థనలు చేసాడు. సరియైన జవాబుల కోసం దేవునిపై భారం వేసి మానవ ప్రయత్నం చేసాడు. కొద్దిమంది పండితుల, గురువుల నేతృత్వంలో భారతదేశ వ్యవస్థను, హిందూ ధర్మ ఆచార సంప్రదాయాలను, వర్ణ, వర్గ వ్యవస్థను లోతుగా చదవటం ఆరంభించాడు. మూడేండ్లపాటు ఈ విషయాలపై పరిశోధన చేశాడు. తన మదిలో మెదలిన అనేక ప్రశ్నలకు కొంతమేరకు పరిష్కారం రాబర్ట్ కనుగొన్నాడు.

భారతదేశమంతా సుస్థిర వర్ణ వ్యవస్థలో కూరుకుపోయిందని, దాని మూలాలను ఇప్పటికిప్పుడు ఛేదించలేమని, ఆ వర్ణ వ్యవస్థను అర్థం చేసుకుని దానికనుగుణంగా వేద వ్యాపక కార్యాచరణ ఉండాలని, వేద ప్రచారకుల భావాలలో, పద్ధతులలో మార్పులు చేసుకుని, క్రీస్తు ప్రభువుపై సమస్త భారాన్ని వేసి ముందుకు నడవాలని రాబర్ట్ డి నొబిలి కంకణం కట్టుకున్నాడు. బడుగు వర్గ క్రైస్తవుల ఆధ్యాత్మిక అవసరాలు, కుల వ్యవస్థ వెలుపల జన్మించిన విదేశీ గురువులు తీరుస్తున్నందున, మిషనరీల నందరిని ఆ గాటనే కట్టివేస్తూ, వారందరినీ నిమ్నకులాలుగా, అంటరానివారుగా భావించి, పరంగిలుగా కించపరుస్తున్నంత కాలం, క్రైస్తవ మతం భారతదేశంలో వేళ్ళూనుకోలేదని, అందుచేత ముందుగా 'పరంగి' అనే ముద్ర నుండి, మైలపడుతున్నారని చెప్పే ఆచారాలు, సంప్రదాయాల నుండి సమూలంగా బయటపడి, వాటికి స్వస్తి చెప్పి దృఢ చిత్తంతో

నూతన మార్గాన్ని అన్వేషించటం రాబర్ట్ మొదలుపెట్టాడు. రాబర్ట్ ముందుగా వయస్సులో తన కన్నా ఎంతో పెద్దవాడైన గొన్సాలోతో తన అంతర్మథనాన్ని పంచుకుని, అతనిని తన పంథాలో ఆలోచించమని విన్నవించినా, అతడు రాబర్ట్‌ను నిరుత్సాహ పరచి, విచారణ కర్తగా అన్ని వర్గాల, అన్ని వర్ణాల క్రైస్తవుల బాధ్యతలను తాను వహించాలని, ఒక్క అగ్రవర్ణం పక్షం మాత్రమే వహించి సువార్త సేవ చేయటం తనకు తగదని, రాబర్ట్‌ని కూడా దుందుడుకు పనులు చేయవద్దని మందలించాడు.

ప్రభుని కోసం ఎన్నో గొప్ప గొప్ప కార్యాలు చేయాలనే ఉత్సాహంతో ఉన్న రాబర్ట్‌కు సుపీరియర్ ప్రతిబంధకమయ్యాడు. ఆ నిరుత్సాహ గడియలో ప్రభువు ఏదో ఒక దారి చూపక పోతాడా అని, తన ఆలోచనలను పై అధికారియైన ప్రావిన్షియల్ లేర్జియోతో పంచుకొన్నాడు. "నేను ఇతరుల వలె అంటుపడిన పరంగిని కాను. నేను ఇప్పటి నుండి తమిళం మాత్రమే మాట్లాడతాను. పోర్చుగీసువారితో, ఇతర క్రైస్తవులతో కలిసి ఉండి, అంటుపడను. నేను ప్రతిరోజు స్నానం చేస్తూ, నేలమీదనే కూర్చుంటూ, సన్యాసిగా పిలిపించుకుంటాను. మాంసాహారాలు భుజించక, శాకాహారమే స్వీకరిస్తాను. తోలు చెప్పులు వేసుకోక, చెక్కతో చేసిన పావుకోళ్ళను మాత్రమే ధరిస్తాను. జేసుసభ గురువులు ధరించే నల్లకోటును విడనాడి, కాషాయపుటంగీని మాత్రమే ధరిస్తాను. చేతిలో ఒక కర్రను (దండము)ను పట్టుకుంటాను" అని రాబర్ట్ డి నొబిలి తన జీవన శైలిలోని మార్పుల గురించి ప్రావిన్షియల్‌కు విన్నవించాడు. రాబర్ట్ అభిప్రాయాలను విన్న ప్రావిన్షియల్ రాబర్ట్‌తో " నీ ఆలోచనలు నాకంతగా రుచించటం లేదు, మింగుడు పడటం లేదు. అంత కఠినమైన పద్ధతులు, విపరీత ధోరణి గురువులకు అవసరమా?" అని అనునయంగా మాట్లాడుతూ, "వేద ప్రచారకులంతా కోరుకున్నట్లే, తాను కూడా హిందువులంతా క్రైస్తవులు కావాలని అభిలషిస్తున్నానని, తనంత తానుగా క్రైస్తవ సంప్రదాయాలకు విరుద్ధమైన వేద ప్రచార పద్ధతులకు అనుమతినిచ్చేంత సాహసం చేయనని" లేర్జియో గురువులు సున్నితంగా తెలియజేసారు. ఏది ఏమైనప్పటికీ ఈ విషయం గురించి మరింతగా అతిమేత్రాణులతో చర్చిస్తానని రాబర్ట్ సూచన ప్రాయంగా తెలియజేసాడు. కొన్ని వారాలకు అగ్రపీఠాధిపతులు పరంగి అనే పదాన్ని వాడకుండా 'సన్యాసి' అనే పదాన్ని వాడటానికి అనుమతినిచ్చారని లేర్జియో తెలిపారు. మిగతా ప్రతిపాదనల గురించి పెద్దలు మౌనం దాల్చారు. భారతదేశం వచ్చి ముచ్చటగా మూడేళ్లు కూడా కాకుండానే, భారతదేశ హిందువులందరిని క్రైస్తవులుగా చేయటానికి ఇదే అత్యుత్తమ మార్గమనే చెప్పే హక్కు ఈ నూతన యువ గురువు కెక్కడిదంటూ, పోర్చుగీసు దేశస్తుడైన అతని సుపీరియర్ గొన్సాలో ఫెర్నాండెజ్ కారాలు, మిరియాలు నూరాడు. రాబర్ట్ ఇవన్నీ ఏమీ పట్టించుకోలేదు. గొన్సాలో వ్యతిరేకత చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే అయింది. ఓ వైపు తన జేసుసభ ప్రధానాధికారి లేర్జియో అనుమతి, మరోవైపు

అతిమేత్రాణుల వారి అంగీకారం ఉన్నంతకాలం, తన నూతన పంథాలో కొనసాగవచ్చని రాబర్ట్ భావించాడు.

రాబర్ట్‌కు, తన సుపీరియర్‌కు మధ్య ఉన్న అంతరం రోజురోజుకూ విస్తరిస్తుంది. అది రెండు సంప్రదాయాల మధ్య అంతరం. రెండు వేద ప్రచార పద్ధతుల మధ్య అంతరం. అది రెండు తరాల మధ్య అంతరం. క్రీస్తు ప్రభువు ఒక్కడే. కాని అతని సేవించే పద్ధతులు, బోధించే పద్ధతులు మాత్రం వేరు వేరు. సనాతన హిందూ సంప్రదాయాలను సంస్కరించకుండా, ఉన్నది ఉన్నట్లుగా వర్ణ వ్యవస్థను గౌరవిస్తూ, గొప్ప ఫలితాలను రాబట్టాలనే చిన్న ప్రయత్నం చేయటానికి రాబర్ట్ సాహసించాడు. రాబర్ట్ మూటా ముల్లె సర్దుకుని జేసుసభ నివాసాన్ని వీడి, మధురై నడిబొడ్డున బ్రాహ్మణులు నివసించే అగ్రహారానికి వచ్చి, చిన్న కుటీరం నిర్మించుకున్నాడు. చిన్న పిలకను మాత్రమే పెట్టుకొని, జుట్టంతా తీసివేశాడు. తమిళ భాష మాత్రమే మాట్లాడాడు. ఇద్దరు బ్రాహ్మణులను సేవకులుగా నియమించుకుని, ఒకరిని వంటకు, మరొకరిని ఇతర పనులకు పురమాయించాడు. సంప్రదాయ బ్రాహ్మణుల వలె ఒంటిపూట మాత్రమే భుజించాడు. అది కూడా శాకాహారమే. నల్ల అంగీ తీసివేసి, కాషాయపుటంగీని, కాళ్ళకు పావు కోళ్ళను, తాను గురువైనందున నుదుటిన గంధపు పూతను ధరించి, తనను తాను సన్యాసిగా సంబోధించుకున్నాడు. బ్రాహ్మణులతో మాత్రమే కలిసి భుజించాడు. కొంతకాలం త్రియేక దైవం పేరిట మూడు పోగులతో జంధ్యం వేసుకున్నాడు. కొలనులో సంప్రదాయ స్నానాలు చేసిన తరువాతనే దివ్య పూజాబలి సమర్పించేవాడు.

రాబర్ట్ డి నొబిలి మొట్ట మొదటిగా తమిళ భాషను, వేదభాషయైన సంస్కృతాన్ని, నాటి నాయక రాజుల మాతృభాషయైన తెలుగు భాషను వేద పండితుల సాహచర్యంలో అభ్యసించాడు. పలు బ్రాహ్మణ పండితులతో చర్చలు, గోష్ఠులు నిర్వహించి, తన ప్రజ్ఞా పాటవాలతో భారతదేశంలోని పవిత్ర గ్రంథాల సారాన్ని గ్రహించి, హైందవ ధర్మంలోని అంతస్సూత్రాన్ని కనిపెట్టి, సంప్రదాయబద్ధ జీవితానికి పెద్ద పీట వేశాడు. ఇటలీలో తనది రాజ వంశం కాబట్టి మొట్టమొదట తనను తాను ''రాజ సన్యాసి'' గా ఆవిష్కరించుకొనే ప్రయత్నం చేశాడు. బ్రాహ్మణ సాహచర్యంతో అప్పటి 'పరంగి' ముద్రను బాపుకున్నాడు. సన్యాసిలా కఠిన ఉపవాసాలతో, దివ్య బలిపూజ, ధ్యానాదులు, సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ, శూద్రులను, బ్రాహ్మణులను తన వైపు క్రమేణా ఆకర్షించాడు. ఆనాటి మధురై లోని అగ్రవర్ణాలు, విద్యావేత్తలు ఆయన ఆశ్రమం చేరుకుని, అతనితో సంభాషించటం, మత విషయాలు చర్చించటం ఆరంభించారు. రాబర్ట్ స్వచ్ఛమైన తమిళం మాట్లాడటం, వేదాలలోని శ్లోకాలను కంఠోపాఠం చేయటం, తమిళ కవుల పద్యాలను సునాయాసంగా ఉటంకించటం, వీటన్నింటినీ రాగ యుక్తంగా పాడి, టీకా తాత్పర్యాలను వివరించటం మున్నగు పలు విశిష్ట కార్యాలతో బ్రాహ్మణ పండితుల

గౌరవాన్ని పొందాడు. రాబర్ట్ ప్రప్రథంగా జ్ఞానస్నాన మిచ్చిన వ్యక్తి శూద్రుడైన పాఠశాల ఉపాధ్యాయుడు. 1608 కల్లా అనగా తాను మధురై చేరిన రెండు సంవత్సరాలలో రాబర్ట్ గురువుల నేతృత్వంలో పదిమంది అగ్రవర్ణాల యువకులు క్రైస్తవ ధర్మంలో జ్ఞానస్నానం పొందారు. రాబర్ట్ శిష్యగణం విస్తృతం అయ్యింది. ఆ సమయంలో శివధర్మ అను బ్రాహ్మణ పండితుడు అతని మిత్రుడయ్యాడు. రాబర్ట్ అతని శిష్యరీకం చేసి సంస్కృత భాష నేర్చుకున్నాడు. అతని సహకారంతో సంస్కృత భాషలో వేదాలను ముందుగా కళ్ళారా చూశాడు, చదివాడు, అందులో విషయసారాన్ని గ్రహించాడు. ఆ విధంగా సంస్కృత భాషను, హిందూ వేదాలను పఠించిన ఐరోపా వాసులలో రాబర్ట్ డి నొబిలి ప్రథముడుగా చరిత్ర పుటలలో కెక్కాడు. 1609లో క్రైస్తవ వేదమైన బైబులు గ్రంథాన్ని శివధర్మచే పఠింపచేసి, అతనికి క్రైస్తవ సంప్రదాయంలో జ్ఞానస్నానమిచ్చి, ప్రభు రాజ్య వారసునిగా చేసిన ఘనత రాబర్ట్ డి నొబిలిదే. శివధర్మ క్రైస్తవ స్వీకారంతో రెండు ప్రశ్నలు ఉదయించాయి. శివధర్మ బ్రాహ్మణుడు కాబట్టి అతడు ఇతర నిమ్న జాతులతో కలసి ప్రభుని ఆరాధించ ఇష్టపడతాడా? కులం ఆధారంగా క్రైస్తవ విశ్వాసులను వేరుపరచటం న్యాయమా? రెండవది : వేద ప్రచారకుల తలంపుల కనుగుణంగా అగ్రవర్ణాల చిహ్నాలైన మూడు పోగులుగా ఉన్న జంధ్యాన్ని, తలపై పిలకను తొలగించాలా? మొదటి క్లిష్ట ప్రశ్నకు సమాధానంగా రాబర్ట్, బ్రాహ్మణులకు, అగ్రవర్ణాలకు మాత్రమే ప్రత్యేక దేవాలయం నిర్మించి, వారు ఇతరులతో కలిసి మైల, అంటు పడకుండా చేశాడు. రెండవ ప్రశ్నకు జవాబుగా జంధ్యం, పిలక అనునవి సామాజిక సంస్కృతి చిహ్నాలే కాని మత చిహ్నాలు కాదని, తన పొవిన్షియల్ లేర్జియోకు విన్నవించుకుని, నూతన క్రైస్తవులు జంధ్యం, పిలక ధరించటంలో ఇసుమంతైనా తప్పులేదని సమర్థించాడు.

రాబర్ట్ నూతన పంథాలో వేదవ్యాపకం చేస్తూ, కులవ్యవస్థను ఉన్నదున్నట్లుగా అంగీకరించటం, భారతదేశములోని సువార్తా ప్రచారానికి పంటి క్రింది రాయిలా బాధించక మానదని అతని సుపీరియర్ గొన్సాలో అభిప్రాయ పడ్డాడు. కనుక అతడు మలబారు, గోవా ప్రాంతాలను సందర్శించి, రాబర్ట్ పద్ధతులను గురించి, సహ గురువులకు తెలియజేయటమే గాక, గోవా అగ్రపీఠాధిపతికి వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేసాడు. దరిమిలా దక్షిణ భారతదేశంలోని జేసుసభ గురువుల మధ్య, ఇతర సువార్తా ప్రచారకుల మధ్య ఈ విషయం అతి పెద్ద చర్చనీయాంశమైంది. రాబర్ట్ స్నేహితులలో అనేకులు, రోమన్ సామ్రాజ్యంలోని అతని బంధువర్గం, రాబర్ట్ ఎందుకు భారతదేశ సంప్రదాయాలకు ఇంత పెద్ద పీటవేసి, తనను తాను సమూలంగా మార్చివేసుకున్నాడో యని, విస్తుపోయారు. ప్రొవిన్షియల్ లేర్జియో ఈ తుఫానును అణచివేయడానికి, రాబర్ట్ ఆలోచనలను, ఆహార్యాన్ని, సువార్త ప్రచార విధానాలను సమర్థిస్తూ, రోమాపురిలోని జేసుసభ సుపీరియర్ జనరలు గారికి ఉత్తరం వ్రాశాడు.

రాబర్ట్ 1609 కల్లా తన నూతన విధానంలో క్రీస్తు సువార్తను బోధించి, కొందరు బ్రాహ్మణులతో సహా అరవైమందికి జ్ఞానస్నానం ఇచ్చాడు. కుల చిహ్నామైన జంధ్యము, పిలకలను అనుమతించి, క్రైస్తవ మత సంప్రదాయాల ననుసరించి వాటిని ఆశీర్వదిస్తూ, వాటికొక నూతన అర్థాన్ని ఇచ్చాడు. తమిళ ప్రాంతంలో కోత కాలపు పండుగను 'పొంగల్' అంటారు. అది తెలుగు వారికి సంక్రాంతి పండుగ. రాబర్ట్ పొంగల్ గురించి 1609లో తమ ప్రొవిన్షియల్‌కు ఇలా వ్రాశాడు. "సంవత్సర ఆరంభంలో హిందువులు ఒక గొప్ప పండుగను చేసుకుంటారు. అది పొంగల్ పండుగ. ఆ రోజు కొత్త వరి ధాన్యంతో అన్నం వండి, దేవుళ్లకి నైవేద్యంగా పెట్టి, వారు కూడా తింటారు. దానిని వారు చాలా సాంప్రదాయ బద్ధంగా అన్నాన్ని పాలతో కలిపి, దేవుని ముందు అర్పిస్తారు. తమ హిందూ బంధుమిత్రులవలె పొంగల్ చేసుకోకుండా ఉండటం, నూతన క్రైస్తవులు చాలా అవమానంగా భావించారు. అందుచేత, పొయ్యి ముందు సిలువను ఉంచి, నూతన వరిధాన్యంతో అన్నంచేసి, పాలతో కలిపి, దానిని యేసు ప్రభువుకు సమర్పించి, వారెంతో ఆనందించారు. నేనే స్వయంగా ఆ వంటకాన్ని పవిత్ర తీర్థంతో ఆశీర్వదించాను".

రాబర్ట్ బైబులులోని దృష్టాంతాలు తీసుకుని, వానిని అప్పటి సమకాలీన సమాజ పరిస్థితులకు అన్వయించుకుని, అందులో ఉన్న మూఢ నమ్మకాలను కొన్నిటిని ఏరివేసి, క్రైస్తవ మతపరమైన నూతన భాష్యమిచ్చి, భారతీయ ఆచారాలను గౌరవించాడు. అగ్రవర్ణాల క్రైస్తవులకు శ్రీసభలో సముచిత స్థానం కల్పించాడు. అప్పటికి రాబర్ట్ మాత్రమే వేదాలను, వేదాంగాలను చదివి, అందులోని మర్మాన్ని, గూఢార్థాలను ఆకలింపు చేసుకున్న మొట్ట మొదటి ఐరోపా మతవాసి. కనుక అతడు వేదాలను సంశోధించి, మధించి, తన వాదనలకు సాక్ష్యాలను సేకరించి, సహేతుకంగా, సవినయంగా తన పెద్దలకు తెలియజేసి, వారి నిర్ణయాధికారానికి వదలివేసాడు. రాబర్ట్‌కి వేదాల సారమంతా ఒక్కరోజులోనే, ఒక్క సంవత్సరంలోనో వచ్చింది కాదు. అది ఒక నిరంతర ప్రయాణం. అతడు ఒక నిరంతర అన్వేషి. కాబట్టి తాను వేదాలలో తెలుసుకున్న దానిని బట్టి, రాబర్ట్ తన వేషభాషలలో అనేక మార్పులు చేర్పులు చేసుకుంటాడు. అతడు కొన్నాళ్లు పొడవాటి గడ్డంతో కనిపిస్తాడు. మరి కొన్నాళ్లు పూర్తి గుండుతో ఉంటాడు. కొన్నిసార్లు చెవులకు పోగులతో, కొన్నిసార్లు ఏ పోగులూ లేకుండా దర్శనమిస్తాడు. కొన్నిసార్లు బోయీలు మోస్తున్న పల్లకీలో ప్రయాణిస్తాడు. మరికొన్నిసార్లు 150 మైళ్ళ దూరమైనా కాలినడకన వెళ్తాడు. రాబర్ట్ వ్రాసిన వ్యాసాల, గ్రంథాల చివరన తన పేరును "తత్వ బోధకుడు"గా వ్రాసుకున్నాడు. భారతదేశ క్రైస్తవ మనుగడ విదేశీ గురువులపై గాక, స్థానిక భారతీయ బిడ్డలపై ఆధారపడాలని, సువార్త ప్రకటన, విదేశీ భాషలలో గాక, స్థానిక భాషలలో జరగాలని చాలా దూరదృష్టితో చెప్పటం, వ్రాయటం చేశాడు.

వేదవ్యాపక పద్ధతులలో ఏది మంచిది, ఏది మంచిది కాదు? అను వాద

ప్రతివాదనలతో రెండేళ్లు కాలం గడిచిన పిమ్మట, రాబర్ట్ డి నొబిలి విధానాలు ఆమోదయోగ్యం కాదని జగద్గురువుల అధికార ప్రతినిధిగా గోవా, మలబారు మేత్రాసనాలను సందర్శించవచ్చిన నికొలా పిమెంటా గారు ఖండించారు. మత విషయాలలో స్థానికతకు, హైందవ సాంప్రదాయాలకు పెద్దపీట వేసి, రాబర్ట్ లక్ష్మణరేఖ దాటాడని పిమెంటా ప్రకటించారు. ఆ విధంగా కుండబద్దలు కొట్టినట్లు జగద్గురువుల ప్రతినిధి చెప్పటంతో, రాబర్ట్ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయింది. రోములోని జేసుసభ సుపీరియర్ జనరలు గారికి రెండు వైపులా తమ తమ వాదనలు వినిపిస్తూ నివేదికలు పంపారు. దానితో చర్చా వేదిక గోవా నుండి రోముకు మారినట్లయింది. మరో రెండేండ్లు కాలగర్భంలో కలిసిపోయాయి. అంతలో రాబర్ట్ శిష్యులలో ఇరవైమంది తిరిగి హైందవంలో కలిసిపోయారు. ఎంతో సహాయకారిగా, అనుకూలంగా ఉంటూ, రాబర్ట్ వాదనలను సమర్థించిన లేర్జియా స్థానంలో పెరో ఫ్రాన్సిస్కో, నూతన ప్రావిన్షియల్‌గా నియమితులయ్యారు. చివరకు 1613 ఆగస్టులో జేసుసభ జనరలు గారు నొబిలి మూడు ముఖ్యమైన తప్పులు చేశాడంటూ ఉత్తరం వ్రాశారు: 1. బ్రాహ్మణుల వలె జంధ్యం వేయటం, గంధం పూయటం, పావు కోళ్ళు ధరించటం, పరంగిని కాదని చెప్పటం. 2. హిందువుల వలె సంప్రదాయబద్ధ స్నానాలు ఆచరించటం 3. గొన్సాలో ఫెర్నాండెజ్ నుండి విడిపోయి వేరుగా జీవించటం. కనుక వానిని సవరించుకుంటూ జీవించాలని, ఫెర్నాండెజ్ గృహానికి రాబర్ట్ రహస్యంగా రాత్రుళ్లు గాక, పగటిపూట వెళ్ళి పరస్పరం మాట్లాడుకోవాలని, అదేవిధంగా ఫెర్నాండెజ్, రాబర్ట్ ఇంటికి రాకపోకలు నిరాటంకంగా ఉండాలని జేసుసభ జనరలు సూచించారు. జనరలు గారు ఆజ్ఞాపించినట్లు సకల సూచనలు పాటించేంతవరకు, రాబర్ట్ ఎవ్వరికి కూడా కూడా జ్ఞానస్నానం ఇవ్వరాదని నూతన ప్రొవిన్షియల్ ఫ్రానిస్కో షరతులు పెట్టి, రాబర్ట్ ముందరి కాళ్ళకు బంధాలు వేశాడు. సభ పెద్దలకు సంపూర్తిగా విధేయించటం జేసుసభ సభ్యుల ప్రధాన బాధ్యత.

జేసుసభ జనరలు వ్రాసిన లేఖలోని అంశాలను సునిశిత దృష్టితో రాబర్ట్ పరికించాడు. అవి తాను ఎంతో కష్టపడి, శ్రమించి, త్యాగం చేసి హైందవ ధర్మాన్ని గౌరవిస్తూ జీవిస్తున్న జీవన విధానానికి, హైందవ సోదరులకు సువార్త ప్రకటించటం, అగ్రవర్ణాలను ప్రభురాజ్యంలో చేర్చటం లాంటి తన ప్రయత్నాలకు ఆ లేఖ మరణ సాదృశ్యమని, గొడ్డలి పెట్టని భావించి, మౌనంగా రోదించాడు. దైవ చిత్తం తెలుసుకోవటానికై రాబర్ట్ ప్రశాంతంగా ప్రార్థించాడు. దారి తెన్ను కానరాని చిమ్మ చీకటిలో, ఓ కాంతి పుంజం రాబర్ట్ మనస్సులో వెలిగింది. అదే జనరలు గారి లేఖలోని ఓ చిన్న వాక్యం. అది చిన్నదైనా కొండంత బలాన్ని ఇచ్చింది. అదేమనగా "ప్రస్తుత వేదవ్యాపక ప్రాంత మనుగడకు భంగం కలిగించే ఎటువంటి మార్పును, ఎవరూ తలపెట్టవద్దు". అవును. రాబర్ట్ వేదవ్యాపక పరిచర్య కొనసాగాలనే అందులో ఉంది కదా! దైవకార్యాన్ని

ఆప ఎవరితరం? అని రాబర్ట్ గాఢంగా నమ్మి, తన వేదవ్యాపక పద్ధతులలో, వేషభాషలలో ఎటువంటి మార్పులు చేయక, భగవంతునిపై భారం వేసి, తన పని తాను చేసుకొని పోయాడు. కొందరు మాత్రం రాబర్ట్ అవిధేయుడని, సాక్షాత్తూ జేసుసభ జనరలు మాటను జవదాటాడని భావించారు.

ఒకవైపు ఈ చిక్కుముడి వీడకపోవటం, మరో వైపు ప్రావిన్షియల్ ఆజ్ఞకు బద్ధులు కావాల్సి ఉండటంతో, రాబర్ట్ మరో ఐదేళ్లు ఎవ్వరికి జ్ఞానస్నానం ఇవ్వలేదు. 1617లో ఐదవ పాల్ పాపుగారు ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ఒక ధర్మాసనం ఏర్పాటు చేసి, ఇరవై మంది వేదాంత పండితుల సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం కనుగొనమన్నారు. ఆ సమావేశం ఫిబ్రవరి 1518లో గోవాలో జరిగింది. అందులో ముందుగా రాబర్ట్ డి నొబిలిని తన వేద వ్యాపక పద్ధతులను విశదీకరించి, హేతుబద్ధంగా సమర్థించుకోమని కోరారు. రాబర్ట్ తన ప్రజ్ఞాపాటవాలతో, బైబులు దృష్టాంతాలతో, అలనాటి శిష్యుల వైవిధ్య భరిత సువార్త బోధనా పద్ధతులను వరుసగా ఏకరువు పెడుతూ, హిందూ మతం వేరు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు వేరని, క్రీస్తు ప్రభువు నిమ్న జాతుల కొరకే గాక, అగ్రవర్ణాల వారి రక్షకుడు కూడా యని సుదీర్ఘ వివరణ ఇచ్చాడు. రాబర్ట్ తాను కతోలిక మతంలో విబేధాలు సృష్టించి, కొత్త శాఖను ఏర్పరచలేదని, క్రీస్తుని నూతన పద్ధతిలో బోధిస్తున్నానని, బ్రాహ్మణుల కోసం ప్రత్యేక దేవాలయ నిర్మాణానికి క్రాంగనూరు అతి మేత్రాణులు అనుమతిని దయచేశారని, బ్రాహ్మణులను ఇతర అగ్రవర్ణాల వారిని పెద్ద సంఖ్యలో క్రైస్తవంలోనికి ఆహ్వానించటానికి భారతదేశ సనాతన సంస్కృతి సహాయాన్ని మాత్రమే తీసుకున్నానని, బైబులు గ్రంథానికి వ్యతిరేకమైన ఏ పద్ధతిని తాను అవలంభించలేదని పలు కోణాలలో తన పద్ధతులను సమర్థించుకుంటూ, తన లిఖిత పూర్వక సిద్ధాంత వ్యాసాన్ని న్యాయమూర్తుల సంఘానికి సమర్పించాడు. ఆ సమావేశంలో పాల్గొన్న పండితులకు రాబర్ట్ పద్ధతుల గురించి, దాని పర్యవసానాలను గురించి, ఒక ప్రశ్నావళిని నిచ్చి అందరి అభిప్రాయాలను సేకరించి, ఒక నివేదికను తయారు చేసి, రోము నగరానికి పంపారు.

ఆ న్యాయమూర్తుల నివేదికను అందుకున్న రోములోని శ్రీసభ అధికారులు దాని పూర్వాపరాలు ఆలోచించి, కూలంకషంగా మరో మారు చర్చించారు. దాదాపు అయిదు సంవత్సరాల తర్వాత, జనవరి 31, 1623లో పదిహేనవ గ్రెగరి పాపుగారు, రాబర్ట్ తన వేదవ్యాపక పద్ధతులను కొనసాగించవచ్చని తాత్కాలిక ఉత్తర్వులు ఇచ్చారు. క్రైస్తవ బ్రాహ్మణులు జంధ్యం, పిలక ఉంచుకోవచ్చని, గంధం నుదిటన పూసుకోవచ్చని, కాకపోతే జంధ్యానికి ఒక సిలువను కూడా జత చేయాలని, జంధ్యాన్ని కతోలిక గురువు మాత్రమే వేయాలని ఆజ్ఞలిచ్చారు. వర్ణవ్యవస్థపై జగద్గురువుకు కొంత మేరకు అవగాహన వచ్చిందని, బానిసత్వం, వెట్టి చాకిరి వ్యవస్థలపై శ్రీసభ ఏ విధంగా వ్యవహరించిందో,

దీనిపై కూడా అదేవిధంగా వ్యవహరిస్తుందని అభయం ఇచ్చారు. వాటికను పెద్దల ఆశీర్వాదంతో, రాబర్ట్ క్రీస్తు సువార్తను ఉత్సాహంతో బోధిస్తూ, పన్నెండు మంది బ్రాహ్మణులతో సహా 1208 మంది అగ్రవర్ణాల వారికి, 2675 మంది శూద్రులకు జ్ఞానస్నాన భాగ్యం కలిగించాడు. రాబర్ట్ సలహాతో జేసుసభ అధినేతలు, క్రాంగనూరు అతిమేత్రాణులు వేదవ్యాపక ప్రచారానికి ఇక నుండి రెండు రకాల మిషనరీలు ఉండాలని బ్రాహ్మణులు, అగ్రవర్ణాల కోసం ఒక వర్గం, నిమ్నజాతుల వారికోసం మరొక వర్గం అని వేరు వేరుగా వేద ప్రచారకులుండాలని నిర్ణయించారు.

క్రైస్తవ మతానికి స్థానికతను జోడించే ప్రక్రియలో భాగంగా, నొబిలి అనేక నూతన పదాలను పరిచయం చేశాడు. కతోలిక చర్చిని 'కోయిల్' అని, ప్రభు భోజనాన్ని 'ప్రసాదం' అని, గురువును 'అయ్యర్' అని, బైబులును ''వేదం'' లేదా ''యేసుని వేదం'' అని, పూజాబలిని 'పూజ' అని స్థానిక నామాలను రూపొందించాడు. అదేవిధంగా బైబులులోని వ్యక్తులైన లాజర్‌ను 'దేవ సహాయం' అని, పీటర్‌ను 'రాయప్ప' అని, జాన్ ను 'అరుళప్ప' అని, పాల్‌ను 'చిన్నప్ప' అని సమానార్థక నామాలను రూపొందించి ఇవ్వసాగాడు. కతోలిక మత సత్యాలను తమిళ, తెలుగు, సంస్కృత భాషలలో ప్రజలకు అందించటానికి ఎన్నో గ్రంథాలను స్వయంగా లిఖించాడు. మరి కొన్నింటిని స్థానిక భాషలలో అనువదించాడు. ఎక్కడో పోర్చుగల్ దేశం నుండి గాక స్థానిక భారతీయ సాంప్రదాయంలో పుట్టి పెరిగిన యువతకు స్థానిక భాషలలోనే గురుశిక్షణ నొసగి, వారే స్థానికులకు బోధన చేసే దశకు, భారతీయ శ్రీసభ ఎదగాలని రాబర్ట్ మనస్ఫూర్తిగా కోరుకున్నాడు. దానికోసమై ఎన్నో ప్రయత్నాలు చేశాడు. 17వ శతాబ్దంలోనే అటువంటి ఉన్నత భావాలను నిర్భయంగా వెల్లడించటం ఆయనకే చెల్లింది. అప్పట్లో క్రైస్తవులు కొబ్బరికాయ కొట్టడం, స్త్రీలు బొట్టు పెట్టుకోవటం, నూనె దీపం పెట్టటం లాంటి చిన్న విషయాలు కూడా కతోలిక మతానికి వ్యతిరేకమని, క్రైస్తవ జ్ఞానస్నానంతోబాటు, పాశ్చాత్య అలవాట్లు, కట్టుబొట్లు భారతీయులకు బలవంతంగా కట్టబెట్టిన ఆ రోజులలో రాబర్ట్ విభిన్నంగా ఆలోచించాడు. స్థానిక మత సంప్రదాయాలను, అచార వ్యవహారాలను, హిందూ వేదాలను అర్థం చేసుకున్నాడు. మతానికి, సంస్కృతికి ఉన్న కొద్దిపాటి వ్యత్యాసాన్ని గ్రహించి, దానినే తన వేద వ్యాపక పద్ధతుల ద్వారా అమలు పరచి, లక్షలాది మందికి క్రైస్తవ మత ప్రవేశం కల్పించాలని ఒంటరిపోరాటం చేశాడు. రాబర్ట్ గతించి నాలుగు శతాబ్దాలైనా, భారతదేశంలో పుట్టి పెరిగిన వేదాంత పండితులెందరో ఇంకా మతానికి, వర్ణానికి స్పష్టమైన ఆకారం ఇవ్వలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇచ్చినా అందరి ఆమోదానికి నోచుకోని పరిస్థితిని మనం ఇంకా చూస్తున్నాం. కాని రాబర్ట్ భారతదేశానికి వచ్చి, భారతీయతను, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, తెలుసుకొని, అతి కొద్దిపాటి సమయంలో అనగా మూడేండ్లలోనే దానిపై స్పష్టమైన ఒక అవగాహనకు వచ్చి, భారత శ్రీసభను ఎంతో

ప్రేమించి, ప్రభు రాజ్యాన్ని క్రొత్త పంథాలో స్థాపించబూనటం మనలో చాలా మందికి ఊహాతీతం.

రాబర్ట్ డి నొబిలి వ్యక్తిగత జీవితం చాలా సౌమ్యంగా, లోతుగా ఉంటుంది. అతడు ప్రతిదినం ఎంతోసేపు ప్రార్థనలో గడిపాడు. దివ్య పూజాబలిని ప్రతినిత్యం అర్థవంతంగా నిర్వహించాడు. భక్తులెవరైనా వస్తే, వారితో ఆధ్యాత్మిక విషయాలు ముచ్చటించాడు. పండితులతో మత విషయాలు, సాహిత్య విషయాలు తర్కించాడు. ప్రస్తుత నామక్కల్ సమీపాన గల శాంతమంగళం రాజాస్థానాన్ని 1628లో సందర్శించి, రామచంద్ర నాయక్ రాజుగారి అతిథి సత్కార్యములను స్వీకరించాడు. రాజు గారి సోదరునికి, బంధువులలో కొందరికి జ్ఞానస్నానమిచ్చాడు. రాబర్ట్ సువార్త ప్రకటన వలన తిరుచ్చిరాపల్లి, సేలం పట్టణాలలో పలు వర్ణాల ప్రజలు జ్ఞానస్నానం పొందారు. 1640లో రాబర్ట్ బ్రాహ్మణుల ఆగ్రహానికి గురై, చెరసాలలో వేయబడ్డాడు. రాబర్ట్ తన ప్రార్థనా శక్తితో వ్యాధులను కూడా నయం చేశాడు. 1643లో బల్తజార్ డి కోస్టా గురువులు ఉన్నత వర్గాల క్రైస్తవులను, ఇతర వర్గాల క్రైస్తవులను ఒకే సంఘంగా, ఐక్యం చేయాలని ప్రయత్నించినా, అతని ప్రయత్నాలు ఫలించలేదు. కొందరు దానిని బహిరంగంగా వ్యతిరేకించటంతో, చేసేదేమిలేక బల్తజార్ మిన్నకుండి పోయాడు. రాబర్ట్‌ని మధురై నుండి శ్రీలంక లోని జాఫ్నాకు 1640లో బదిలీ చేశారు.

అక్కడ రాబర్ట్ కొన్ని సంవత్సరాలు పనిచేసాడు. అక్కడే అతని ఆరోగ్యం క్షీణించసాగింది. దాంతో తన అంత్యదశను తనకు ఎంతో ఇష్టమైన మధురైలో గడుపుతానని జేసుసభ అధికారులను అభ్యర్థించినా, వారు దానిని ఆలకించక, రాబర్ట్‌ను ప్రస్తుత మద్రాసు పట్టణమందలి మైలాపూరుకు తరలించారు. అక్కడే తన చివరి దశను గడిపాడు. రాబర్ట్ చూపును కోల్పోయి అంధుడయ్యాడు. అక్కడ అతడిని అందరూ ఎంతో ఆప్యాయంగా ''పుణ్య గురువుగా'' పిలిచేవారు. రాబర్ట్ వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ మాంసాన్ని ముట్టక, శాకాహారాన్ని మాత్రమే భుజించాడు. క్రమేణా అతడు చిక్కి శల్యమై పోతున్న స్థితిలో అతని స్నేహితులు బలం కోసం 'ఎముకల చారు'' ఇవ్వచూపినా, అతడు దానిని తిరస్కరించాడు. మరణ పర్యంతం రాబర్ట్ బ్రాహ్మణ సన్యాసి వలె జీవించి, కతోలిక గురు జీవితానికి వన్నె తెచ్చాడు. చివరగా రాబర్ట్ ఒక నిజమైన క్రైస్తవ సన్యాసివలె ఎటువంటి ఆహారం ముట్టక, ఉపవశిస్తూ, తన పవిత్ర ఆత్మను త్రియేక దేవునికి జనవరి 16, 1656న సమర్పించాడు. ఇటలీ రాజ వంశంలో పుట్టి, భారతదేశాన్ని తన స్వంత దేశంగా ఎంతో ఆప్యాయంగా ప్రేమించి, చక్కని శ్రీసభను స్థాపించాలనే ఉద్దేశ్యంతో ఒంటరి పోరాటం చేసిన రాబర్ట్ పార్థివ దేహాన్ని, భరతమాత నేల తల్లికి అశ్రు నయనాలతో సమర్పించి భూస్థాపితం చేశారు. అప్పటికి రాబర్ట్ నొబిలి వయస్సు 79 యేండ్లు.



మరవనాటి వేదసాక్షి

# 6. పునీత జాన్ డి బ్రిట్టో

**(1647-1693)**

ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.

జాన్ డి బ్రిట్టో పోర్చుగల్ దేశములోని లిస్బన్ లో 1647 మార్చి 1న జన్మించాడు. రాజ వంశీయుడైన జాన్ డి బ్రిట్టో, పోర్చుగల్ యువరాజు బాల్యం నుండియే స్నేహితులు. ఆ యువరాజే, తరువాత రెండవ పీటర్ పేరుతో పోర్చుగల్ దేశానికి రాజయ్యాడు. జాన్ బాల్యంలో వ్యాధికి గురి కాగా, అతని తల్లి శౌరివారిని, స్వస్థత చేకూర్చమని వేడుకున్నది. ఆ వ్యాధి నుండి కోలుకుంటే, జేసుసభ గురువుల అంగీని, సంవత్సరంపాటు జాన్‌కు వేస్తానని మొక్కుకుంది. జాన్‌కు స్వస్థత చేకూరగానే, ఆ గురువుల అంగీని సంవత్సరం ధరించి, రాజుగారి సభలో తన పని తాను చేసుకుంటూ, తన తల్లి మొక్కు తీర్చుకున్నాడు. ఆ సమయంలోనే ఫ్రాన్సిస్ శౌరివారి వలె, దేశ దేశాలు తిరిగి, మతప్రచారం చేయాలని, దానికై జేసుసభలోనే చేరాలని జాన్ డి బ్రిట్టో నిశ్చయించుకున్నాడు. కాని అతని తల్లి బియాట్రిస్ అందుకు సమ్మతించలేదు. అతనిని రాజుగారు, రాకుమారుడు. రాజసభలోనే ఉండిపోవలసిందిగా కోరారు. కాని జాన్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

1662లో జాన్ డి బ్రిట్టో జేసుసభలో చేరి, నోవిషియేట్, తత్వశాస్త్రం ముగించాడు. భారతదేశానికి తనను మత ప్రచారకునిగా పంపవలసినదిగా సభాధినేతకు లేఖ వ్రాయగా, వారందుకు సమ్మతించారు. బ్రిట్టో వేదాంత విద్యను ముగించి 1673లో గురుపట్టం పొందాడు. జాన్ భారతదేశం వెళ్ళనున్నాడని తల్లి తెలుసుకుని, ఆ నిర్ణయాన్ని అధికారులచే మార్పించాలని శత విధాలా ప్రయత్నించింది. కాని ఆమె కుమారుడే వెళ్ళాలని, స్వయంగా కోరుకున్నాడు కావున ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. జాన్ డి బ్రిట్టో, పలువురు జేసుసభ సభ్యులతో కలసి, 1673 మార్చి 15న లిస్బన్ నుండి భారతదేశానికి బయలుదేరి, గోవా చేరుకున్నాడు. గోవాలోని గురువిద్యాలయములో బోధించవలసినదిగా, జాన్ డి బ్రిట్టోను కోరగా 'భారత దేశానికి వచ్చినది వేదసాక్షిగా మరణించటానికే గాని, మంచి ఉపాధ్యాయునిగా పేరు గడించటానికి కాదంటూ' స్పష్టంగా చెప్పాడు. అతనిలోని ఉత్సాహాన్ని, ధైర్యాన్ని గమనించి, జాన్ డి బ్రిట్టోను, మధురై మండలానికి పంపారు.

ఆనాటి మధురై మండలం నేటి తమిళనాడు రాష్ట్రమే. అప్పటికే ఆ ప్రాంతంలో అనేకులు క్రైస్తవ మతం స్వీకరించారు. జాన్ డి బ్రిట్టో మధురై మండలం చేరే సమయానికి, జేసుసభ గురువులు కొందరు 'పండార స్వాములు' గా, కొందరు "బ్రాహ్మణ

సన్యాసులు''గా క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేయసాగారు. జాన్ డి బ్రిట్టోను పెద్దలు అన్ని కులాల వారికి దైవవాక్యాన్ని బోధించవీలైన 'పండార స్వామి'గా 1674లో నియమించారు. అనాటి నుండి జాన్ డి బ్రిట్టో ''అరుళానందర్''గా స్థానిక నామధేయాన్ని స్వీకరించి, తలకు ఎర్రని తలపాగా చుట్టి, కాషాయ వస్త్రాలు ధరించి, నుదుటిపై విభూది రేఖలతో, ఉపవాసాలు చేస్తూ, శాకాహారం భుజిస్తూ, చాపపై నిద్రిస్తూ, నియమ నిష్ఠలు కలిగిన సన్యాసిగా జీవించసాగాడు. హిందూ సాంప్రదాయాలను అనుసరిస్తూ అరణ్యములో, ఆశ్రమాలలో వడకము (ధ్యానము) లేర్పాటు చేశాడు. జాన్ డి బ్రిట్టో ఈవిధంగా కఠిన జీవితం జీవిస్తూ తంజావూరు, జింజి రాజ్యములలో బోధించ సాగాడు. జాన్ 1677 తపస్కాలంలో 300 మందికి జ్ఞాన స్నానమిచ్చాడు.

మధురై మండలములో పదకొండు సంవత్సరాలు పనిచేసిన పిమ్మట జాన్ డి బ్రిట్టోను 1685లో మండలాధిపతిగా నియమించారు. ఆ కాలంలో ఏ గ్రామంలో, ఏ చిన్న విపత్తు సంభవించినా, అది క్రైస్తవుల వలననే సంభవించినదని, పుకారు పుట్టించి, క్రైస్తవులను, క్రైస్తవ గురువులను పట్టుకొని, చిత్రహింసల పాలుచేసేవారు. జాన్ డి బ్రిట్టో ఈ విధంగా కొన్నిసార్లు కష్టాల పాలయ్యాడు. క్రైస్తవ మతంలోనికి ఎక్కువమందిని స్వీకరిస్తున్న కారణంగా, జాన్ డి బ్రిట్టోను బ్రాహ్మణులు కుట్ర పన్ని చంపదలచి 1686లో బ్రిట్టోను, అతని ఉపదేశులను పట్టి బంధించారు. వారికి మరవ పాలనాధికారి మరణ శిక్ష విధించి, రాజుగారి ఆమోద ముద్రకై ఆగారు. ఆ నెల రోజులలో వారిని కొరడాలతో కొట్టని రోజు లేదు. వారి ఒళ్ళంతా పచ్చి పుండులా తయారైనా, ఎర్రటి ఎండలో మాడిపోతున్న బండలపై పండబెట్టి, బాధించేవారు. ఆ విధంగా జాన్ డి బ్రిట్టోను నెల రోజులపాటు చిత్ర హింసల పాలు చేసి, రామనాధపురంలో గల మరవ రాజు వద్దకు తీసుకొని పోయారు. రాజు, బ్రిట్టో మత సిద్ధాంతాలను తెలుసుకుని క్రైస్తవ మతాన్ని మరింత వివరించమని బ్రిట్టోను కోరాడు. బ్రిట్టో వివరణను విన్న తరువాత రాజు ఎంతో మంది ప్రతిఘటిస్తున్నా బ్రిట్టోను, అతని అనుచరులను విడుదల చేశాడు.

ఈ చిత్రహింసలానంతరము భారతదేశంలో క్రైస్తవ మత వ్యాప్తిపై పోర్చుగల్ దేశంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యేందుకు జాన్ డి బ్రిట్టో బయలు దేరాడు. అతని కంటె ముందుగానే, అతని సన్యాస జీవితం, చెరసాల జీవితం, చిత్ర హింసల వివరాలు ఐరోపా ఖండం చేరుకున్నందున, అతడు పోర్చుగల్ చేరినపుడు అతనికి వీర స్వాగతం లభించింది. తన చిన్ననాటి స్నేహితుడు పోర్చుగల్ రాజు వద్దకు వెళ్లినా, కాషాయ వస్త్రములతోనే వెళ్లి, శాకాహారాన్నే భుజించాడు. భారతదేశ క్రైస్తవ మత ప్రచారకుల సాహసోపేత జీవితాన్ని అక్కడి జేసుసభ సభ్యులకు, మిత్రులకు ఉత్సాహకరంగా వర్ణించి చెప్పాడు. వృద్ధురాలైన తన తల్లిని కూడా సందర్శించాడు జాన్. ఈసారి కుమారుడు చేస్తున్న గొప్ప గొప్ప కార్యములు విని, ఆమె సంతోషంతో జాన్‌కు వీడ్కోలు చెప్పింది.

జాన్ డి బ్రిట్టో 1690లో భారతదేశానికి వచ్చి, తన మధురై మండలంలో వేద

ప్రచార కార్యక్రమములలో మునిగిపోయాడు. అతని కృషి వలన, రెండు సంవత్సరాలలో పది వేల మందికి పైగా జ్ఞానస్నానం తీసుకున్నారు. 1686లో మరవరాజు అతనిని వదలిపెడుతూ, తిరిగి తన రాజ్యంలో ప్రవేశించవద్దని శాసించినా, ఆ రాజ్యంలో ప్రవేశించి, రాత్రి వేళలందు రహస్యంగా పూజ సమర్పిస్తూ కొందరికి జ్ఞానస్నానం ఇవ్వసాగాడు. ఆ విధంగా క్రైస్తవులైన వారిలో మరవ రాకుమారుడగు తడయ దేవర్ ముఖ్యుడు. తడయ దేవర్ పూర్వీకులు మరవ రాజ్యాన్ని పాలించారు. అతనికి క్రైస్తవ మత సిద్ధాంతాలపట్ల ఆసక్తి కలిగి, జాన్ డి బ్రిట్టోను పిలువ నంపాడు. జాన్ డి బ్రిట్టో తడయ దేవర్‌ను జనవరి 6, 1693న సందర్శించాడు. అతనికి పలువురు భార్యలున్నందున, మొదటి భార్యను మాత్రమే స్వీకరించి, మిగిలిన వారిని విడచి పెట్టిన పిమ్మటనే జ్ఞానస్నానం స్వీకరించవచ్చుని, జాన్ డి బ్రిట్టో తడయ దేవర్‌కు చెప్పాడు. తడయ దేవర్ ఆ విధంగా ఇతర భార్యలను వదలిపెట్టి, జ్ఞానస్నానం పొందాడు.

ఆ విధంగా వెళ్ళగొట్టబడిన భార్యలలో నొక భార్య అప్పటి మరవ రాజుగారి సోదరుని కుమార్తె కావటంతో కథ మరో మలుపు తిరిగింది. కుమార్తె చెప్పిన విషయాలను విన్న మరవ రాజు అగ్రహోదగ్రుడై బ్రిట్టోను చంపదలచి, జనవరి 8న బ్రిట్టోను ఖైదు చేసి, రామనాథపురం చెరసాలకు పంపాడు. క్రైస్తవ వేదాన్ని తన రాజ్యంలో బోధించినందుకు శిక్షగా, మరవరాజు జనవరి 28న జాన్ డి బ్రిట్టోను రాజ్యం నుండి వెలివేసి, ఓరియారుకు పంపాడు. మరవరాజు ఒరియూరు ప్రాంతమునకు రాజైన తన సోదరునికి రహస్యముగా నొక లేఖను పంపి, బ్రిట్టోను చంపవలసినదిగా కోరాడు.

ఓరియూరు చెరసాల నుండి ఫిబ్రవరి మూడున తన సోదరునికి, జేసుసభ గురువులకు తాను ఖైదు చేయబడిన విధము వివరిస్తూ రెండు లేఖలు వ్రాశాడు. వానిలో తాను మరునాడు మరణించనున్నానని, ఆ సంవత్సరములోనే 4000 మందికి పైగా జ్ఞానస్నానమిచ్చానని జాన్ డి బ్రిట్టో వ్రాసుకున్నాడు. జాన్ డి బ్రిట్టో తలచినట్లుగా ఫిబ్రవరి 4, 1693న అతనిని, సైనికులు ఓరియూరుకు దగ్గరలో గల ఒక ఇసుక తిన్నె వద్దకు తీసుకుని వెళ్ళారు. జాన్ డి బ్రిట్టో ఆ ఇసుక తిన్నెపై మోకాళ్ళూని, కొన్ని నిమిషాలు ప్రార్థించి "మిత్రమా! మా దేవుని నేను ప్రార్థించి, నా పనిని ముగించాను. నీకప్పగించిన పనిని నీవు కూడా ముగించమని" సైనికులతో చెప్పగానే, అతడు కత్తిని చేతబట్టి మొదటి వేటుతో బ్రిట్టో మెడలోని సిలువను వేరు చేసి, రెండవ వేటుతో అతని తలను తెగనరికాడు. అనంతరము కాళ్ళు చేతులను నరికి వేశారు. కట్టతేవర్ సేతుపతి 1730లో బ్రిట్టో మరణించిన స్థలంలోనే ఒక స్మారక దేవాలయాన్ని నిర్మించాడు. మన భారతదేశంలో రక్తం చిందించిన జాన్ డి బ్రిట్టోను 1853 ఆగస్టు 21న తొమ్మిదవ భక్తినాథ జగద్గురువులు ధన్యులుగా, 1947 జూన్ 22న పన్నెండవ భక్తినాథ పాపుగారు పునీతులుగా ప్రకటించారు. జాన్ డి బ్రిట్టో పేరిట ఓరియూరులో నిర్మించిన దేవాలయములో ఫిబ్రవరి 4న అతని పండుగను ఘనంగా కొనియాడుచున్నారు.



శ్రీలంక అపోస్తులుడు

# 7. పునీత జోసఫ్ వాస్

**(1651-1711)**

బ్రదర్ పొన్నకంటి అరవింద్ కుమార్ S.J.

జోసఫ్ వాస్ పోర్చుగీసు సామ్రాజ్యమందలి గోవాకు సమీపానగల బెనాలిమ్ గ్రామంలో ఏప్రిల్ 21, 1651లో జన్మించాడు. అతని తల్లిదండ్రులు క్రిస్టోవా వాస్ మరియు మరియ దె మిరాండా. వారు చక్కని కతోలికులు. క్రిస్టోవా, సంకోలె గ్రామంలోని ప్రముఖ కుటుంబానికి చెందినవాడు. జోసఫ్ వాస్‌కు పుట్టిన ఎనిమిదవ రోజున బెనాలిమ్‌లోని పునీత బప్తిస్మ యోహాను గారి దేవాలయంలో విచారణ గురువైన జసింతో పెరిరా గారు జ్ఞానస్నానమిచ్చారు. ఆ దంపతులకు కలిగిన ఆరుగురిలో జోసఫ్ మూడవ సంతానం.

జోసఫ్ తన విద్యను సంకోలెలోని ప్రాథమిక పాఠశాలలో అభ్యసించాడు. అతడు సంకోలె లో పోర్చుగీసుభాష, బెనాలిమ్ లో లతీను భాషను క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. అతడు చాలా తెలివైనవాడు. అందుచేత అతనిని సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు గౌరవించేవారు. అతడు చదువులలో చక్కగా రాణిస్తున్నందున, ఉన్నత చదువుల నిమిత్తం అతని తండ్రి, జోసఫ్‌ను గోవా పట్టణం పంప నిర్ణయించాడు. అతడు గోవాలోని జేసుసభకు చెందిన పునీత చిన్నప్ప గారి కళాశాలలో కొంతకాలం చదివాడు. కళాశాల చదువులు ముగించిన పిమ్మట జోసఫ్, పునీత దొమినిక్ వారి సభగురువులచే నిర్వహించబడుచున్న పునీత తోమాసు అక్వినాస్ గారి అకాడమీలో చేరి తత్వ, వేదాంత శాస్త్రాలు చక్కగా పఠించాడు. అతడు 1675లో డీకనుగా, 1676లో గోవా అతిమేత్రాణులగు అంతోనియో గారి పవిత్ర హస్తాల మీదుగా గురు పట్టాభిషేకం పొందాడు.

జోసఫ్ వాస్ గురువుగా తన స్వగ్రామం వచ్చి కొన్నాళ్లు దేవాలయంలో దివ్య పూజలు చేశాడు. అతడు కాళ్లకు చెప్పులు కూడా లేకుండా తిరుగుతూ బోధించేవాడు. ప్రజలకు ప్రభు మార్గాన్ని బోధించి, వారిచే పాప సంకీర్తనాలు చేయించేవాడు. అతడు సంకోలె నందు సెమినరీ విద్యార్థుల కోసం లతీను పాఠశాలను ఆరంభించాడు. అతడు 1677లో తనను "మరియమాత దాసుని"గా దేవమాతకు ప్రత్యేకంగా సమర్పించుకున్నాడు. జోసఫ్ సిలోను దేశంలో సువార్తా ప్రచారం చేయాలని కోరుకున్నప్పటికి, అతనిని గోవా పీఠ భూభాగమైన కర్ణాటకలోని కెనరాకు పంపారు. అక్కడ పోర్చుగల్ ఆధ్వర్యంలోని గురువులకు, రోములోని జగద్గురువుల ఆధ్వర్యంలోని గురువులకు మధ్యనున్న భేదాలను తొలగించడం జోసఫ్ ప్రధాన బాధ్యత. అందులకై అతనికి 1781లో "వికర్ ఫొరెన్" అను గురుహోదాను కల్పించారు. జోసఫ్ చాకచక్యంగా ఇరువర్గాలతో చర్చలు జరిపి,

వైషమ్యాలు, ఉద్రేకాలు తగ్గించి, రెండు వర్గాలను శాంతింపజేశాడు. నూతనంగా నియమింపబడిన పదకొండవ ఇన్నొసెంట్ పాపుగారి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఇరువర్గాల వారిని వేచియుండాలని ఒప్పించాడు. అతడు 1681 నుండి 1684 వరకు మంగుళూరు, కుందాపూర్, బస్రూర్, కళ్యాణ్‌పూర్ మొదలగు ప్రాంతాలలో కతోలిక విశ్వాస ఉజ్జీవనానికి ఎంతో కృషి చేసి, బోధించాడు. అతడు మంగుళూరు నందలి రొజారియో కతెడ్రల్‌ను పునర్నిర్మించాడు. అతడు అనేక గ్రామాలలో నూతన దేవాలయాలను నిర్మించాడు. స్థానికుల సహకారంతో కొన్ని గ్రామాలలో పాఠశాలలను ఆరంభించి, విద్యాభివృద్ధికి తన చేయూత నందించాడు. అతడు కతోలికుల మధ్య ఆధ్యాత్మిక సమాజాలను ఏర్పాటు చేసాడు. వారి సహకారంతో అక్కడ దేవాలయాలు లేకపోయినా, క్రైస్తవ పండుగలు చాలా వైభవంగా చేసుకునే సంప్రదాయాన్ని మొదలుపెట్టి, గురువులు లేని కొరతను తీర్చి, వారి విశ్వాసాన్ని వృద్ధి పరచాడు. అతడు పనీర్ గ్రామంలో ఉన్నప్పుడు కొందరు హిందూ సోదరులు అతనిని చంపాలని కుట్ర పన్నారు. వ్యాధిగ్రస్తుల అభ్యంగనం నెపంతో అతనిని పిలుచుకుని వెళ్లారు. వారు చంపటానికి సిద్ధంకాగా, జోసఫ్ మోకాళ్లని ప్రార్థించటం ఆరంభించాడు. అతనిలోని మహత్తును, పవిత్రతను కళ్లారా గాంచి, వారు చంపకుండా వదిలివేశారు. ఇప్పుడు ఆ 'ముడిపు'లో అతని పేరిట ఏర్పడిన పుణ్యక్షేత్రంలో ఎందరో భక్తులు, విశ్వాసులు ప్రార్థించడం, పలు స్వస్థతలు, మేలులు పొందటం జరుగుతుంది.

జోసఫ్ వాస్ మంగుళూరు నుండి 1684లో గోవా పట్టణం చేరుకున్నాడు. అతడు ఏదైనా గురువుల మతసభలో చేరాలని భావించాడు. కాని ఆ సభలలో భారతీయులకు ప్రవేశం లేనందున, అతని కోరిక నెరవేర లేదు. గోవా అతి మేత్రాణుల అనుమతితో జోసఫ్ మరో ముగ్గురు స్థానిక గురువులతో కలిసి ఒక బృందంగా ఏర్పడి, సమూహ జీవనం మొదలుపెట్టారు. ఆ విధంగా ''పునీత ఫిలిప్ నెరి ఒరేటరీ మతసభ'' సెప్టెంబరు 25, 1685న ప్రారంభమైంది. వారంతా అద్భుత పవిత్ర సిలువ దేవాలయ బాధ్యతలు స్వీకరించి,అక్కడే తమ నివాసాన్ని ఏర్పరచుకున్నారు. గురువుల బృందం జోసఫ్‌ను తమ మతసభ నాయకునిగా ఎన్నుకుంది. కొన్నాళ్లు అక్కడ ఆధ్యాత్మిక సేవలందించిన తరువాత, సిలోను (శ్రీలంక)లోని కతోలికులకు గురువుల కొరత ఎక్కువగా ఉందని తెలుసుకుని, అక్కడి దేవుని ద్రాక్షాతోటలో పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. అతడు 1686లో సిలోను ప్రయాణం మొదలుపెట్టి, మార్గమధ్యంలో కేరళలో పనిచేసి, సన్యాసిగా మారువేషం వేసుకుని, 1687 ఈస్టర్ పండుగకు ట్యుటికోరిన్ చేరుకున్నాడు. అతడు వలస కూలీ అవతారమెత్తి, జాన్ అను ఒక సహాయకుని వెంట బెట్టుకుని, సముద్ర మార్గాన సిలోను తీర పట్టణం జాఫ్నా చేరుకున్నాడు. జాఫ్నాలో ఉన్నప్పుడు అతడు రక్త విరేచనాలతో విపరీతంగా చాలాకాలం బాధపడ్డాడు. స్థానిక ప్రజల పరామర్శతో అతడు క్రమేణా కోలుకున్నాడు.

సిలోనులో క్రైస్తవ శాఖయైన కాల్వినిస్టుల ప్రభావం ఎక్కువగా ఉంది. డచ్చి

ప్రభుత్వం కతోలికుల గురువులను దేశ బహిష్కారం చేసింది. కనుక జోసఫ్ వాస్ ఒక భారతీయ సన్యాసిలా, ఒక యాచకునిలా మారువేషంలో కతోలికుల కోసం తన అన్వేషణ మొదలుపెట్టాడు. కతోలికులు తనను గుర్తించాలని జోసఫ్ తన మెడలో పెద్ద జపమాలను ధరించి, ఇల్లిల్లూ తిరిగి భిక్షమెత్తాడు. అతనిని ఒక కతోలికుడు గుర్తించాడు. అతని సహాయంతో 1689లో కతోలికులు ఎక్కువగా నివసించే సిల్లాలై గ్రామంలో తన బస ఏర్పాటు చేసుకుని, రహస్యంగా వారి ఆధ్యాత్మిక అవసరాలు తీర్చసాగాడు. అక్కడ అతడు రెండు సంవత్సరాలు పనిచేశాడు. జోసఫ్ దాదాపు 36 యేళ్ల నుండి కతోలిక గురువు లేని పుట్టాలం చేరుకుని, వారికి దివ్య బలిపూజలు సమర్పించాడు. వారి పాప సంకీర్తనాలు విన్నాడు. ఆ ప్రాంతమందలి ప్రతి గ్రామం కాలినడకన రహస్యంగా రాత్రులందు ప్రయాణిస్తూ, కతోలికులకు ఆధ్యాత్మిక పరిచర్య చేసి, వారి విశ్వాసాన్ని నూత్నీకరించాడు. అక్కడ 18 నెలలు పనిచేసిన పిమ్మట, కాండీకి దగ్గరలోని వియిదా చేరుకున్నాడు. అది కాండీ రాజ్యానికి ముఖద్వారం. అక్కడే కాండీ చేర అనుమతి పొందాలి. అక్కడ అనుమతి కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పుడు, అక్కడున్న ఓ ఫ్రెంచి దేశీయుడు జోసఫ్‌ను పోర్చుగీసు గూఢచారిగా అనుమానించి ఖైదు చేశాడు. అతడు ఆ జైలులో సింహళ భాషను చక్కగా నేర్చుకున్నాడు. కొంత కాలం కాండీ చెరసాలలో గడిపిన పిమ్మట, అతని దైవ భక్తిని, పవిత్ర జీవితాన్ని గమనించిన కాండీ రాజైన రెండవ విమల ధర్మసూర్య అతనిని, అతని సహాయకుని విడచిపెట్టాడు. రాజు, రాకుమారుడైన నరేంద్ర సింహలిద్దరు జోసఫ్ వాస్ పట్ల గౌరవభావంతో, సుహృద్భావంతో మెలిగారు. కనుక జోసఫ్ ఆ అవకాశాన్ని వినియోగించుకుని, వారి రాజ్యంలో ఒక పేద సన్యాసిలా గ్రామ గ్రామాలు తిరుగుతూ, కతోలిక బిడ్డలకు ఎన్నో సేవలు చేశాడు. 1691 క్రిస్మస్ రాత్రి మొట్టమొదటగా జోసఫ్ దివ్యపూజాబలి సమర్పించాడు. ఆ ప్రాంతం మత బోధకు అనుకూలం కావడంతో, మరికొందరు గురువులను పంపమని తన నూతన మఠసభ గురువులకు 1692 సెప్టెంబరులో లేఖ వ్రాసాడు. జోసఫ్ పవిత్రత తెలిసిన స్థానిక కతోలికులు పలు గ్రామాల నుండి అతని వద్దకు వచ్చి, అతని ఆశీర్వాదాలు పొందేవారు.

కాండీ రాజ్యంలో ఒక సారి వర్షాలు పడక పెద్ద కరవు రాగా, విమల ధర్మసూర్య రాజు విజ్ఞప్తి మేరకు, రాజుగారి కోట గుమ్మం ముందున్న బహిరంగ ప్రదేశంలో జోసఫ్ ఒక పీఠం నిర్మించి, మోకాళ్లూని ప్రార్థించగా, ఎవరూ ఊహించని విధంగా జోరున పెద్ద వర్షం కురిసింది. దానితో అతని పేరు ప్రఖ్యాతులు మారు మ్రోగాయి. అతనికి రాజ్యమంతా తిరిగి క్రైస్తవ మత బోధ చేయ అనుమతి పూర్తిగా లభించింది. జోసఫ్ వాస్ కృషితో ఎందరో క్రైస్తవ ధర్మం స్వీకరించారు. తన సేవకుడు జాన్‌ని గోవా పంపి, సిలోనులోని పరిస్థితులను స్వయంగా నివరించి, గురువుల కొరకు అభ్యర్థించాడు. జోసఫ్ స్థానికంగా ఉంటూ, కాండీ రాజ్యంలోని సితవాక, రూవన్‌వెల్లా, రత్నపుర మొదలగు కతోలిక గ్రామాల క్రైస్తవులను ఉత్తేజపరచి, దేవాలయాలు కట్టించి, వారికి సంఘ నాయకులను, ఉపదేశులను నియమించి, క్రైస్తవ విశ్వాసాన్ని మరింత మెరుగు పరచాడు.

రాజు గారిచ్చిన స్వేచ్ఛతో డచ్చి వారి ఆధీనంలోనున్న కొలంబో పట్టణ కతోలికులను సందర్శించి, వారికి పలు సేవలందించాడు.

జోసఫ్ విజ్ఞప్తిని మన్నించి 1697లో ముగ్గురు గురువులు సువార్తా ప్రచారానికి సిలోన్ వచ్చారు. కొచ్చిన్ పీఠాధిపతులు జోసఫ్‌ను సిలోన్ వికర్ జనరలుగా నియమించగా, ఆ గురువులు ఆ నియామక పత్రాన్ని తీసుకొని వచ్చారు. అతని ఆధ్వర్యంలో ఎందరో గురువులు 1687 నుండి 1711 వరకు సిలోను వచ్చి వివిధ ప్రాంతాలలో దైవ ప్రజల పరిచర్య చేశారు. జోసఫ్ కతోలిక సత్యోపదేశాన్ని, పలు ప్రార్థనలను స్థానిక భాషలైన సింహళ, తమిళ భాషలలోనికి అనువదించి, పుస్తకాలను అచ్చు వేయించి, ప్రజల విశ్వాసాన్ని సుస్థిర పరచాడు. అతని పరిశుద్ధతను గమనించిన స్థానికులు ఆప్యాయంగా అతనిని "సన్మనస్కుల్లాంటి గురువు"గా పిలచేవారు. జోసఫ్ సిలోనులో ఎన్నో చోట్ల దేవాలయాలను నిర్మించాడు. ఎందరో పలుకుబడి గలవారికి జ్ఞానస్నాన భాగ్యం కల్పించాడు. 1697లో కాండీ రాజ్యంలో మశూచి వ్యాపించగా, అతడు, అతని సభ గురువులు ప్రాణాలకు తెగించి, కుల, మత, వర్గ, వర్ణ విచక్షణ లేకుండా దాదాపు 12 నెలలు దేశమంతా వైద్య సేవలందించి, ఆ రాజ్యాన్ని ఈ విపత్తు నుండి కాపాడారు. ఆ విధంగా సిలోను దేశ వివిధ ప్రాంతాలలో జోసఫ్ వాస్ సేవలందించి, కతోలిక శ్రీసభను పునరుద్ధరించాడు. అతడు హన్వెల్లా, మల్వానా, కొలంబో, నిగంబో, మంతోట, బట్టికలోవా మొదలగు చోట్లలో క్రైస్తవ విశ్వాసాన్ని అభివృద్ధి పరచి, పలు దేవాలయాలు నిర్మించాడు. పుట్టాలం వెళ్లేక్రమంలో వరద నీరు వేగంగా పారే ఓ వాగు నీటిలో జోసఫ్ తన చేతి కర్ర నుంచి, అద్భుతంగా అతడు, అతని సహచరులు దాటారు. 1710లో బట్టికలోవా ప్రాంతమందలి తండ వెన్వెలి గ్రామంలో కతోలికులను చిత్రహింసలు పెట్టే సమయంలో జోసఫ్ వాస్‌ను కూడ చెట్టుకు బంధించి కొట్టారు.

జోసఫ్ వాస్ సిలోను దేశమందు 24 సంవత్సరాలు ఎండనక, వాననక, కష్టపడి బోధించాడు. అతని శరీరం చాలా అలసిపోయింది. విపరీతమైన శారీరక బాధలు అతనిని చుట్టు ముట్టాయి. జోసఫ్ తన మరణం సమీపించినదని గ్రహించాడు. తమ ఒరటోరి సభ నియమావళి ప్రకారం జోసఫ్ వాస్ ఎనిమిది రోజుల ధ్యానాన్ని ఆరంభించాడు. ఏడు రోజులు ప్రభుని సన్నిధిలో గడిపాడు. ఏడవరోజున వ్యాధిగ్రస్తుల అభ్యంగనం పొంది, తనను తాను మరణానికి ఆయత్తం చేసుకున్నాడు. చివరగా తన సోదర మత గురువులను "దైవ ప్రేరణను అనుసరించి జీవించమని" చెప్పి, జనవరి 16, 1711న జోసఫ్ వాస్ తన అత్మను దేవునికి అప్పగించాడు. జోసఫ్ వాస్‌ను రెండవ జాన్ పాల్ పాపుగారు శ్రీలంకలోని కొలంబో నందు జనవరి 21, 1995న "ధన్యులు"గా, ఫ్రాన్సిస్ జగద్గురువులు కొలంబోలో జనవరి 14, 2015న "పునీతులు"గా ప్రకటించారు. భారత దేశంలో జన్మించి, గురువై, గోవా, మంగళూరు తీరంలో, సిలోన్ దేశమంతటా సువార్తను ప్రకటించిన జోసఫ్ వాస్‌ను "శ్రీలంక అపోస్తలుని"గా శ్రీసభ గుర్తించి, గౌరవించింది. వారి పండుగ జనవరి 16.




## తెలుగుక్రీసభ సంస్థాపకులు

# 8. సంజీవ నాథ స్వామి

## - ఎతియన్ లె గాక్ (1671-1738)

**ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.**

తెలుగు కతోలిక శ్రీసభను ఎందరో పుణ్యమూర్తులు 300 సంవత్సరాల క్రిందట ఎంతో కష్టించి స్థాపించారు. ఫ్రాన్సు చక్రవర్తి 14వ లూయీ కోరిక మేరకు జేసుసభ సభ్యుల బృందమొకటి కతోలిక విశ్వాసాన్ని ప్రచారం చేసేందుకు 1685లో సయామ్ (థాయిలాండ్) చేరుకున్నది. అయితే వీరిని ఆహ్వానించిన సయాము రాజు, వీరు చేరుకునేసరికి ఆ ప్రాంత అంతర్యుద్ధంలో మరణించాడు. జేసుసభ సభ్యులు, అక్కడి పరిస్థితులు అనుకూలించేవరకు వేచి చూద్దామని, భారతదేశమందలి ఫ్రెంచి వారి నౌకాస్థావరమైన పాండిచ్చేరి చేరుకున్నారు. అప్పటికే పోర్చుగీసు రాజు ఆధ్వర్యంలో సమీపంలోని 'మధురై మండలం'లో సోదర జేసుసభ గురువులు వేద పరిచర్య చేస్తున్నారు. వారు సయాం చేరుకునే మార్గం కనిపించనందున, తమ ఫ్రాన్సు దేశ చక్రవర్తితో చర్చించి సువిశాల భారతదేశంలో మరోచోట ప్రభు యేసుని సువార్తను ప్రకటించాలనే నిర్ణయానికొచ్చారు. ఆ విధంగా 1699లో ఫ్రాన్సు జేసుసభ గురువులు ఓ మత ప్రచార సంస్థను భారతదేశంలో ఏర్పరచారు. దానిపేరే 'కర్ణాటక్ మిషన్'. అది తమిళనాడులోని పాలారు నదికి ఉత్తరం నుండి బెంగాలులోని హుగ్లీ నదికి దక్షిణంగా గల భూభాగం. ఆ రెంటి మధ్య దాదాపు 1200 మైళ్ళ దూరం ఉంది. అందులో పలు భాషలకు, జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. ఇదంతా "కర్ణాటక మిషన్"గా జేసుసభ గురువులు వేద ప్రచారం చేయ ఎంచుకున్న ప్రాంతం. మరలా ఇందులో పాండిచ్చేరి పరిసరాలతో కూడుకున్న తమిళ విభాగం, చంద్రనగర్ కేంద్రంగా బెంగాలు విభాగం, మన తెలుగు విభాగాలు ఉన్నాయి. కర్నాటిక్ మిషన్ సుపీరియర్ జనరల్ డి లా బ్రూలె గురువులు రోమాపురిలోని జేసుసభ సభాధినేతకు సెప్టెంబరు 16, 1699న లేఖ వ్రాస్తూ, "నా సహచరులను సంప్రదించిన మీదట, నేను తెలుగు వారి మధ్య పనిచేయటానికి 'తెలుగు మిషన్'ను ఆరంభించ నిర్ణయించాను" అని వ్రాశాడు. తెలుగు మిషనుకు పియరె మోద్వి గురువును సుపీరియర్‌గా, పెద్దగా నియమించగా, అతడు ముందు మద్రాసు పట్టణం వెళ్ళి, పునీత తోమాసు వారి సమాధిని సందర్శించి, వారివలె సువార్తను ప్రకటించడానికి తన హృదయాన్ని రగిలించమని ప్రార్థించాడు. అక్కడే కొద్దిగా తెలుగు నేర్చుకుని, దక్షిణ

తమిళనాడులోని కోట్టారుకు డిసెంబరు 8న చేరుకుని, అక్కడి పోర్చుగీసు జేసుసభ గురువుల వద్ద కొంతకాలం శిష్యరీకం చేశాడు. అనంతరం మోద్వి ఉత్తర తమిళనాడులో గల కరివేపంపూండి వచ్చాడు. అక్కడ తన పాశ్చాత్య దుస్తులను వీడి కాషాయ వస్త్రాలను ధరించి, పొడుగాటి చేతి కర్రను పట్టుకుని కొద్దిమంది బ్రాహ్మణ సేవకులను, ఇతర సేవకులను తోడు తీసుకుని సెప్టెంబరు 3, 1701న రోమాపురి సన్యాసిగా పియరె మోద్వి తెలుగు సీమకు ప్రభు సువార్తను బోధించ బయలుదేరాడు.

కర్నాటిక్ మిషన్ లోని తెలుగు భూభాగంలో పనిచేసిన వారిలో పియరె మోద్వి, దె లా పొంతేన్, సంజీవ నాథస్వామి (లెగాక్), జాన్ కాల్మెట్ (సత్యబోధ స్వామి) ముఖ్యులు. వీరిలో తెలుగునాట సంజీవనాథ స్వామిగా పేరుగాంచిన ఎతియన్ లెగాక్ ఫ్రాన్సు దేశమందలి బ్రిటనీ సీమలోని బ్రెస్ట్ అను ఓడరేవు పట్టణంలో జూలై 23, 1671న జన్మించాడు. లెగాక్ చిన్నతనం నుండి తల్లిదండ్రుల ప్రేమానురాగాలతో పెరిగాడు. అతడు దేవుని పట్ల భయ భక్తులు, మరియమాత పట్ల గౌరవ ప్రపత్తులు కలిగి ఉన్నాడు. ఆయన తన పాఠశాల విద్యను బ్రెస్ట్ నందే ముగించాడు. స్థానిక జేసుసభ గురువుల ప్రేరణ మేరకు దేవుని కొరకు గొప్ప గొప్ప కార్యాలను చేయాలనుకుని, 19 ఏండ్ల యవ్వనంలో 1690 డిసెంబరు 27న జేసుసభలో గురు విద్యార్థిగా చేరాడు. కఠిన తపస్సుతో కూడిన రెండు సంవత్సరాల నోవిషియేట్ శిక్షణను ఎతియన్ లెగాక్ దిగ్విజయంగా ముగించుకుని, పేదరికము, బ్రహ్మచర్యము, విధేయత అను వ్రతాలను చేపట్టి, పునీత ఇన్యాశివారి ఆధ్యాత్మికతతో, ఆయన అడుగు జాడలలో నడవాలని నిర్ణయించుకున్నాడు. పిమ్మట ఐరోపా ఖండంలోనే తత్వ, వేదాంత శాస్త్రాలను అత్యంత శ్రద్ధతో అధ్యయనం చేసి, గురువుగా అభిషిక్తుడయ్యాడు.

ఎతియన్ లెగాక్ యేసు భగవానుని ప్రేమ సందేశాన్ని సుదూర ప్రాంత ప్రజలకు సహితం వినిపించి, దైవ రాజ్యాన్ని విస్తరింప చేయాలన్న దృఢ సంకల్పంతో, 1703లో కర్ణాటిక్ మిషన్ ప్రధాన కేంద్రమైన పాండిచ్చేరి చేరుకున్నాడు. తెలుగు వారి మధ్య సువార్తను బోధించాలన్న కాంక్షతో, బ్రాహ్మణ పండితుల వద్ద తేనెలొలుకు తెలుగు భాషను, పండిత భాషయగు సంస్కృత భాషను యువ గురువైన లెగాక్ నేర్చుకున్నాడు. దానితో బాటు, తెలుగువారి కట్టు బొట్టులను, ఆచార వ్యవహారాలను బ్రాహ్మణ గురువులను అడిగి, వానిని అర్థసహితంగా తెలుసుకున్నాడు. కొంతకాలం "మధురై మండలం" వెళ్ళి పోర్చుగీసు జేసుసభ గురువుల వద్ద సువార్త పద్ధతులను, దానిలోని మెళుకువలను స్వయంగా పరిశీలించి, సువార్త సేవ చేయటానికి లెగాక్ తనకు తాను సిద్ధపరచుకున్నాడు. మధురై మండలం నుండి పాండిచ్చేరి తిరిగి వచ్చిన తరువాత లెగాక్ తన ఆహార్యం, వేషధారణ పూర్తిగా మార్చి వేసుకున్నాడు. తనకు ఎంతో ఇష్టమైన మాంసాన్ని, ద్రాక్షారస సేవనాన్ని సంపూర్తిగా మానివేసి, అప్పటినుండి ఆనాటి హిందూ

సన్యాసుల వలె కాషాయపుటంగీ ధరించి, శాకాహారాన్ని తీసుకోవటం మొదలుపెట్టాడు. శుచి శుభ్రత పాటిస్తూ, వేకువనే చెరువులో స్నానం, మధ్యాహ్న భోజనానికి ముందు మరోసారి స్నానం చేయటమారంభించాడు. బ్రాహ్మణులు మాత్రమే వండే వంటను రోజుకొక్క సారే భుజిస్తూ, రోజంతా కఠిన ఉపవాసం ఉండేవాడు. లెగాక్ యువగురువుగా హిందూ ధర్మాన్ని గౌరవిస్తూ, “సంజీవనాథ స్వామి” అను నూతన నామ ధేయాన్ని స్వీకరించి, తెలుగు వారిలో ఒక్కడయ్యాడు.

సంజీవనాథస్వామి, దె లా పొంతేన్ గురువుతో కలిసి పుంగనూరు గ్రామం వస్తుండగా, మార్గ మధ్యంలో పొన్నై కనుమ వద్ద కొందరు సైనికులు వారిద్దరిని అడ్డగించి, ఒక నెల రోజుల పాటు కారాగారంలో బంధించారు. దీనిని తెలుసుకొనిన చుట్టు ప్రక్కల గ్రామాలలోని క్రైస్తవులు చెరలో నున్న వారిద్దరిని సందర్శించి, వారి దీవెనలను పొందారు. స్థిర చిత్తులైన సంజీవనాథ స్వామి ఈ కష్టాలకు, కడగండ్లకు భయపడలేదు. చెరలో నుండి విడుదలైన పిమ్మట ఆయన కృష్ణాపురం చేరుకున్నాడు. తాను మనసా, వాచా, కర్మణా నమ్మిన క్రీస్తు భగవానుని పవిత్ర సందేశాన్ని ఇతరులకు బోధిస్తూ, సువార్త ప్రచారాన్ని తెలుగు వారి మధ్యలో ప్రారంభించాడు. సువార్తా బోధన అనే మహాయాగాన్ని కడు చాకచక్యంగా, నిబద్ధతతో చేస్తూ, క్రైస్తవాన్ని క్రమక్రమంగా చుట్టు ప్రక్కల గ్రామాలైన ధర్మవరం, తాడిమర్రి, గుత్తికొండ, కొత్తకోటలకు విస్తరించాడు. 1708 క్రీస్తు జయంతి పర్వదినాన చిన్న బళ్లాపురం నందు నూతనంగా నిర్మించిన దేవాలయాన్ని సంజీవనాథ స్వామి తమ పవిత్ర హస్తాలతో ఆశీర్వదించి, ప్రతిష్ఠించాడు. అనతి కాలంలోనే వారి సువార్తాసేవలు సమీపంలోని దేవన హళ్ళికి విస్తరించాయి.

కృష్ణాపురం ఆనాటి కతోలిక క్రైస్తవులకు ఒక ప్రధాన కేంద్రంగా అనేక దశాబ్దాలు వెలుగొందింది. సంజీవనాథస్వామి బహు సుందరంగా నిర్మించిన దేవాలయం ప్రమాదవశాత్తు 1708లో అగ్నికి ఆహుతైంది. మరో రెండేళ్లలోనే సంజీవనాథ స్వామి అక్కడ మరో చక్కని దేవాలయాన్ని నిర్మించాడు. అతడు దేవనహళ్ళి, చిన్న బళ్లాపురంలలో కూడా వేదప్రచారం చేసినందున, అక్కడి స్థానికులు, కొందరు రాజవంశీయుల బంధువులు క్రైస్తవ భక్తులయ్యారు. వారు చేసిన నిర్విరామకృషి వలన అక్కడి క్రైస్తవులు కతోలిక విశ్వాసంలో ఎంతో బలపడ్డారు. దేవనహళ్ళిలో 1713 మరియు తదనంతరం మూడు దశలుగా మత హింసలు చెలరేగాయి. ఆనాటి కాలంలో దాసరులనే సన్యాసులు ఆ ప్రాంతమంతా తిరుగుతూ, పూజలు చేస్తూ ధనాన్ని సంపాదించేవారు. స్థానికులు క్రైస్తవులైనందున వారి ఆదాయానికి గండి పడింది. దాంతో ఆ దాసరులు, స్థానిక బ్రాహ్మణులతో కలిసి కుట్రపన్ని, క్రైస్తవుల గృహాలను దహనం చేసి, విపరీత నష్టం కలుగజేశారు. క్రైస్తవులను భయభ్రాంతులను చేసి, గ్రామం నుండి వెడలగొట్టడంతో, వారంతా సమీపంలోని అడవులలో తలదాచుకున్నారు. ఆ హింసల కాలంలో సంజీవనాథ స్వామి, వారి పక్షాన నిలువబడి, వారికి సాంత్వన కలుగజేశాడు. వారందరికి స్థానిక

నవాబు రక్షణ అవసరమని గ్రహించాడు. దానికోసం తన వంతు ప్రయత్నాలు చేశాడు. అప్పటి ఆర్కాటు రాజుల కోసం సెయింట్ హిలెర్ అను క్రైస్తవ వైద్యుడు వారి ఆస్థానంలో ఉన్నందున, అతని సహాయంతో ఆర్కాటు నవాబు వద్ద నుండి రక్షణ కల్పిస్తూ ఒక లేఖను సంపాదించ వలసిందిగా సంజీవనాథస్వామి తన సుపీరియర్ అయిన దె లా పొంతేను గురువులను అభ్యర్థించాడు. అతడు వానలైనా, వరదలైనా ఆగకుండా, ఆగమేఘాల మీద ఆర్కాటు రాజు గారి కోటలో నున్న హిలెర్ వైద్యులను కలిసి, మతహింసల విషయాన్ని చెప్పి, తమకు రక్షణ కల్పించమని ప్రాధేయపడ్డాడు. ఆ వైద్యుని సహాయంతో ఆర్కాటు నవాబు వద్ద నుండి, క్రైస్తవ సన్యాసులకు మతబోధ చేసే హక్కును కల్పించాలని, తమ రాజ్యమంతటా క్రైస్తవులకు రక్షణ కల్పించాలని మొఘల్ చక్రవర్తి ఇచ్చిన ఫర్మానా ప్రతిని, దానితో పాటు ఆర్కాటు నవాబు తమ సామంత రాజ్యంలో క్రైస్తవులకు అండగా ఉండమని చెప్పే మరో ఆజ్ఞను పొంతేను గురువు సంపాదించి, దేవనహళ్ళికి కొనివచ్చాడు. ఈ హిలెర్ వైద్యుడు మైసూరు మిషన్‌లో పనిచేస్తున్న జేసుసభ సభ్యుల మరో బృందానికి అత్యంత సన్నిహితుడు. కనుకనే ఈ సిఫారసు లేఖలు కర్ణాటిక్ మిషన్ గురువులు అతని ద్వారా  వెంటనే పొంద గలిగారు. ఆ లేఖలతో కొంత కాలం పరిస్థితి సద్దుమణిగినా, దేవనహళ్ళిలో మరలా మొత్తం మూడుసార్లు తీవ్ర మత హింసలు చెలరేగాయి. మరలా అదే పంథాలో ఆర్కాటు నవాబుల నుండి లేఖలు సంపాదించి సంజీవనాథస్వామి, క్రైస్తవులు తాత్కాలికంగా ఉపశమనం పొందగలిగారు. దాసరుల ఆగడాలు మితిమీరినా, ఆ నూతన కతోలికుల విశ్వాసం మాత్రం సన్నగిల్లలేదు. ఇంకా పైపెచ్చు వారి విశ్వాసం దృఢ పడింది. ఆ గండం గడిచిన పిమ్మట మైసూరు సైన్యం తొమ్మిది నెలలపాటు చిన్న బళ్లాపురాన్ని ముట్టడించి, స్వాధీన పరచుకుంది. ఆ ముట్టడిలో కతోలిక దేవాలయం ధ్వంసమైంది. ఆ సమయంలోనే అక్కడ కలరా సోకి క్రైస్తవులతో సహా ఎందరో ప్రజలు పెద్ద సంఖ్యలో మరణించారు. అక్కడి మఠంలో నివశిస్తున్న దె లా పొంతేన్ గురువుకు, మరో ముగ్గురు ఉపదేశులకు కూడ ఈ వ్యాధి సోకింది. ఉపదేశులలో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. అది తెలిసిన సెయింట్ హిలేర్, పొంతేను గురువులకు స్వయంగా మందులిచ్చి, ఆ ప్రాణాంతక వ్యాధి నుండి రక్షించాడు. పైగా హిలేర్ తన పల్లకిని, పన్నెండు మంది బోయీలనిచ్చి, వెల్లూరు పట్టణం మీదుగా పాండిచ్చేరి చేర్చి, పొంతేను గురువుల ప్రాణాలు కాపాడాడు.

సంజీవనాథస్వామి సువార్త పరిచర్య పలుచోట్లకు విస్తరించింది. గురువులు తక్కువగా ఉన్నందున, క్రైస్తవులైన కొందరు బ్రాహ్మణులకు, ఇతరులకు కతోలిక మత సత్యాలలో శిక్షణనిచ్చి, వారిని క్రైస్తవ మతం పట్ల ఆసక్తి చూపిన గ్రామాలకు పంపి, వారి ద్వారా మతబోధ చేయటం అప్పటి పద్ధతిగా ఉంది. కృష్ణాపురం  జేసుసభ గురువులకు ముఖ్య స్థావరమై, శ్రీసభ వ్యాప్తిలో కీలక పాత్ర పోషించింది. తెలుగు క్రైస్తవులందరికి 'పుట్టినిల్లు' అయింది. కృష్ణాపురం సమీపంలోని ధర్మవరానికి చెందిన

పద్మశాలి కులస్తుడైన భీమిశెట్టి రంగప్ప క్రీస్తుప్రభువు బోధనలను క్రైస్తవ బోధకుల ద్వారా విన్నాడు. దానికి ఆకర్షితుడై, తన పూర్వ హిందూ గురువులకు వీడ్కోలు పలికి, ప్రభు సువార్తను క్షుణ్ణంగా తెలుసుకుని, సంజీవనాథ స్వామి చేతుల మీదుగా జ్ఞానస్నానం పొంది, కతోలిక శ్రీసభలో ప్రవేశం పొందాడు. పిమ్మట రంగప్ప సంజీవనాథస్వామి వద్ద ఉపదేశిగా పనిచేస్తూ, కతోలిక ధర్మ ప్రచారంలో సంజీవనాథ స్వామికి కుడి భుజంగా నిలిచాడు. ఈ భీమిశెట్టి రంగప్ప వారసులు, బంధువులే గుంటూరు సీమలోని కొండ్రముట్ల, ఫిరంగిపురం మున్నగు గ్రామాలకు వలస వెళ్ళారు.

ఆ కాలంలో యెలనాటి రెడ్ల వంశంలో మదిగుబ్బ గ్రామ పెద్ద అయిన తుమ్మా హనుమంత రెడ్డి అంతు చిక్కని వ్యాధితో రెండేళ్లు బాధపడ్డాడు. అతడు ఎందరో దేవతలకు పూజలు సలిపినా, ఎన్నో శాంతులు నిర్వహించినా, దాన ధర్మాలు చేసినా వ్యాధి ఏ మాత్రం తగ్గలేదు. హనుమంత రెడ్డి ఆ పరిస్థితిలో ఉన్నప్పుడు భీమిశెట్టి రంగప్ప ద్వారా క్రైస్తవ మతాన్ని గురించి, క్రీస్తు ప్రభుని గురించి విన్నాడు. ఆ మతం గురించి మరింత లోతుగా తెలుసుకోవాలని కృష్ణాపురంలోని క్రైస్తవ మఠం వెళ్ళాలని హనుమంత రెడ్డి నిర్ణయించుకుని, తన తమ్ముడైన కొండప్ప రెడ్డి సహాయం కోరాడు. కొండప్ప రెడ్డి తన అన్న మాటకు విధేయించి, రోగియైన హనుమంత రెడ్డికి డోలుకట్టి, మరో ఇరవై మంది సహాయంతో అతనిని మోసుకుంటూ, రెండు రోజులలో కృష్ణాపురం మఠం చేరారు. అది దాదాపు 1715 సెప్టెంబరు నెల కావచ్చు. అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరమే మేలని, తాను శరీర వ్యాధులను నయంచేసే వైద్యుణ్ణి కానని, ఆత్మల శుద్ధిచేసే సత్య బోధకుడనని సంజీవనాథస్వామి సున్నితంగా తెలియజేసి, రోగియైన హనుమంత రెడ్డిని తన మఠంలో ఉంచుకుని, ప్రేమానురాగాలతో చూసుకోవటం మొదలు పెట్టాడు. హనుమంత రెడ్డి క్రీస్తు భగవానుని పై గాఢ విశ్వాసాన్ని కనబరచి, తనను సత్యవేదంలో నడిపించమని సంజీవనాథ స్వామిని కోరాడు. అతని కోరిక మన్నిస్తూ, సంజీవనాథస్వామి స్వయంగా అతనిని ఆయత్తపరుస్తూ కతోలిక మతసత్యాలను నేర్పించ సాగాడు. ఎనిమిది రోజులు గడిచిన పిమ్మట, రాత్రివేళ హనుమంత రెడ్డి నోట నురగ వచ్చి, చనిపోయేవానిలా కనిపించాడు. గురువు వెంటనే ప్రార్థిస్తూ, అతనిపై సిలువ గురుతు వేశాడు. అతనిపై పవిత్ర తీర్థ జలాన్ని చల్లాడు. “ఓ స్వామి! సాతాను నా గొంతు పట్టుకున్నాడు. నాకు ఆలస్యం చేయకుండా వెంటనే జ్ఞానస్నానమివ్వండి” అని అప్పుడతడు గురువును వేడుకున్నాడు. అతని అభ్యర్థన మేరకు హనుమంత రెడ్డికి మరుసటి ఉదయం దేవాలయంలో సంజీవనాథ స్వామి జ్ఞానస్నానమిచ్చాడు. ప్రభుని శిష్యులలో ప్రథముడైన రాయప్పగారి పేరు మీదుగా అతనికి రాయప్ప రెడ్డి అని నూతన నామధేయమొసగి, అతనిని కతోలిక మతంలోనికి గురువు స్వీకరించాడు. తుమ్మా రాయప్పరెడ్డి జ్ఞానస్నానంతో తెలుగు కతోలిక శ్రీసభ చరిత్రలో ఒక విశిష్ట అధ్యాయం ఆరంభమైందని చెప్పుకోవచ్చు.

ఇంతకు మునుపు చెప్పుకున్నట్లుగా చిన్న బళ్లాపురాన్ని మైసూరు సైన్యం ముట్టడి చేయనున్నట్లు, దానికి ముందే సంజీవనాథ స్వామిని చిన్న బళ్లాపురం రావలసిందిగా అక్కడి వారు వర్తమానం పంపారు. గురువు వెంటనే అక్కడకు చేరుకుని, సిద్ధపరచిన 14 మందికి క్రైస్తవ ధర్మంలో జ్ఞానస్నాన మిచ్చాడు. అక్కడే రెండు నెలలకు ముందు 18 మందికి సంజీవనాథ స్వామి జ్ఞానస్నాన మిచ్చాడు. అక్కడ వారికి మూడు నెలల పాటు సువార్తను బోధించాడు. తదుపరి దేవనహళ్ళి, పుంగనూరులను సందర్శించ సంజీవనాథ స్వామి సిద్ధమయ్యాడు. అంతలో తుమ్మా రాయప్ప రెడ్డి ఆరోగ్యం క్షీణిస్తున్నదని కృష్ణాపురం నుండి కబురందింది. రాయప్ప రెడ్డి, గురువు చేతులలో మరణించాలన్న కోరికను వ్యక్తం చేశాడు. కాబట్టి గురువు వెంటనే ప్రయాణం కట్టి, కృష్ణాపురం చేరుకున్నాడు. అప్పటికే రాయప్ప రెడ్డి బంధువులు ఎనిమిది మంది జ్ఞానస్నాన భాగ్యం పొందారు. మరి కొంతమంది బంధువులు రాయప్ప రెడ్డిని పలకరించటానికి వచ్చారు. వారు కూడా జ్ఞానస్నానం పొందాలని ఆశతో ఉపదేశి ఆధ్వర్యంలో ప్రార్థనలు నేర్చుకుని, జ్ఞానస్నాన మివ్వమని సంజీవనాథస్వామిని కోరారు. సంజీవనాథ స్వామి దానికి అంగీకరించక "మీరంతా ఇప్పటి దాకా మీ బంధువైన రాయప్ప రెడ్డి స్వస్థత పొంది, తిరిగి మామూలు మనిషి అవుతాడని భావించారు, కాని ఇప్పుడతడు మరణావస్థలో ఉన్నాడు. మీ విశ్వాసం పరీక్షింపబడి, స్థిరపడేవరకు ఓపిక పట్టండి" అని వారిని వారించాడు. డిసెంబరు 24 సాయంత్రం సంజీవనాథ స్వామి దేవాలయంలో బోధించే సమయంలో రాయప్ప రెడ్డి పరిస్థితి విషమిస్తుందని తెలియగానే, వెంటనే అతనివద్దకు వెళ్ళాడు. రాయప్ప రెడ్డి ఆత్మను ప్రభువునకప్పగిస్తూ, సంజీవనాథ స్వామి మరణావస్థ ప్రార్థనలు చెప్పే సమయంలో రాయప్ప రెడ్డి ప్రశాంతంగా కన్నుమూశాడు. అనతి కాలంలోనే తనకు ఆత్మీయ బంధువైన రాయప్ప రెడ్డి మరణించడంతో, సంజీవనాథ స్వామి అతని బంధువులతో కలిసి ఎంతో రోదించాడు. రాయప్ప రెడ్డి కల నిజంగా నెరవేరింది. తన ఆధ్యాత్మిక గురువు సంజీవనాథ స్వామి పవిత్ర హస్తాల మీదుగా మరణించాలని ఎంతగానో తపించిన రాయప్ప రెడ్డి చివరి కోరిక తీరింది. మరునాడే రాయప్పరెడ్డి భౌతిక కాయాన్ని క్రైస్తవ సంప్రదాయంలో, పరిమళాలు చల్లుతున్న పూల గుత్తులతో అలంకరించి, వెలుగుచున్న దీపములతో, భక్తి ప్రపత్తులతో అతని ఆత్మశాంతికై ప్రార్థిస్తూ, ఇద్దరిద్దరుగా వరుసలలో నిలబడి, ఎంతో గౌరవ మర్యాదలతో ఊరేగిస్తూ, కృష్ణాపురం పుణ్య భూమిలో భూస్థాపితం గావించారు. అది క్రీస్తు జయంతి పర్వదినం కూడా కావడంతో, రాయప్ప రెడ్డి బంధువుల అభ్యర్థన మేరకు సంజీవనాథ స్వామి ఆనాటి సాయంత్రమే ఇరవై మందికి జ్ఞానస్నానమిచ్చి, వారికి దైవరాజ్యంలో ప్రవేశం కల్పించాడు.

సువార్తా ప్రచారం ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడినప్పటికి, సంజీవనాథ స్వామి

అలుపు, అలసట లేకుండా, గ్రామ గ్రామాలూ తిరిగి వేద ప్రచారం నిర్వహించాడు. రాయప్ప రెడ్డి స్వగ్రామమైన మదిగుబ్బ అనంతపురం సీమలో ఉంది. ఆ గ్రామస్థుల కోరికతో సంజీవనాథ స్వామి ఆ గ్రామాన్ని సందర్శించినప్పుడు ఆ నూతన క్రైస్తవులు, అత్యంత ఆప్యాయత, అనురాగాలతో తమ ప్రియ గురువును ఘనంగా, సగౌరవంగా మేళ తాళాలతో ఊరేగించి, తమ మధ్యకు ఆహ్వానించారు. ఆ రోమాపురి సన్యాసి గొప్పతనాన్ని గురించి విన్న చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఎంతో మంది అక్కడికి గుంపులు గుంపులుగా వచ్చారు. నూతన క్రైస్తవులైన మదిగుబ్బ వాసులు వారితో "మీరు మమ్ము పిచ్చివాళ్ళనుకోవద్దు. మా గురువులను మీ గురువులతో పోల్చండి. మీ గురువులకు మీ నుండి డబ్బు కావాలి. మా గురువుకు డబ్బేమీ అక్కర లేదు. ఆయనకు కావలసినదల్లా మా ఆత్మల రక్షణ, మా ఆత్మల ఆనందం మాత్రమే"నని చాలా స్పష్టంగా, ఉత్సాహంగా తమ కతోలిక విశ్వాసం గురించి బహిరంగ సాక్ష్యం పలికారు. మదిగుబ్బ గ్రామంలో గురువు కొంత కాలముండి, సువార్తను బోధించి, మరో 50 మందికి జ్ఞానస్నానమిచ్చి, ఆ సంఘాన్ని విస్తృత పరచాడు.

పలువురు రాయప్ప రెడ్డి బంధువులు మదిగుబ్బ గ్రామంలో రాయప్ప రెడ్డి అడుగు జాడలలో నడిచి క్రైస్తవులయ్యారు. అదే విధంగా మదిగుబ్బకు దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో నున్న ఆలమూరులో కూడ వారి బంధువులు క్రైస్తవ మతంలో చేరారు. ఈ రెండు గ్రామాలు అనంతపురం రాజైన ప్రసనప్పనాయుడి ఆధీనంలో ఉన్నాయి. కావున సంజీవనాథ స్వామి ఆ రాజును సందర్శించి, అతని రాజ్యంలో సువార్తా ప్రచారానికి అనుమతి కోరాడు. రాజు అందుకు సమ్మతించటమే గాకుండా, ఆయా గ్రామాలలో దేవాలయాల నిర్మాణాలకు కావలసినంత కలపను తన తోపులో కొట్టుకునేందుకు సుముఖత వ్యక్తం చేశాడు. ప్రసన్నప్ప నాయుడు రాజ భవనంలో హిందూ మత గురువులకు, క్రైస్తవ మత గురువులకు విశ్వం, దైవం, ఆత్మ, విముక్తి మున్నగు విషయాలపై చర్చ నిర్వహించాడు. అందులో క్రైస్తవ ధర్మ వాదన పైచేయిగా ఉండటాన్ని రాజు గమనించాడు. చర్చానంతరం వ్యక్తిగతంగా సంజీవనాథస్వామిని ప్రసన్నప్ప నాయుడు కలిసినప్పుడు, తనకు కూడా కతోలిక ధర్మం స్వీకరించాలని ఆసక్తిగా ఉన్నదని తెలిపాడు. కతోలిక ధర్మాన్ని అనుసరించి ఏక పత్నీ వ్రతుడుగా ఉండటానికి తనకు సమ్మతమేగాని, తన కులానికి చిహ్నమైన తన మెడలోని శివ లింగాన్ని మాత్రం ఎట్టి పరిస్థితులలోను తీసివేయలేనని తన అశక్తతను రాజు వెల్లడించాడు. తన రాజభవనంలోనే ఒక దేవాలయం నిర్మిస్తానని, అక్కడే ఉండమని రాజు సంజీవనాథ స్వామిని బ్రతిమిలాడినా, పేదలైన తన కతోలిక బిడ్డలతో ఉండటమే తనకు అత్యంత ప్రీతిపాత్రమని, తన మనసులో మాటను రాజుకు సున్నితంగా చెప్పాడు.

సంజీవనాథ స్వామి మదిగుబ్బలో క్రైస్తవుల ప్రార్థనల నిమిత్తం ఒక చక్కని దేవాలయం నిర్మించాడు. అందులో ప్రథమంగా 1719 సంవత్సరపు క్రీస్తు పునరుత్థాన

పండుగ వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. ఆ పండుగకు రాజును ఆహ్వానించినా, తన అస్వస్థత వలన రాలేక, తన సమీప బంధువును తన ప్రతినిధిగా పంపాడు. మరుసటి సంవత్సరం జరిగిన ఈస్టర్ వేడుకలలో రాజైన ప్రస్నప్పనాయుడు స్వయంగా పాల్గొన్నాడు. ఆ పర్వదినాన నలభైమంది కతోలిక మతాన్ని స్వీకరించారు. నాలుగు కుటుంబాల వారు తమ కుల చిహ్నామైన లింగాలను దేవాలయంలో సమర్పించి, తమను కూడ కతోలిక ధర్మంలోనికి స్వీకరించమని ప్రాధేయపడ్డారు. ఆ రాజు మదిగుబ్బ నుండి బయలుదేరుతూ "మీరంతా నా మిత్రుడైన సంజీవనాథ స్వామి శిష్యులైనందుకు నాకెంతో సంతోషంగా ఉందని" పలికి, వీడ్కోలు తీసుకున్నాడు. మరోమారు అతడు రాజుగారి కోటకు వెళ్ళి మదిగుబ్బ, ఆలమూరు క్రైస్తవులకు దాసరుల నుండి రక్షణ కల్పించమని కోరాడు. అప్పుడు కూడా తన ఆస్థానంలో మతాంతర చర్చలు నిర్వహించి, పిమ్మట క్రైస్తవులకు కొంత రక్షణ కల్పించాడు. ప్రసన్నప్ప నాయుడుకి రాచపుండు ఏర్పడి, ఏ వైద్యానికి లొంగలేదు. అతడు మరణానికి సిద్ధమై, ఒక సమాధి మందిరాన్ని కూడా ముందుగానే నిర్మించుకున్నాడు. సంజీవనాథ స్వామి రాజుకు ఒక మందును పంపగా, దానిని పూయడంతో కొంత తగ్గటం ప్రారంభించింది. గురువు వెళ్ళి రాజుతో ఆరు రోజులుండి, రాజుతో ఆధ్యాత్మిక విషయాలు చర్చించినప్పుడు, తనకు కతోలిక మతంపై ఎంతో విశ్వాసముందని, తన మనస్సంతా పరలోకంవైపు చూస్తుందని, తన శరీరం సమాధివైపు చూస్తుందని రాజు పలికాడు. రాజు మాత్రం జ్ఞానస్నానం తీసుకోలేదు. రాజు కోలుకోవడం గమనించిన అతని రెండవ భార్య, ఓ రాత్రి కత్తితో రాజును పొడిచి చంపింది. అతని తరువాత సింహాసనాన్ని అధిష్టించిన అతని సోదరుడు కూడా, గురువుపట్ల ఎంతో సుహృద్భావాన్ని, గౌరవాన్ని కనబరచాడు. సంజీవనాథ స్వామి మదిగుబ్బ వచ్చినప్పుడు, ఆ నూతన రాజు కూడ మందీ మార్బలంతో మదిగుబ్బ వచ్చి, దేవాలయంలో పూజలకు అవసరమైన సంగీత వాయిద్యకారులను పంపుతానని, ప్రభువు, మరియతల్లి స్వరూపాల ఊరేగింపు నిమిత్తం కొత్తగా రథాలు చేయిస్తానని మాట ఇచ్చి, తేరులను చేయించి, దేవాలయానికి కానుకగా నిచ్చాడు. పిమ్మట సంజీవనాథ స్వామిని తన కోటకు ఆహ్వానించగా, గురువు వెళ్ళి, అతని ఆతిధ్యాన్ని స్వీకరించాడు. అక్కడ అంతపురంలోని రాజు బంధువైన ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురై, మరణపు కోరలలో ఉండగా, సంజీవనాథ స్వామి ఆమెపై సిలువ గురుతువేసి, ప్రార్థించి, ఒక లేపన మందును పూయగా, ఆమె వెంటనే సంపూర్ణంగా కోలుకుంది. ఈ విధంగా సంజీవనాథ స్వామి తన జీవిత కాలంలోనే ఎన్నో అద్భుతాలు చేసి, ప్రభుని పేరిట స్వస్థతలు దయ చేశాడు.

ఆ నాటి ఇస్రాయేలు ప్రజలు ఈజిప్టునుండి పవిత్రభూమి పాలస్తీనా వలస వెళ్ళినట్లుగా, అనంతపురం సీమలోని నూతన క్రైస్తవులు కూడా పొట్ట చేతపట్టుకుని వలసలు వెళ్ళక తప్పలేదు. రాయలసీమ ప్రాంతమంతా కరువు కాటకాలు, మరాఠా, గోల్కొండ మరియు స్థానిక రాజుల సైన్యపు దాడులు, సాయుధ దోపిడీలు మున్నగు

కారణాలతో క్రైస్తవులు సుదూర ప్రాంతాలకు తరలి వెళ్ళారు. సంజీవ నాథ స్వామి సలహామేరకు, సత్యబోధస్వామి సూచనలతో అప్పటి మరవపల్లి సంస్థానాధీశుడైన గోపు లింగారెడ్డి గారి నాయకత్వంలో 1731లో మొట్టమొదట ఎనభై క్రైస్తవ కుటుంబాల వారు 240 మైళ్ళ దూరాన గల నెల్లూరు సీమలోని బుక్కాపురం గ్రామం వలస వెళ్లారు. ఆ ప్రాంతమందు జేసుసభ గురువులకు అప్పటికే అక్కడ ఒక స్థావరముంది. 1730లోనే గార్గం గురువులను సంజీవనాథ స్వామి అక్కడ నియమించాడు. గురువుల విన్నపాన్ని మన్నించి, అక్కడ వెంకటగిరి రాజు ఆ నూతన క్రైస్తవులను తన రాజ్యంలోనికి ఆహ్వానించి, వారికి పెద్దారికట్ల, బచ్చుల కూరపాడు, పామూరు గ్రామాలను ఈనాముగా ఇచ్చి, వారిని ఆదుకున్నాడు. 1752లో గుంటూరు సీమ, ఫ్రెంచి వారికి ఈనాముగా దక్కడంతో అప్పటి ఫ్రెంచి జేసుసభ గురువుల సలహా సంప్రదింపులతో అనేక మంది క్రైస్తవులు అనంతపురం, గండికోట సీమల నుండి గుంటూరు జిల్లాకు చేరుకున్నారు.

సంజీవనాథ స్వామి 1726 నుండి 1737 వరకు తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలు ప్రాంతాలన్నిటికి కలిసి ప్రావిన్షియల్‌గా ఉండి, జేసుసభ గురువులందరిని కలగలుపుకుని చక్కగా వేదవ్యాపకము చేశాడు. తన పదవీ కాలంలో ప్రధాన కేంద్రమైన పాండిచ్చేరిలో ఉండాల్సి వచ్చినా, తెలుగు ప్రజల మీది మమకారంతో, వీలుచేసుకొని ప్రతి సంవత్సరం కొన్ని నెలలపాటు తెలుగు నేలలో సువార్తను బోధించి, తెలుగు క్రైస్తవ సంఘాలను సుస్థిర పరచాడు. అతడు ప్రావిన్షియల్‌గా ఉన్న కాలంలో తెలుగు నాట ఏడు కేంద్రాలను తమ నివాస స్థావరాలుగా చేసుకుని, ఎందరో పుణ్యమూర్తులైన జేసుసభ గురువులు తెలుగు శ్రీసభ సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు. వారందరి శ్రమ, త్యాగం ఫలించి, శ్రీసభ మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లింది.

సంజీవనాథ స్వామి ప్రావిన్షియల్‌గా పదవీ విరమణ చేసిన అనంతరం శేష జీవితాన్ని, తన అనుంగు బిడ్డల, ప్రియ శిష్యుల మధ్య గడపాలని, తిరిగి కృష్ణాపురం చేరుకున్నాడు. అప్పటికి అతనికి 67 ఏండ్ల వయస్సు. భారతదేశం వచ్చి 35 యేండ్లు. తెలుగు వారి మధ్య కొద్దిమంది మాత్రమే అంత ప్రాయందాకా జీవించారు. కృష్ణాపురం, దాని పరిసర ప్రాంతాలలో కలరా వ్యాధి సోకగా, ఎంతో ధైర్యంగా వ్యాధి సోకిన వారిని వెదుక్కుంటూ వెళ్ళి, ఎంతో మందికి మందులిచ్చి, పరిచర్య చేసాడు. మరణావస్థలో ఉన్న క్రైస్తవులకు వ్యాధిగ్రస్థుల అభ్యంగనమిచ్చి, వారి స్వస్థతకై ప్రార్థించాడు. మరణశయ్యపై నున్న కలరా వ్యాధి బాధితులు ప్రభుని రాజ్యంలో ప్రవేశించటానికి జ్ఞానస్నానం ఇవ్వమని అడిగిన కొందరికి జ్ఞానస్నానమిచ్చాడు. ఎంతో అనురాగ, ఆప్యాయతలతో, కలరా రోగులకు సేవలందిస్తున్న సంజీవనాథ స్వామికి కూడా చివరకు కలరా సోకి, 1738, ఏప్రిల్ 4 పెద్ద శుక్రవారం రోజున ప్రభు సన్నిధి చేరుకున్నాడు. సంజీవనాథ స్వామిని కృష్ణాపురంలోని వారి మఠంలోనే భూస్థాపితం చేశారు. అక్కడ అప్పటికే 1721లో శౌరినాథ స్వామిగా పిలువబడే ఫ్రాన్స్వా కేరన్ గురువులను, 1730లో దివ్యనాథ స్వామిగా పిలువబడే గిల్బర్ట్

డుక్రోస్ గురువులను భూస్థాపితం చేశారు.

ఎక్కడో ఫ్రాన్సు దేశంలో పుట్టిన లెగాక్, జేసుసభలో చేరి, ఇన్యాశి వారి ఆధ్యాత్మికతతో, ఫ్రాన్సిస్ శౌరి వారి అడుగు జాడలలో నడిచి, మన తెలుగు గడ్డను తన నివాస స్థానంగా చేసుకుని, తెలుగు శ్రీసభ అనే దేవుని ద్రాక్షా తోటలో అవిశ్రాంతంగా పనిచేసి, ఎన్నో క్రైస్తవ సంఘాలను స్థాపించి, సాలెలకు, తొగటలకు, రెడ్లకు, బలిజలకు, పత్రా వాండ్లకు, లింగాయత్‌లకు, దళితులకు మున్నగు ఎన్నో వర్గాలకు క్రీస్తు ప్రభువునందు విశ్వాస భిక్ష పెట్టి, తన పుణ్య జీవితంతో మార్గదర్శిగా ఉంటూ, కృష్ణాపురంలో తన ఆత్మీయులు, ఆప్తుల మధ్య మరణించి, అక్కడే భూస్థాపితమై సంజీవనాథ స్వామి కృష్ణాపురం భూమిని పుణ్యభూమిగా, పవిత్ర భూమిగా పావనమొనర్చాడు. తెలుగు శ్రీసభ స్థాపించి, 300 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కృష్ణాపురంలోని ఆ గురువుల సమాధులపై చక్కని త్రిశతాబ్ది ఉత్సవాల స్మరకాన్ని 2003లో నిర్మించారు. అతి పవిత్రమైన వారి సమాధి భక్తుల పాలిటి కల్పవృక్షమైంది. ఎందరో క్రైస్తవ విశ్వాసులు సంజీవనాథ స్వామి పవిత్ర సమాధిని దర్శించి, వారి మధ్యవర్తిత్వం ద్వారా ప్రార్థిస్తున్నారు. వారందరి కోరికలు నెరవేరుచున్నాయి. సంతానం లేని దంపతులకు సంతాన భాగ్యం కలిగిందని, యువతీ యువకులు మంచి ఉద్యోగాలు పొందామని, వ్యాపారంలో నష్టపోయినవారు నిలద్రొక్కుకుని లాభాల బాట పట్టామని పలువురు భక్తులు సాక్ష్యం పలుకుచు, సంజీవనాథ స్వామి చేస్తున్న అద్భుతాలకు కరుణామయుడైన యేసు భగవానుని స్తుతించి, ఆరాధిస్తున్నారు. సంజీవనాథ స్వామి పుణ్యక్షేత్ర పండుగ, మరియగిరి పుణ్యక్షేత్ర పండుగలు కలిపి పుణ్యభూమి కృష్ణాపురంలో ప్రతి సంవత్సరం జనవరి 14, 15 తేదీలలో ఘనంగా, వైభవంగా జరుగుచున్నాయి. సంజీవనాథ స్వామి పేరిట ప్రతిదినం రెండు పూటలా యాభై మంది వృద్ధులకు, దివ్యాంగులకు జేసుసభ గురువులు ప్రేమతో అన్నదానం చేస్తున్నారు.



కృష్ణాపురంలోని
శ్రీ సంజీవనాథ
స్వామి సమాధి వద్ద
జేసుసభ గురువులు



తెలుగు, సంస్కృత సారస్వత మిత్రులు

# 9. సత్య బోధ స్వామి

## - జాన్ కాల్మెట్ (1693-1740)

ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.

జాన్ కాల్మెట్ ఫ్రాన్సు దేశమందలి తులూస్ రాష్ట్రంలోని రోడెజ్ పట్టణంలో మే 5, 1693న జన్మించాడు. తులూస్ ప్రాంతం నుండి ఎక్కువ మంది యువకులు ఆ రోజులలో జేసుసభలో చేరి, వేదప్రచారకులుగా పనిచేసేవారు. అక్కడి ప్రజలంతా జేసుసభ గురువులు సుదూర దేశాలకేగి దైవసేవ చేయటాన్ని, వారి సాహసోపేత గురుత్వ జీవితాలగురించి కథలు కథలుగా చెప్పుకునే వారు. అట్టి వీరోచిత గురువుల గాథలను అక్కడి బాలలు చిన్నప్పటినుండే వింటూ ఉండేవారు. అలాగే తాము కూడా క్రీస్తు ప్రభుని సువార్త కోసం దూర ప్రాంతాలకు వెళ్ళి, సేవ చేయాలనే కోరిక కలిగి ఉండేవాళ్ళు. చక్కని కతోలిక వాతావరణంలో పెరిగిన జాన్ కాల్మెట్, తాను కూడా జేసుసభలో చేరి గురువు ఎందుకు కాకూడదు, తన జీవితాన్ని క్రీస్తు ప్రభునికి ఎందుకు అర్పించుకోగూడదు అన్న ప్రశ్న చిన్నగా అతని హృదయంలో ఉదయించింది. ఆ విషయమై దీర్ఘంగా ఆలోచించాడు. దైవాన్ని ప్రార్థించాడు. దైవ ప్రేరణతో జేసుసభకు చెందిన తులూస్ మండలంలో గురు అభ్యర్థిగా చేరాడు. అక్కడే నోవిషియేట్ తర్ఫీదు ముగించి, పునీత ఇన్యాశివారిలా ప్రభుని కోసం పవిత్రంగా జీవించాలని, ఆత్మల రక్షణ యాగంలో తన వంతు పాత్రను పోషించి, అన్యులను ప్రభు చెంతకు నడిపించాలని స్థిర నిర్ణయాని కొచ్చాడు. ఫ్రాన్సుదేశంలోనే కాల్మెట్ తత్వ, వేదాంత శాస్త్రాలను ఆపోసన పట్టాడు.

జేసుసభ గురువులు పోర్చుగల్ రాజు ప్రాపకంలో ప్రపంచ నలుమూలలా వేదప్రచారం చేసి, కతోలిక మతాన్ని వ్యాప్తి చేస్తున్నట్లుగానే, ఫ్రాన్సు దేశమందలి తులూస్ మండల జేసుసభ గురువులు కూడా ఫ్రాన్సు చక్రవర్తి యగు 16వ లూయీ ఆశీస్సులతో స్వతంత్రంగా వేదప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆసియా ఖండమందలి సయాము (థాయ్‌లాండ్) దేశపు చక్రవర్తి క్రైస్తవ మతాన్ని తమ దేశంలో బోధించమని ఫ్రెంచివారిని కోరాడు. తదనుగుణంగా జేసుసభ గురువులు అక్కడకు చేరారు. కాని అక్కడ తమను ఆహ్వానించిన చక్రవర్తి అంతర్యుద్ధాల వలన పదవీచ్యుతుడయ్యాడు. కనుక తగిన సమయం కోసం ఎదురు చూడటానికి ఫ్రాన్సు దేశపు నౌకా పట్టణమగు పాండిచ్చేరి చేరుకున్నారు. ఆ సమయంలో పోర్చుగీసు వారి ఆధ్వర్యంలో జేసుసభ

గురువులు మధురై ప్రాంతంలో చేస్తున్న వేదప్రచారాన్ని, దాని సఫలతను గమనించి, ''కర్ణాటిక్ మిషన్'' అను వేదవ్యాపక సంస్థను 1699లో ఏర్పరచారు. ఇక అప్పటి నుండి క్రీస్తు సువార్తను తమిళ ప్రాంతములగు పాండిచ్చేరి, కరువేపంపూడి, వేటవళంలలో, కన్నడ ప్రాంతములోని చిన్నబల్లాపురం, దేవనహళ్లి, కోలారు, ఏరుదుర్గంలలో, తెలుగు భూభాగమందలి పుంగనూరు, కృష్ణాపురం, ధర్మవరం, గండికోట సీమలలో, బెంగాలు ప్రాంతమందలి చంద్ర నగరులలో బోధించటం, నూతనంగా జ్ఞానస్నానమిచ్చి కతోలిక సంఘాలను స్థాపించటంలో పలు విజయాలు సాధించారు.

దేవుని సువార్తను ప్రకటించాలనే ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న జాన్ కాల్మెట్ ఆగస్టు 21, 1725న వికారి హ్యూగుస్ అను గురువు, విల్లెమెట్ అను బ్రదరుతో కలిసి భారతదేశమందలి పాండిచ్చేరి చేరుకున్నాడు. వారు ముప్పురు చేరుకునే సమయానికి, కర్ణాటిక్ మిషన్ భూభాగం మొత్తానికి బౌచె గురువులు తాత్కాలిక సుపీరియర్ జనరలుగా ఉన్నారు. దానిలో అంతర్భాగమైన తెలుగు నేలకు సంజీవనాథ స్వామిగా పిలువబడు లెగాక్ గురువు మిషన్ సుపీరియర్‌గా ఉన్నారు. జాన్ కాల్మెట్‌ను ముందుగా ప్రస్తుత తమిళనాడులో ఉన్న కరువేపంపూండిలో ఉన్న ఆబర్టు గురువులకు సహాయకులుగా నియమించారు. ఉత్తర మెరూరుకు కరువేపంపూండి ఉత్తరాన నాలుగుమైళ్ళ దూరంలో ఉంది. కరువేపంపూండి, ఉత్తర మెరూరు, పులియూరు, వేటవళం మున్నగు గ్రామాలు మధురై మండలానికి చెందిన పోర్చుగీసు జేసుసభ గురువులు పనిచేసిన కతోలిక గ్రామాలు. ఆ గ్రామాలను కర్ణాటిక్ మిషనుగా ఏర్పడిన ఫ్రెంచి జేసుసభ గురువులకు ఇటీవలనే అప్పగించినట్లు మోద్వీ గురువులు జేసుసభ జనరలు గారికి ఫిబ్రవరి 18, 1705న వ్రాసిన లేఖలో వెల్లడించారు. మోద్వి గురువులు (1644-1711), వారికి సహాయక గురువుగా వచ్చిన మాక్సిమిలన్ కోర్బవిల్ లను కరువేపంపూండి నందు 1711లో బ్రాహ్మణులు విషాహారం పెట్టి చంపారు. వారి సమాధులు ఇప్పటికీ ఆ గ్రామంలో ఉన్నాయి. అట్టి గొప్ప చరిత్ర కలిగిన కరువేపంపూండిలో తన పరిచర్య మొదలుపెట్టి, అక్కడే కాల్మెట్ తమిళ భాషను నేర్చుకున్నాడు.

జాన్ కాల్మెట్ మంచి విద్వత్తు కలిగిన గురువర్యులు. అతనికి హిందూ వేదాలన్నా, స్థానిక గణితము, ఆయుర్వేదం, ఖగోళ, జ్యోతిష్య శాస్త్రాలు, భారత సంస్కృతియన్నా మక్కువ ఎక్కువ. అతడు భారతదేశ రాశి ఫలాలు, పాశ్చాత్య రాశి ఫలాలు ఒకటేనని కనిపెట్టాడు. హిందూ పురాణాలలో సూర్యగ్రహణాల గురించి చెప్పబడిన అంశాలు కాల్దియన్ల శాస్త్రానికి సామీప్యముందని కాల్మెట్ గ్రహించాడు.

సంజీవనాథ స్వామి తెలుగు సీమలో 1712 నుండి వేద ప్రచారం నిర్వహిస్తూ, పలు చక్కని కతోలిక సంఘాలను ఏర్పరచాడు. వారే 1714 నుండి 1726 వరకు తెలుగు మిషన్ కు సుపీరియర్ గా ఉంటూ, తెలుగు కతోలికుల పితామహుడుగా పేరు బడసాడు.

ఆ గురువుల ఆహ్వానంతో జాన్ కాల్మెట్ తెలుగు గడ్డపై 1726లో కాలుమోపాడు. అతడు స్థానిక మత సంప్రదాయలను అనుసరించి, "సత్యబోధ స్వామి" అను నామాన్ని స్వీకరించి, భారతీయ గురువులలో ఒకరై నిష్ఠగా జీవిస్తూ, సువార్తసేవ చేశాడు. మరలా తమిళ ప్రాంతమైన పుష్పగిరికి 1727 పునరుత్థాన పండుగ తరువాత కాల్మెట్ చేరుకున్నాడు. ఇటుకలతో మొట్ట మొదటగా కట్టబడుతున్న దేవాలయాన్ని ఆ సంవత్సరాంతం కల్లా పూర్తి గావించాడు. అక్కడ గురువుల నివాసం కొంచెం విశాలంగా ఉంది. అందుచేత గురువుల సమావేశాలు అక్కడే నిర్వహించుకునేవారు. అతడు పుష్పగిరి చేరిన ఎనిమిది నెలలకే 150 మందికి జ్ఞానస్నానమిచ్చాడు. తదనంతర కాలంలో కాల్మెట్ ప్రతి సంవత్సరం దాదాపు 250 మందికి జ్ఞానస్నానం ఇచ్చినట్లు సంజీవనాథ స్వామి ధృవీకరించారు. పుష్పగిరిలో 1730 వరకు, పిమ్మట 1730 నుండి 1739 వరకు కాల్మెట్ చిక్క బళ్ళాపురం, వెంకటగిరి మున్నగు స్థావరాలలో ఉంటూ పలు గ్రామాలు కలియదిరిగి, ప్రభు రాజ్యాన్ని సుస్థిరంగా స్థాపించాడు. కాల్మెట్ తెలుగు మిషన్ కు సుపీరియర్‌గా 1732 నుండి 1737 వరకు ఉంటూ, తెలుగు శ్రీసభకు గట్టి పునాదులు వేశాడు.

జాన్ కాల్మెట్ ఓ యువ బ్రాహ్మణుని వద్ద సంస్కృతం అభ్యసించటం మొదలు పెట్టాడు. అనతి కాలంలోనే ఆ బ్రాహ్మణుడు కాల్మెట్ గురువులకు మంచి మిత్రుడయ్యాడు. కాల్మెట్‌కు ఆ బ్రాహ్మణుడు సంస్కృతం, తెలుగు భాషలను నేర్పగా, కాల్మెట్ ఆయనకు ఫ్రెంచి, లతీను భాషలను నేర్పాడు. వారి స్నేహం మరింత గాఢమైన దశలో, అందరూ భావిస్తున్నట్లుగా వేదాలు నాశనం కాలేదని, అవి మౌఖిక సంప్రదాయంలో మాత్రమే తరతరాల వారు నేర్చుకుంటారన్న నిజాన్ని అతడు వెల్లడించాడు. 1732 నాటికల్లా ఆ బ్రాహ్మణున్ని నాలుగు వేదాలను తెలుగు లిపిలో తాళ పత్రాలపై వ్రాయటానికి కాల్మెట్ ఒప్పించాడు. అదే సంవత్సరం ఆగస్టు నెల కల్లా ముప్పై వేల శ్లోకాలను, ఎన్నో తాళపత్ర గ్రంథాలను సేకరించి, వానిని పారిస్ జాతీయ ప్రాచ్య గ్రంథాలయ అధికారి అయిన అబె బైగ్నాన్‌కు పంపాడు. ఆ తరువాత మరో మూడు విడతలుగా మరో ఇరవై ఆరువేల శ్లోకాలను, అనేక ఇతర తెలుగు గ్రంథాలను 1733, 1734, 1735 లలో పారిస్ గ్రంథాలయానికి పంపాడు. వానిలో వేమన గారి శతకము కూడ ఉన్నదని ఆరుద్ర గారు తన డాక్టర్ పట్టా సిద్ధాంత వ్యాసంలో నుడివాడు. జాన్ కాల్మెట్ గురువులు వేద ప్రచారంతో బాటు, ఫ్రాన్సు దేశ చక్రవర్తికి తూర్పుదేశాలకు చెందిన గ్రంథాలను సేకరించి, పంపవలసిన బాధ్యతాయుతమైన పదవిని కూడా చేపట్టాడు. కనుక తెలుగు గ్రంథాలు, సంస్కృత గ్రంథాలు సేకరణ అతనికి మరో ముఖ్య వ్యాపకమైంది. పిశాచ శక్తులను కట్టడి చేసే మంత్ర తంత్రాలతో కూడుకున్న అధర్వణ వేద విషయంలో కొన్ని సందిగ్ధాలు, అస్పష్టతలు ఉన్నాయి. హైందవ సంప్రదాయంలో మౌఖికంగా ఉన్న అధర్వణ వేదం గ్రంథస్థం చేయడం నిషిద్ధం. అది ప్రాణాంతకమైనా కడు గోప్యంగా ఈ నాలుగవ వేదాన్ని గ్రంథస్థం

చేసి, పాశ్చాత్య దేశాలకు పంపడంలో జాన్ కాల్మెట్ గొప్ప విజయం సాధించాడు. కాల్మెట్ పంపిన ప్రతియే అసలైన అథర్వణ వేదమని అనంతర సాహితీవేత్తలు కితాబునిచ్చారు.

1732లో కాల్మెట్ పుంగనూరు చేరుకున్నాడు. తెలుగునాట జేసుసభ గురువులు 1701 లోనే పుంగనూరులో అడుగుపెట్టి, సమీపంలోని మార్లపల్లెలో మంచి కతోలిక సంఘాన్ని ఏర్పరచారు. పుంగనూరు రాజు తన సముఖంలో క్రైస్తవులకు, బ్రాహ్మణులకు మత విషయాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేశాడు. అందు బ్రాహ్మణులు సంస్కృత భాషలో సంభాషింపగా, జాన్ కాల్మెట్ లతీను భాషలో సంవాదం సాగించాడు. దానికి బ్రాహ్మణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పుడు కాల్మెట్ స్వామి సభాసదులందరికి అర్థమయ్యే తేట తెలుగులో సంవాదం జరిపించమని రాజుగారిని కోరగా, సంవాదం తెలుగు భాషలోనే ఉండాలని రాజు చిరునవ్వుతో బ్రాహ్మణులకు సూచించాడు. ఆ విధంగా కాల్మెట్ పండితులలో పండితుడుగా, పామరులలో పామరునిగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు.

తదనంతరం కాల్మెట్ కృష్ణాపురం చేరుకున్నాడు. అది తెలుగు క్రైస్తవుల పుట్టినిల్లుగా పేరుగాంచిన ప్రాంతం. అప్పటికే సంజీవనాథ స్వామి, ఇతర గురువుల కృషివలన ఆ ప్రాంతంలో అనేక గ్రామాలు క్రైస్తవాన్ని స్వీకరించాయి. మరాఠా సైన్యపు దాడులకు, కరవు కాటకాలకు క్రైస్తవ గ్రామాలు తరచుగా గురి అవుతున్నాయి. అందుచేత క్రైస్తవులను సురక్షిత ప్రాంతాలకు కొనిపోవలసిన అవసరత ఏర్పడింది. జాన్ కాల్మెట్ సూచన మేరకు ఆలమూరుకు చెందిన గోపు లింగారెడ్డి నాయకత్వంలో ఆలమూరు, మదిగుబ్బ క్రైస్తవులు అందె వారి సీమ (అనంతపురం)ను కట్టు బట్టలతో వీడి, 240 మైళ్ళ దూరంలోనున్న నెల్లూరు సీమలోని బచ్చుల కూరపాడు, బుక్కాపురం, పెద్దారికట్లకు వలస వెళ్ళారు. అక్కడ వెంకటగిరి రాజు, వారికి స్వయంగా ఈనాములిచ్చి తన రాజ్యంలోనికి ఆహ్వానించాడు. అలనాటి ఇస్రాయేలు ప్రజలు పది ఆజ్ఞల పలకలను, దివ్య మందసాన్ని మోసుకొనిపోతూ, మార్గ మధ్యంలో విడిది చేసినప్పుడల్లా దేవునికి గుడారం ముందుగా వేసినట్లుగా, ఆ క్రైస్తవులు తాము చేరవలసిన గ్రామాలు చేరుకోగానే, తాము చేసుకున్న మ్రొక్కుబడి ప్రకారం ముందు చక్కని దేవాలయాలను నిర్మించారు. ఆ తరువాతనే తమ ఇండ్లను నిర్మించుకున్నారు.

1734లో కర్దూ స్వాములవారితో కలిసి ప్రాచ్య భాషలను, సంస్కృతిని మరింత లోతుగా అధ్యయనం చేశాడు. కాల్మెట్ స్వతహాగా పండితుడు. కనుక సోదర జేసుసభ గురువులు అతని పాండిత్యానికి ప్రణమిల్లేవారు. అతడు బహుభాషా కోవిదుడుగా పేరుగాంచాడు. కాల్మెట్ కతోలిక విశ్వాసంపై "సత్యవేద సార సంగ్రహం" అను సంస్కృత గ్రంథాన్ని స్వయంగా రచించాడు. కతోలికులు ప్రతిరోజు చెప్పే పరలోక జపము, మంగళవార్త జపము, విశ్వాస సంగ్రహం మున్నగు ప్రార్థనలను సంస్కృతంలో తర్జుమా

గావించాడు. కతోలిక వివాహాది శుభకార్యాలలో, తలంబ్రాల కార్యక్రమంలో వాడే సంస్కృత శ్లోకాలన్నీ అతడు రచించినవే. తెలుగులో నిఘంటువులను, వ్యాకరణ గ్రంథాలు రచించిన పొన్స్, దు చాంప్, కర్డ్దూ మున్నగు గురువర్యుల ప్రశంసలనే గాక, సమకాలీన పండితులు కూడా కాల్మెట్ వైదుష్యాన్ని గౌరవించి, అతని బాటలో నడువ ప్రయత్నించారు. తన సాహితీ సేవలో సహాయకుడైన మంగళగిరి ఆనందయ్యను "వేదాంత రసాయనము" అను విశ్వాస గ్రంథమును వ్రాయుటకు కాల్మెట్ గురువులు ఎంతో ప్రోత్సహించాడు.

జాన్ కాల్మెట్ గురువులు 1733లో చిత్రావతి నదీతీరంలో ఉన్న పార్నపల్లె గ్రామాన్ని సందర్శించాడు. ఆ గ్రామ సమీపాన తాడిమర్రి, కొత్తకోట, గుత్తిలలో క్రైస్తవ సంఘాలు అప్పటికే ఉన్నందున, గురువులు ఆ గ్రామాలను తరచుగా సందర్శించేవారు. పార్నపల్లె నందు గండికోట కమ్మ వంశానికి చెందిన హిందువులు ఉన్నారు. వారిలో పలుకుబడి కలిగిన సుబ్బయ్య కుమారుడగు గాలి తమ్మినీడు అతని భార్యకు స్వస్థత కలుగజేయమని, జాన్ కాల్మెట్ గురువుల వద్దకు తీసుకువచ్చాడు. ఆమె కొన్ని యేండ్ల నుండి పిశాచి శక్తులకు లోబడి, విపరీతంగా బాధపడింది. ఆమెకు తరచుగా పూనకం వచ్చేది. అప్పుడు ఆమె అటు ఇటు వేగంగా ఊగుతూ, గాల్లోకి చేతులు ఊపుతూ, వికృత హావ భావాలతో చూపరులకు భయాన్ని కలిగించేది. కాల్మెట్ గురువులు ముందు ఆమెపై పరిశుద్ధ తీర్థ జలాన్ని చల్లి, భక్తితో ప్రార్థించాడు. వెంటనే ఆమె ఆ క్షణమే మెల్లగా నేలకు ఒరిగి పోయింది. ఆశ్చర్యం. ఆదే ఆమె చివరిసారిగా పడిపోవటం. ఆ క్షణమే ఆమె సాతాను శక్తి నుండి బయటపడి, పరిశుద్ధుడైన క్రీస్తుప్రభుని సాంత్వన లోనికి వచ్చింది. గత ఆరేళ్ళగా ఆమె కోల్పోయిన స్వస్థత, బలం త్వరలోనే తిరిగి ఆమెకు సమకూరాయి. అందుకు కృతజ్ఞతగా ఆమె, ఆమె భర్త, వారు దత్తత చేసుకున్న ఇద్దరు పిల్లలు త్రియేక దేవునిలో జ్ఞానస్నానం తీసుకుని, శ్రీసభలో సభ్యులయ్యారు. ఆమె పేరు గాలి (పాతకమూరు) అన్నమ్మ. వారిని అనుసరిస్తూ గండికోట సీమనందలి కమ్మవారు జ్ఞానస్నానం స్వీకరించటం, తమ వంశంలో మొట్ట మొదటి కతోలికులయిన అన్నమ్మ పేరును స్మరించుకుంటూ, తమ బిడ్డలకు ఆమె పేరు పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఆ పార్నపల్లె లోనే అనేకులు జ్ఞానస్నానం తీసుకున్నారు. ఆ వంశంలో పేరు గాంచిన పాతకమూరు వారు అక్కడి వారేనని, అక్కడే "పాతకమూరి బంగళా"గా పేరొందిన బంగళా ఉందని అంతోని క్రూట్ గురువులు 1905లో తన "తెలుగు క్రైస్తవుల చరిత్ర" గ్రంథంలో పొందుపరిచారు.

జేసుసభ గురువులైన జాన్ కాల్మెట్ తన వేద పరిచర్య చాలా సువిశాలంగా ఉన్న తెలుగు ప్రాంతములో చక్కగా జరుగుతుందని, అందులో పదహారు పెద్ద దేవాలయాలతోబాటు, చిన్న దేవాలయాలు అనేకం ఉన్నాయని, వానిలో ప్రజలు గుమికూడి ప్రార్థించటానికి వీలుంటుందని తెలిపాడు. 1733 నాటికి 10,000 మంది

తెలుగు క్రైస్తవులున్నట్లు తమ లేఖలో కాల్మెట్ వివరించాడు. 1730 నాటికి గార్గం గురువులు వెంకటగిరి చేరుకున్నాడు. అక్కడి రాజు ముందుగా క్రైస్తవ ధర్మంపట్ల అంత సుముఖంగా లేనప్పటికి, ఆ తరువాత స్నేహహస్తాన్ని అందించాడు. మూడు సంవత్సరాలపాటు అక్కడ క్రైస్తవ సంఘాలు ఆ రాజు గారి ప్రాపకంలో వర్ధిల్లాయని కాల్మెట్ లేఖను బట్టి తెలుస్తుంది. 1732లో ముస్లిం రాజులు, వెంకటగిరికోటపై దండెత్తి, దానిని సర్వనాశనం చేశారు. వెంకటగిరిలో బోయవాండ్లు, కొందరు రాజుగారి సేవకులు క్రైస్తవులుగా మారారు. బుక్కాపురం, పెద్దారికట్ల సంఘాలు ఒక దానికొకటి దగ్గరగా ఉన్నందున, క్రైస్తవం చాలా త్వరగా ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. బుక్కాపురంలో రెండు వందలమంది క్రైస్తవులున్నారని, పెద్దారికట్లలో చాలామంది క్రైస్తవులు స్థిరపడ్డారని, ఇంకా అనేక మంది అక్కడకు వలసలు వస్తున్నారని జాన్ కాల్మెట్ 1735వ సంవత్సరంలో వ్రాసిన లేఖలో తెలియజేశాడు.

జాన్ కాల్మెట్ మరో లేఖలో ఓబులమ్మ ను గురించి వివరంగా ఇలా తెలియజేశాడు. ఆమె కొత్తకోట రాజుగారి కుమార్తె. ఓబులమ్మ ఎనిమిదేండ్ల ప్రాయంలో నున్నప్పుడు, ఆ రాజు తనను దీర్ఘకాలంగా పట్టి పీడిస్తున్న వ్యాధిని బాగుచేయమని, అదే సమయంలో తనకు సత్యవేదాన్ని బోధించమని పలుమార్లు కృష్ణాపురం వెళ్ళి, అక్కడి గురువు సంజీవనాథస్వామిని కలుసుకున్నాడు. రాజు కన్నా అతని కుమార్తె ఓబులమ్మలో ఎక్కువగా విశ్వాస బీజాలు నాటుకున్నాయి. ఆమెకు యుక్త వయస్సు వచ్చిన తరువాత, కృష్ణాపురం వెళ్ళి గురువును కలుసుకోవాలని ఆమె కోరుకుంది. కాని ఆమెను అందుకు అనుమతించ లేదు. కనుక తన కోటలో పాల్ అను ఉపదేశిని, సేవకునిగా నియమించుకుంది. అతని ద్వారా కతోలిక ధర్మాన్ని, మత సత్యాలను తెలుసుకుని, ప్రభు యేసుని విశ్వసించింది. తన వివాహానంతరం తన భర్తను, బంధువులను క్రైస్తవ మతం స్వీకరిద్దామని ప్రోత్సహించినా, వారు ఎవరూ ముందుకు రాలేదు. వివాహమైన మొదటి సంవత్సరం ముగియటానికి ముందే ఆమెకు తీవ్రమైన జబ్బు చేసింది. కృష్ణాపురం తీసుకుని వెళ్ళి, గురువు వద్ద తనకు జ్ఞానస్నానం ఇప్పించమని తన భర్తను ఓబులమ్మ ప్రాధేయపడినా, అతడు వినిపించుకోలేదు. అనతి కాలంలోనే ఆమె మరణించింది. ఓబులమ్మ పవిత్ర తీర్థ జలంతో జ్ఞానస్నానం స్వీకరించనప్పటికి, ఆమె 'ఆశా జ్ఞానస్నానం' పొంది, క్రైస్తవురాలుగా మరణించిందని చెప్పుకోవచ్చు. తదనంతరం కోటలోని ఆమె బంధువులు, వారి సంతానంతో సహా జ్ఞానస్నానం పొంది శ్రీసభ సభ్యులయ్యారు.

1736లో జాన్ కాల్మెట్ తెలుగు, సంస్కృత గ్రంథాల అధ్యయనం కొనసాగించేందుకు నెల్లూరు సీమనందలి వెంకటగిరి కోట చేరుకున్నాడు. అక్కడ అతనికి మలేరియా వ్యాధి సోకింది. విశ్రాంతి నిమిత్తం అతడు పాండిచ్చేరి వెళ్ళాడు. నయం కాగానే ఏడుదుర్గం ప్రయాణం కట్టాడు. మార్గ మధ్యంలో ఓ మహమ్మదీయ సైనికుడు అతనిని బంధించి,

మూడు రోజులపాటు నానా చిత్ర హింసలు పెట్టాడు. ఏడుదుర్గం చల్లని ప్రాంతం. అక్కడి పండ్ల తోటలన్నా, పండిత ప్రముఖులతో మంతనాలన్నా కాల్మెట్ స్వామికి బహుప్రీతి. 1736లో ఆ ప్రాంతమంతా కనీవిని ఎరుగని కరవు దాపురించింది. దానితో ప్రజలు కుప్పలు తెప్పలుగా మరణించారు. దానికి తోడు కర్ణాటిక్ మిషను భూభాగమంతా రెండేళ్ళపాటు వర్షాలు అసలు కురవలేదు. తినటానికి తిండి లేక దాదాపు 12000 మంది క్రైస్తవులు మరణించారు. ఈ విపత్తులో మరణించనున్న 2242 మందికి స్వయంగా జ్ఞానస్నాన మిచ్చినట్లు కాల్మెట్ గురువులు తమ పెద్దలకు తెలిపారు.

జాన్ కాల్మెట్ జీవించిన 47 సంవత్సరాలలో తెలుగు ప్రజల మధ్య పదమూడు సంవత్సరాలు మాత్రమే వేదప్రచారం నిర్వహించాడు. అయినప్పటికి అతని సేవలు చిరస్మరణీయమైనవి. తన సృజనాత్మకత, పరిశోధనా శైలి, స్థానిక కట్టుబాట్లకు, ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తూ చేసిన బోధలు, సలిపిన సాహితీ సేవలు తెలుగు క్రైస్తవ చరిత్రలో ప్రముఖ అధ్యాయంగా చెప్పుకోవచ్చు. అతని అనంతరం వచ్చిన చరిత్రకారులు, తత్వవేత్తలు, సాహితీ ప్రియులు, జాన్ కాల్మెట్‌ను బహుభాషా కోవిదుడుగా, తులనాత్మక భాషా నిపుణునిగా, హైందవ ధర్మాన్ని చక్కగా అర్థం చేసుకున్న ప్రథమ విదేశీ పౌరునిగా ఎన్నో ప్రశంసలు కురిపించారు. చాలా మంది ప్రయత్నించినప్పటికి అసలైన వేదాన్ని సంపాదించి, పాశ్చాత్యదేశాలకు పంపింది జాన్ కాల్మెట్ గురువులేనని జర్మన్ తత్వవేత్త, ప్రాచ్యభాషల పండితుడైన మాక్స్ ముల్లర్ నొక్కి వక్కాణించాడు. జాన్ కాల్మెట్ చిన్న బళ్లాపురంలో 1739 చివరన గాని, 1740 ప్రారంభంలో గాని మరణించి ఉండవచ్చు. ట్రెంబ్లే గురువులు తన లేఖలో మొజాక్, మరో గురువుతో కలసి జాన్ కాల్మెట్ సమాధిని సందర్శించి, కాల్మెట్‌కు కన్నీటి వీడ్కోలు పలికామని వ్రాసారు. చిన్న బల్లాపుర ప్రజలు పిల్లలు కలగడానికి ఓ సమాధి వద్దకు వచ్చి, ప్రార్థించి, మ్రొక్కుబడులు చేసుకుంటారు. అది ఒక పవిత్రమైన క్రైస్తవ సన్యాసిదని నానుడి. అదే కాల్మెట్ గురువుల సమాధి అయి ఉండవచ్చునని భావన. ఆ సమాధి ఇప్పుడు కాలగర్భంలో కలిసి పోయింది.



శ్రీ సంజీవనాథ స్వామి
శ్రీ శౌరినాథ స్వామి
శ్రీ దివ్యనాథ స్వామి
వారల ప్రాచీన సమాధుల
వద్ద భక్తగణం
- కృష్ణాపురం



ప్రథమ భారతీయ గృహస్త పునీతులు

# 10. పునీత దేవ సహాయం

**(1712-1752)**

ఫాదర్ పామిశెట్టి విజయరాజు, S.J.

దేవ సహాయం పిళ్లై అసలు పేరు నీలకంఠ పిళ్ళై. అతడు హిందూ ధర్మంలో పుట్టి పెరిగిన వ్యక్తి. కేరళలోని ట్రానన్కూరు రాజ్యం కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్న కాలమది. నీలకంఠ తల్లిదండ్రులు వాసుదేవన్ నంబూద్రి, దేవకి అమ్మాళ్. ఆ దంపతులకు కన్యాకుమారి ప్రాంతంలోని నట్టాలం గ్రామంలో ఏప్రిల్ 23, 1712న నీలకంఠ జన్మించాడు. వారు నాయర్ కులస్తులు. తండ్రి స్వగ్రామం కాయంకులం. అది కేరళ రాష్ట్రంలోనిది. కాని అతడు తమిళ ప్రాంతమగు కన్యాకుమారి సమీపానగల తిరువట్టూరులోని శ్రీ ఆదికేశవ పెరుమాల్ దేవాలయంలో పూజారిగా విధులు నిర్వర్తించాడు. నీలకంఠ తన బాల్యాన్ని కన్యాకుమారి జిల్లాలోని తిరువట్టూరు గ్రామమందు మేనమామ ఇంట్లో గడిపి, సనాతన హిందూ సంప్రదాయాలను పాటిస్తూ పెరిగాడు.

యువకుడైన దేవ సహాయం ట్రావన్కూరు రాజైన మహారాజు మార్తాండవర్మ కొలువులో చేరి, పనిచేశాడు. అతనిలోని ప్రజ్ఞాపాటవాలను, సామర్థ్యాలను గుర్తించిన రాజకుటుంబీకులు, అతనిని రామయ్య దలవా అను దివాను (ప్రధానమంత్రి) కు సహాయ అధికారిగా నియమించారు. దేవ సహాయం తన వృత్తి పట్ల చూపించే అంకితభావం, ఉత్సాహం అచ్చటి రాజు గారికెంతో నచ్చింది.

అది 18వ శతాబ్దం. ఐరోపా వాసులు భారతదేశంపై దండయాత్రలు చేసి, తమ సామ్రాజ్యాలను విస్తరించుకునే కాలం. డచ్చి ఈస్ట్ ఇండియా కంపెనీ వారు తమ డచ్చి నౌకా దళంతో, 1741లో ట్రావన్కూరు రాజ్యంలోని కోలాచల్ ఓడరేవును స్వాధీనం పరచుకోవటానికి సైనికదాడి జరిపారు. ఆ సైనిక దాడికి దళపతి కెప్టెన్ యుస్టాచియస్ దె లనోయ్. కోలాచల్‌ను కబళించి, అక్కడ వర్తక కేంద్రాన్ని ఏర్పరచాలని డచ్చి వారి పథకం. లనోయ్ నౌకాదళమునకు, ట్రావన్కూరు సైన్యానికి మధ్య భీకర యుద్ధం జరిగింది. అందులో ట్రావన్కూరు సేనలు విజయం సాధించాయి. శత్రు సైన్యంలోని వారందరిని చంపటమో, బందీలుగా పట్టుకోవటమో జరిగింది. ట్రావన్కూరు సైన్యం,

లనోయ్, అతని సైన్యాధిపతి అయిన డోనాడి, ఇంకా కొందరు డచ్చి సైనికులను సజీవంగా పట్టుకుని, ఖైదు చేసారు. కొంతకాలం బందీలుగా ఉన్న మీదట లనోయ్, ఇతర డచ్చి సైనికులు ట్రావన్కూరు రాజ్య సైన్యంలో పనిచేయటానికి ఇష్టపడితే, వారికి క్షమాభిక్ష పెడతానని రాజు షరతు విధించాడు. ఆ షరతుకు వారు అంగీకరించడంతో, రాజు వారిని క్షమించి, తన సైన్యంలో తీసుకున్నాడు. లనోయ్, క్రమంగా రాజుగారి అభిమానాన్ని పొందాడు. లనోయ్ నమ్మకపాత్రుడని గ్రహించిన రాజు, అతనిని తన సైన్యానికి సర్వ సేనాధిపతిని చేశాడు. లనోయ్ నాయకత్వంలో ట్రావన్కూరు రాజైన మార్తాండవర్మ పలు యుద్ధాలు చేసి, తన ప్రక్కలో బల్లెంలా ఉన్న పలు పొరుగు రాజ్యాలను కబళించి, తన రాజ్యాన్ని విస్తరించుకున్నాడు.

ట్రావన్కూరు రాజగు మార్తాండవర్మ కొలువులో ముఖ్యులైన దేవసహాయం పిళ్ళై, డి లనోయ్ మధ్య ఏర్పడిన పరిచయం క్రమేణా వృద్ధిచెంది, వారిద్దరు అనతికాలంలోనే గాఢ మిత్రులయ్యారు. లనోయ్‌లోని దైవభక్తి దేవ సహాయానికి నచ్చింది. క్రైస్తవ మతం పట్ల, మత సిద్ధాంతాలపట్ల దేవ సహాయానికి ఉన్న ఆసక్తిని గమనించిన లనోయ్, అతనికి క్రైస్తవ మత విశ్వాసాన్ని గురించి వివరంగా బోధించాడు. దానితో దేవ సహాయం 1745లో కతోలిక జ్ఞానస్నానం పొందాడు. ప్రస్తుత తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా నందలి వడక్కంకుళం అను గ్రామంలో అప్పుడు జాన్ బట్టిస్టా బుట్టారి అను జేసుసభ గురువులు పనిచేస్తున్నారు. ఆ గురువుల ఆధ్వర్యంలో దేవ సహాయం తొమ్మిది నెలల పాటు కతోలిక మతాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, సత్యోపదేశమును నేర్చుకున్నాడు. పిమ్మట బుట్టారి గురువులు అతనికి జ్ఞాన స్నానమిచ్చి, 'లాజర్' అను నామకరణం చేసారు. లాజర్ నామానికి తమిళంలోను, మళయాళంలోను ''దేవ సహాయం'' అని అర్థం. ఇక అప్పటి నుండి అతనిని అందరూ దేవ సహాయం అని పిలువసాగారు. అప్పటికే దేవసహాయానికి ట్రావన్కూరు మండలమందలి కుంచువీడుకు చెందిన భార్గవి అమ్మాళ్‌తో వివాహమైంది. ఆమె కూడా కతోలిక ధర్మాన్ని స్వీకరించింది. ఆమెకు తెరెసమ్మ అని నూతన నామమిచ్చారు. తెరెసమ్మకు తమిళ, మళయాళ భాషలలో సమానార్థక నామం ''జ్ఞానపూవు అమ్మాళ్''.

''క్రీస్తు ప్రభుని విశ్వసించమని నన్ను ఎవరూ బలవంతపెట్టలేదు. నా అంతట నేనే స్వేచ్ఛగా ప్రభువు చెంతకు వచ్చాను. నాకు నా హృదయం తెలుసు. క్రీస్తు ప్రభువే నా దైవం. అతనినే నా జీవన పర్యంతం అనుసరించటానికి నేను దృఢంగా నిర్ణయించుకున్నాను'' అని దేవ సహాయం తన జ్ఞానస్నాన పర్వదినాన తనను తాను క్రీస్తు ప్రభువునకు సంపూర్ణంగా సమర్పించుకున్నాడు. ఆనాటి నుండి దేవసహాయం

జీవితం మరో మలుపు తిరిగింది. అతడు బైబులులోని యోబు చరిత్రను ముందే చదివాడు. కష్టాలలో సైతం యోబు, ప్రభునిపై గట్టి నమ్మకముంచటం, అతనిని ఎంతగానో ప్రభావితం చేసింది. తన జ్ఞానస్నానంతో, తనకు ఎన్నో కష్టాలు ఎదురౌతాయని అతనికి తెలుసు. అయినా వాటికి కొంచెమైనా భయపడలేదు. అతడు ఎంతో ధైర్యంతో దైవవాక్కు బోధనలో నాలుగేండ్లు గడిపాడు. దేవ సహాయంను అనుసరించి, అతని బంధువులలో కొంతమంది జ్ఞానస్నానం స్వీకరించి, క్రైస్తవులయ్యారు.

దేవ సహాయం క్రైస్తవుడు కావటాన్ని, ఆనాటి వర్ణ వ్యవస్థను సమర్థించే సమాజంలోని పలువురు సహించలేదు. హిందూ ధర్మ పెద్దలు, కొంతమంది సామంతరాజులు, కొందరు రాజకుటుంబీకులు, తమ నాయర్ కులస్తులు అతడిని బెదిరించటం, దూషించటం, కొట్టడం, అతని ఆస్తులను ధ్వంసం చెయ్యటం లాంటి ఎన్నో అకృత్యాలకు పాల్పబడ్డారు. దేవ సహాయం ఎన్ని బాధలైనా ప్రభుని కోసం భరించటానికి సిద్ధంగా ఉన్నాడు. కాబట్టి వారి బెదిరింపులను పెడచెవిని పెట్టాడు. అతడిని తిరిగి హిందూ ధర్మంనకు మారమని అనేక విధాల వత్తిడి తెచ్చారు. చివరిగా, చేసేదేమి లేక అతడు రాజద్రోహం చేస్తున్నాడని, ట్రావన్కూరు రాజ్య సమాచారం శత్రువులకు, విదేశీయులకు చేరవేస్తున్నాడని దీవాను రామయ్య దలావాకు ఫిర్యాదు చేశారు. అతనిపై లేనిపోని నిందలు వేసి, రాజ భవనంలోని అతని ఉన్నత పదవిని ఊడ గొట్టారు. దేవ సహాయం క్రైస్తవుడైనట్లే మరెందరో క్రైస్తవ మతం స్వీకరిస్తారని భయపడిన రాజు, అతడిని 1749లో ఖైదుచేసి, మూడు సంవత్సరాలపాటు పలు చిత్రహింసలకు గురి చేసాడు. అయినా దేవ సహాయం తన దైవమైన క్రీస్తు ప్రభుని శిష్యరికం మానలేదు.

దేవసహాయం రాజద్రోహ నేరం చేశాడని అభియోగం మోపినందున, రాజు అతనికి మరణ దండన శిక్ష విధించాడు. అతడిని యమ ధర్మరాజు వాహనమైన దున్నపోతుపై కుళుమైకాడు వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్ళాలని, దారిపొడవునా, గ్రామాలలో కొరడాలతో కొట్టించి, చివరకు మరణశిక్ష అమలు పరచాలని ఆజ్ఞాపించాడు. ఆ నరకయాతనను చూచిన హిందువులెవ్వరూ క్రైస్తవులు కారని భావించి, అటువంటి శిక్షను అమలు పరచాలని తలంచాడు. కాని మంత్రుల సలహా మేరకు రాజు తన శిక్షలో కొంత మార్పు చేసాడు. అరల్ వైమొళి సరిహద్దు వరకు మాత్రమే అతనిని దున్నపోతుపై అవహేళనగా ఊరేగిస్తూ, దారిలోని పది గ్రామాలలో బహిరంగ చిత్రహింసలు పెట్టి, ఆ పిమ్మట రాజ్య బహిష్కారము చేస్తూ, అరణ్యములో విడచి పెట్టాలన్నాడు.

రాజాజ్ఞను అమలు చేస్తూ, రాజభటులు దేవ సహాయాన్ని దున్నపోతుపై

పద్మనాభపురం రాజభవనం నుండి అరల్ వైమొళి వరకు ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఆనాటి నేరస్థుల వలె, దేవ సహాయం శరీరమంతా ఎరుపు, నలుపు రంగుల చుక్కలు పెట్టి, జనసమ్మర్ధంగల గ్రామాల గుండా, దున్నపోతుపై వెనుకకు కూర్చోబెట్టి, అతనిని దక్షణ ట్రావన్కూరు రాజ్యమంతా కొన్ని రోజులపాటు త్రిప్పారు. ప్రతి దినం దేవ సహాయంను ఎనభై కొరడా దెబ్బలు కొట్టేవారు. అతని గాయాలలో, ముక్కు రంధ్రాలలో మిరియాలపొడిని దట్టించేవారు. ఎర్రటి ఎండలో అతడిని నడిపించేవారు. అతడు దప్పిక గొంటే త్రాగటానికి వీలులేని, మురికి కంపు కొడుతున్న నీటిని మాత్రమే త్రాగటానికి ఇచ్చేవారు. ట్రావన్కూరు రాజ్యపు పద్మనాభపురం రాజభవనానికి సమీపంలో, పులియూరు కురిచ్చి అనే గ్రామముంది. దేవ సహాయం, రాజభటులు అక్కడ సేద దీరటానికి ఆగారు. ఆ సమయంలో అతనికి విపరీతమైన దాహం వేసింది. దేవ సహాయం మోకాళ్ళని కన్నీటి ప్రార్థన చేశాడు. వెంటనే సాక్షాత్తూ ప్రభువే అక్కడ రాతిలోని చిన్న రంధ్రం నుండి నీటి ధారను పంపి, దేవ సహాయం దప్పిక తీర్చారని అక్కడి క్రైస్తవుల దృఢ నమ్మకం. నాగర్ కోయిల్ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పులియూర్ కురిచ్చి గ్రామ దేవాలయ ఆవరణలో ఇప్పటికీ ఆ రాతి రంధ్రం నుండి నీరు ఉబికి వస్తుంది. దేవ సహాయాన్ని దారిలో పెరువిలై గ్రామంలో ఒక వేప చెట్టుకు కట్టివేశారు. పెరువిలై, దాని పరిసర గ్రామాలలోని ఎందరో రోగులకు అప్పటి నుండి ఆ వేప చెట్టు అద్భుత రీతిలో స్వస్థత నిచ్చిందని అక్కడి ప్రజలు ఇప్పటికీ నమ్మకంగా చెప్పుకుంటారు.

1752లో అక్కడి రాజు మరియు దివానుల ఆజ్ఞ ప్రకారము, దేవసహాయాన్ని అరల్ వైమొళి వద్ద పాండ్య దేశంలోనికి పంపి, దేశ బహిష్కరణ శిక్షను అమలు పరచాలి. తదనుగుణంగానే దారిలో శిక్షించుకుంటూ అతడిని అక్కడ రాజ భటులు వదలిపెట్టారు. దేవసహాయం ఏ మాత్రం చింతించకుండా, అక్కడే దైవ ధ్యానం చేసుకుంటూ గడిపాడు. అతని పరిశుద్ధతను తెలిసిన చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు అతనిని సందర్శించారు. అతడప్పుడు క్రీస్తు ప్రభుని గురించి వారికి బోధించాడు. అది గిట్టని అగ్రవర్ణ హిందువులు కుట్రపన్ని, దేవ సహాయాన్ని తుద ముట్టించారు. అతని మరణం గురించి మరో కథనం కూడా ఉంది. దేవ సహాయాన్ని చంపటానికి సైనికులు అడవి ప్రాంతానికి వెళ్ళి, అక్కడ అతనిని కాల్చి వేయటానికి ప్రయత్నించగా, సైనికుల తుపాకీ పేలలేదు. దేవ సహాయమే ఆ పిస్తోలును తీసుకుని, స్వయంగా దానిని ఆశీర్వదించి, తనను కాల్చాలంటే కాల్చవచ్చుని, ఆ తుపాకిని తిరిగి వారికే ఇవ్వగా, ఆ సైనికులు తుపాకిని తీసుకుని, అయిదుసార్లు దానిని పేల్చి, దేవ సహాయాన్ని చంపారని ఆ కథనం. పిమ్మట అతని భౌతిక దేహాన్ని కట్టడిమలై పర్వత ప్రాంతంలో పడవేసి, సైనికులు వెళ్ళిపోయారు. ఆ విధంగా దేవసహాయం జనవరి 14, 1752లో కన్యాకుమారి జిల్లాలోని కట్టడిమలై లో

మరణించాడు. అతని శరీరాన్ని, క్రైస్తవులు కోట్టారులోని పునీత ఫ్రాన్సిస్ శౌరివారి దేవాలయమందలి పీఠం ముందు భూస్థాపితం చేశారు. ఇప్పుడు ఆ దేవాలయమే కోట్టారు మేత్రాసన ప్రధాన దేవాలయం.

దేవ సహాయం మరణించిన నాలుగేళ్ళకే అనగా 1756లో అప్పటి కొచ్చిన్ పీఠాధిపతులు కతోలిక విశ్వాసం కొరకై దేవ సహాయం వేదసాక్షి మరణం పొందాడని రోము నగరంలోని పాపుగారికి తెలియజేసారు. 1780లోనే దేవ సహాయాన్ని పునీతునిగా ప్రకటించాలని అప్పటి సిరో-మలబారు గురువులగు జోసఫ్ కరియాటిల్ రోముకు విన్నవించాడు. దేవ సహాయం మరణానంతరం కతోలిక విశ్వాసులెందరో అతని సమాధిని సందర్శించి అనేక ఆధ్యాత్మిక మేలులు, శారీరక స్వస్థతలు పొందుచున్నారు. పదహారవ బెనెడిక్టు జగద్గురువులు తన క్రైస్తవ విశ్వాసానికి దేవసహాయం పొందిన వీరోచిత మరణానికి గాను “పూజ్యులు”, “వేదసాక్షి”, “ధన్యులు”గా ప్రకటిస్తున్నామని జూన్ 2012లో తెలిపారు. ఆ చారిత్రక ఘట్టాన్ని డిసెంబరు 2, 2012న పదహారవ బెనెడిక్టు పాపుగారు రోము నగరంలోను, కోట్టారు మేత్రాసన పరిధిలోని నాగర్‌కోయిల్ నందు పలువురు కార్డినళ్లు, అతిమేత్రాణులు, మేత్రాణులు, గురువులు, మఠకన్యలు, విశ్వాసుల సమక్షంలో దివ్యబలిపూజ సమర్పించి, దేవ సహాయంను ధన్యులుగా, వేదసాక్షులుగా ప్రకటించారు. భారతదేశంలోని సామాన్య గృహస్త క్రైస్తవులలో ధన్యతా పట్టాన్ని పొందినవారిలో దేవసహాయం ప్రప్రథములు. ఫ్రాన్సిస్ జగద్గురువులు, దేవ సహాయంను పునీతులుగా ప్రకటించడానికి అవసరమైన గొప్ప అద్భుతం జరిగిందని, త్వరలో అతనిని పునీతులుగా అధికారికంగా ప్రకటిస్తారని ఫిబ్రవరి 21, 2020న రోమాపురిలో తెలిపారు. పునీత దేవ సహాయం గారి పండుగ జనవరి 14.





## కార్మెల్ గురుసభ వ్యవస్థాపకులు

# 11. పునీత కురియాకోస్ చావరా

**(1805-1871)**

**ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.**

కేరళ రాష్ట్రంలోని ఆలపుళ పట్టణ సమీపాన గల కైనకారిలో ఫిబ్రవరి 10, 1805న జన్మించాడు. అతని తల్లి దండ్రులు ఐకా కురియాకోస్ చావరా మరియు మరియం తొప్పిల్. వారు సిరో-మలబార్ కతోలిక శాఖకు చెందినవారు. ప్రభుని శిష్యులలో ఒకడైన పునీత తోమాసు వారిచే జ్ఞానస్నాన భాగ్యం పొందిన నాలుగు కుటుంబాలలో పకలమట్టం కుటుంబం ఒకటిగా పేరుగాంచింది. ఆ విశిష్ట కుటుంబానికి చెందిన పుణ్యదంపతులకు ఆరవ సంతానంగా జన్మించి, చెన్నంకారి విచారణ దేవాలయంలో ఎనిమిదవ దినమైన ఫిబ్రవరి 17న జ్ఞానస్నానం పొందాడు. అతని ప్రాథమిక విద్యాభ్యాసం కాలరి గ్రామ ప్రాథమిక పాఠశాలలో, ఆసాన్ అను హైందవ గురువుల ఆధ్వర్యంలో జరిగింది. కురియాకోస్‌కు బాల్యం నుండి భక్తి ప్రపత్తులు మెండు. అతడు క్రమం తప్పకుండా అనుదినం దివ్యబలిపూజలో పాల్గొనేవాడు. చాలా చిన్న వయస్సులోనే అతనికి గురువై, యేసు భగవానిని పరిచర్య చేయాలని జిజ్ఞాస, కోరిక కలిగింది. అందుకు వయస్సు చాలనందున, రెండేళ్ళపాటు పునీత జోజప్పగారి విచారణ గురువుకు శిష్యరికం చేసి, బైబులుకు సంబంధించిన ప్రాథమిక విషయాలను అధ్యయనం చేశాడు. కురియాకోస్ గురువు కావటానికి తల్లిదండ్రులు కూడ అనుమతినిచ్చారు. కురియాకోస్ తనకు పదమూడేళ్ళ ప్రాయం వచ్చినప్పుడు, పల్లిపురం గురు విద్యాలయ రెక్టర్ తోమాస్ పాలకల్ ఆహ్వానంతో, ఎంతో శ్రద్ధాసక్తులతో గురువిద్యాలయంలో 1818లో ప్రవేశించాడు.

కురియాకోస్ గురుశిక్షణ సమయంలో కైనకారి, దాని పరిసర గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలాయి. అనతికాలములోనే కురియాకోస్ తల్లిదండ్రులు, అతని సోదరుడు అంటు వ్యాధికి బలి అయ్యారు. వారికి వారసులు లేనందున గురువిద్యను చాలించుకుని ఇంటికి రమ్మని బంధువులు ఎంతో వత్తిడి చేశారు. ప్రభుని కృపతో ఆ అవాంతరాల నెదుర్కొని, తన ఇంటి విషయాలను చక్కబెట్టి, అతడు గురు విద్యలో నిమగ్నమయ్యాడు. వెరపొలి (వరాపుళ) పీఠాధిపతులు మౌరీలియస్ గారి హస్తాల మీదుగా తన 24వ యేట, నవంబరు 29, 1829న అర్తుంగల్ లోని పునీత ఆంద్రూ గారి దేవాలయంలో గురువుగా కురియాకోస్ పట్టాభిషేకం పొందాడు. పిదప తన ప్రథమ దివ్య బలిపూజను చెన్నంకారి దేవాలయంలో సమర్పించాడు.

కురియాకోస్ ఎంతో ఉత్సాహంతో కొంతకాలం సామాన్య క్రైస్తవుల సేవలో గడిపి, వారిని ప్రభుని బాటలో నడిపాడు. పిమ్మట కురియాకోస్ గురు విద్యాలయంలో గురు విద్యార్థులకు శిక్షణ నిచ్చాడు. అక్కడ తన గురువైన తోమాస్ పాలకల్ మరియు తోమాసు పోరుకర గురువుల సాహచర్యం లభించింది. దైవరాజ్య విస్తరణ నిమిత్తం ఒక స్థానిక గురువుల మఠం లేని లోటు, వారు ముప్వురు గమనించారు. ఆ అంశంపై సుదీర్ఘంగా సమాలోచనలు జరిపి, స్థానిక గురువుల సభను స్థాపించాలని వారు నిర్ణయించుకున్నారు. దరిమిలా తమ ఆలోచనల కనుగుణంగా ఆ ముప్వురు గురువులు కలిసి "కార్మెలైట్స్ ఆఫ్ మేరి ఇమ్మాకులేట్ (C.M.I.)ని 1831లో స్థాపించారు. ఆ సభ స్థాపనకు బ్రదర్ జేకబు కూడ ఆ ముగ్గురు గురువులతో కలిసి గట్టి ప్రయత్నం చేసాడు. తన కంటె ఎంతో పెద్ద వారైన ఆ ఇద్దరు గురువులు పరమపదించిన తరువాత, ఆ సభను నడిపే బాధ్యతను కురియాకోస్ తన మీద వేసుకున్నాడు. "కురియాకోస్ ఎలియాస్ ఆఫ్ హోలీ ఫామిలీ" అను నామధేయాన్ని స్వీకరించి, తన పదిమంది సహచరులతో కలిసి 1855 డిసెంబరు 8న మఠసభలో కురియాకోస్ మాటపట్టు తీసుకున్నాడు.

కురియాకోస్ పేదవారిలో క్రీస్తుప్రభుని గాంచి, సేవలు చేయాలని ఎంతో ఆరాట పడ్డాడు. హీన, దీన, దళిత వర్గాల సేవలో తన జన్మ ధన్యం కావాలని కురియాకోస్ మనసా, వాచా, కర్మణా భావించాడు. ఎందరో నిరుపేదలను తన అక్కున చేర్చుకున్నాడు. కుల, మత, జాతి ప్రసక్తి లేకుండా క్రైస్తవ దేవాలయాల చెంత పాఠశాలలు ఆరంభించి, కేరళ రాష్ట్రంలోని బడుగు, బలహీన, గ్రామీణ వర్గాల ప్రజలంతా విద్యలో రాణించి, తమ సమాజాన్ని మెరుగు పరచుకోవటానికి ఒక నిశ్శబ్ద విప్లవాన్ని కురియాకోస్ ఆరంభించాడు. అప్పటివరకు విద్య అనునది అగ్రవర్గాల మరియు ధనవంతుల చేతులలో ఓ కీలు బొమ్మలా ఉండేది. కురియాకోస్ సార్వత్రిక విద్యకు చేయూతనిచ్చి, విద్యను ధనవంతుల కబంధ హస్తాల నుండి విముక్తి చేసి, అల్ప వర్గీయుల ముంగిళ్ళలో నాట్యమాడేలా చేశాడు. స్థానిక మలబారు సంస్కృతిని, సంప్రదాయాలను ప్రోదిచేస్తూ, 1846లో మొట్టమొదటి సంస్కృత పాఠశాలను ఏర్పాటు చేసి, వేద భాషను సైతం ఆపోసన పట్టమని, తన ప్రాంతీయులకు కురియాకోస్ సవాలు విసిరాడు. సామాన్యుల గడపలకు విద్యాగంధాన్ని పూసి, ఎంతో మంది గురువులుగా, మఠ కన్యలుగా శ్రీసభ సేవలు చేయటానికి కురియాకోస్ నాంది పలికాడు. కడుపు నిండందే కడు పేదలకు విద్య అబ్బదని గ్రహించిన కురియాకోస్, పేద విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత భోజన పథకం సైతం ఆరంభించి విద్య గరపాడు.

కురియాకోస్ మహిళాభ్యుదయమునకు పునాదులువేసి, ఎంతోమంది మహిళలకు వారి వారి గృహాలలోనే, చేతి వృత్తులలో శిక్షణ ఇప్పించి, కతోలిక పూజా సామాగ్రి, అలంకరణకు ఉపయోగపడే కాగితపు పూలు, మైనపు వత్తులు మున్నగు వాటిని తయారు

చేయించి, వారికి ఉపాధి కల్పించాడు. అతని దూరదృష్టి, చొరవతో దాదాపు 3000 కుటుంబాలు స్వయంఉపాధి పొంది, ఆ రాబడితో తమ కుటుంబంలోని బాలికలకు చక్కని ఉన్నతవిద్యను అందించగలిగారు. వారి కృషి, ముందు చూపు వలన భారత దేశంలోని ఇతర ప్రాంతాలకంటే, కేరళ ప్రాంత మహిళలు చదువుల ప్రాముఖ్యతను గుర్తించి, విద్యాధికులై ఉపాధ్యాయురాండ్రుగా, వైద్యరంగంలో నర్సులుగా పురుషులతోబాటు సమానంగా, ఆర్థికంగా ముందంజ వేసి, దేశాభివృద్ధిలో పాల్గొంటున్నారు.

కురియాకోస్ 1846లో 'మన్ననం'లో పునీత జోజప్పగారి ముద్రణాలయమును నెలకొల్పాడు. కేరళలో అది ముచ్చటగా మూడవ ముద్రణాలయం. దాని సహాయంతో ఆధ్యాత్మిక విషయాలపై కతోలికులకు దైవ జ్ఞానాన్ని, బైబిలు జ్ఞానాన్ని అందిస్తూ, "నస్రాని దీపిక" అను మళయాళ భాషా వార్తాపత్రికను వెలువరించాడు. దీపిక పత్రిక ఆ కాలం నుండి భారతదేశంలో నిరంతరాయంగా ఈనాటి వరకు ప్రచురించబడుచున్న విస్తృత పాఠకులు గల ఏకైక పత్రికగా చెప్పుకోవచ్చు. ఈ పత్రికను దాదాపు మూడున్నర కోట్ల మంది చదువుచున్నట్లు తెలుస్తుంది. కురియాకోస్ తన జీవితకాలంలో అనేక రచనలు చేశాడు. వారి ఆశ్రమాలలో జరుగుచున్న సంఘటనలే గాకుండా, తన చుట్టూ ఉన్న సంఘంలోని ముఖ్య ఘట్టాలను సైతం చక్కగా గ్రంథస్థం చేశాడు. అతడు అనేక ఆధ్యాత్మిక విషయాలపైన గ్రంథాలు రచించాడు. గద్యమే కాకుండా పద్యంకూడ వ్రాశాడు. కురియాకోస్ కతోలిక కుటుంబాలకు చేసిన ఆధ్యాత్మిక ఉపదేశాల సమాహారంగా వెలసిన "తండ్రి దేవుని సాక్ష్యం" అనే పుస్తకం ఇప్పటికి, ఎప్పటికి ఉపయోగకరం అని చెప్పక తప్పదు.

కురియాకోస్ 1856 నుండి 1871 వరకు కార్మెలైట్ సభకు అధినేతగా ఉన్నాడు. కేరళలోని మన్ననం కాకుండా, మరి ఏడు చోట్ల ఆ సభ గృహములను ఏర్పరచాడు. అతని ఆధ్వర్యంలో ఆ సభ ఎన్నో ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించింది. కేరళ శ్రీసభకు అమూల్య సేవలందించింది. అతడు ఎన్నో గురు శిక్షణాలయాలను స్థాపించి, లోతైన ఆధ్యాత్మికత కలిగిన యాజకత్వాన్ని ఏర్పరచాడు. గురువులకు, సామాన్య క్రైస్తవులకు ధ్యానము లేర్పాటు చేసి, వారి విశ్వాసాన్ని స్థిరపరచి, మతం పట్ల ఆసక్తిని పెంపొందించాడు. దారితెన్ను లేక జీవిస్తున్న అభాగ్యులకు, మరణావస్థలో నున్న రోగులకు శరణాలయాలు స్థాపించి, వారికి ఆశారేఖలా నిలిచాడు. దైవ వాక్యాన్ని ప్రకటిస్తూ, జ్ఞానస్నాన స్వీకరణకు ఆయత్తపడుచున్న వారికి పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, వారి విశ్వాసంలో చేయూత నందించాడు. ఆ విధంగా కురియాకోస్ సామాన్యుల కష్టాలు, కడగండ్లు తీరుస్తూ, నిరక్షరాస్యులకు విద్య నందించి, వారిని ప్రయోజకులు చేశాడు. శ్రీసభ నుండి దూరంగా వెళ్ళిన వారిని సైతం లాలించి, బుజ్జగించి, తిరిగి దేవుని మందలో చేరుస్తూ, శ్రీసభకు

విశిష్ట సేవలందించాడు.

కేరళ శ్రీసభకు 1861లో పెద్దగడ్డు సమస్య ఎదురైంది. రోమాపురిలోని జగద్గురువుల నుండి సక్రమ నియామక పత్రాలు లేకుండా మార్ తోమాస్ రొకొస్ తనను తాను బిషప్‌గా ప్రకటించుకున్నాడు. ఆ క్లిష్ట సమయంలో వెరపొలి అగ్ర పీఠాధిపతులు, కురియాకోస్ గురువులను, సిరోమలబారు క్రైస్తవ వికర్ జనరలుగా నియమించారు. అప్పుడు కురియాకోస్ ఎంతో విజ్ఞతతో, చాకచక్యంగా రొకొస్ కుట్రను బట్టబయలుచేసి, శ్రీసభలో చీలికను అడ్డుకుని, కేరళ శ్రీసభ సమైక్యతకు, సమగ్రతకు ఎనలేని సేవలందించి, అందరి మన్ననలను, ప్రశంసలను పొందాడు.

కురియాకోస్ సిరియన్ భాషలో "క్రైస్తవుల ప్రార్థనా గ్రంథం"నకు కొన్ని మార్పులు చేర్పులు చేసి, మొట్టమొదటగా దానిని 1862లో ప్రచురించాడు. అదే సంవత్సరంలో మలబారు శ్రీసభకు రోజువారి పరిశుద్ధ గ్రంథ పఠనాలతో ఒక కాలెండరును ప్రప్రథమంగా తయారుచేసి అందించాడు. సిరియన్ భాషలో, మళయాళంలో పలు ప్రార్థనా పుస్తకాలను కేరళలోనే ప్రచురించి, కతోలిక విశ్వాసుల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చాడు.

కురియాకోస్ చిరు ప్రాయము నుండే ప్రార్థనా జీవితాన్ని అలవరచుకుని, గంటల తరబడి ప్రార్థించేవాడు. ప్రభునితో, మరియతల్లితో సన్నిహిత బంధాన్ని పెంచుకుని, ధ్యానించేవాడు. కురియాకోస్ తన దైనందిన జీవితంలో పలు ఇతర కార్యాలలో నిమగ్నమైనా, తన మనసు నిరంతరం ప్రభునిలో లీనమైయ్యేది. కనుక అతనిని అందరూ చిన్ననాటి నుండే దేవుని బిడ్డగా భావించారు. దివ్య సత్ప్రసాదంపై గల భక్తితో కురియాకోస్ 'నలభై గంటల ధ్యాన ప్రార్థన'ను తాను స్వయంగా ఆచరిస్తూ ప్రార్థిస్తూ, కేరళ శ్రీసభకు పరిచయం చేశాడు.

గురువుల కోసం ఒక మఠవాస సంస్థను ఏర్పరచినట్లే, మహిళలకు కూడ ఒక సంస్థ నేర్పరచాలని కురియాకోస్ చాలా కాలం తలపోశాడు. దాని కోసం 1857లో ఆలంగాడ్ నందు, 1859లో పుతెన్‌పల్లిలో ప్రయత్నాలు చేసినా, అవి సఫలం కాలేదు. విదేశీ కార్మెలైట్ గురువైన లియోపొల్డ్ బెక్కరో గారి సహకారంతో ఫిబ్రవరి 13, 1866న "కాంగ్రిగేషన్ ఆఫ్ మదర్ ఆఫ్ కార్మెల్" (C.M.C.) అను మఠకన్యల సభను మహిళల కోసం స్థాపించాడు. కతోలిక శిక్షణ, విద్య మరియు మహిళా సాధికారతలు ఆ సంస్థ యొక్క ముఖ్య ఆశయాలుగా చేకొని, కతోలిక మహిళాభ్యుదయానికి, స్త్రీ విద్యకు నిరుపమాన సేవలందించి, కతోలిక శ్రీసభను కురియాకోస్ ఎంతో స్థిరపరచాడు.

కురియాకోస్ అరవై ఆరేళ్ళ ప్రాయంలో కొంతకాలం అస్వస్థులయ్యాడు. తన మరణం సమీపించినదని తెలుసుకుని రోదిస్తున్నవారిని చూచి, ఎంతో పరిణతితో, విశ్వాసంతో వారిని ఇలా సముదాయించాడు: "మీరెందుకు విషాదంగా ఉన్నారు? ప్రతి

దేవుని బిడ్డ ఒకప్పుడు మరణించాల్సిందే కదా! ఇప్పుడు నా ఘడియ వచ్చింది. నేను ఎప్పటి నుండో సిద్ధపడి, నా మరణానికి ఎదురుచూస్తున్నాను. నా జ్ఞానస్నాన సమయంలో పొందిన జ్ఞానస్నాన పవిత్రతను నేను ఏనాడు కూడ కోల్పోకుండా, ఇప్పటి వరకు తిరుకుటుంబ సంరక్షణలో జీవించానని గట్టిగా చెప్పగలను. నాలాగే మీరు కూడా తిరుకుటుంబమునకు సమర్పించుకొని, వారిపై ఆధారపడి జీవించండి. దైవచిత్తమునకు సర్వదా తలయొగ్గి జీవించండి. దివ్య మందసంలో వేంచేసియున్న సత్ప్రసాద ప్రభువును అంటిపెట్టుకుని, ప్రభువునకు ప్రియంగా, ఇష్టులుగా జీవిస్తూ, ప్రభుని జీవమును సమృద్ధిగా పొందండి. మీకు ఇక ఏ కొదువయు ఉండదు.'' కురియాకోస్ దైవ కృపలో జీవించి, ప్రజలకు పుణ్యజీవపు బాటలు వేసి, గురువులకు, మఠ కన్యలకు ప్రార్థనలో దైవ ప్రసన్నతను పొంది జీవించ, చక్కని ఆదర్శాన్ని ఒసగి, కొచ్చిన్‌కు సమీపంలో ఉన్న కూనమ్మావు ఆశ్రమంలో జనవరి 3, 1871న పరలోక ప్రభుని సన్నిధి చేరుకున్నాడు. వారి పవిత్ర అవశేషాలను 1889లో మన్ననం లోని పునీత జోజప్పగారి ఆశ్రమానికి తరలించి, సమాధి చేశారు.

కురియాకోస్ మరణానంతరం వారి వేడుదల మూలంగా పలు స్వస్థతలు, వివిధ అద్భుతాలు జరుగుతున్నాయి. సిస్టర్ అల్ఫోన్సాకు 1936లో రెండు సార్లు కనబడి, ఆమెకు సంపూర్ణ స్వస్థత కలుగజేశారు. రెండవ జాన్‌పాల్ జగద్గురువులు కురియాకోస్‌ను ఏప్రిల్ 7, 1984న 'దైవసేవకులు'గా, ఫిబ్రవరి 8, 1986న కొట్టాయంలో ''ధన్యులు'' గా ప్రకటించారు. వారిని ఫ్రాన్సిస్ జగద్గురువులు రోమాపురిలో నవంబరు 23, 2014న ''పునీతులు''గా ప్రకటించారు. వారి పండుగ సిరో-మలబారు సంప్రదాయంలో జనవరి 3న, రోమన్ కతోలిక సంప్రదాయంలో ఫిబ్రవరి 18న జరుపుతున్నారు.





## మద్రాసు, ఫిరంగిపురం అన్నాంబ మఠ స్థాపకులు

# 12. దైవ సేవకులు తాటిపత్రి జ్ఞానమ్మ

**(1822-1874)**

ఫాదర్ బెల్లంకొండ ఇన్నాశ శౌరయ్య, S.J.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా యందలి ఫిరంగిపురం గ్రామానికి తెలుగు కతోలిక చరిత్రలో ప్రముఖ స్థానం ఉంది. తాటిపత్రి జ్ఞానమ్మ తెలుగు కతోలిక శ్రీసభకు మూలరాయిగా గణుతికెక్కిన ఫిరంగిపురం గ్రామమందు 1822లో గాలి రాయన్న, మరియమ్మలనే ఆదర్శ దంపతులకు రెండవ సంతానంగా జన్మించింది. గాలి రాయన్న చక్కని విశ్వాసపరుడు. దైవభక్తి గలవాడు. అతడు బాల్యం నుండి అక్కడి విచారణ గురువులకు ఎల్లప్పుడు చేదోడు వాదోడుగా ఉండేవాడు. అతని భక్తి తత్పరతలు, సేవాదృక్పథం గమనించిన గురువులు, రాయన్నను దేవాలయ ఉపదేశిగా నియమించారు. జ్ఞానమ్మ తన తండ్రి రాయన్న ఆదర్శ జీవితాన్ని గమనించి, చిన్నప్పటి నుండియే తండ్రి అడుగు జాడలలో నడిచి, ప్రభు యేసుని నిండుగా అనుసరించింది. ఆమె తల్లి మరియమ్మ, జ్ఞానమ్మను చిన్ననాటి నుండే దేవమాత యెడల భక్తి ప్రపత్తులతో, గురువుల యెడల వినయ విధేయతలతో పెంచింది.

ఫ్రాన్సు దేశానికి చెందిన జేసుసభ గురువులు 1699లో పాండిచ్చేరిని కేంద్రంగా చేసుకుని భారతావనిలో యేసుప్రభుని, వారి బోధలను ప్రకటించాలనే తలంపుతో ''కర్ణాటక మిషన్'' అను వేదప్రచార సంస్థను స్థాపించారు. వారు భారతీయ సంప్రదాయాలను గౌరవిస్తూ, స్థానిక భాషలను నేర్చుకుని, శాకాహారము భుజిస్తూ, మద్యానికి దూరంగా ఉంటూ, ఉపవాసాలు చేస్తూ, ప్రభు యేసుని సువార్తను బోధించారు. తెలుగు మిషన్ పేరిట పలు ప్రాంతాలలో కతోలిక సంఘాలను ఏర్పాటు చేసి, కతోలిక శ్రీసభ స్థానికంగా గట్టి పునాదిపైన వేళ్ళూనుకొనేలా చేశారు. ఆనాటి పుణ్యమూర్తులైన జేసుసభ గురువులు సంజీవ నాథ స్వామి (1671-1738), సత్యబోధ స్వామి (1693-1740), జార్జియో మనంతె (1740-1812) గురువులను తెలుగు శ్రీసభ స్థాపకులుగా పేర్కొనవచ్చు. వారు పుంగనూరు, కృష్ణాపురం, చిన్న బల్లాపురం, దేవనహళ్ళి మున్నగు గ్రామాలను స్థావరాలుగా చేసుకుని, సువార్తను ప్రచారం చేశారు. వారిలో సంజీవనాథ స్వాముల వారు 1702లో భీమిశెట్టి రంగప్పను, 1715లో తుమ్మా హనుమంతరెడ్డిని క్రైస్తవ ధర్మంలోనికి స్వీకరించారు. సత్యబోధస్వామి గురువులు గాలి (పొతకమూరి) అన్నమ్మకు కతోలిక జ్ఞానస్నానమిచ్చి, యేసుప్రభుని శిష్యులుగా స్వీకరించారు.

తదనంతర రాజకీయ అస్థిరత మూలంగా, కరువు కాటకాల వలన క్రైస్తవులు, జేసుసభ గురువుల సలహామేరకు గోపు లింగారెడ్డి నాయకత్వంలో నెల్లూరు సీమకు చెందిన వెంకటగిరి, బుక్కాపురం, పెద్దారికట్ల మున్నగు ప్రాంతాలకు వలస వెళ్ళారు. మరి కొందరు గుంటూరు సీమ నందలి ఓలేరు, ముట్లూరు, ఫిరంగిపురం, రావిపాడు, రెంటచింతల, పాటిబండ్ల, సిరిపురం మున్నగు గ్రామాలలో స్థిర నివాసమేర్పరచుకున్నారు. 1773లో ఐరోపా ఖండ రాజకీయ కుట్రలో భాగంగా జేసుసభను పాపుగారు నిషేధించారు. బాల్యారిష్టాలు దాటిన తెలుగు శ్రీసభకు, కతోలికులకు ఆ నిషేధం పెద్ద శరాఘాతంగా మారింది. తెలుగు కతోలికుల ఆలనా పాలనా చూసే గురువులు సంపూర్ణంగా కనుమరుగయ్యారు. దాని ఫలితంగా పలు సంవత్సరాల పాటు గురువులు లేకుండా తెలుగు శ్రీసభ తల్లిలేని బిడ్డలా, అనాధలా తయారయ్యింది. "కర్ణాటక మిషన్" స్థానే పారిస్‌కు చెందిన విదేశీ ప్రచార సంస్థ (M.E.P.) ఏర్పడి, 1778 నుండి 1843 వరకు, 65 సంవత్సరాల బాటు వేదవ్యాపక కార్యాన్ని కడుశ్రద్ధతో కొనసాగించింది. ఫ్రెంచి విప్లవ కారణంగా ఆ రోజులలో గురువుల కొరత తీవ్రంగా ఉంది. 1778 నుండి 1793 సంవత్సరాల మధ్యలో ఒక డజను మంది గురువులు మాత్రమే భారతదేశానికి వచ్చారు. వారిలో ముగ్గురు గురువులు మాత్రమే విశాలమైన తెలుగు భూభాగంలో కతోలిక విశ్వాసుల పరిచర్య చేశారు.

జేసుసభ అణచివేత అనంతరం కర్ణాటక మిషను ప్రాంతాన్ని మద్రాసు-మైలాపూరు పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఉంచారు. 1802 నుండి 1818 వరకు కర్ణాటక మిషన్‌లో తెలుగువారి మధ్య పనిచేస్తున్న గురువుల సంఖ్య చాలా స్వల్పంగా ఉంది. గురువులు సుదూర ప్రాంతాలలో ఉన్న క్రైస్తవ గ్రామాలన్నీ తిరిగి, దివ్య పూజాబలులు సమర్పించి, ప్రజల యొక్క ఆత్మీయ మేలులు తీర్చుటకు అంతగా సాధ్యపడలేదు. పాండిచ్చేరి నుండి గుంటూరు, నెల్లూరు, అనంతపురం ప్రాంతాలలోని గ్రామాల సందర్శనకు చాలా అంతరాయం ఏర్పడింది. ఒక సందర్శనకు మరో సందర్శనకు చాలా నెలల విరామాలు ఏర్పడ్డాయి. ఆ రోజులలో ఆ ప్రాంతంలో ఎటువంటి విపత్తులు వచ్చినా, ఆపదలు వచ్చినా, అవి వారు క్రైస్తవులైనందునే వచ్చాయని, వారి బంధువులే వారిని సూటిపోటి మాటలనేవారు. నిందించేవారు. ఆనాటి సామాజిక పరిస్థితుల వలన, పరనిందల వలన, గురువులు తరచుగా రానందున, క్రైస్తవుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

ఫిరంగిపురం దాదాపు 1800 సంవత్సరంలో ఒక ప్రముఖ తెలుగు కతోలిక మిషన్ కేంద్రంగా రూపొందింది. అప్పట్లో ఆ గ్రామంలో 400 మంది కతోలికులున్నారు. గ్రామ జనాభాలో మూడింట రెండు వంతులు కతోలికులే. బోనాండు గురువులు 1827లో కర్ణాటక మిషన్ క్రైస్తవుల బాధ్యతలు స్వీకరించారు. వారు ముందుగా డిసెంబరు మాసంలో ఫిరంగిపురం గ్రామం వచ్చారు. వారి రాకడకు మునుపు ఫిరంగిపుర ప్రాంత

కతోలికులకు ఆధ్యాత్మిక సేవలు సరిగా జరగనందున, క్రైస్తవుల విశ్వాసం కొద్దిగా సన్నగిల్లుతూ వచ్చింది. అప్పటి గురువులు పలువురు ఉపదేశులను నియమించి, వారిని సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఉంచారు. ఆ ఉపదేశులు తాము నేర్చుకున్న జపములను, విశ్వాస సత్యాలను ప్రజలకు నేర్పేవారు. గుడ్డిలో మెల్ల మేలన్నట్లు, వారు పాక్షికంగా క్రైస్తవుల ఆధ్యాత్మిక అవసరాలను తీరుస్తూ, దివ్యసంస్కారాలకు భక్తులను సిద్ధం చేస్తూ, గురువులు లేని కొరతను కొంతవరకు పూడ్చారు. ఆనాటి ఉపదేశులు స్వతహాగా దైవగ్రంథ సారాన్ని గ్రహించి, దైవ వాక్కును బోధించేంత స్థాయికి ఆ రోజులలో ఎదగలేదు. అట్టి చారిత్రక నేపథ్యంలో జ్ఞానమ్మ తండ్రి రాయన్న ఫిరంగిపురం గ్రామ ఉపదేశి బాధ్యతను ఒక సవాలుగా తీసుకుని, ఫిరంగిపుర గ్రామ క్రైస్తవుల విశ్వాస వికాసం కోసం తన శాయశక్తులా కృషి చేశాడు.

ఫిరంగిపురం నందు ఆ సమయంలో తాటిపత్రి వారి వంశంలో హిందూ ధర్మానికి చెందిన ఓ యువ దంపతులున్నారు. వారికి ఒక బాలుడు జన్మించగా, అతనికి వీరప్ప అను పేరు పెట్టుకున్నారు. వీరప్ప ఏడేండ్ల వయస్సులో ఉండగా తండ్రి అకస్మాత్తుగా మరణించాడు. ఆ కుటుంబ పరిస్థితి అగమ్య గోచరమైంది. అట్టి క్లిష్ట పరిస్థితులలో వీరప్ప తల్లి, ప్రభుయేసుని శరణు జొచ్చింది. ప్రభుని నిండుగా విశ్వసించింది. ఆమెను బంధువర్గం ఎంత వ్యతిరేకించినా వినకుండా, కతోలిక జ్ఞానస్నానం స్వీకరించి, శ్రీసభ సభ్యురాలైంది. తన కుమారుడైన వీరప్పకు జ్ఞానస్నానమిప్పించి, పునీత ఇన్యాశి వారి పేరట ఇన్నయ్య అను నామకరణం చేసింది. స్వయంగా తాను మరియమ్మ అను పేరు స్వీకరించింది. క్రైస్తవ మత స్వీకారంతో, ఏ ఆలంబన లేని ఆ విధవరాలి కుటుంబానికి మరిన్ని కష్టాలు ఎదురయ్యాయి. ఇరుగు పొరుగువారు మరియమ్మను ఈసడించటం, ఆడిపోసుకోవడం ప్రారంభించారు. బంధువులు ఆమెను నిందించారు. ఉన్న కొద్దిపాటి ఆస్తులను ధ్వంసం చేసి, ఆమెను ఏకాకిని చేశారు. అయినా మరియమ్మ విశ్వాసం ఏ మాత్రం చెక్కు చెదరలేదు. ఈ లోక సంపదలు నశించినా, ఆమె పరలోక సంపదలను కూడబెట్టుకోవాలని, ప్రభు యేసుని నిండు విశ్వాసంతో కొలవాలని స్థిర నిశ్చయాని కొచ్చింది. మరియమ్మ తాను పుట్టి పెరిగి, మనువాడిన ఫిరంగిపురాన్ని వీడి, ఎక్కడో నాలుగు వందల మైళ్ళ దూరాన ఉన్న పాండిచ్చేరికి తన కుమారుడు ఇన్నయ్యతో పయనమైంది. అక్కడకు వెళ్ళి ఒక మఠకన్యల మఠంలో ఆశ్రయం పొంది, తలదాచుకుంది. తన పుత్రుడు ఇన్నయ్యను అక్కడే ఉన్న పాఠశాలలో చేర్చింది. పాండిచ్చేరి పట్టణం మొదటి తరమునకు చెందిన తెలుగు క్రైస్తవులు వీరేయని చెప్పవచ్చు.

పాండిచ్చేరి పట్టణం తెలుగు వారికి క్రైస్తవ ప్రబోధం చేసిన కర్ణాటక మిషనుకు ప్రధాన కేంద్రం. అది ఫ్రెంచి వారిచే నూతనంగా నిర్మించబడ్డ పట్టణం. అక్కడ ప్రతి నిత్యం కతోలిక దేవాలయాలలో దివ్యపూజా బలులు, జపమాల ప్రార్థనలు జరిగేవి.

మరియమ్మ, ఇన్నయ్యలు అక్కడే చక్కని కతోలిక సంప్రదాయంలో నడుస్తూ, ప్రభు యేసునికి ప్రియశిష్యులుగా ఎదిగారు. ఇన్నయ్య కష్టపడి, తన ఉన్నత చదువులలో చక్కగా రాణించాడు. ప్రాయం పెరిగే కొలది, ఇన్నయ్యలో దైవభక్తి దినదిన ప్రవర్థమానమైంది. విదేశాల నుండి పాండిచ్చేరికి వచ్చిన గురువులకు ఇన్నయ్య తెలుగు నేర్పడంలో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. అదే వరవడిలో ఆంగ్లం, ఫ్రెంచి, లతీను భాషలలో ఉన్న ఆధ్యాత్మిక మరియు ప్రార్థనా పుస్తకాలను తెలుగు లోనికి అనువదించాడు.

ఇన్నయ్య నూనూగు మీసాల వయస్సుకు వచ్చాడు. అతనికి తన స్వంత ఊరైన ఫిరంగిపురం గ్రామాన్ని చూసి రావాలనే తలంపు కలిగింది. కాని అతని తల్లి మరియమ్మ దానికి సమ్మతించలేదు. వారి మధ్యలో కొద్దిపాటి సంవాదం, ఘర్షణ జరిగాయి. ఇన్నయ్య చివరకు తన మాట నెగ్గించుకుని, సుదూరంగా ఉన్న ఫిరంగిపురం వెళ్ళాడు. అతనిలోని ఆధ్యాత్మిక చురుకుదనం, దైవభీతి, బహు భాషా జ్ఞానం చూసిన విచారణ గురువు ఇన్నయ్యను దేవాలయంలో ప్రార్థనలు నిర్వహించ సహాయపడటానికి ఉపదేశిగా నియమించాడు. పాండిచ్చేరిలో ఇన్నయ్య నేర్చిన విద్య తనకు, ఫిరంగిపురం కతోలిక సంఘానికి ఎంతగానో ఉపయోగపడింది. ఇన్నయ్యలోని అంకిత భావం, పూజాదికాలలో శ్రద్ధ, గురువుల పట్ల వినయ విధేయతలు గమనించిన గ్రామస్థులు అతనిని ఎంతో మెచ్చుకున్నారు. కొందరైతే అతనిని తమ ఇంటి అల్లుణ్ణి చేసుకోవాలని ఉబలాడ పడ్డారు. గాలి రాయన్న, మరియమ్మ దంపతులకు కూడ ఇన్నయ్య ప్రవర్తన, నడవడిక చక్కగా నచ్చింది. నచ్చిందే తడవుగా పదిహేనేళ్ళ ప్రాయంలో ఉన్న తమ కూతురు జ్ఞానమ్మను ఇన్నయ్యకు ఇచ్చి వివాహం జరిపించటానికి ముందుకు వచ్చారు. 1837లో తాటిపత్రి ఇన్నయ్య, జ్ఞానమ్మలు దైవానుగ్రహంతో ఫిరంగిపురం దేవాలయంలో పవిత్ర వివాహ బంధమందు ఒక్కటయ్యారు.

ఇన్నయ్య ఫిరంగిపురం దేవాలయంలో దైవార్చన కార్యక్రమాలలో సహాయం చేయడమేగాక, విచారణ గురువు వెంట అన్ని గ్రామాలు తిరిగి, క్రైస్తవుల ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేశాడు. పిల్లలకు, పెద్దలకు ప్రార్థనలు నేర్పించాడు. కతోలిక మత సత్యాలను, సంక్షేపమును వారిచే వల్లె వేయించాడు. లతీను పూజా ప్రార్థనలు కంఠతా పట్టించాడు. లతీను పూజా పాటలను కూడ పెద్దలకు, యువకులకు నేర్పించాడు. ఇన్నయ్య, జ్ఞానమ్మలకు దైవాశీస్సులతో అయిదుగురు సంతానం కలిగారు. చివరి సంతానం శౌరయ్య పుట్టిన తరువాత, 1858లో ఇన్నయ్య, విచారణ గురువుతో కలిసి, మద్రాసులో కతోలిక పీఠాధిపతులుగానున్న జాన్ ఫెన్నెల్లి గారిని కలవటానికి ప్రయాణమయ్యాడు. కాని ఇన్నయ్యకు మార్గంలో హఠాత్తుగా కలరా వ్యాధి సోకి, పెనుగొండ అను గ్రామంలో కన్నుమూశాడు. అప్పటికి జ్ఞానమ్మ వయస్సు 37 ఏండ్లు

మాత్రమే. పిడుగుపాటులా అతి చిన్న వయస్సులోనే జ్ఞానమ్మకు వైధవ్యం దాపురించింది. అయినా ఆమె అధైర్యపడలేదు. నిరాశపడ లేదు. ఆమె ప్రభునిపై నిండు విశ్వాసం ఉంచింది. తన కుటుంబ భారాన్ని, తన బిడ్డల భవిష్యత్తును ప్రభుని చేతులలో ఒప్పగించి, ''తన ఆలనా పాలనా, తన కుటుంబ భారమంతా మీదే''యని కరుణామయుడైన యేసుక్రీస్తుని వేడుకుంది.

జ్ఞానమ్మ ఇరవై సంవత్సరాలు మాత్రమే వైవాహిక జీవితం జీవించింది. తుఫానులా విరుచుకు పడ్డ వైధవ్యాన్ని మోస్తూ, ఆమె స్వగ్రామమైన ఫిరంగిపురంలోనే రెండేళ్ళపాటు కాలం గడిపింది. ఆ సమయంలో ఆమె విశ్వాసంలో మరింత బలాన్ని పుంజుకుని, దేవునిపై అపార నమ్మకం కలిగి జీవించింది. ఒక్క చేత్తో అయిదుగురు బిడ్డల పోషణ చేయడం ఒంటరి పక్షియైన జ్ఞానమ్మకు చాల కష్టమైన పనే. ఆమె కష్టాలను, కడగండ్లను చూసిన విచారణ గురువు మరియు జాన్ ఫెన్నెల్లి పీఠాధిపతులు ఆమెకు చేదోడు వాదోడుగా ఉంటూ, కొంత ఆర్థిక సహాయం చేస్తూ వచ్చారు. ఆ సమయంలోనే ఆమె దైవసేవ చేయాలని, దైవసేవకే తన జీవితమంతా అంకితం కావాలని, ఆమె హృదయంలో ఒక చిన్న ఆశ కలిగింది. తన ఆశను, ఆశయాన్ని ప్రభుని ముందుంచి, జ్ఞానమ్మ చిత్తశుద్ధితో రేయింబగళ్ళు ప్రార్థించింది. దైవ సేవలో తన శేష జీవితం కడపాలనే ఆశయం కాలక్రమేణా దృఢ సంకల్పంగా మారింది. తమ తల్లి ప్రార్థనా జీవితాన్ని గమనించిన తన అయిదుగురు కుమారులు కూడ, ఒకరి వెంట ఒకరు గురువులు కావాలనే కోరికను వెల్లడించారు. దానితో వారిని దైవ సేవకులుగా, ప్రభుని యాజకులుగా సేవలందించమని గురు శిక్షణకు పంపి, తన బిడ్డల కొరకు అనునిత్యం ప్రార్థించింది. ఒక తల్లిగా తన బిడ్డల బాధ్యతలు మోస్తూ, వారి గురుత్వ అంతస్తు చేరుకోవటానికి తన ప్రార్థనా సహాయం, మాట సహాయం అందిస్తూ, జ్ఞానమ్మ తన మదిలోని కలలను కార్య రూపంలో పెట్టేందుకు కృతనిశ్చయంతో అడుగులు ముందుకు వేసింది.

1859 లో జ్ఞానమ్మ తన స్వగ్రామాన్ని వీడి, మద్రాసు చేరుకుని పీఠాధిపతులైన జాన్ ఫెన్నెల్లి గారిని కలుసుకుంది. వారితో తన బాగోగులను ముచ్చటించింది. దైవ సేవకే సంపూర్ణంగా అంకితం కావాలన్న తన మనసులోని కోర్కెను వారి ముందు ఉంచింది. ఆమె అయిదుగురి కుమారులు గురుశిక్షణలో వేరు వేరు దశలలో ఉన్నారు. ఫిరంగిపురం నుండి వచ్చి, వారిని పరామర్శించాలంటే చాల వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. కాబట్టి మద్రాసు పరిసర ప్రాంతాలలో ఆమెను నివాసమేర్పరచుకొమ్మని పీఠాధిపతులు సలహా ఇచ్చారు. మద్రాసు ప్రాంతం ఆమెకు బొత్తిగా కొత్త. తెలిసిన వాళ్ళెవరూ లేరు. కనుక ముందుగా తంజావూరు వెళ్ళి, బృహదీశ్వర ఆలయానికి సమీపాన ఉన్న ఓ ఇంట్లో స్వల్ప కాలం నివాసముంది. పిమ్మట మద్రాసుకు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎరయూరు అను గ్రామంలో తన బంధువులున్నారని తెలిసి, అక్కడకు

వెళ్ళి కొంతకాలం అక్కడ నివశించింది. ఎరయూరు నుండి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కిలచేరికి, ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా వెళ్ళి, ఉదయం దివ్యపూజా బలిలో, సాయంత్రం జపమాల, దివ్యసత్ప్రసాద ఆశీర్వాదములో పాల్గొనేది. అలా కొంతకాలం కాలి నడకన కిలచేరి వెళ్ళి, కడు నిష్ఠతో తన ఆత్మ కార్యములు తీర్చుకునేది. అక్కడి గురువులను సంప్రదించి, వారి సలహాలు స్వీకరించింది. కిలచేరిలో ఉన్నచో ప్రతిదినము దివ్యపూజలో పాల్గొనవచ్చని, మరియు గురువుల ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో ముందుకు నడవవచ్చని తలంచింది. కనుక ఆరు మాసాలలోనే ఎరయూరుకు స్వస్తి చెప్పి, 1860 డిసెంబరులో కిలచేరి గ్రామానికి తన నివాసం మార్చింది. కిలచేరి గ్రామం మద్రాసుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. కనుక అప్పుడప్పుడు వెళ్ళి, తన కుమారులను పరామర్శించి, వారి దైవ పిలుపుల్లో ప్రోత్సాహించింది. పితృసమానులైన ఫెన్నెల్లి పీఠాధిపతులతో తన వ్యక్తిగత ఆధ్యాత్మికతను, పవిత్రాత్మ ప్రేరణను పంచుకుని వారి సహాయంతో, ప్రభుని అతి సన్నిహితంగా అనుసరించ జ్ఞానమ్మ ప్రయత్నించింది.

కిలచేరి గ్రామమంతా తెలుగు వారే. అందరూ కతోలికులే. వారి విచారణ గురువు ఆరోగ్యనాథర్ గారు. వారంతా ఎనభై సంవత్సరాల ముందు జార్జియో మనంతె అను జేసుసభ గురువుల ఆధ్వర్యంలో గుంటూరు సీమ నందలి ఓలేరు నుండి వలస వచ్చినవారే. వారంతా ఎన్నో దశాబ్దాలుగా క్రీస్తు ప్రభుని అనుకరిస్తున్న గట్టి విశ్వాసులే. అయినా ఆ గ్రామం చాలా వెనుక బడిన ప్రాంతం. కనీస ప్రాథమిక సౌకర్యాలు కూడా లేని గ్రామం. అక్కడి ప్రజలంతా నిరక్షరాస్యులే. చదువంటే ఆ గ్రామస్తులకు గాని, ఆ చుట్టు ప్రక్కల కతోలిక గ్రామాలకు గాని తెలియదు. ఇక ఆడవాళ్ళకు చదువులంటే "అమ్మో" అని ఆశ్చర్యంతో నోరెళ్ళ బెట్టే రోజులు. ఆ గ్రామంలో ఫ్రాన్సీసు వారి సభకు చెందిన ఒక మఠం ఉంది. ఆ గురువులు బాలుర కోసం కిలచేరిలో ఒక ప్రాథమిక పాఠశాల స్థాపించి నడిపిస్తున్నారు. కతోలిక విశ్వాస సత్యాలను, ప్రార్థనలను విద్యార్థులకు నేర్పాలని ఆమె ముందుకు వచ్చింది. జ్ఞానమ్మ ఆ పాఠశాలలో సత్యోపదేశం బోధించి, చిన్నారి బిడ్డలను చక్కని ఆధ్యాత్మిక బాటలో నడిపింది. చదువు విషయంలో బాలికల పట్ల నిర్లక్షభావాన్ని చూపి, బాలురకు మాత్రమే విద్యను బోధించటం ఆమెను మహా క్షోభకు గురిచేసింది. బాలికా విద్యను ప్రోత్సహించాలన్నది ఆమె చిరకాల కోరిక. బాలికల దుస్థితి, బాలికల పట్ల వివక్ష, కళ్ళకు కట్టినట్లు స్పష్టంగా ఆమెకు కనిపించింది. అది ఆమెను ఎక్కువగా కలవరపరచింది. ఆ వివక్ష నుండి బాలికలను తప్పించాలని జ్ఞానమ్మ ఓ నిర్ధారణకు వచ్చింది. దేవుడే తనను ఓ ప్రత్యేక కార్యాన్ని సాధించడం కోసం కిలచేరికి రప్పించారని జ్ఞానమ్మ దృఢంగా నమ్మింది. కిలచేరిలో బాలికల కోసం ప్రత్యేక పాఠశాలను స్వయముగా స్థాపించాలని సంకల్పించింది. జ్ఞానమ్మ తన ఆత్మలో కలిగిన ప్రేరణను తన ఆధ్యాత్మిక గురువులైన ఆరోగ్యనాథర్ గురువులకు తెలియజేసింది. ఆమె మనోగతాన్ని

తెలుసుకున్న గురువులు, ఆమె సత్సంకల్పానికి ఎంతో సంతోషించారు. తాను వెతుకుతున్న తీగె తన కాలికే తగిలిందని, తాను కూడా అదే యోచనలో ఉన్నానని, సరైన వ్యక్తికోసం తాను వెతుకుతున్నానని ఆరోగ్యనాథర్ గారు తన జ్ఞానబిడ్డయైన జ్ఞానమ్మకు తెలిపి, ఆమెను ప్రోత్సహించారు. బాలికల పాఠశాల స్థాపనకు ఆ గురువు సహాయ సహకారాలు అందించటానికి ముందుకు రావడంతో, జ్ఞానమ్మ బహుగా సంతోషించింది.

ఆ రోజుల్లో పాఠశాల స్థాపించడమంటే అంత సులభం కాదు. అది ఎంతో కష్టాలమయం, ఇబ్బందుల పయనం. పాఠశాల నిర్మాణం కోసం ముందుగా స్థలాన్ని సేకరించాలి. అది ఖర్చుతో కూడుకున్న పని. అయినా జ్ఞానమ్మ దానికి సిద్ధపడింది. వెనువెంటనే 1862లో జ్ఞానమ్మ తన స్వగ్రామం ఫిరంగిపురం వెళ్ళింది. అక్కడ ఆమె తనకున్న ఆస్తులన్నీ అమ్మింది. ఆ డబ్బుతో కిలచేరి వెళ్ళి, పాఠశాలకు అవసరమైన స్థలం కొన్నది. భవన నిర్మాణానికి కొంతమేరకు ప్రజల నుండి విరాళాలు స్వీకరించింది. జ్ఞానమ్మ దైవాశీర్వాదంతో కిలచేరిలో మే 3, 1863న పునీత క్లారమ్మ గారి పాఠశాలను ప్రారంభించింది. ఆ రోజులలో బాలికల కోసం ఒక మహిళచే స్థాపించబడిన మొట్టమొదటి పాఠశాల అదేనని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఆ పాఠశాల ద్వారా సాధారణ విద్యతో పాటు, యేసుప్రభుని బోధలను అందించి, సత్యోపదేశము నేర్పించి, క్రైస్తవ విలువలతో బాలికలను పెంచి, పెద్ద చేయాలని తాడిపత్రి జ్ఞానమ్మ సదాశయం. తదనుగుణంగా బాలికల కతోలిక విశ్వాస వికాసానికి తన పాఠశాల మాధ్యమంగా జ్ఞానమ్మ తన శాయశక్తులా కృషిచేసి, శ్రీసభ ముద్దుబిడ్డగా గణుతి కెక్కింది. కిలచేరి దేవాలయ అధికార జ్ఞానస్నాన రిజిస్టరు ప్రకారం 37 మంది కతోలిక బిడ్డలకు జ్ఞానమ్మ జ్ఞానతల్లియై, ఆ బిడ్డలను కతోలిక విశ్వాసంలో పెంచింది.

జ్ఞానమ్మ చేస్తున్న దైవసేవను, విద్యాసేవలను కళ్ళారా గాంచిన యువతులు కొందరు, పాఠశాల ఉపాధ్యాయినులుగా, వసతి గృహ సహాయకులుగా సేవలందించ ముందుకు వచ్చారు. 1864లో ఇరవై ఎనిమిదేళ్ళ వయస్సులో నున్న అగతమ్మ అను విధవరాలు, 1866లో పదిహేనేళ్ళ ప్రాయంలో వసతి గృహంలో విద్య నిమిత్తం చేరిన అరుళమ్మ అను వారిద్దరు జ్ఞానమ్మ దైవాంకిత జీవితానికి తొలుదొల్త ఆకర్షింపబడ్డారు. వారిద్దరు మఠకన్యలు కావాలని నిర్ణయించుకుని, 1871లో జ్ఞానమ్మకు ఆ విషయాన్ని తెలిపారు. అది విని జ్ఞానమ్మ ఎంతో సంతోషించింది. ఒక మఠసభను స్థాపించి దైవసేవ చేయాలన్న తలంపు ఎంతో కాలం నుండి ఆమె మదిలో ఉంది. కాబట్టి వెంటనే జ్ఞానమ్మ తన ఆధ్యాత్మిక గురువైన ఆరోగ్యనాథర్ గారితో మఠసభ స్థాపన విషయం చర్చించింది. వారి సలహా మేరకు మద్రాసు వెళ్ళి, సభ స్థాపనకు పీఠాధిపతులు స్టీఫెన్ ఫెన్నెల్లి గారి అనుమతి పొందింది. జ్ఞానమ్మ స్వయముగా అగతమ్మ, అరుళమ్మలకు కొంతకాలం కిలచేరి నందే మఠ జీవితంలో, ప్రార్థనలో ప్రాథమిక శిక్షణ ఇచ్చింది. ఆ సమయంలో

ఆరోగ్యనాథర్ గురువులు కిలచేరి నుండి బళ్ళారి విచారణకు బదిలీ అయ్యారు. దాంతో జ్ఞానమ్మ ఏకాకి అయింది. అప్పుడు జ్ఞానమ్మ మరింత విశ్వాసంతో ప్రార్థించింది. ఆరోగ్యనాథర్ గురువుల సలహాపై వారిద్దరిని తదనంతర మఠకన్యల శిక్షణ కోసం ముఖ్యంగా నొవిషియేట్ శిక్షణ కోసం, 1873 ఆగస్టులో బళ్ళారిలోని గుడ్‌షెపర్డ్ మఠకన్యలు నిర్వహిస్తున్న పునీత అన్నమ్మగారి నొవిషియేట్‌లో చేర్చింది. వారిద్దరు ఎంతో శ్రద్ధతో మఠ జీవితంలో, దైవ చింతనలో శిక్షణ పొందారు. శిక్షణానంతరం బళ్ళారిలో అక్టోబరు 4, 1874న అరుళమ్మ సిస్టర్ అంజెలా నామధేయాన్ని, అగతమ్మ సిస్టర్ ఫిలోమినా నామధేయాన్ని స్వీకరించి, మఠకన్యలుగా పేదరికము, బ్రహ్మచర్యము, విధేయత అను ప్రమాణాలు చేసి, సంపూర్ణంగా తమ్ముతాము ప్రభుయేసునకు సమర్పించుకున్నారు. పిమ్మట వారు అక్టోబరు 18న కిలచేరి చేరుకున్నారు. వారు తిరిగి వచ్చిన వెంటనే, ఫెన్నెల్లి పీఠాధిపతులు సిస్టర్ అంజెలాను నూతన కన్యల మఠమునకు మఠాధికారిణిగా నియమించారు. దీనితో ఎంతోకాలం మఠసభ స్థాపించి, దైవసేవ చేయాలనే జ్ఞానమ్మ కల నిండుగా ఫలించింది. ఆవిధంగా పునీత అన్నమ్మగారి మఠకన్యల సభ అధికారికంగా కిలచేరిలో స్థాపించబడింది. ఈ నూతన మఠసభ కన్యలు బళ్ళారిలో ఉన్న పునీత అన్నమ్మ గారి మఠ నియమ నిబంధనలను కొంత కాలం పాటించారు.

ఒక సాధారణ కతోలిక విశ్వాసి చేసిన మానవ ప్రయత్నానికి దైవానుగ్రహం తోడైంది. కాబట్టి కిలచేరిలో పునీత అన్నమ్మగారి మఠకన్యల సభ ఏర్పడింది. దానిని పెంచి పోషించాల్సిన గురుతర బాధ్యత జ్ఞానమ్మపై ఉంది. మఠ కన్యల సభను అటు ఆధ్యాత్మికంగా ముందుకు నడపాలి, ఇటు ఆర్థికంగా పటిష్టపరచాలి. కిలచేరి గ్రామ కతోలికులు సన్నకారు వ్యవసాయదారులు. అయినా వారు మఠకన్యల సభ అను దైవ కార్యానికి తమ శక్తికి మించి ఆర్థిక సహాయం చేస్తూ, తమ తోడ్పాటు నందించారు. ఈ మఠకన్యల సభ నిలద్రొక్కుకునేందుకు ఇతర ప్రాంతాలలోని కతోలికుల సహాయం కూడా పొందాలని జ్ఞానమ్మ తలంచింది. గుంటూరు, కడప, కర్నూలు జిల్లాలలోని క్రైస్తవ గ్రామాలన్నీ పర్యటించి, అక్కడి కతోలికులందరికి సభ స్థాపన విషయం చెప్పి, అందులో తమ బిడ్డలను మఠకన్యలు కమ్మని మరియు వారి శిక్షణకై ప్రభుని పేరిట ఆర్థిక సహాయం చేయమని అర్థించింది. కతోలికులంతా పేదలైనప్పటికి, జ్ఞానమ్మను నిండుగా ఆశీర్వదిస్తూ, సహృదయంతో వస్తు రూపంలో, ధన రూపంలో విరాళాలు అందించారు విరాళాలుగా పోగుచేసిన డబ్బుతో, కిలచేరి సమీపాన గల 'మప్పేడు' గ్రామంలో మఠ సంస్థ కోసం 14 ఎకరాల సాగుభూమిని జ్ఞానమ్మ కొన్నది.

జ్ఞానమ్మ తన జీవితాన్ని సంపూర్తిగా ప్రభువుకు సమర్పించింది. ప్రభుని బిడ్డగా జీవించింది. ఎందరో కతోలిక విశ్వాసులకు ఆదర్శంగా నిలిచింది. సంసార సాగరాన్ని ఈదుతూ, దైవసేవ చేయవచ్చని ఆమె తన జీవితంలో నిరూపించింది. తనకున్న

ఆస్తిపాస్తులన్నీ అమ్మి, కతోలిక బాలికల శ్రేయస్సు కోసం కృషి చేసింది. వారికి సమాజంలో, శ్రీసభలో గౌరవాన్ని కల్పించటానికి, విద్యయనే ఆయుధం సమకూరుస్తూ పాఠశాల నెలకొల్పింది. దేవుని పూదోటలో నిరంతర శ్రామికురాలుగా, దైవరాజ్య స్థాపనలో తన భాగస్వామ్యం కూడా ఉండాలని తాటిపత్రి జ్ఞానమ్మ తనంత తానుగా పునీత అన్నమ్మ గారి మఠకన్యల సభను మారుమూల ప్రాంతమైన కిలచేరిలో స్థాపించింది. ఆ సభ శ్రేయస్సు కోరి విరాళాలు సేకరించ చేసిన సుదూర ప్రయాణాలలో ఆమె శరీరం అలసి పోయింది. అప్పటికే ఆమె ఇరవై యేండ్లపాటు ఉబ్బస వ్యాధితో బాధపడుతూ వచ్చింది. జ్ఞానమ్మ తన అంతిమ గడియలు దగ్గర పడ్డాయని, ప్రభుని ముఖాముఖి సందర్శించు కోబోతున్నానని గ్రహించింది. తాను స్థాపించిన అన్నమ్మ గారి మఠసభలో ఉన్న మఠ కన్యలను, శిక్షణలో ఉన్న యువతులను పిలిచి, "నా జ్ఞాన బిడ్డలారా! మీ పెద్దలకు ఎల్లప్పుడు విధేయించండి. ఆధ్యాత్మిక గురువుల సలహాలు నిండు హృదయంతో స్వీకరించండి. బాలికలకు విద్యనందించటమేగాక, దైవ బిడ్డలుగా తీర్చిదిద్ది, వారికి అండగా నుండటంలో మీరెప్పుడూ ముందు ఉండండి. దైవ ప్రేమను సోదర మానవులకు క్రియాపూర్వకంగా చూపించే మహిళామణులుగా వెలుగొందండి. మీరు ఇతరులకు ఆర్థిక భారంగా ఉండక, మీ కష్టార్జితంలో జీవించి, సబలలు అవ్వండి" అని వారికి తన చివరి సందేశమిచ్చింది. చివరిగా జ్ఞానమ్మ మంచి పాప సంకీర్తనం చేసి, వ్యాధిగ్రస్తుల స్వస్థతా అభ్యంగనాన్ని పొంది, పవిత్రాత్మ దేవుని వరములు పొందింది. తాటిపత్రి జ్ఞానమ్మ దేవుడు తనకప్పగించిన పనిని సంపూర్తి చేసి తన 52వ యేట డిసెంబరు 21, 1874లో కిలచేరి నందు పరమపదించింది. అప్పటి విచారణ గురువులు జె.యం. లేరోక్స్ గారు జ్ఞానమ్మ అంతిమ సంస్కారాలు నిర్వహించి, కిలచేరి గ్రామ సమాధుల స్థలంలో ఆమె భౌతిక కాయాన్ని భూస్థాపితం చేశారు.

"ఇదిగో! నేను మీ దాసిరాలను! మీ చిత్తమే నెరవేరునుగాక (లూకా 1:38) అని పలికిన మరియతల్లిని ఆదర్శంగా తీసుకుని తాటిపత్రి జ్ఞానమ్మ ప్రభుయేసుని నిండు మనస్సుతో, పరిపూర్ణంగా అనుసరించింది. తన బాల్యంలో ఒక కతోలిక బిడ్డగా ఒక ఉపదేశి కుటుంబంలో నిండు విశ్వాసంతో, దైవ భక్తితో ఎదిగింది. యుక్త వయస్సు రాగానే దైవసేవలో రాణిస్తున్న ఉపదేశి ఇన్నయ్యను వివాహమాడి, ఆదర్శ ధర్మపత్నిగా, సువార్తను ఆస్వాదిస్తూ, ఆచరిస్తూ ముందుకు నడిచింది. నాలుగు పదుల వయస్సు నిండక మునుపే ఆకస్మికంగా వైధవ్యం ప్రాప్తించినా, చింతించక, వగచెందక, అది దైవ నిర్ణయమని వినమ్రతతో తలయొగ్గింది. తన అయిదుగురు సంతానాన్ని ప్రభు సేవకు అర్పించగా వారిలో నలుగురు గురువులై ప్రభువు సేవ చేసారు. జ్ఞానమ్మ కుమారులలో పెద్ద కుమారుడు తోమాసురెడ్డి, మూడవ కుమారుడు మరియన్నరెడ్డి ఫ్రాన్సిస్‌వారి సభలో గురువులయ్యారు. వారిలో మూడవ కుమారుడు కిలచేరిలోనే 30

ఏండ్లప్రాయంలో మరణించాడు. నాలుగవ కుమారుడు శౌరయ్యరెడ్డి చెంగల్పట్టు మేత్రాసనంలో, అయిదవ కుమారుడు రాజనాథర్‌రెడ్డి మద్రాసు అతి మేత్రాసనంలో గురువులయ్యారు. రెండవ కుమారుడైన రాయపరెడ్డి తిరుచురాపల్లిలోని పునీత జోజప్పగారి కళాశాలలో చదువుకుని వివాహం చేసుకున్నాడు. అతని సంతానంలో ఇద్దరు పునీత అన్నమ్మగారి మఠంలో ప్రవేశించారు. ఉర్సులమ్మ మఠకన్యల శిక్షణలో ఉన్నప్పుడే మరణించగా, సిస్టర్ రీతమ్మ చాలాకాలం పనిచేసి, 1935లో మరణించింది. జ్ఞానమ్మ దివ్య పూజాబలులలో దైవ సాక్షాత్కారం పొందుతూ, అనుదిన పూజాబలి, ప్రభుని భోజనము తన ఆత్మకు ఎంతో అవసరమని గ్రహించింది. మరియతల్లి అడుగు జాడలలో నడుస్తూ జపమాల చేతబట్టి నిత్యము జపిస్తూ, దేవాలయం మరియు గురువులను తన జీవన కేంద్రంగా చేసుకుని తన విశ్వాస యాత్రను జ్ఞానమ్మ చక్కగా కొనసాగించింది. కతోలిక విశ్వాసం, కతోలిక వాతావరణంలో ఎదుగుతున్న బాలికలకు విద్యాదానం చేసి, విద్యనే ధనంగా ఒసగాలని, నిస్వార్థ బుద్ధితో తన ఆస్తిపాస్తులన్నిటినీ అమ్మి, బాలికల పాఠశాల నెలకొల్పిన మహాసాధ్వి జ్ఞానమ్మ. కతోలిక విలువలతో కూడిన దైవరాజ్యమనే మహాసౌధం నిర్మించాలని, దానికై గురువుల సలహాలు స్వీకరించి, కతోలిక మహిళామూర్తులకు చల్లని నీడనిచ్చే కల్పవృక్షం లాంటి పునీత అన్నమ్మ గారి మఠకన్యల సభను స్థాపించటం దైవానుగ్రహ పూరితురాలైన తాటిపత్రి జ్ఞానమ్మకే చెల్లింది. "దైవసేవకై సర్వం త్యజించు, దైవ వాక్కునే సదా ప్రకటించు, దైవరాజ్య స్థాపనలో సర్వవేళలా ముందుండు" అను మూడు సూత్రాల సమ్మిళితమే తాటిపత్రి జ్ఞానమ్మ విశ్వాస జీవితం.

తాటిపత్రి జ్ఞానమ్మ బాలికా విద్య ద్వారా కతోలిక శ్రీసభను బలోపేతం చేసి, గట్టి పునాది వేయాలని కిలచేరిలో పునీత అన్నమ్మగారి మఠసభను స్థాపించగా, నేడు ఆ సభ మద్రాసులోని మాధవరం కేంద్రంగా ఉండి పలు సేవలందిస్తోంది. అటులనే తాటిపత్రి జ్ఞానమ్మ అనే విశ్వాస వృక్షానికి పుట్టిన మరో స్వతంత్ర సంస్థ ఫిరంగిపురం కేంద్రంగా వెలసిన పునీత అన్నమ్మగారి మఠకన్యల సంస్థ. తన ఆదర్శ పుణ్య జీవితంతో తెలుగు శ్రీసభకు పెట్టని మణిహారంగా విలసిల్లిన తాటిపత్రి జ్ఞానమ్మ మధ్యస్థ ప్రార్థనల ద్వారా ఎన్నో అద్భుతములు జరుగుచున్నాయి. ఆమె పుణ్య జీవితమును అధికారికముగా గుర్తించిన శ్రీసభ, కిలచేరి గ్రామంలో సకల విశ్వాసుల సమక్షంలో మద్రాసు-మైలాపూరు అతిమేత్రాణులు జార్జి అంతోనిసామి గారు దివ్యపూజాబలి నిర్వహించి, మార్చి 21, 2014న తాటిపత్రి జ్ఞానమ్మను "దైవసేవకులు"గా ప్రకటించారు. అదే విధంగా ఆమె పుట్టి పెరిగిన ఫిరంగిపురంలోని బాలయేసు కతెడ్రల్ దేవాలయంలో జూన్ 4న గుంటూరు పీఠాధిపతులు గాలి బాలి గారు దివ్యబలి పూజ నిర్వహించి, తెలుగు గడ్డపై, తెలుగు బిడ్డయైన తాటిపత్రి జ్ఞానమ్మను 'దైవ సేవకులు'గా మరొక మారు ప్రకటించి, ఆమె ఆదర్శపూరిత పుణ్య కతోలిక జీవితమును కొనియాడారు.



ప్రథమ భారతీయ మత సభ స్థాపకులు

# 13. దైవ సేవకులు ఎలీష్వా

**(1831-1913)**

ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.

కేరళ తీరమందలి కొచ్చికి సమీపాన గల వైపిన్ ద్వీపంలోని ఒచాంతురుత్‌లో వైపుస్సెరి వంశపు ధనవంతుల కుటుంబం ఒకటి ఉంది. ఆ కుటుంబ సభ్యులు సైనికాధికారులైనందున, అక్కడి రాజు వారికి కొన్ని భూములను ఈనాములుగా ఇచ్చి, దాని ఫలసాయం అనుభవించమన్నాడు. అంత పేరు ప్రఖ్యాతులు గలిగిన తోమన్ మరియు తాండ అను పుణ్యదంపతులకు ఎలీష్వా అక్టోబరు 15, 1831న ప్రథమ సంతానంగా జన్మించింది. ఎలీష్వా నామమునకు ఆంగ్లంలో సమానార్థక నామం ఎలిజబెత్. ఎలీష్వా కుటుంబం స్థితిమంతులు. కావున ఆమెను బాల్యంలో ఇంటి వద్దనే విద్యాభ్యాసం చేయించారు. వైపిన్ ద్వీప పేదప్రజలపట్ల, ఆమె చిన్నతనంలోనే జాలి, కరుణలు చూపించి, సహాయ పడింది. వారు మొత్తం ఎనిమిదిమంది సంతానం. ఆమె మూడవ తమ్ముని పేరు లూయిసు. తరువాత కార్మెలైట్ సభలో లూయిస్ గురువుగా అభిషేకం పొందాడు. అతడే "సత్యనాధ కహలం" (బాకా) అను ద్విమాస పత్రికను ప్రచురించ నారంభించాడు. అతడు పది పుస్తకాలు రచించడమే గాక, బైబులును కూడా మళయాళ భాషలోనికి అనువదించాడు. కుటుంబమంతా భక్తి విశ్వాసములతో, చక్కని క్రైస్తవులుగా జీవించారు.

ఎలీష్వాకు పదహారేళ్ల ప్రాయం రాగానే, ఆమె తండ్రి తోమన్ ఆమెను వరీద్ వకాయిల్ కిచ్చి వివాహం చేశాడు. వకాయిల్ వరాపుళకు దాపులోనున్న కూనమ్మావుకు చెందిన వ్యాపారవేత్త. అతడు శొంఠి మరియు ఇతర వస్తువుల అమ్మకాలు చేశాడు. కూనమ్మావులోని చాలా భూములపై అతనికి అధికారముంది. ఆ భూముల శిస్తు వసూలు చేసి, ఆ పైకాన్ని తన పైఅధికారులకు అప్పగించాలి. అక్కడ భూములు పెద్దగా పండక, రైతులు శిస్తు కట్టకపోయినా, వరీద్ మాత్రం భూములన్నిటికి శిస్తు కట్టాడు. ఆ దంపతులకు చక్కని బాలిక జన్మించింది. బాలికకు అన్నా అని పేరు పెట్టుకున్నారు. పిమ్మట వరీద్‌కు జబ్బు చేసి, అనతి కాలంలోనే అసువులు బాసాడు. ఎలీష్వాకు ఇరవై యేండ్ల లేతప్రాయంలోనే వైధవ్యం కలిగింది. అప్పటి ఆచారం ప్రకారం యువతులుగా

నున్న ధనిక విధవరాండ్రు మరలా పెండ్లి చేసుకోవాలి. కాని ఎలీష్వా పునర్వివాహం మాట ఎత్తలేదు. దానికి విముఖత చూపి, తన కుమార్తె అన్నా పెంపకంలో, ప్రార్థన చేయడంలో, పేదలకు సహాయం చేయటంలో నిమగ్నమైంది. దైవ సేవలో, దైవ చింతనలో నిలకడగా, మనోనిబ్బరంగా ఉండటం అలవాటు చేసుకుంది. ఈ లోకపు ఆకర్షణలకు లొంగక, ప్రభునితో సాన్నిహిత్యము పెంచుకోవటానికి ఎలీష్వా త్రికరణ శుద్ధిగా ప్రయత్నించింది. కూనమ్మావులో తన భర్త ఇంటికి సమీపాన ఒక పూరిపాకను నిర్మించుకుంది. అందులోనే ఆమె, కూతురు అన్నాతో కలిసి ప్రార్థనలో మునిగిపోయింది. దాదాపు పదేండ్లపాటు పూజలు, ప్రార్థనలు, ఉపవాసాలు, త్యాగాలతో వారిద్దరు గడిపారు. ఇప్పుడు శిథిలమైన ఆ కుటీరాన్ని పునర్నిర్మించి, ఎలీష్వా జీవిత చరిత్ర తెలిపే మ్యూజియంగా మార్చారు.

ఎలీష్వా పవిత్రాత్మ ప్రేరణతో దైవసేవకే అంకితం కావాలనే తృష్ణ, తలంపు ఆమెలో 1862లో కలిగింది. అప్పుడు ఇటలీ దేశానికి చెందిన లియోపాల్డ్ వారి విచారణ సహాయక గురువు. ఆ గురువు వద్దకు వెళ్ళి, తన ఆత్మలో కలుగుతున్న భక్తి భావాలను, ముఖ్యంగా దైవసేవ చేయాలన్న ప్రత్యేక పిలుపును గూర్చి సవివరంగా ముచ్చటించింది. ఆమెను లియోపాల్డ్ గురువు సరిగా అర్థం చేసుకున్నాడు. ఆమెకు దైవ పిలుపు ఉన్నదని, శ్రీసభ సేవకు ప్రభువే స్వయంగా ఆమెను ఆహ్వానిస్తున్నాడని, పవిత్రాత్మ దేవుని అనుగ్రహం ఆమెకున్నదని లియోపాల్డ్ పసిగట్టాడు. అప్పటి వరకు భారతీయులెవరూ మఠకన్యలు కాలేదు. తమ వేద ప్రచారానికి కొందరు మఠకన్యల అవసరముందని గ్రహించిన మిషనరీలు, స్పెయిను దేశపు మఠకన్యలను భారతదేశానికి విచ్చేయుమని ఆహ్వానించటానికి సిద్ధమౌతున్నారు. సరిగ్గా ఆ సమయంలో ఎలీష్వా, తన కూతురు అన్నా, ఎలీష్వా చెల్లి తెరెసా మఠకన్యలు కాగోరి, తమ గురువు అనుమతితో నూతన మఠకన్యల మఠానికి అంకురార్పణ చేశారు. వారు ముచ్చురు లాటిన్ అర్చక సంప్రదాయానికి చెందినవారు. ఆ ముప్పురు ఫిబ్రవరి 13, 1866న నూతనంగా వెదురుతో నిర్మితమైన మఠంలో అడుగుపెట్టడంతో, కేరళ శ్రీసభ చరిత్రలో ఒక ముఖ్య అధ్యాయం మొదలైంది. దానితో కార్మెల్ తృతీయ మఠకన్యల సభ (TOCD) ఆవిర్భవించింది. అదే కేరళ లోని ప్రప్రథమ స్వదేశీ మఠకన్యల సభ. ఫిబ్రవరి 14న సిరో-మలబారు క్రైస్తవులకు చెందిన విధవరాలు క్లారా కూడా సభలో చేరింది. ఆ సభకు లియోపాల్డ్ గురువులు అతి మేత్రాణులగు బెర్నడిన్ గారి అధికార అనుమతి లేఖను పొందారు. వారంతా మార్చి 27, 1867న వెదురు గృహమునుండి, కూనమ్మావులోని ఎలీష్వా, అన్నాలకు చెందిన స్థిరాస్తిలో నిర్మించిన నూతన గృహమందలి పునీత తెరెసమ్మగారి కాన్వెంట్ లోనికి

మారారు. శ్రీసభ చట్టప్రకారం వారంతా సంవత్సరకాలం నొవిషియేట్‌లో శిక్షణ పొంది, జూలై 16, 1868న ప్రథమ మాటపట్టు నిచ్చి, మఠకన్యలయ్యారు.

ఎలీష్వా ఇప్పుడు నూతన కార్మెలైట్ మఠకన్యల సభకు మఠ శ్రేష్ఠురాలు. ఆమె నేతృత్వంలో బాలికా విద్యకు ప్రాధాన్యమిచ్చి, జూలై 20, 1868న కూనమ్మావు నందు పునీత జోజప్పగారి బాలికల పాఠశాలను స్థాపించింది. అదే కేరళ ప్రాంతంలోని మొట్టమొదటి కతోలిక బాలికల పాఠశాల. అక్కడే ఒక అనాథ శరణాలయం, బాలికల వసతి గృహం ఆరంభించింది. మదర్ ఎలీష్వా బాలికల విద్యకై తదనంతరం ఎన్నో పాఠశాలలు నెలకొల్పి, కేరళ కతోలిక బాలికలకు విద్యాదానం చేసింది. మఠకన్యల పుణ్యజీవితాన్ని అనుసరిస్తూ ఎందరో యువతులు ఈ పాఠశాల నుండి ఈ నూతన మఠంలో చేరారు. సిరో-మలబారు అర్చక సాంప్రదాయానికి చెందిన కతోలిక యువతులకు కూడా ఈ నూతన మఠంలో సభ్యత్వం కల్పించింది. సిస్టర్ అన్నా నోవిస్‌ల శిక్షణాధికారిగా, సిస్టర్ తెరిసా బాలికల పాఠశాల నిర్వాహకురాలిగా, సిస్టర్ క్లారా వసతి గృహ సంరక్షకురాలిగా సేవలందించారు. ఎలీష్వా చొరవతో, లియోపాల్డ్ గురువుల మార్గదర్శకత్వంలో ఏర్పడిన మొట్టమొదటి భారతదేశ మఠకన్యల సభగా "కార్మెల్ మఠకన్యల సభ" చరిత్రలో సరిక్రొత్త అధ్యాయాన్ని లిఖించింది. అప్పటి వరకు కొన్ని మఠాలున్నా, వారంతా విదేశీయులే. అటు పిమ్మట తెలుగు వారితో 1874లో తాడిపత్రి జ్ఞానమ్మ స్థాపించిన పునీత అన్నమ్మగారి సభ (మాధవరం, ఫిరంగిపురం) భారతదేశ మఠకన్యల సభలలో రెండవది.

ఎలీష్వా తన మఠకన్యలను శ్రీసభకు సహాయకారులుగా ఉంటూ, దైవ రాజ్య స్థాపనకు నిర్విరామంగా కృషిచేయ ప్రోత్సహించింది. ఆవిలాపురి తెరేసమ్మగారు విశ్వసించినట్లుగా "యేసు భగవానుడు మనకు తోడుండగా మనకేమీ కొదువలేదు. ప్రభువు మాత్రమే నాకు చాలును" అని గాఢంగా నమ్మింది. దానినే తన మఠకన్యలకు నూరిపోసింది. దేవునికి ప్రథమ స్థానమిచ్చింది. దేవుని కృప చాలని భావించింది. పేదరికంలో, దైవచిత్తానికి సంపూర్ణంగా లొంగి జీవించటమే పరమావధిగా భావించింది. పేదరికాన్ని మోక్షసాధనంగా పరిగణించాలని, సిలువధారి యైన క్రీస్తు కొరకు మరణించటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలే గాని, సుఖప్రద జీవితానికి మఠంలో చేరలేదని తన మఠకన్యలను పలుమార్లు హెచ్చరించేది. ఆధ్యాత్మిక జీవితానికి మూడు అంశాలు ముఖ్యమని, అవి మఠకన్యలకు ఎంతో ఉపకరిస్తాయని ఎలీష్వా నిండుగా విశ్వసించింది. వానిలో మొదటిది: సోదరప్రేమ. సోదర ప్రేమలో అందరూ ఎదగాలని, ఒకరి తప్పులు మరొకరు మన్నించాలని కోరుకుంది. తన మఠంలో లాటిన్ సంప్రదాయం

వారికి, సిరో-మలబారు కతోలికులకు సమానరీతిలో సభ్యత్వం కల్పించింది. సిరో-మలబారు మఠకన్యలు విడిపోయినా, అందరూ ఎలీష్వా ప్రేమను గురించి చాలా గొప్పగా చెప్పేవారు. ఆ విధంగా ఎలీష్వా సోదరప్రేమను తాను స్వయంగా ఆచరించింది. ఆచరించిన దానినే బోధించింది. రెండవది: నిర్లిప్తత. ఈ లోక సంబంధ వస్తువులపై, విషయాలపై, బంధుత్వాలపై పూర్తిగా అయిష్టత చూపుతూ, ప్రభుని సర్వస్వంగా స్వీకరించి, ఆయన నీడలో జీవించడం; శారీరక సుఖాలకు వెంపర్లాడక, పరలోక ప్రభుని పరమ పెన్నిధిగా, ఆత్మీయ బంధువుగా చేకొని, త్యాగపూరిత జీవితంలో ముందుకు సాగమని కోరింది. మూడవది: వినమ్రత. బంగారాన్ని నిప్పులో పెట్టి నాణ్యతను పరిశీలించినట్లే, మఠకన్యలంతా వినమ్రతలో, వినయంలో, నిగర్వంగా, సాధుశీలతతో, క్రీస్తు ప్రభునిపై సంపూర్ణ భారం వేసి జీవించాలని, తమలోని తప్పులను ఎంత చిన్నవారు ఎత్తి చూపినా, సహృదయంతో స్వీకరించి, వారికి మాతృకగా ఉండమని బోధించింది.

ఆ కాలంలో కేరళ శ్రీసభలో కొన్ని చారిత్రాత్మక మార్పులు సంభవించాయి. వరాపుళ అగ్రమేత్రాసనం నుండి సిరో-మలబారు క్రైస్తవులను 1887లో వేరుపరచారు. సిరో-మలబారు కతోలికులకు, లాటిన్ కతోలికులకు, జగద్గురువులు వేరు వేరు మేత్రాసనాలు ఏర్పరచారు. అప్పటి వరకు కలిసి ఉన్న కేరళ కతోలికులు కాస్తా, వేరు కుంపట్లు పెట్టుకోవాల్సి వచ్చింది. ఇది రోము నుండి వచ్చిన శాసనం కావడంతో, విశ్వాసంతో అందరూ తలయొగ్గారు. ఆ సమయంలో మఠ ముఖ్య కేంద్రం కూనమ్మావును వరాపుళ పరిధి నుండి తప్పించి, సిరో-మలబారు కతోలిక సంఘ పరం చేశారు. దాంతో లాటిన్ అర్చక సంప్రదాయానికి చెందిన మఠకన్యలకు, సిరో-మలబారు మఠకన్యలతో కలిసిమెలసి ఉండటం భవిష్యత్తులో కష్టం కావచ్చని, ఎలీష్వా, ఆమె అనుచరులు, కూనమ్మావును వీడి, క్రొత్త స్థావరం ఏర్పరచుకోవటానికి అనుమతి కోరారు. విడిపోయే సమయంలో, ఎలీష్వా చాలా పెద్ద మనస్సుతో, ఉదార స్వభావంతో వ్యవహరించి, సభ ఆస్తులన్నింటిని సిరో-మలబారు మఠకన్యలకే వదలివేసి, వట్టి చేతులతో సెప్టెంబరు 17, 1890న వెళ్లారు. వారు 52 రోజుల పాటు ఎర్నాకుళంలో తాత్కాలికంగా బసచేసారు. ఆ పిమ్మట వరాపుళ పీఠాధిపతులు మార్సిల్లినస్, అక్కడి క్రైస్తవులు హృదయపూర్వకంగా వారిని వరాపుళకు ఆహ్వానించగా, మఠకన్యలు నూతన కాన్వెంటును ఆరంభించారు. ఆ విధంగా ఎలీష్వా రెండు మఠకన్యల స్థాపకురాలుగా చరిత్రలో నిలిచిపోయింది. మొట్టమొదటి మఠసభ ''కార్మెల్ తృతీయ మఠకన్యల సభ'' (TOCD). రెండవది ''తెరెసియన్ కార్మెల్ సభ'' (CTC). ఈ విధంగా నూతన మఠసభ స్థాపనకు ఎలీష్వా రెండవసారి పురిటి నొప్పులు పడాల్సి వచ్చింది.

వెనువెంటనే అక్కడ పునీత జోజప్పగారి బాలికల పాఠశాలను స్థాపించి, బాలికలకు విద్యనందించింది. నూతన సభకు ఆర్థిక బలం లేకపోయినా, కూనమ్మావు బాలికల వసతి గృహం నుండి వచ్చిన 41 మంది బాలికలను కూడా అక్కున చేర్చుకుని, వారికి ఉచితంగా విద్యాబుద్ధులు చెప్పించింది. పేదలకు సేవలు చేయటం, శ్రీసభకు సహాయపడటం మున్నగు ముఖ్య కార్యముల ద్వారా ప్రభుని సేవలో, ఐక్యమై జీవించటమే తెరెసియన్ కార్మెల్ సభ ముఖ్య ఉద్దేశ్యమని ఎలీష్వా తెలిపింది. ''దేవుని కోసం తపన-పేదల కోసం తపన''తో ప్రతి మఠకన్య ఆదర్శంగా ఉండాలని ఆమె కోరుకుంది. స్థానిక శ్రీసభకు, గురువులకు తలలో నాలుకలా ఉంటూ, సేవలందించేందుకు తమ మఠకన్యలంతా సర్వదా సిద్ధంగా ఉండాలని ఆమె తలపోశారు.

ఎలీష్వా తన చరమదశలో పూర్తికాలం ప్రార్థనలో గడిపింది. ఈ లోక సుఖ భోగాలు, పేరు ప్రఖ్యాతుల కోసం ఆమె ప్రాకులాడక, పరలోక సంపదలు కూడబెట్టడానికి తీవ్రంగా కృషి చేసింది. దీనతతో, వినమ్రతతో, అతి సామాన్య జీవితం జీవించింది. చివరగా ఎలీష్వా తన ఇహలోక ప్రయాణానికి జూలై 18, 1913న స్వస్తి చెప్పి, పరలోక ప్రయాణం కట్టి, తాను ఎంతో ప్రేమించి సేవించిన ప్రభుని సన్నిధి చేరుకుంది. ఆమెను వరాపుళ దేవాలయ ముందు భాగాన భూస్థాపితం చేశారు. అనంతరం ఆమె భౌతిక అవశేషాలను వరాపుళలోని పునీత జోజప్పగారి కాన్వెంట్‌లో నూతనంగా ఏర్పరచిన ''స్మృతి మందిరం''లో భద్రపరిచారు. ఎలీష్వాను ఎర్నాకుళం లోని పునీత ఫ్రాన్సిస్ అసిస్సీవారి పెద్ద దేవాలయమందు అతిమేత్రాణులైన డానియేల్ గారు మే 30, 2008న ''దైవ సేవకులు''గా ప్రకటించి, పునీత పట్టా ప్రక్రియ ఆరంభించారు. ఎలీష్వా స్థాపించిన తెరెసా కార్మెల్ మఠంలో నేడిప్పుడు 190 కాన్వెంట్లు ఉన్నాయి. దాదాపు 1400 మంది మఠకన్యలు బాలికలకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను, రోగులకు ఆరోగ్యసేవలనందిస్తూ, పేదల సమగ్ర అభివృద్ధికి శాయశక్తులా ప్రయత్నిస్తూ, శ్రీసభ అభివృద్ధికి, దేశాభివృద్ధికి చేయూత నందిస్తున్నారు.



**కృష్ణాపురం మరియగిరి పుణ్యక్షేత్రమందు భక్తులు**





# 14. దైవ సేవకులు ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్

**(1854-1900)**

బ్రదర్ మెట్టి ఆశీర్వాదం S.J.

ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ హాలెండు దేశమందలి జ్వోల్లె అను పట్టణంలో నివశిస్తున్న హెన్రీ క్రూట్, జోన్ అను పుణ్య దంపతులకు చివరి సంతానంగా డిసెంబరు 7, 1854లో జన్మించాడు. క్రూట్ కుటుంబం చాలా పెద్ద కుటుంబం. అది చాలా ఆదర్శవంతమైన కుటుంబం. వారి సంతానం అయిదుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. తల్లిదండ్రులు చక్కని ఆదర్శ దంపతులుగా, ప్రార్థనాపరులుగా ఉంటూ, తమ బిడ్డలను కూడ మంచి కతోలిక విశ్వాసంలో పెంచారు. కుటుంబమంతా కలిసి దేవాలయంలో జరిగే దివ్య బలిపూజలకు, జపమాలలకు క్రమం తప్పకుండా వెళ్ళి, ప్రార్థించేవారు. ఫ్రాన్సిస్ ప్రాథమిక విద్యను తన పట్టణమందే అభ్యసించాడు. తదనంతరం రోర్మండ్ నందలి ఒక కతోలిక పాఠశాలలోని వసతి గృహంలో ఉండి, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్ భాషలతో బాటు సంగీతం, మంచి దస్తూరిని నేర్చుకున్నాడు. అక్కడ ప్రతి దినము దివ్య బలిపూజలో భక్తిగా పాల్గొన్నాడు. మంచిగా సత్యోపదేశం నేర్చుకున్నాడు. ఫ్రాన్సిస్ కతోలిక గురువుల మధ్య, కతోలిక వాతావరణంలో పెరిగాడు.

హెన్రీ క్రూట్, జోన్‌లు తమ సంతానంతో కలసి ప్రతినిత్యం కుటుంబ జపమాలను విధిగా జపించేవారు. తమ కుటుంబాన్ని ప్రభువుకు సమర్పించుకుని, తమను దీవించమని వేడుకునే వారు. జపమాలలో అయిదు దేవ రహస్యాలను ధ్యానిస్తూ, ఏబది మూడు పూసలతో జపిస్తాము. కాని వారి కుటుంబంలో ఆరవ గుర్తు ప్రతిరోజూ చెప్పుకునేవారు. ఆ ప్రార్థన ఉద్దేశ్యము తల్లిదండ్రులెప్పుడూ పిల్లలకు చెప్పలేదంట. అదేమిటంటే "ఓ యేసు ప్రభూ! మా బిడ్డలో ఏ ఒక్కరైనా గురువై, నిన్ను సేవించే అదృష్టాన్ని అనుగ్రహించండి" అనునది వారి రహస్య ప్రార్థన. తమ అయిదుగురు మగ సంతానంలో ఒక్కరైనా గురువు కావాలని తల్లిదండ్రులు భక్తితో, విశ్వాసంతో, ఎడతెగక ప్రార్థించారు. భక్తుల కోరికలను భగవంతుడు ఆలకిస్తాడు కదా! ఆ పుణ్య దంపతుల కుటుంబ ప్రార్థన ఆలకించిన ప్రభువు, వారిని మూడు రెట్లుగా దీవించాడు. అయిదుగురులో ఒక్కరే కాదు. ముగ్గురు గురువులయ్యారు. జ్యేష్ట పుత్రుడైన బర్తలోమియో జేసుసభలో చేరి, ఆఫ్రికా ఖండంలో మిషనరీగా పనిచేశాడు. అంతోని మరియు ఫ్రాన్సిస్ జేవియర్‌లు లండన్ కేంద్రంగా గల మిల్‌హిల్ సభలో గురువులై, మన భారతదేశంలో గురు సేవలు

అందించారు. వారి సహోదరీలలో ఇద్దరు బాల్యంలోనే మరణించగా, జువానా ఇరవై అయిదేళ్ల యవ్వనంలో అసువులు బాసింది. మగ బిడ్డలైన గాడ్ ఫ్రే, జాన్‌లు ఇంటివద్దనే ఉంటూ, పాదరక్షల తయారీ వ్యాపారం చూసుకునే వారు.

దైవ పిలుపును ఆలకించిన ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్, హాలెండ్ నది బొడ్డునగల కూలెంబర్గ్ పట్టణంలోని మైనర్ సెమినరీలో ఏప్రిల్ 6, 1869న ప్రవేశించాడు. అతడు రోర్మండ్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడే గురువు కావాలనే ఆశ, అతని లేత హృదయంలో మెలమెల్లగా చివురించింది. అప్పటికే అతని అన్నలిద్దరు గురువులు కాగోరి, గురుశిక్షణలో చేరారు. ఫ్రాన్సిస్ కూడా వారి బాటలోనే నడిచి, తన తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ, పవిత్రాత్మ ప్రేరణతో గురువు కాగోరాడు. అందుకుగాను లండన్ కేంద్రంగాగల మిల్‌హిల్ సభలో చేరాడు. ముగ్గురు అన్నదమ్ములు సెమినరీలో ఉన్నప్పుడే వారు తమ తండ్రి హెన్రీని 1870లో కోల్పోయారు. మరో మూడేళ్ల తరువాత ఫ్రాన్సిస్ సెమినరీ నుండి సెలవులకు వచ్చిన సమయంలో, 1873లో తన తల్లి జోన్ పరమ పదించింది. ఫ్రాన్సిస్, లండన్‌లోని మిల్‌హిల్ ప్రాంతమందుగల పునీత జోజప్పగారి గురు శిక్షణాలయంలో తత్వ శాస్త్రం, వేదాంత శాస్త్రములు క్షుణ్ణంగా అభ్యసించాడు. శిక్షణానంతరం అక్కడే ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్, మిల్‌హిల్ సభలో గురువుగా జూన్ 8, 1878లో అభిషేకం పొందాడు.

అప్పటికే ఫ్రాన్సిస్ అన్నయగు అంతోని క్రూట్ భారతదేశమందలి తెలుగు ప్రాంతాలలో గురుత్వ బాధ్యతలు నిర్వహిస్తూ, సువార్త పరిచర్య చేస్తున్నాడు. ఫ్రాన్సిస్ కూడ భారతదేశం మిషనరీగా వెళ్ళాలన్న కోరికను సభ పెద్దలకు వెల్లడించాడు. వాళ్ళ ఇద్దరు బిడ్డలు కలిసి ఉండాలని, కలిసికట్టుగా ఒకే చోట పని చేయాలనేది వారి తల్లి కోరికట. మిల్‌హిల్ పెద్దల ఆశీర్వాదముతో తన అన్న అంతోని క్రూట్‌ను అనుసరిస్తూ, భారతదేశం పయనమై ఆగస్టు 8, 1878న మద్రాసు ఓడరేవు చేరుకున్నాడు. మద్రాసు నగరం అప్పుడు ఆంగ్లేయుల ఆధీనంలో ఉన్న ముఖ్యనగరం. మద్రాసు కేంద్రంగా ఒక కతోలిక మేత్రాసనం ఉంది. దాని పరిధిలో మిల్‌హిల్ గురువులు వేద ప్రచారం చాలా నిష్ఠతో చేస్తున్నారు. ఆ సభ గురువులలో కొందరు తెలుగు వారి మధ్య, కొందరు తమిళుల మధ్య, కొందరు కన్నడిగుల మధ్య సేవలందిస్తూ, శ్రీసభకు బాసటగా నిలిచారు. ఫ్రాన్సిస్ క్రూట్‌ను మొట్ట మొదటగా మద్రాసు అతి మేత్రాసనానికి కతెడ్రల్‌గా ఆర్మీనియన్ బజారులో ఉన్న పునీత మరియమ్మ గారి దేవాలయంలో సహాయక గురువులుగా నియమించారు. అది చాలా పురాతన కతోలిక దేవాలయం. ఫ్రాన్సిస్‌కు అప్పటికి ఇంకా ఇరవై అయిదేండ్లయినా నిండలేదు. ఫ్రాన్సిస్ అక్కడ ఇంగ్లీషులో, తమిళ భాషలో దివ్య పూజాబలులు నిర్వహించాలి. కనుక వెంటనే తమిళం నేర్చుకున్నాడు. తరువాత మద్రాసు పట్టణానికి దగ్గరలో ఉన్న పూనమల్లిలోని మిలిటరీ స్థావరమందుగల దేవాలయంలో ఉపగురువుగా దైవార్చన విధులు నిర్వహించాడు. ఫ్రాన్సిస్ క్రైస్తవుల బాగోగులు గమనించి,

వారికి ఎప్పుడూ అండగా ఉండేవాడు. పేదలకు తన పరిధిలో తాను సహాయం చేస్తూ, చక్కని కతోలిక జీవితం జీవించమని వారిని ప్రోత్సహించేవాడు.

ఫ్రాన్సిస్ క్రూట్ పూనమల్లిలో పనిచేయునప్పుడు పట్టణాలలోగాక, వేద ప్రచారక ప్రాంతాలలో, గ్రామాలలో పనిచేయాలనే దృఢమైన కోరిక కలిగింది. ఇంకా వేద వ్యాపకం చక్కగా జరగాలంటే, మఠకన్యలు ఉంటే బాగుంటుందని, విదేశీ మఠకన్యలు కాక, స్థానిక క్రైస్తవులే మఠకన్యలైతే ఇంకా మంచిదని తలపోశాడు. "ఇక్కడకు వచ్చినప్పటి నుండి ఇక్కడ ఒక మంచి కాన్వెంట్ ఉంటే బాగుండును. ఆ ఆలోచనతో నా మనస్సు నిండి ఉంది" అని ఫ్రాన్సిస్ ఉత్తరాలలో వ్రాసాడు. ఫ్రాన్సిస్ క్రూట్ గుంటూరు జిల్లాలోని రావిపాడు విచారణ కర్తలుగా ఉన్న తన అన్నయగు అంతోని క్రూట్ గురువులకు సహాయక గురువుగా ఒక సంవత్సరం పనిచేశాడు. అక్కడి ప్రజల విశ్వాసాన్ని చూరగొని, తన అన్న కనుసన్నలలో అలుపెరుగని యోధునిలా, ఆ ప్రాంతంలోని గ్రామాలన్నీ ఒక్కొక్కటిగా తిరుగుతూ, చక్కని యాజకునిగా పేరు బడసాడు.

ఫ్రాన్సిస్ అతి చిన్న వయస్సులోనే మిల్‌హిల్ గురువులకు 1886 నుండి 1891 వరకు ప్రొవిన్షియల్‌గా, 1891 నుండి వైస్ ప్రొవిన్షియల్‌గా బాధ్యతాయుత పదవులలో పనిచేశాడు. కొన్నేండ్లపాటు నెల్లూరు, కర్నూలులో నెలకొనియున్న పునీత జోజప్పగారి గురుశిక్షణా కేంద్రంలో రెక్టర్‌గా, ఆచార్యులుగా గురు విద్యార్థులకు శిక్షణ ఇచ్చాడు. కొంతకాలం మద్రాసులోని  ఫోర్ట్ సెయింట్ జార్జిలో ఆధ్యాత్మిక గురువుగా ఉన్నాడు. అక్కడున్న సమయంలో 'ద కాతలిక్ వాచ్‌మన్' అను వారపత్రికకు సంపాదకులుగా ఉండి, నాటి గురువులను, క్రైస్తవ లోకాన్ని ఉత్తేజపరుస్తూ క్రైస్తవ ఆధ్యాత్మికత గురించి, కతోలిక విశ్వాసంపై ఎన్నో వ్యాసాలు వ్రాశాడు. ఆ పత్రిక నూతన రూపమే ప్రస్తుత "న్యూ లీడర్".

ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ 1882లో బళ్లారిలోని బ్రిటిష్ సైన్య స్థావరమందలి దేవాలయ గురువుగా పదవీ స్వీకారం చేశాడు. టిప్పు సుల్తానుల కాలంలో బళ్లారి నందు పెద్ద బ్రిటిష్ సైన్య పటాలం ఉంది. అప్పుడక్కడ సిపాయిలతో, సైనికాధికారులతో సందడి సందడిగా ఉండేది. ఆంగ్లేయులు పటాల స్థావరాన్ని మరియొక చోటుకు మార్చినందున, అప్పటి భవనాలు, భవంతులు, విశాలమైన కవాతు మైదానాలు పూర్తిగా బోసిపోయాయి. అక్కడ చాలా పురాతనమైన, విశాలమైన దేవాలయముంది. అది మరియమాత మోక్షారోహణ దేవాలయం. అక్కడ దాదాపు మూడువేల మంది కతోలిక క్రైస్తవులున్నారు. బళ్లారిలోనే పాట్రిక్ డోయల్ గురువులచే 1872లో నిర్మించిన లాజరస్ దేవాలయం ఉంది. దాని బాధ్యతలు కూడా కొంత కాలం ఫ్రాన్సిస్ స్వీకరించాడు. లాజరస్ దేవాలయాన్ని 1939లో ఫ్రాన్సిస్కన్ గురువులు పునీత అంతోనివారి దేవాలయంగా పేరు మార్చారు.

ఫ్రాన్సిస్ బళ్ళారిలో ఉన్నప్పుడు అక్కడి సాంఘిక పరిస్థితులను చాలా దగ్గరగా

గమనించాడు. ఆనాటి సమాజమంతా ఎన్నో ఆధ్యాత్మిక, సాంఘిక, నైతిక సమస్యలతో కొట్టు మిట్టాడుతుంది. సంఘంలో స్త్రీలపట్ల ఎన్నో వివక్షతలు, అన్యాయాలను గమనించి, వారి ఉద్ధరణకు కంకణం కట్టుకున్నాడు. స్త్రీల సాధికారతకు విద్యయే ప్రథమ సోపానమని గ్రహించాడు. మహిళా విద్యతో సంఘంలోని దురాచారాలను అరికట్టి, వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని తలంచాడు. పునీత ఫ్రాన్సిస్ శౌరివారి వలె వేదవ్యాపకాన్ని చక్కగా, ఉత్సాహంతో, తపనతో చేయటానికి, బాలికా విద్యను చేపట్టటానికి ఒక మత కన్యల సభ తప్పక అవసరమని దూరదృష్టితో భావించి, దాని స్థాపనకు ఫ్రాన్సిస్ క్రూట్ ముందుకు వచ్చాడు. మత స్థాపన విషయమై మరింత ప్రార్థించాడు. తన మదిలో కలిగిన పవిత్రాత్మ ప్రేరణను కార్యరూపం పెట్టడానికి, మత కన్యల సభను స్థాపించాలనే ప్రతిపాదనను అప్పటి మద్రాసు అతిమేత్రాణులు జోసఫ్ కోల్గన్ గారికి వ్రాతపూర్వకంగా సమర్పించాడు. ఫ్రాన్సిస్ లోని పట్టుదలను, వేద వ్యాపకం చేయడంలో ఉన్న తపనను గుర్తించి, నూతన మతకన్యల సభ స్థాపనను కోల్గన్ అగ్ర పీఠాధిపతులు ఆమోదించారు. ఆ విధంగా ఫ్రాన్సిస్ జేవియర్ గురువులు తన పాలక పునీతుల పేరిట "మిషనరీ సిస్టర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్" అను స్థానిక మతకన్యల సంస్థను ఫిబ్రవరి 8, 1893న బళ్ళారిలో స్థాపించాడు. అప్పటికింకా ఫ్రాన్సిస్‌కు నలభై యేండ్లయినా నిండలేదు. అయినా ఎంతో ముందు చూపుతో, స్థానిక క్రైస్తవులే ముందు ముందు శ్రీసభకు నాయకత్వం వహించి, భారత దేశంలోని చీకటిని మహిళా విద్య ద్వారా పటాపంచలు చేసి, దేశాన్ని అభివృద్ధి బాటలో నడపాలని భావించిన ఫ్రాన్సిస్ జేవియర్ కలలు ఫలించి, నూతన మతసభ ఆవిర్భవించింది. అందులకు ఫ్రాన్సిస్ సంతోషంతో దేవుణ్ణి ఎంతగానో స్తుతించాడు.

ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ స్థాపించిన సభలో మొట్టమొదట మేరి ఆంద్రూ, మేరి అన్నా, మేరి క్లేర్ అను ముగ్వురు మహిళలు దైవ పిలుపుకు స్పందించి కన్యాస్త్రీలు కాగోరారు. అప్పటికి ఆ సభకు స్వంత భవనాలు ఏమిలేవు. శిక్షణ ఇచ్చేవారు కూడ లేరు. కావున ఫ్రాన్సిస్ ఆ ముగ్వురు మహిళా అభ్యర్థులను బళ్ళారిలోనే ఉన్న "గుడ్ షెపర్డ్ మత కన్యల"కు అప్పగించి, తర్ఫీదు నిప్పించాడు. వారి శిక్షణ ముగిసేలోగా వారి స్వంత కాన్వెంట్ భవనం తయారైంది. అదే కౌల్ బజారులోగల పునీత ఫ్రాన్సిస్ జేవియర్ కాన్వెంట్. అందులో ప్రథమంగా జూన్ 29, 1896న అడుగుపెట్టడంతో, మొట్టమొదట మతకన్యల మఠం ఏర్పడింది. క్రూట్ గురువులు వారికి మార్గదర్శిగా నుంటూ, ఆ సభకు నియమ నిబంధనలతో కూడిన రాజ్యాంగం ఏర్పరచి, కోల్గన్ అతిమేత్రాణుల అధికార ముద్ర పొందాడు. మతకన్యలంతా పేదల పక్షాన నిలబడాలని, మహిళా విద్యకై పాటుబడాలని, శ్రీసభను కన్నతల్లిలా ప్రేమిస్తూ క్రైస్తవులకు ఆధ్యాత్మిక చింతన కలుగజేయాలని, ఫ్రాన్సిస్ వారికి దిశా నిర్దేశం చేసాడు. ఆ మతకన్యలు బళ్ళారిని కేంద్రంగా చేసుకుని బాలికల విద్యకై ఎంతో గట్టిగా కృషిచేశారు.

ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ ఆకస్మాత్తుగా జబ్బున పడ్డాడు. అతడు విపరీతమైన దగ్గుతో చాలా బాధపడ్డాడు. రోజురోజుకు అతని ఆరోగ్యం క్షీణించసాగింది. స్థానిక వైద్యులతో వైద్యం చేయించినా, అది ఏ మాత్రం తగ్గలేదు. భారతదేశంలోని ఎండల పరిస్థితి తీవ్రంగా ఉంటుందని మనకు తెలుసు. చల్లని ప్రదేశాలు ఫ్రాన్సిస్‌కు కొంత ఉపశమనం కలిగించవచ్చని తలంచి, కొన్నాళ్ళు చల్లగా ఉండే వేసవి విడిదియైన యేర్కాడుకు తరలించారు. అక్కడ ఆర్చిబిషప్ కోల్గన్ గారితో కలిసి ఒకే చిన్న గదిలో ఉండవలసి వచ్చింది. ఇవన్నీ మానవ ప్రయత్నాలని ఫ్రాన్సిస్‌కు తెలుసు. ఆ సమయంలో తన జీవితాన్ని ప్రభుని చేతిలో ఉంచి 'మీ చిత్తమే జరుగునుగాక' అని విశ్వాసంతో ప్రార్థించాడు. కొన్నాళ్ల ఫ్రాన్సిస్‌ను మద్రాసు జనరలు హాస్పిటల్‌లో ఉంచి వైద్యం చేయించారు. అది క్షయ జబ్బుగా నిర్ధారణ అయ్యింది. ఫ్రాన్సిస్ ఆరోగ్యస్థితిని మెరుగు పరచటానికి అతని అన్న అంతోని క్రూట్ గురువు, మిల్‌హిల్ సంస్థ ఎంతో ప్రయత్నం చేసింది. పాశ్చాత్య దేశాలలో మెరుగైన వైద్యం లభించవచ్చని, ఆ వాతావరణంలో ఫ్రాన్సిస్ ఆరోగ్యం కుదుటబడవచ్చని భావించి, ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్‌ను తన మాతృ దేశమైన హాలెండుకు పంపాలని నిర్ణయించారు. అతని అన్న ఫాదర్ అంతోని క్రూట్, ఫ్రాన్సిస్‌కు తోడుగా వెళ్లాడు. వారిద్దరు 18 నవంబరు 1899న బొంబాయి నుండి ఓడలో ప్రయాణమై మర్సెయిల్స్ మీదుగా ఫ్రాన్సులోని హైరెస్ ఓడరేవు చేరుకున్నారు. అక్కడే ఫ్రాన్సిస్‌కు చికిత్స చేయటం ప్రారంభించారు. అతడు ముందు కొంత కోలుకున్నట్లు కనిపించాడు. కాని అంతలోనే ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ ఆరోగ్యం ఒక్కసారిగా విషమించింది. జనవరి 5 ఉదయాన దివ్య సత్ప్రసాదం స్వీకరించాడు. దానితోబాటు ఫ్రాన్సిస్ పాపసంకీర్తనం చేసి, వ్యాధిగ్రస్తుల అభ్యంగనం కూడా పొందాడు. ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ జనవరి 5, 1900న తన ఇహలోక యాత్రను ముగించుకొని, ప్రభువు చెంతకు చేరుకున్నాడు. అతని భౌతిక కాయాన్ని ఫ్రాన్సు దేశమందలి హైరెస్‌లో భూస్థాపితం గావించారు.

ఫ్రాన్సిస్ స్థాపించిన ''మిషనరీస్ సిస్టర్స్ ఆఫ్ ఫ్రాన్సిస్ జేవియర్'' మఠ కన్యల సంస్థ రాజ్యాంగానికి మార్చి 25, 1951 న సవరణలు చేసి, దాని పేరును ''సిస్టర్స్ ఆఫ్ అవర్ లేడీ ఆఫ్ ఫాతిమా''గా మార్చారు. ప్రధాన కేంద్రాన్ని బళ్ళారి నుండి పూనా పట్టణానికి జూలై 16, 1951న తరలించారు. దానితోబాటు ఆ సభ ఫ్రాన్సిస్ జేవియర్ అవశేషాలను 1988లో హైరెస్ నుండి పూనాకు కొనివచ్చి, సుపీరియర్ జనరల్ నివాసమందలి దేవాలయంలో భద్రపరచారు. ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్ శ్రీసభకు చేసిన విశేష సేవలను, వారి పవిత్రతను గుర్తించి, పునీత పట్ట ప్రక్రియను ఆరంభించిన బళ్ళారి పీఠాధిపతులు హెన్రీ డిసూజ గారు జూలై 7, 2017న పలువురు గురువులతో కలిసి, బళ్ళారిలో దివ్య పూజాబలి సమర్పించి, అసంఖ్యాక ప్రజలు, వందలాది ఫాతిమా మఠకన్యల సమక్షంలో ఫ్రాన్సిస్ జేవియర్ క్రూట్‌ను ''దైవ సేవకులు'' గా ప్రకటించారు. అది స్థానిక శ్రీసభకు, మిల్‌హిల్ సభకు, ఫాతిమా మఠకన్యల సభకు ఎంతో సంతోషాన్ని, గుర్తింపును ఇచ్చింది.





# 15. దైవ సేవకులు కాన్‌స్టంట్ లీవెన్స్

**(1856-1893)**

ఫాదర్ దాసరి తంబి క్రాంతి కుమార్,S.J.

ప్రస్తుత ఝార్ఖండ్ రాష్ట్రంలోని చోటా నాగపూర్ ప్రాంతపు కతోలిక దేవాలయాలను పరిశీలిస్తే, అక్కడ దేవాలయాల ముంగిట గుర్రంపై కూర్చున్న వ్యక్తి విగ్రహం చాలా కొట్టొచ్చినట్లు కనబడుతుంది. అతడు ఎవరు? అతడు చేసిన గొప్ప కార్యం ఏమిటి? ఎందుకు ఈ అరణ్య ప్రాంతాలలో అతని విగ్రహాన్ని పెట్టారు? అని అక్కడ ఆదివాసి క్రైస్తవులను ప్రశ్నిస్తే, వారు చాలా ప్రేమగా, ఉత్సాహంగా ఆ వ్యక్తిని గురించి వివరిస్తారు. ఆ గుర్రం పైనున్న వ్యక్తిపేరు కాన్‌స్టంట్ లీవెన్స్. అతడు ఒక జేసుసభ గురువు. అతడు గిరిజనులకు సువార్తను బోధించటమేగాక, వారి కష్టాలలో, నష్టాలలో తోడుగా ఉండి, వారి స్వేచ్ఛ కొరకు వీరోచితముగా పోరాడిన మహనీయుడు. కాబట్టి అక్కడి క్రైస్తవులు లీవెన్స్‌ను "చోటా నాగపూర్ అపోస్తులుడు"గా అప్యాయంగా పిలుచుకుని గౌరవిస్తారు.

కాన్‌స్టంట్ లీవెన్స్ ఐరోపా ఖండమందలి బెల్జియం దేశములోని వెస్ట్ ఫ్లాండర్స్ రాష్ట్రంలోని మూర్స్‌లెడె పట్టణమందు జాన్ లీవెన్స్, బార్బరా అను కతోలిక దంపతులకు ఏప్రిల్ 11, 1856న జన్మించాడు. అతని తల్లిదండ్రులు కాయకష్టం చేసుకుని, ఉన్నంతలో కొరతలేకుండా జీవించే పేదలు. కాన్‌స్టంట్‌కి ఆరుగురు సోదరీమణులు, నలుగురు సోదరులున్నారు. అతను వరుసక్రమంలో ఏడవవాడు. అతని కుటుంబం చాలా భక్తిగల కుటుంబం. అందరు కలిసి కుటుంబ జపమాల క్రమం తప్పకుండా అనుదినం చెప్పుకునేవారు. చిన్ననాటి నుండే అతడు దైవభక్తి కలిగి, ప్రార్థనలంటే మక్కువతో పెరిగాడు. అతడు ప్రాథమిక విద్యను తన పట్టణమందే అభ్యసించాడు. అతడు కష్టపడి చదివి, మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. అతని తల్లి ఆగస్టు 1, 1867న పరమపదించటంతో, కుటుంబం ఇబ్బందుల పాలయ్యింది. కొన్నాళ్ళు కాన్‌స్టంట్ ఇంటి వద్దనే ఉండి పశువులు కాశాడు. అందువలన అతని చదువు కుంటుబడింది. అతడు గురువై గిరిజనుల మధ్య సువార్త బోధించే తరుణంలో, తన చిన్నతనంలో పశువులు కాసిన అనుభవాన్ని, తన కష్టాన్ని వారికి సోదాహరణంగా చెప్పి, గిరిజనులను కష్టించి పనిచేయమని ప్రోత్సహించేవాడు.

కాన్‌స్టంట్ లీవెన్స్ పదునాలుగేళ్ళ ప్రాయంలో అనగా 1870లో ఒక స్నేహితుని ఇంట్లో ఉంటూ లతీను, గ్రీకు భాషలు నేర్చుకున్నాడు. తన మాతృభాష ఫ్లెమిష్ భాష. కాని అక్కడ ఫ్రెంచి భాషలో చదవాల్సి వచ్చి, కొంత ఇబ్బందిపడినా, చదువులలో ఎప్పుడూ ప్రథముడుగా నిలిచేవాడు. ఒకనాడు ఒక గురువు "నీవు గురువు కావటం ఇష్టమేనా?" అని ప్రశ్నించగా, "అవును. నాకిష్టమే" అని కాన్‌స్టంట్ బదులిచ్చాడు. కాన్‌స్టంట్‌కు విచారణ గురువుగా గాక, ఒక మిషనరీ గురువు కావాలని ఎంతో కోరిక. కాని తన కుటుంబ పరిసరాలను విడచిపెట్టి, మిషనరీగా దూరదేశాలు వెళ్ళాలంటే అతనికి చాల భయం.

లీవెన్స్ 1876 అక్టోబరులో రోసెలారె పట్టణంలో తత్వశాస్త్రం అభ్యసించ నారంభించాడు. మేత్రాసన గురువు కావాలన్న కోరికతో అక్కడ తత్వశాస్త్రం చదివాడు. పిమ్మట రెండు సంవత్సరాల వేదాంత శాస్త్రాన్ని పఠించటానికి బ్రుగ్గె లోని మేజర్ సెమినరీలో సెప్టెంబరు 1877న చేరాడు. ఆ వేదాంత విద్యనభ్యసిస్తున్న సమయంలో, తలవని తలంపుగా ఉత్తర అమెరికాలో మిషనరీగా నున్న కల్లార్ట్ గురువులు పరిచయమయ్యారు. ఆ గురువు, కాన్‌స్టంట్‌ను భారతదేశంలోని బెంగాలు మిషన్‌లో వేదవ్యాపకం చేస్తున్న బెల్జియం జేసుసభ సభ్యులలో చేరమని సలహా ఇచ్చాడు. దానితో ఆయన గమనం మరో దిశకు మారింది. 1878లో కాన్‌స్టంట్, పీఠాధిపతుల అనుమతి పొంది, వేదాంత విద్య పూర్తి చేయకుండానే, డ్రొంగెన్‌లో ఉన్న జేసుసభ నొవిషియేట్‌లో చేరాడు. "ఆత్మల రక్షణకు జేసుసభ గురువులెంతో శ్రమిస్తూ ఆదర్శ ప్రాయంగా ఉన్నందున, నేను కూడా జేసుసభలో చేరి నా ఆత్మ దాహాన్ని తీర్చుకుంటాను" అని కాన్‌స్టంట్ పీఠాధిపతులకు విన్నవించి, అనుమతి పొందినట్లు కాన్‌స్టంట్ లేఖలో తన ఉద్దేశ్యాన్ని తెలియజేశాడు.

ఇరవై రెండేళ్ళ వయస్సులో కాన్‌స్టంట్ నొవిషియేట్‌లో చేరాడు. ఇతర నోవిస్‌లు తన కంటె వయస్సులో చిన్నవారు. వారు అతనికి ఎక్కువ గౌరవం ఇవ్వబోగా, 'నేనొక సాధారణ రైతు బిడ్డను' అని వారితో చెప్పి, వినమ్రతతో కలిసి పోయేవాడు. రెండు సంవత్సరాల నొవిషియేట్ శిక్షణ జేసుసభ సభ్యులకు చాల ముఖ్యమైన శిక్షణ. అక్కడే ప్రతి సభ్యుడు ప్రభువు ప్రేమను వ్యక్తిగతంగా తెలుసుకోవటం, ప్రార్థనలో ప్రభుని సాక్షాత్కారం పొందటం, దైవ రాజ్య యోధులుగా నిలవటానికి కావలసిన నిండు దైవానుభవాన్ని పొందటం జరుగుతుంది. అవన్నీ కాన్‌స్టంట్ ఆ శిక్షణలో పూర్తిగా పొందాడు. పునీత ఇన్యాశివారు స్వీయ అనుభవంలో తయారుచేసిన 'తపోభ్యాసాల'ను అనుసరించి, కాన్‌స్టంట్ నెలరోజుల పాటు ధ్యానం చేశాడు. ఆ నొవిషియేట్ దశలోనే ఒక మిషనరీగా వెళ్లి, సువార్తను బోధించాలన్న దృఢ సంకల్పం అతనికి మరింత ఎక్కువైంది. అక్కడి గురువుల ప్రోత్సాహంతో శ్రద్ధగా జేసుసభ ఆధ్యాత్మికతను, నియమావళిని, దాని అంతరార్థాన్ని కాన్‌స్టంట్ లీవెన్స్ చక్కగా గ్రహించాడు. ప్రభుని కోసం, ప్రభుని బిడ్డలకోసం

పట్టుదలగా పనిచేయాలని లీవెన్స్ నిర్ణయించుకోగా, అతనిలో చిన్నప్పటినుండి ఉన్న బెరుకుతనం, భయం బొత్తిగా కనుమరుగయ్యాయి. కాన్‌స్టంట్ లీవెన్సు భారతదేశానికి మిషనరీగా వెళ్ళటానికి ప్రొవిన్షియల్ గారు 1880 అక్టోబరులో అనుమతించారు. కాన్‌స్టంట్ భారతదేశం బయటదేరటానికి ఇంకా మూడువారాలే ఉన్నందున, వెంటనే తన స్వగృహానికి వెళ్లి, తన కుటుంబ సభ్యులందరితో కొన్ని రోజులు గడిపి, వారందరికి వీడ్కోలు పలికాడు. ఇంటినుండి తిరిగి వచ్చిన పిమ్మట అక్టోబరు 22, 1880న జేసుసభలో పేదరికం, బ్రహ్మచర్యం, విధేయత అను మూడు వ్రతాలను చేపట్టి, జేసుసభలో సభ్యుడయ్యాడు. ఆనాటి సాయంత్రమే మరో నలుగురు జేసుసభ సభ్యులతో కలిసి ముందుగా లండన్ చేరుకున్నారు. ఆ అయిదుగురూ కలిసి సౌతాంప్టన్ ఓడరేవు నుండి అక్టోబరు 28, 1880న బయలుదేరి, డిసెంబరు 2, 1880న కలకత్తా ఓడరేవుకు చేరుకున్నారు. దానితో జేసుసభలో చేరి, మిషనరీగా సేవలందించ దూరదేశాలకు వెళ్లాలన్న కాన్‌స్టంట్ కోరిక నెరవేరినందుకు, దేవునికి స్తుతులు సమర్పించాడు.

కాన్‌స్టంట్ లీవెన్స్ భారతదేశం రాగానే కలకత్తా పీఠ అధికారి పాల్ గోతల్స్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నాడు. కొన్ని రోజులు అక్కడ పునీత శౌరివారి కళాశాలలో బస చేశాడు. పిమ్మట అతనిని బెంగాలు మిషన్ పెద్దలు అసన్‌సోల్ లోని సెమినరీకి తరలించగా, వేదాంత విద్యను, బెంగాలి, హిందీ, ఇంగ్లీషు భాషలను పఠించాడు. భారతదేశ సామాజిక పరిస్థితులను, ముఖ్యంగా తాను పనిచేయనున్న బెంగాలు మిషను ప్రాంత ప్రజల సంస్కృతిని, ఆచార వ్యవహారాల గురించి క్షుణ్ణంగా తెలుసుకో నారంభించాడు. దైవశాస్త్రమును రెండు సంవత్సరాలు అభ్యసించిన పిమ్మట, కాన్‌స్టంట్ లీవెన్స్ కలకత్తాలోని పెద్ద దేవాలయంలో పాల్ గోతల్స్ పీఠాధిపతులచే జనవరి 14, 1883న గురుపట్టాభిషేకం పొందాడు. తన కుటుంబ సభ్యులెవరూ ఆ గురుపట్టాభిషేకానికి రాలేదు. అయినా కానుకలుగా పంపిన పూజ వస్త్రాలు, ద్రాక్షారస పాత్రలలో, వారి ప్రేమాప్యతలను తృప్తిగా పొందాడు. కాన్‌స్టంట్ లీవెన్సు గురుశిక్షణను ముగించి, కలకత్తా నందలి పునీత శౌరివారి కళాశాలలో ఒక సంవత్సరం బోధించాడు. ఆ సమయంలోనే సమీపమందలి బో బజారు దేవాలయంలో యాజక సేవలందించాడు. మరలా ఒక సంవత్సరంపాటు అసన్‌సోల్ సెమినరీకి వెళ్ళి, వేదాంత విద్యను పూర్తిచేసి, మార్చి 2, 1885న వేదాంతవిద్య పట్టా పొందాడు. ఆ సంవత్సరం దాపులోని రాణిగంజ్ ఐరోపావాసుల కాలనీలోని కతోలికులకు పూజాదికాలు నిర్వహించాడు.

లీవెన్స్ తన చదువుల అనంతరం తన పెద్దల ఆదేశానుసారం గిరిజనుల మధ్య సేవలందించటానికి అప్పటి బీహారులోని చోటా నాగపూరు ప్రాంతం చేరుకున్నాడు. అది చాల వెనుకబడిన అరణ్య ప్రాంతం. అక్కడ ప్రజలంతా వివిధ తెగలకు చెందిన గిరిజనులు. కడు పేదరికంతో నిండిన ప్రాంతం. అమాయకులైన గిరిజనులను వివిధ

పన్నులంటూ మోసం చేస్తూ, అక్కడ భూస్వాములు, ధనవంతులు వారిని బానిసలుగా, వెట్టి చాకిరీ చేయించేవారు. కాన్‌స్టంట్ లీవెన్స్ మార్గమధ్యంలో జేసుసభ స్థావరమైన హజారీబాగ్‌ను దాటి, దోరండా చేరుకున్నాడు. అక్కడి జేసుసభ గురువుతో ఆ రాత్రి బసచేసాడు. కాన్‌స్టంట్ ఉదయాన్నే దేవాలయంలో దివ్యబలి పూజచేసి, తన వేద వ్యాపక పరిచర్యను ఆశీర్వదించమని ప్రభుని ఎంతో భక్తి ప్రపత్తులతో ప్రార్థించాడు. తన కోసం సిద్ధంగా ఉన్న గుర్రాన్ని తీసుకుని, సరియైన దారిలేని ఆ అడవి మార్గంలో గుర్రపుస్వారీ చేస్తూ జంగాయిన్ చేరుకున్నాడు. ఆ ప్రాంతమందు ఫెర్డినాండ్ విచారణ గురువులుగా ఉన్నారు. అప్పటికి అక్కడ 200 మంది మాత్రమే క్రైస్తవులు. ఆ గురువుతో నివాసమంటూ అక్కడి గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను, వారి భాషలైన ముండారి, ఒరాన్ భాషలు లీవెన్స్ నేర్చుకున్నాడు. సువార్తను చాటాలంటే గిరిజనుల భాషలలో మంచి ప్రావీణ్యము ఉండాల్సిందే. కాబట్టి ఆ భాషలను నేర్చుకుని ఆ భాషలో పిల్లలకు సత్యోపదేశాన్ని, దేవాలయంలో ఆదివారం ప్రసంగాలు ఇవ్వసాగాడు. 1885 సెప్టెంబరు నుండి 'కంటి' అనే గ్రామంలో నివసించసాగాడు. అక్కడి జీవితం గురించి లీవెన్స్ ఇలా వివరించాడు "ఇప్పటివరకు నేను నివసించింది మట్టితో చేయబడిన ఒక పూరి గుడిసెలో. అది కూడ వర్షాలకు కూలిపోయింది. నాకు ఇల్లంటూ ఏమీ లేదు. నాకు డబ్బు లేదు. సామాన్లు కూడ లేవు, నేను ఎక్కడకు వెళ్తే అక్కడ ఆ రాత్రి ఏ చెట్టు క్రిందో లేక పశువుల కొట్టంలోనో నిద్రిస్తాను". అతని పరిస్థితి అంత దయనీయం. ఏ కష్టమైనా, ఏ ఇబ్బందైనా ప్రభుని కోసం భరించటానికి అతడు ఎల్లప్పుడూ సిద్ధమే.

కాన్‌స్టంట్ అక్కడ నుండి దోర్మా, తోర్పా ప్రాంతాలలో తన గుర్రంపైన అడవి అంతా గాలిస్తూ అక్కడ గిరిజనులను పలకరిస్తూ, గ్రామ గ్రామాలూ తిరిగాడు. అక్కడి సంస్కృతిని, వారి స్థితిగతులను తెలుసుకుంటూ, ఆ సమాచారాన్ని కలకత్తాలోని జేసుసభ అధికారులకు తెలియబరిచి, వారి అనుమతితో 'తోర్పా'లో తన శాశ్వత నివాసం ఏర్పరచుకున్నాడు. ముందుగా అక్కడి పోలీసు అధికారిని మిత్రునిగా చేసుకుని, తాత్కాలికంగా కొన్ని రోజులు పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడు. తరువాత దానికి సమీపంలో భూమిని కొని, అక్కడ నివశించటం ఆరంభించాడు. అక్కడి గిరిజన తెగలంతా అమాయకులు, నిరక్షరాస్యులు. కష్టపడి పొట్ట పోసుకునేవారు. దొంగతనం అసలు ఎరుగరు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, అక్కడి ధనవంతులు వారిని పీల్చి పిప్పిచేస్తున్నారు. వారిని అనవసరంగా కోర్టు కేసులలో ఇరికించేవారు. కేసులు వాదించాలంటే డబ్బు చాలా అవసరం. ఆ ధనం లేనందున, ఆ పేదలు వడ్డీ వ్యాపారస్తుల వద్ద, ధనవంతుల వద్ద అప్పులు చేసి, దానిని తిరిగి చెల్లించలేక, అప్పుల ఊబిలో పూర్తిగా కూరుకుపోయి, చివరకు వారికే అమ్ముడుబోయి, కట్టు బానిసలయ్యేవారు. దీనిని గమనించిన లీవెన్స్, అక్కడి భూచట్టాలను, న్యాయశాస్త్రాన్ని కూలంకషంగా చదివాడు. అందులోని లోటుపాట్లను, దానివలన గిరిజనులు ఏ విధంగా తమ సారవంతమైన

భూములను కోల్పోయి, కట్టుబట్టలతో మిగిలిపోతున్నారో గ్రహించాడు.

కాన్‌స్టంట్ లీవెన్స్ న్యాయస్థానంలో పేదల పక్షాన పోరాటం మొదలు పెట్టాడు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను న్యాయస్థానంలో ఎండగడుతూ, భూములను తిరిగి వారికే ఇప్పించసాగాడు. దీనితో అక్కడి గిరిజనులకు లీవెన్స్‌పై గురి కుదిరింది. నమ్మకం పెరిగింది. ప్రతిరోజు తెల్లవారేసరికి లీవెన్స్ గుడిసె ముందు దగాపడిన ఆదివాసీలు ఎందరో లీవెన్స్ కోసం కాచుకునేవారు. అతడు తన దైనందిన ప్రార్థన ముగించి, వారికి జరిగిన అన్యాయాలను విని, వారి తరపున కోర్టులో కేసులు వేసేవాడు. ప్రభువు కృపతో, వేసిన కేసులన్నీ జయించసాగాడు. అప్పటివరకు అక్కడ మిషనరీలు పేదవారి ఆకలి మంటలను గుర్తించి, కొంత ధనం సహాయం చేసారే కాని, కాన్‌స్టంట్‌వలె వారి పక్షాన నిలిచి, న్యాయస్థానంలో పోరాడిన వారు ఎవరూ లేరు. వారంతా జబ్బుకు మందులిచ్చారే కాని, జబ్బు రాకుండా నివారించలేదు. సమస్య పరిష్కారం చేయలేదు. ఇంకా అక్కడ "బేత్ బేగారి" అని ఒక క్రూర చట్టముంది. అక్కడ వ్యవసాయం చేసే గిరిజనులంతా భూస్వాముల పొలాలలో సంవత్సరానికి ముప్పై రోజులు పొలం దున్నటం, విత్తటం, కలుపు తీయడం, కోయటం, తూర్పార పట్టటం, ధాన్యాన్ని ఇంటికి చేర్చటం లాంటి పనులన్నీ ఉచితంగా చేయాలన్నదే 'బేత్ బేగారి' చట్టం. అక్కడి పోలీసు అధికారి సహాయంతో ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాడి, గిరిజనులకు కొంత వెసులుబాటు కలిగించాడు. ఈ విధంగా లీవెన్స్ సంఘసేవలో ముందున్నందున, అక్కడి గిరిజనులు అతనిని విపరీతంగా అభిమానించారు.

లీవెన్స్ వేద పరిచర్యలో ఎంతో ఉత్సాహాన్ని చూపాడు. ప్రజలతో పూర్తిగా మమేకమయ్యాడు. అతని కృషివలన, సువార్తను అంగీకరించి 1887లో తోర్పా ప్రాంతంలో 10,000 మంది క్రైస్తవులయ్యారు. వారిలో అగ్రభాగం ముండా గిరిజన తెగకు చెందినవారు. అతడు ముందుగా ఒక పథకం ప్రకారం తన ఉపదేశులను పంపి, క్రైస్తవులు కాగోరే ప్రజల జాబితాలు తయారు చేయించేవాడు. అటు పిమ్మట, వారికి క్రమ పద్ధతిలో ప్రార్థనలు, సత్యోపదేశం నేర్పించేవాడు. ఆ విధంగా అతడు అనేక గ్రామాలలో పర్యటించి, అనతి కాలంలోనే గ్రామాలకు గ్రామాలనే పూర్తిగా కతోలిక ధర్మంలోకి స్వీకరించాడు. సువార్తను బోధించ, మరింత మంది గురువులు అవసరమని అతడు పెద్దలకు విన్నవించగా, 1886లో జాన్ డెస్మెట్ గురువును అతనికి సహాయకునిగా, 1887లో మరొక గురువును, ఒక బ్రదర్‌ను పంపారు, వీరందరి సమిష్టి కృషితో గిరిజనుల మధ్య ప్రభు రాజ్యం అక్కడ విస్తరిల్లింది. గిరిజనుల మధ్య వేదప్రచారం చేసి జ్ఞానస్నాన మివ్వటంతో బాటు, వారికి రాంచీ పట్టణంలో మంచి ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేసి విద్యావంతులను చేయాలని, కతోలిక మత సత్యాలను, ప్రార్థనలను కరపత్రములద్వారా, చిన్న గ్రంథాల ద్వారా నూతన క్రైస్తవులకందించటానికి రాంచీలో

అచ్చు యంత్రాన్ని నెలకొల్పాలని కాన్‌స్టంట్ ఉవ్విళ్లూరాడు. చోటా నాగపూర్ ప్రాంతమంతా, అందులోని ముండా, ఖరియా, ఒరాన్ తెగల వారంతా లక్షలాదిగా క్రైస్తవులు కావాలని లీవెన్స్ ఎన్నో కలలుగన్నాడు. దాని కోసమై ఎంతో శ్రమించి ఎన్నో ప్రణాళికలు రచించాడు.

అతని ఉత్సాహాన్ని, నైపుణ్యాన్ని గమనించిన కలకత్తా అతిమేత్రాణులైన గోతల్స్ ఆగస్టు 27, 1888న లీవెన్స్‌ను 'లోహర్‌దగా మిషన్' పర్యవేక్షకులుగా, అధికారిగా నియమించటంతో, లీవెన్స్ రాంచి పట్టణం చేరుకున్నాడు. అతనికి లోహరదగా జిల్లాలోని వేదవ్యాపక బాధ్యతలు సంపూర్ణంగా అప్పగించారు. అప్పటికి చోటా నాగపూర్ మిషన్ భూభాగంలో 11,000 మంది జ్ఞానస్నానం పొందిన క్రైస్తవులు, 40,000 మంది జ్ఞానస్నానానికి సిద్ధపడే వారున్నారు. ఇంకా 189 మంది ఉపదేశులు, 95 చిన్న దేవాలయాలు, 2400 మంది విద్యార్థులతో 77 పాఠశాలలున్నాయి. వీరందరికి సువార్త పరిచర్య చేసే గురువులు అయిదుగురు మాత్రమే. గిరిజనుల మధ్య వేద పరిచర్యకు కాన్‌స్టంట్ గురువుల అభ్యర్థన మేరకు 1889లో బెల్జియం నుండి రెండు బృందాలుగా 18 మంది మిషనరీలు, అసన్‌సోల్ సెమినరీలో గురుపట్టం పొంది ముగ్గురు గురువులు వచ్చారు. మొత్తం 21 మంది జేసుసభ మిషనరీలు ఒకే సంవత్సరం రావటం ఆ ప్రాంతానికి నిజంగా గొప్ప దైవ ఆశీర్వాదంగా చెప్పుకోవాలి.

లీవెన్స్ 1889లో మిషన్‌లోని నూతన ప్రాంతాలను అన్వేషించి, తన సహాయకులను సువార్త బోధకు "దిగియా, సనారి, నోవగర్" మున్నగు ప్రాంతాలకు పంపాడు. లీవెన్స్ బార్వే ప్రాంతాన్ని అక్టోబరులో మొట్టమొదట సందర్శించాడు. అక్కడ ఒరాన్ తెగ గిరిజనులు దాదాపు 35000 మంది ఉన్నారు. వారిలో కొందరు రాంచీ న్యాయస్థానంలో అతనికి పరిచయమయ్యారు. వారి పక్షాన కోర్టులో పోరాడి, అనేక కేసులలో విజయం సాధించటంతో, లీవెన్స్ అంటే అందరికి అభిమానం, నమ్మకం ఏర్పడింది. వారి ఆహ్వానం మేరకు వారి నివాసగ్రామాలను సందర్శించాడు. వారు తమను కూడ క్రైస్తవ మతంలోనికి స్వీకరించమని లీవెన్స్‌కు మొరపెట్టుకున్నారు. ఆ తరుణంలో వారికి ఒక షరతు పెట్టాడు. గ్రామవాసులంతా ఒక్క త్రాటిపై నిలిచి, అందరూ జ్ఞానస్నానం కోరితేనే జ్ఞానస్నానమిస్తానని, వ్యక్తిగతంగా కాని, గ్రామంలో ఒక చిన్న గుంపుకాని అడిగితే, ఇవ్వనని చెప్పాడు, గిరిజనులు సమిష్టి జీవనానికి, తెగ పెద్దల నిర్ణయాలకు పెద్దపీట వేసి, కలిసిమెలిసి ఉండటం వారి నైజం. క్రైస్తవులుగా సమైక్యంగా ఉండటం, కలిసిమెలిసి పండుగలు చేసుకోవటం, అదే విధంగా వారంతా ఐక్యంగా ఉండటం వలన జమీందారుల, భూస్వాముల ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చని లీవెన్స్ నమ్మినందువలన, సామూహిక జ్ఞానస్నానమనే షరతు పెట్టాడు. దాని అంతరార్థాన్ని గ్రహించిన తెగ పెద్దలంతా, ఆయన అభిప్రాయాన్ని గౌరవించి, గ్రామస్తులంతా జ్ఞానస్నానం పొందసాగారు. కాన్‌స్టాంట్ లీవెన్స్ 1890 ఆగస్టు నుండి 14000 మంది పిల్లలకు, 4000 మంది పెద్దలకు బార్వే, మున్నగు

గ్రామాలలో స్వయంగా జ్ఞానస్నానమిచ్చి, ప్రభుని రాజ్యంలో చేర్చాడు. మరలా బార్వే ప్రాంతాన్ని 1890 డిసెంబరులో సందర్శించి, అక్కడ మారుమూల అరణ్య ప్రాంతాలకు వెళ్ళి, ఒక్క నెల రోజులలోనే 6000 మందిని క్రైస్తవ ధర్మంలోనికి స్వీకరించాడు.

లీవెన్స్ మాకుమ్మడిగా జ్ఞానస్నానాలిస్తున్నాడని, కొందరికి కతోలిక మతసత్యాలు తెలియనే తెలియవని అతనిపై నిందలు మోపారు. కాని ఏ ఒక్కరిని కూడ ప్రార్థనలు నేర్పకుండా, తన ఉపదేశుల ద్వారా సువార్త బోధించకుండా, క్రైస్తవ ధర్మం లోకి స్వీకరించలేదని లీవెన్స్ స్వయంగా సాక్ష్యమిచ్చాడు. బార్వే ప్రాంతాన్ని 1891 ఫిబ్రవరి నెలలో, ఏప్రిల్ నెలలో మొత్తం రెండు సార్లు సందర్శించాడు. ఆ సమయంలో దాదాపు 36000 మంది జ్ఞాన స్నానమివ్వమని ఆర్జీలు పెట్టుకొనగా, 23000 మందికి లీవెన్స్ జ్ఞానస్నాన మిచ్చాడు. కాన్‌స్టెంట్ నిర్విరామంగా మండుటెండలలో పని చేయటంతో, అతని శరీరం పూర్తిగా అలసిపోయింది. ఆ అడవులలో విషగాలికి అతనికి క్షయవ్యాధి అంటుకుంది. పెద్దల మాటలకు విధేయించి, చల్లని ప్రాంతమైన డార్జిలింగ్ కొండలలోని కర్సియాంగ్ లో కొన్ని నెలలు సేద దీరాడు. కర్సియాంగ్ చాలా ప్రశాంతంగా ఉంటుంది. అతడు ఎండనక, వాననక వళ్ళు హూనం చేసుకుంటూ చోటా నాగపూర్‌లో పనిచేసేటప్పుడు "ఫాదర్! మీరిలా పనిచేస్తే ఈ భారతదేశంలో ఎక్కువకాలం జీవించలేరు. మీ ఆరోగ్యం గురించి కొంత శ్రద్ధ తీసుకోవాలి" అని ఎవరైనా చెప్తే, దానికి వెంటనే "నేను ఎన్నాళ్లు జీవించానని కాదు. నాకు కావాల్సింది ఒక్కటే. ఇక్కడి ప్రజలకు మంచి చేయటమే నా ఏకైక లక్ష్యం. నేనెంత త్వరగా చేస్తే, అన్ని ఎక్కువ ఆత్మలను కాపాడగలుగుతాను. ఏ పనీ చేయకుండా వందేళ్లు బ్రతికే కన్నా, నిజమైన సేవచేస్తూ పదేళ్లు మాత్రమే బ్రతికినా చాలు"నని తన మనసులోని మాటను లీవెన్స్ బయటపెట్టాడు.

లీవెన్స్ కర్సియాంగ్‌లో విశ్రాంతి తీసుకున్న పిమ్మట చివరిసారి డిసెంబరు 20న బార్వే ప్రాంతం చేరుకున్నాడు. క్రైస్తవులందరిని పరామర్శించి, కతోలిక మత సత్యాలను లోతుగా తెలుసుకుంటూ, చక్కని క్రైస్తవులుగా జీవించమని వారందరికి హితోపదేశము చేశాడు. తన చివరి సందర్శనలో 1241 మందికి జ్ఞానస్నానాలిచ్చాడు. గురువంటే "నిత్యం మండే అగ్ని"లా ఉండాలని, సాతాను శక్తులను దహించివేస్తూ, పవిత్రాత్మ దేవుని కనుసన్నలలో, ప్రజలకోసం జీవించే వారిగా ఉండాలని విశ్వసించాడు. ప్రభుని మీద నమ్మకముంచి, ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తే, ప్రభువే నూరంతల ఫలితమొసగుతాడని లీవెన్స్ దృఢంగా నమ్మాడు. కరుణామయుని సహాయంతో వేలాది మందికి జ్ఞానస్నానమిస్తూ ఎన్నో చక్కని గిరిజన క్రైస్తవ సంఘాలను అనతి కాలంలోనే ఏర్పరచాడు. అతని వేదవ్యాపక కార్యాలలో పలు లోటుపాట్లు ఉన్నాయని ఎవరైనా అతనిని విమర్శిస్తే, "కొన్ని తప్పులు జరిగి ఉండవచ్చు. కాని నా పరిచర్య దైవచిత్తమైతే కలకాలం నిలుస్తుంది. లేదంటే కొద్ది కాలంలోనే ముక్కలవుతుంది" అని వినమ్రతతో జవాబు చెప్పేవాడు.

చోటా నాగపూరు మిషన్‌లో అనేక గడ్డు సమస్యలు ఎదురైనా కాని, వాటినన్నింటిని అతడు ప్రార్థన అనే ఆయుధంతో జయించాడు.

కాన్‌స్టంట్ లీవెన్స్ ఆరోగ్యం క్షయవ్యాధితో క్రమక్రమంగా క్షీణించింది. అందుచేత లీవెన్స్ ఆగస్టు 28, 1892న చోటా నాగపూర్ ప్రాంతాన్ని విడిచి, ఐరోపా ప్రయాణమయ్యాడు. నేపుల్స్, రోము నగరముల మీదుగా అక్టోబరు 28, 1892న డ్రోంగెన్‌లోని జేసుసభ నొవిషియేట్ చేరుకున్నాడు. అక్కడ పుస్తక పఠనంలో, ప్రార్థనలో తన కాలాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. తన స్వంత ప్రాంతానికి వచ్చినందున కొంత సంతోషంగా ఉన్నా, తన మనసంతా భారతదేశంలోనే ఉందని చెప్పేవాడు. అతడు మే 24, 1893న లేఖ వ్రాస్తూ," దేవుడు నన్ను మరలా భారతదేశం తీసుకొనివెళ్తాడో లేదో తెలియదు. ప్రభుని చిత్తమే నెరవేరాలి. నా ఆరోగ్యం బాగున్నా, బాగులేకపోయినా, నేను దేవుని పూదోటలో నిరంతరం శ్రమించాను. అక్కడక్కడ కొన్ని తప్పులు దొర్లాయి. ఇప్పుడు వాటికి నగచి, ఏమీ ప్రయోజనం లేదు" అని ప్రభుని చేతులలో తన భవితవ్యాన్ని ఉంచాడు. అతని పరిస్థితి రోజు రోజుకు దయనీయమైంది. కాన్‌స్టంట్ లీవెన్స్ తన చివరి దివ్య పూజాబలిని ఆగస్టు 15న సమర్పించి, ప్రభుయేసుకు కృతజ్ఞతా వందనములు తెలిపాడు. మరియతల్లి శరణు వేడుకున్నాడు. అతని పరిస్థితి విషమించడంతో, అనాడే అతడిని లూవెన్ పట్టణం చేర్చారు. కాన్‌స్టంట్ లీవెన్స్ నవంబరు 6న వ్యాధిగ్రస్తుల అభ్యంగనము స్వీకరించి, నవంబరు 7, 1893న తన ఆత్మను ప్రభుయేసుకు సమర్పించాడు. అప్పటికి అతని వయస్సు ముప్పయి ఏడేండ్లే.

కాన్‌స్టంట్ లీవెన్స్ గిరిజన ఆదివాసీల మధ్య పని చేసినది పది సంవత్సరాలు మాత్రమే అయినప్పటికి, వారి జీవితాలలో అతడు చెరగని శాశ్వత ముద్ర వేశాడు. అతడు నాటిన విత్తనం, ప్రభుని దీవెనతో ఇప్పుడు ఎంతో పెరిగి, పెద్దదై, వటవృక్షమై బీహారు, ఝార్ఖండ్, బెంగాలులలో చక్కని విశ్వాసమనే పునాదులపైన గొప్ప విశాలమైన శ్రీసభ నిర్మితమైంది. చోటా నాగపూర్ ప్రాంతం లక్షలాది మంది క్రైస్తవులతో, వేలాదిమంది గురువులు, మఠకన్యలతో ఆదివాసి శ్రీసభ భారతదేశంలో చక్కగా ప్రభునికి జయజయ ధ్వానాలు చేస్తూ భాసిల్లుచున్నది.  లీవెన్స్ ఆత్మ గిరిజన క్రైస్తవ సంఘంలో ఇప్పటికీ సజీవంగా ఉంది. కాన్‌స్టంట్ లీవెన్స్ మరణ శత వార్షికోత్సవ సందర్భంగా బెల్జియం దేశమందలి లూవెన్‌లోని అతని భౌతిక అవశేషాలను కొనివచ్చి, రాంచి పట్టణమందలి పునీత మరియమ్మ గారి దేవాలయంలో నవంబరు 7, 1993న భద్రపరచారు. కాన్‌స్టంట్ లీవెన్స్ శ్రీసభకు చేసిన విశిష్ట సేవలకు, విశాలమైన చక్కని గిరిజన కతోలిక సంఘ స్థాపనకు, ఇంకా అతని వీరోచిత పుణ్యజీవితమునుబట్టి బెల్జియం లోని బ్రుగ్గె మేత్రాసనం అతని పునీత పట్టా ప్రక్రియను మార్చి 15, 2001న ప్రారంభించి, కాన్‌స్టంట్ లీవెన్స్‌ను "దైవ సేవకులు" గా ప్రకటించి గౌరవించింది.



## పునీత అన్నమ్మ సత్యోపదేశ సభ సంస్థాపకులు

# 16. దైవ సేవకులు సిల్వియో పాస్క్వాలి

**(1864-1924)**

**ఫాదర్ గోపు జోసఫ్ కిరణ్ కుమార్, S.J.**

సిల్వియో పాస్క్వాలి ఇటలీ దేశమందలి క్రెమోనా పట్టణ సమీపంలోని పిచెనెంగో నందు ఏప్రిల్ 5, 1864న పౌల్ పాస్క్వాలి, రెస్కాగ్లియో మరియ తెరెసా అను పుణ్య దంపతులకు జన్మించాడు. అతనికి ఏప్రిల్ 10న జ్ఞానస్నానంలో అబ్రామో సెకొందో సిల్వియో అను నామకరణం గావించారు. వారు వ్యవసాయదారులు. వారి కుటుంబం, సిల్వియో బాల్యంలో ఉన్నప్పుడే క్రెమోనా నగరంలోని పునీత అబ్బోందియో విచారణకు తమ నివాసాన్ని మార్చుకుంది. అక్కడ లొరెట్టో మరియమాత దేవాలయం ఉంది. ఆ దేవాలయమన్నా, అందున్న లొరెట్టో మాత అన్నా అతనికి ఎంతో ఇష్టం. బాల్యం నుండి అతనికి మరియమాత పట్ల ఎనలేని గౌరవం, ప్రేమ ఉంది. ఆమె అనుగ్రహం ద్వారా సిల్వియో గురువుగా, వేద ప్రచారకునిగా దైవ పిలుపు అందుకున్నాడు.

“పూవు పుట్టగానే పరిమళించునన్నట్లు”, సిల్వియో బాల్యం నుండియే ప్రభు సేవ చేయాలనే కోరిక అతని మదిలో మొలకెత్తింది. కనుక అతడు పన్నెండేళ్ళ ప్రాయంలోనే గురుశిక్షణా కేంద్రంలో చేరాడు. అతడు తత్వ, వేదాంత శాస్త్రాలు నిష్ఠతో చదివి, క్రీస్తు ప్రభుని రాజ్యమును, దాని విశాలతను, లోతులను క్రమక్రమంగా తెలుసుకున్నాడు. అతడు తన శిక్షణానంతరం సెప్టెంబరు 14, 1887న ఉప గురువుగాను, డిసెంబరు 17, 1887న గురువుగాను పట్టాభిషిక్తుడయ్యాడు.

సిల్వియో, జెనివోల్తా విచారణ సహాయక గురువుగా మూడేండ్లు ఉత్సాహంతో పనిచేశాడు. అక్కడి ప్రజలకు అతడు ఆధ్యాత్మికంగానే కాకుండా, సామాజికపరంగా కూడా ఎన్నో సేవలందించాడు. ప్రజల హక్కుల పరిరక్షణకు పాటుపడుతూ, ప్రజలను సంఘటితపరచి, కొన్ని సంఘాలుగా ఏర్పరచి, వారిని చైతన్యపరిచాడు. అనంతరం అతనిని క్రెమోనా పట్టణమందలి పునీత అగతమ్మగారి పెద్ద దేవాలయ విచారణకు సహాయకులుగా పంపారు. అక్కడ తనకు, తన క్రైస్తవుల మనస్సులకు నచ్చిన గొప్ప గొప్ప కార్యక్రమాలను ఎంతో ఇష్టంగా చేసి, ప్రజల మన్ననలను, ఆదరాభిమానాలను పొందాడు. సిల్వియో గురువుగా పాప సంకీర్తనాలు వినడంలో శ్రద్ధ చూపించాడు. అతడు చక్కగా తయారై, మంచి ప్రసంగాలిచ్చేవాడు.

ఇటలీలోని లొంబార్దియా పీఠాధిపతుల ఆశీస్సులతో, అంజెలో రమజ్జోత్తి గురువులు

'ఫారిన్ మిషన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిలాన్' (PIME) అను వేద ప్రచారక సంస్థను జూలై 30, 1850లో స్థాపించారు. ఈ గురువులు విదేశాలు వెళ్ళి ప్రభు సువార్తను బోధించి, దైవరాజ్య స్థాపనకు కృషి చేస్తారు. సిల్వియో ఈ గురువుల గురించి, వారి సాహసోపేత వేదప్రచారం గురించి తెలుసుకుని, వారి మిషనరీ సేవలపట్ల, ఆ సంస్థ పట్ల, ఆకర్షితుడయ్యాడు. తన క్రెమోనా పట్టణంలో ఆ మిషనరీ గురువులంటే ఎంతో గౌరవముండటాన్ని గమనించాడు. పవిత్రాత్మ ప్రేరితుడై, తాను కూడ ఆ సంస్థలో చేరాలని, శ్రీసభ వ్యాప్తికి నడుం కట్టాలని సిల్వియో నిర్ణయించుకున్నాడు. తన మనసులో రగులుతున్న కోరికను తన పీఠాధిపతులకు తెలియజేసి, మిషనరీగా పనిచేయటానికి అనుమతి నివ్వమని ప్రాధేయపడ్డాడు. తన పీఠం నుండి ఒక యువ గురువును వదలుకోవటం తనకు బాధను కలిగిస్తున్నా, తొమ్మిదవ భక్తినాథ పాపుగారి తలంపులకనుగుణంగా ఏర్పడిన ఈ సంస్థలో, మిషనరీ గురువుగా పంపటానికి స్థానిక పీఠాధిపతులు ఆమోదించారు. వివిధ దేశాలలో క్రైస్తవేతరులకు సువార్తనందించే వేదప్రచారక సంస్థలో తాను కూడా భాగస్తుడు కాబోతున్నందుకు సిల్వియో ఎంతో సంతసిల్లాడు. ఎప్పుడెప్పుడు విదేశాలకెళ్ళి ప్రభుసేవ చేద్దామా అని కలలు కంటూ, ఆగస్టు 17, 1896న సిల్వియో, క్రెమోనా నుండి మిలాన్‌లోని తన నూతన ఆత్మీయ కుటుంబమగు PIME సంస్థ లోనికి అడుగుపెట్టాడు.

భారతదేశమందలి హైదరాబాదు తొలి పీఠాధిపతులు పీటర్ కాప్రొత్తి చికిత్స నిమిత్తం మిలానులో కొంతకాలం ఉన్నారు. వారు సిల్వియోలో ఉన్న ఉత్సాహాన్ని, అతని కళ్ళలోని మెరుపుని గమనించారు. పీఠాధిపతులు సిల్వియోను పలుకరిస్తూ "హైదరాబాదులో నీ కోసం ఎదురు చూస్తుంటాను" అని ఆశాభావాన్ని, దానితో పాటు తన ఆహ్వానాన్ని వ్యక్తపరిచారు. దానికి బదులుగా సిల్వియో "పెద్దలు నన్ను పంపితే, ఇష్టపూర్తిగా నేనొస్తాను" అని సవినయంగా వెంటనే బదులిచ్చాడు. భారతదేశం వెళ్ళే సమయం అతి త్వరలో రానే వచ్చింది. సిల్వియో మునుముందుగా సెప్టెంబరు 1897లో తన ఇంటికి వెళ్ళాడు. తన కుటుంబ సభ్యులకు, బంధు మిత్రాదులకు వీడ్కోలు పలుకుతూ "మనం మరలా పరలోకంలో కలుసుకుందాం" అని చెప్పి, వారి నుంచి సెలవు తీసుకున్నాడు. తన వేదవ్యాపక పరిచర్యకు జగద్గురువులు పదమూడవ సింహరాయుల దీవెనలు టెలిగ్రాం ద్వారా పొందాడు. సిల్వియో భారతదేశానికి ఇతర మిషనరీలతో కలసి ట్రియస్తె ఓడరేవు నుండి సెప్టెంబరు 26, 1897లో బయలు దేరాడు. వారంతా సుదీర్ఘ ప్రయాణం చేసి, అక్టోబరు 18, 1897న బొంబాయికి చేరుకున్నారు. అక్కడ నుండి అక్టోబరు 20న హైదరాబాదు బయలుదేరారు.

అప్పటి హైదరాబాదు, నిజాం రాజుల యేలుబడిలో ఉన్నది. నిజాం రాజ్యంలోని తెలుగు, కర్ణాటక, మహారాష్ట్ర లలో కొన్ని ప్రాంతాలు కలిపి హైదరాబాదు కేంద్రంగా ఒకే ఒక మేత్రాసనముంది. సిల్వియో పాస్క్వాలి కర్ణాటకలోని ముద్గళ్ విచారణకు సహాయ

గురువుగా నియమించబడ్డాడు. సిల్వియో ముందుగా ముద్గళ్ విచారణలోని భాగమైన రాయచూరులో నివాసముంటూ, తన మిషనరీ సేవలను ప్రారంభించాడు. రాయచూరులో ఒక చిన్న దేవాలయం, దానికి అనుబంధంగా పూజా సామాగ్రి పెట్టుకునే చిన్నగది మాత్రమే ఉన్నాయి. అక్కడ గురువుకు ఇల్లంటూ ఏమీ లేదు. రాయచూరులో నివాసమున్న తొలి గురువు సిల్వియోనే. పూజ సామాగ్రి గదినే సిల్వియో తన నివాసంగా చేసుకుని, దైవ సేవ చేయటం మొదలుపెట్టాడు. అది కన్నడ ప్రాంతం కావడంతో, కన్నడ భాష నేర్చుకున్నాడు. అక్కడ పనిచేస్తూ, చుట్టుప్రక్కల గ్రామాలైన కలుమెలె, దినుయిలలో సువార్త ప్రచారం నిర్వహించాడు. మఠకన్యల సహకారంతో, సువార్త సేవ ఎంతో చక్కగా చేసి, పంట యెక్కువగా కోయవచ్చునని, దైవరాజ్యం త్వరగా విస్తరిల్లుతుందని సిల్వియో భావించాడు. తదనుగుణంగా సికింద్రాబాదులో ఉన్న సెయింట్ ఆన్ ఆఫ్ ప్రొవిడెన్సు మఠకన్యలను 1899 జనవరిలో రాయచూరుకు ఆహ్వానించాడు. తన నివాస గృహాన్ని మఠకన్యలకిచ్చి, సిల్వియో ఒక చిన్న గుడారము ఏర్పరచుకుని, అందులో అతి సామాన్యంగా జీవించాడు. అక్కడ మఠకన్యల కాన్వెంటు, వైద్యకేంద్రం, పాఠశాల నిర్మాణము పూర్తయ్యే వరకు, అసౌకర్యమైనప్పటికి సిల్వియో ఆ చిన్న గుడారంలోనే నివసించాడు. మహిళల పట్ల, మఠకన్యలపట్ల, వారి సేవల పట్ల సిల్వియోకు ఉన్న అపార గౌరవానికి అది గొప్ప తార్కాణంగా చెప్పవచ్చును.

1900 సంవత్సరంలో క్రీస్తు ప్రభుని మరణ పునరుత్థానాల జూబిలీ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన ప్రేమసామ్రాజ్యాన్ని దశదిశలా వ్యాపింపజేయాలని పాస్కాలి ఎంతగానో కాంక్షించాడు. ఆ ప్రభుప్రేమను ప్రకటించే రక్షణ సిలువను రాయచూరులోని ఎత్తైన కొండ శిఖరంపై ఘనంగా ప్రతిష్టించి ప్రభుని మహిమ పరచాలని, తద్వారా ఆ పవిత్ర స్మారక చిహ్నం క్రైస్తవ విశ్వాస కాంతి పుంజమై ప్రకాశింపగలదని ఆయన ప్రగాఢమైన వాంఛ. అయితే ఆ కల కలగానే మిగిలిపోయింది. కాని అతడు నిరుత్సాహం చెందకుండా, మరింత ఎక్కువ మంది హృదయ పీఠాలపై యేసుప్రభుని ప్రతిష్టించాలని, ఇంకా ఎక్కువ కృషి చేసాడు. భీర్ మిషన్‌లో వున్న గురువులు ఒపీలియో నెగ్రి కలరా సోకి 1900 మార్చి నెలలో ఆకస్మికంగా మరణించాడు. అందుచే బిషప్, సిల్వియో పాస్కాలిని భీర్‌కు తాత్కాలికంగా మిషన్‌లో సహాయం చేయుటకు పంపారు. రాయచూరు నుండి ఎడ్లబండిలో ప్రయాణం చేసి, మూడు రోజులకు భీర్ చేరుకున్నాడు. ముందుగా నెగ్రి గురువుల సమాధివద్దకు వెళ్ళి కన్నీటి ప్రార్థన చేశాడు. భీర్ చాలా పెద్ద మిషన్ కేంద్రం. అది కరువుకాలం. పైగా కలరా అంటురోగం. ఆకలి దప్పులతో ఉన్న పేదలకు, కలరా రోగులకు, దీనజనులకు సేవా పరిచర్యలను అందించటంతో పాస్కాలి తన యాజక పరిచర్యను ఆరంభించాడు. తీవ్రంగా వ్యాధి బారిన పడిన రోగులకు అండగా ఉంటూ, వారికి చికిత్స చేసి, మంచి సదుపాయాలు కల్పించేందుకు, మరణావస్థలోని పసిబిడ్డలకు జ్ఞానస్నానమిచ్చేందుకు కొన్ని సహాయ బృందాలను ఏర్పరచుకుని, వారి ద్వారా పాస్కాలి

విశిష్ట సేవ చేశాడు. అప్పటిలో ఎక్కడ చూచినా ఆకలితో అలమటించే కుష్ఠరోగులే ఆయనకు ఎదురయ్యారు. వారిని చూసి ఆయన హృదయం ద్రవించి పోయింది. కుష్ఠ వ్యాధితో మొద్దు బారిన రెండు చేతులతో గుప్పెడన్నం కోసం ఒక పేద స్త్రీ అర్థించే సంఘటన పాస్క్వాలి మనసును కలచివేసింది. ఆ హృదయ విదారక సంఘటనతో అతనికి రెండు రోజులు కునుకు పట్టలేదు. ఆ అభాగ్యులను సేవిస్తే, సాక్షాత్తూ దేవుణ్ణి సేవించినట్లేనని అతడు భావించాడు.

ఆ ప్రాంతంలో కలరా వ్యాధి తగ్గుముఖం పట్టిన తరువాత కూడా, పాస్క్వాలి క్రైస్తవ గ్రామాలను సందర్శించి, తన యాజక పరిచర్యపై దృష్టిని సారించాడు. 1900 పవిత్ర సంవత్సరం పాస్కా ప్రత్యేక ఫలాలు అందరు పొందాలనే ఉద్దేశ్యంతో పాపుగారు ఆ పవిత్ర కాలాన్ని మరుసటి సంవత్సరం వరకు పొడిగించారు. ఆ అవకాశాన్ని బట్టి పాస్క్వాలి 1901 జూన్‌లో సుదూరంగా ఉన్న గ్రామాలకు వెళ్ళి, పూజలు నిర్వహించాడు. ఆ రోజులలో ఎక్కడకు వెళ్ళినా ఎడ్లబండి ప్రయాణమే. రోడ్లన్నీ మట్టి రోడ్లే. అవి కూడా గుంతలతో నిండి ఉంటాయి. గుంతల రహదారులపై ఎడ్లబండి ప్రయాణం చాలా అలసటను, శరీర కష్టాన్ని కలిగిస్తుంది. వర్షాకాలమైతే బండి చక్రాలు బురదలో దిగబడి పోవటం, ఎద్దులు లాగలేక పోవటం, గురువు క్రిందకు దిగి బురదలో నడవటం, ఆ రోజులలో సర్వసాధారణంగా జరుగుతూనే ఉంటుంది. కాని సిల్వియో ఎంత దూరమైనా అన్ని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి, ప్రజల విశ్వాసాన్ని గట్టి పరుస్తూ, తన ప్రేషిత కార్యాన్ని చాలా సమర్థవంతంగా నిర్వహించాడు. కతోలిక విశ్వాసుల గ్రామాలు చాలా దూరమైనా, ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న సిల్వియో పాస్క్వాలి హృదయానికి మాత్రం వారంతా చాలా దగ్గరివారే. పగలంతా ఒక గ్రామ విశ్వాసుల మధ్య విరామం లేకుండా పనిచేసి, రాత్రంతా ఎద్దుల బండిలో ప్రయాణించి, దూరంగా ఉన్న మరో కతోలిక గ్రామం చేరుకుని, సిల్వియో ఉదయాన్నే అక్కడ దివ్యబలిపూజ సమర్పించేవాడు.

పాస్క్వాలి కన్నడ, మరాఠా ప్రాంతంలోని రాయచూరు, భీర్ జిల్లాలలో విస్తృతంగా పర్యటించి, ప్రేషిత కార్యములో మెళకువలు నేర్చుకున్న పిదప, 1902లో నల్గొండ ప్రాంతంలో ఉన్న మఠంపల్లికి బదిలీ అయ్యాడు. గుంటూరు సీమలోని కతోలికులు కృష్ణానదిని దాటి మఠంపల్లి, భీమారం, వంగమర్తి, నర్మెట్ట, నందనం మున్నగు గ్రామాలకు సామూహికంగా వలసలు వచ్చి, నూతనంగా "గుంటూరు పల్లెలు"గా గ్రామాలు ఏర్పరచుకున్నారు. వారంతా చిన్నకారు వ్యవసాయదారులు. కాని విశ్వాసంలో ఘనులు. ఆ విధంగా ఏర్పడిన నూతన గ్రామాల్లో ఒకటి మఠంపల్లి. ఈ గ్రామమందున్న కతోలికులందరు కృష్ణాపురం, మదిగుబ్బ, పరిసర గ్రామాల్లో జేసుసభ గురువులచే జ్ఞానస్నానం పొంది, వివిధ కారణాలతో నెల్లూరు, గుంటూరు ప్రాంతమునకు వలస వచ్చిన సంప్రదాయక క్రైస్తవులు. నైజాం రాజ్యంలోని సారవంతమైన నల్లరేగడి భూములను వెతుక్కుంటూ రెంటచింతల నుండి తరలి వచ్చిన కతోలికులు, 1890లో మఠంపల్లి గ్రామంలో స్థిరపడ్డారు. సిల్వియో పాస్క్వాలి మఠంపల్లికి బదిలీ అయిన వెంటనే,

ముందుగా తెలుగు భాషను నేర్చుకుని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని, వారిని ఆధ్యాత్మికంగా, విశ్వాసంలో నడిపించడానికి ఎంతో ప్రయాసబడ్డాడు. ప్రథమంగా అక్కడ యువకులకు ఉపదేశులుగా శిక్షణనిచ్చాడు. ఉపదేశులకు శిక్షణ ఇవ్వటంకన్నా ప్రియమైనది ఆయనకు మరొకటి లేదు. తన గురుత్వ రజతోత్సవ సందర్భంగా ఇటలీనందలి క్రెమోనా లోని తన బంధుమిత్రులు అందించిన విరాళాలన్నీ, సిల్వియో ఉపదేశుల కేంద్రానికి బహుమతిగా ఇచ్చాడు. అక్కడ ఒక గురు నిలయాన్ని, ఒక పెద్ద దేవాలయాన్ని నిర్మించి 'మంగళవార్త దేవాలయం'' అని నామకరణం చేశాడు. ఆరు సంవత్సరాల్లోనే మఠంపల్లి మిషన్ కేంద్రాన్ని ఒక విచారణ స్థాయికి ఎదిగేలా చేశాడు. అతని కృషికి ఫలితంగా పీఠాధిపతి పీటర్ విగానో 1908 జనవరిలో మఠంపల్లిని విచారణగా ప్రకటించి, పాస్క్వాలి గురువునే ప్రప్రథమ విచారణ గురువుగా నియమించారు.

పాస్క్వాలి గురువులు మఠంపల్లిని, మఠంపల్లి విచారణ ప్రజలను ఎంతగానో ప్రేమించాడు. అతడు అక్కడ సేవలందించిన పదహారు సంవత్సరాలు కూడా ఎంతో ఉత్సాహంతో సువార్త ప్రబోధం చేసి, మఠంపల్లి దైవక్షేత్రంలో విశ్వాసమనే గొప్ప మణులు, మాణిక్యాలు పండించాడు. అందుకే ఆయనను మఠంపల్లి ప్రజలు ఆప్యాయంగా 'మహాత్ముడ'ని పిలుచుకుంటారు. అక్కడి ప్రజలలో మరియమాత పట్ల ఎంతో భక్తి, గౌరవభావాల్ని పెంపొందింపజేసాడు. పాస్క్వాలి తన సారథ్యంలో శిక్షణనిచ్చి, ఎందరో ఉపదేశులను తయారుచేసి, వారి సాయంతో క్రీస్తు ప్రభుని సువార్తను అనేక పల్లెలలో బోధించాడు. ఇంకా మరింత ఎక్కువ మందిని ప్రభుని శిష్యులుగా మలచాలని అతనిలో మరో తీరని ఆత్మల దాహం ఉంది. ఆ ఆత్మల దాహమే, సిల్వియో చేత ''పునీత అన్నమ్మగారి సత్యోపదేశ సభ'' సంస్థాపనకు పునాది వేసేలా చేసింది. తన మనస్సులో ఈ ప్రేరణ కలిగిన కొద్ది రోజుల్లోనే ఇద్దరు బాలికలు పాస్క్వాలి వద్దకు వచ్చి, మాకు మఠకన్యలు కావాలని కోరిక ఉందని చెప్పడంతో, దానిని దైవ చిత్తంగా భావించి, మఠకన్యల సభను స్థాపించుటకు పాస్క్వాలి ముందుకు వచ్చాడు. తన విచారణ గ్రామాల నుండి మొత్తం ఏడుగురు యువతులను ఒక బృందంగా చేసి, వారికి 'సెంట్ ఆన్ ఆఫ్ ప్రావిడెన్స్' మఠకన్యలతో తర్ఫీదు నిప్పించాడు. ఆ విధంగా పునీత అన్నమ్మ గారి సత్యోపదేశ సభ జనవరి 6, 1914న స్థాపించబడింది. అందులో ప్రథమ బృందమైన ఏడుగురు మఠకన్యలు మార్చి 25, 1918న ప్రత్యేకముగా మఠ వస్త్రములు స్వీకరించి, మూడు వ్రతముల ద్వారా తమ్ము తాము దేవునికి సంపూర్ణంగా సమర్పించుకున్నారు. మఠంపల్లి నుండి తమ మఠకేంద్రాన్ని నందనం అను గ్రామానికి మార్చుకున్నందున, నందనం అన్నమ్మగారి సభగా వాడుకలోనికి వచ్చిన ఈ సత్యోపదేశ సభకు సంస్థాపకుడు సిల్వియో పాస్క్వాలి. ఆ సభ మూలకేంద్రం మఠంపల్లి గ్రామం. సత్యోపదేశ సభ పాలన, తర్ఫీదు బాధ్యతలను చాలా సంవత్సరాల పాటు ప్రావిడెన్సు మఠకన్యలు నిర్వహించారు.

హైదరాబాదు పీఠాధిపతులు విస్మారా మార్చి 12, 1943న ఈ సభకు మేత్రాసన మఠంగా గుర్తింపునిచ్చారు. సిస్టర్ తాతిరెడ్డి ఎఁరికెట్టను వారి మొదటి సుపీరియర్ జనరలుగా జనవరి 5, 1954న ఎన్నుకొనడంతో ఆ సభ స్వయంప్రతిపత్తిని పొందింది.

పాస్క్వాలి 1915లో కృష్ణాజిల్లా లోని పెద్ద అవుటుపల్లికి బదిలీ అయ్యాడు. అప్పటికే అక్కడ హ్యూగో పెజ్జోని గురువులు ఒక మంచి దేవాలయాన్ని, గురువుల బంగళాను నిర్మించాడు. అక్కడ సామాజిక పరిస్థితులు భిన్నమైనా, తన విశేష అనుభవంతో బడుగు, బలహీన వర్గాల కతోలికుల మధ్య పనిచేసి, వారిలో ఒకరిగా కలసిపోయి, వారి అభిమానానికి పాత్రుడయ్యాడు. దళితులైన కతోలికులకు, అగ్రవర్ణాలైన హిందువులకు మధ్య ఏర్పడే తగాదాలను పరిష్కరించడంలో అతడు ఎనలేని ధైర్యాన్ని, వివేకాన్ని, ప్రజ్ఞను చూపించాడు. అతడు ఎప్పుడూ న్యాయం వైపు మాట్లాడతాడనే మంచిపేరును సంపాదించాడు. భూమిలేని నిరుపేదలకు భూమి అవసరమని, ప్రభుత్వానికి అర్జీలమీద అర్జీలు పెట్టి, ఎన్నో ఎకరాల బీడు భూములను ఉచితంగా పేద క్రైస్తవులు పొందేలా చేశాడు. 1912 నుండి కృష్ణాజిల్లాలో దళితులు క్రైస్తవ విశ్వాసం స్వీకరించటానికి ఒక ఉద్యమంలా ముందుకు వచ్చారు. ఎందరో మిషనరీలు ఈ ఉద్యమంలో భాగమై పనిచేసినప్పటికి, సిల్వియో పాస్క్వాలి మాత్రమే "దళితుల అపోస్తులుడు"గా పేరు పొందాడు. అతని హయాములో చుట్టు ప్రక్కల గ్రామాలైన కొండ పావులూరు, ఆజ్జంపూడి, అల్లాపురం, అవుటుపల్లి, కొయ్యగూరపాడు, పెరికీడు, బొమ్మలూరు తదితర గ్రామాలలో పెద్ద సంఖ్యలో క్రైస్తవ మతం స్వీకరించారు. విజయవాడ పరిధిలో సిల్వియో తన నిరాడంబరతతో, పుణ్య జీవితంతో క్రైస్తవ మతానికి గొప్ప ఖ్యాతిని తెచ్చాడు.

పాస్క్వాలి గురువు సమర్థతను గమనించిన పీఠాధిపతులు, 1917 ఏప్రిల్‌లో సిల్వియోను ప్రొటెస్టాంట్‌లకు కేంద్రంగా నిలిచిన ఏలూరుకు బదిలీ చేశారు. అప్పటికి సిల్వియోకు యాభై మూడేండ్లు. పొడవాటి గడ్డంతో ఉండేవాడు. అతని పవిత్రమైన జీవన విధానానికి, సాధు స్వభావానికి ఆకర్షితులై, లింగంపాడు, రంగాపురం, ఆగడాల్లంక, శనివారపుపేట, కనుమోలు, దోసపాడు, అప్పనవీడు మున్నగు గ్రామాల ప్రజలు కతోలిక విశ్వాసాన్ని స్వీకరించారు. 1918లో వట్లూరు నందు 400 మందికి జ్ఞానస్నానమిచ్చి, అక్కడ కతోలిక సంఘాన్ని చాలా పెద్దది చేశాడు. 1921లో దెందులూరులో ఒకే రోజు 700 మందికి కతోలిక జ్ఞానస్నానమిచ్చాడు. అదేవిధంగా పెదపాడు సంఘంలో సత్యోపదేశం చక్కగా నేర్పించి, పలువురికి జ్ఞానస్నానమిచ్చాడు. పాస్క్వాలి నూతన విశ్వాసులకు కతోలిక మత సత్యాలను విపులంగా బోధించి, ప్రార్థనలు నేర్పించి, కతోలిక ధర్మంలోకి స్వీకరిస్తున్నాడా లేదా యని విస్మారా పీఠాధిపతులు స్వయంగా పరీక్షించి, తెలుసుకోగోరాడు. వారు ఒక నడిరేయి అకస్మాత్తుగా గుడివాడ వచ్చి, పెదపాడు నుండి ఉపదేశులను, కతోలికులను అక్కడికి పిలిపించి, వారి కతోలిక విశ్వాసం గురించి అనేక ప్రశ్నలు అడిగాడు. వారు సరియైన జవాబులు చెప్పటంతో పీఠాధిపతులు ఎంతో

సంతృప్తిపడ్డారు. పాస్క్వాలి తొందరపడి, ఎటువంటి శిక్షణ ఇవ్వకుండా, ఎవరికీ జ్ఞానస్నాన మివ్వలేదు. సిల్వియో పాస్క్వాలి కతోలిక మత సత్యాల గురించి, కతోలికులు చెప్పే అనుదిన ప్రార్థనల పుస్తకాలను ముద్రించి, ఉపదేశులకు, క్రైస్తవులకు అందజేసి, విశ్వాసాన్ని స్థిరపరచాడు.

సిల్వియో పాస్క్వాలి సేవా ప్రస్థానంలో ఆఖరి మజిలి ఏలూరు. అక్కడ ఏడు సంవత్సరాలు పరిచర్య చేసి, దైవరాజ్యాన్ని బహుగా విస్తరింపజేసాడు. 1916 నుండి ఆయన మూత్ర పిండాల్లో రాళ్ళ సమస్యతో బాధపడ్డాడు. 1920లో చాలాకాలం పాటు జీర్ణాశయం, ప్రేవుల సమస్యతో ఇబ్బంది పడ్డాడు. సిల్వియో ఏలూరుకు మూడు మైళ్ళ దూరంలో ఉన్న ముప్పర్రు గ్రామానికి దివ్యబలి పూజ సమర్పించేందుకు జూన్ 22, 1924న వెళ్ళాడు. అది వర్షాకాలమైనప్పటికీ ఉష్ణోగ్రత 45 డిగ్రీలపైగా ఉంది. ఆ వేడిమికి ఎంతో ఉక్కపోత పోసింది. పాస్క్వాలి శరీరమంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది. ఆ వడదెబ్బతో మంచాన పడి, మూడు రోజులు తీవ్ర జ్వరంతో బాధపడ్డాడు. 4వ తేది నెల మొదటి శుక్రవారంనాడు దివ్య బలిపూజ సమర్పించాడు. ఆ ఆదివారం నాడు తన గృహములోని వరండాలో కూర్చుని, దివ్య బలిపూజలో పాల్గొన్నాడు. ఆ సాయంత్రమే జ్వరం, తలనొప్పి ఎక్కువ కావటంతో వ్యాధిగ్రస్తుల అభ్యంగాన్ని స్వీకరించి, తన మరణానికి ఆయత్తమయ్యాడు. ఆ సమయంలో అతడు "మనం ఈ లోకాన్ని విడిచి వెళ్ళడం సంతోషమే కదా! నేను పరలోకానికి వెళ్తున్నాను" అని పలుకుతూ సిల్వియో పాస్క్వాలి జూలై 7, 1924 వేకువ జామున తన ఆత్మను దేవునకప్పగించాడు. అతనిని ఏలూరులోని పునీత మైఖల్ గారి దేవాలయంలో భూస్థాపితం చేశారు. అన్నమ్మగారి సత్యోపదేశ మఠకన్యలు పినకడిమిలో సిల్వియో గురువుల స్మారకాన్ని "హోలీ లాండ్"గా అభివృద్ధి పరచారు.

"సిల్వియో పాస్క్వాలి నిరాడంబరతకు, విశ్వసనీయతకు, దాతృత్వానికి మారు పేరు. దేవునిపై పరిపూర్ణ నమ్మకంతో, దైవచిత్తానికి వినయ విధేయతలతో తలయొగ్గి, తన వదనంపై చెరగని చిరునవ్వుతో, క్రీస్తు ప్రభువు కోసం ఎన్నో గొప్ప కార్యాలను చేశాడు. అతడు కేవలం ఒక గురువే కాదు. పునీతులుగా ఎంచదగినవాడు" అని పాస్క్వాలి గురించి సోదర గురువైన లియొంచీని చెప్పిన మాటలలో అతిశయోక్తి లేదు. సిల్వియో పాస్క్వాలి ఆధ్యాత్మికతను జ్ఞాపకం చేసుకొంటూ ఆయన మధ్యస్థంద్వారా ప్రార్థించే విశ్వాసులు ఎన్నో మేలులు, స్వస్థతలు పొందుతున్నామని సాక్ష్యాలు చెబుతున్నారు. ఏప్రిల్ 25, 2015న పలువురు పీఠాధిపతులు, గురువులతో కలిసి ఏలూరు పీఠాధిపతులు పొలిమెర జయరావు గారు దివ్యపూజాబలి నిర్వహించి, వేలకొలది కతోలిక విశ్వాసులు, పాస్క్వాలి స్థాపించిన పునీత అన్నమ్మగారి సత్యోపదేశ మఠకన్యలు, ఇతర మఠకన్యల సమక్షంలో సిల్వియో పాస్క్వాలిని "దైవ సేవకులు"గా అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అది నిజంగా PIME సంస్థకు, పునీత అన్నమ్మగారి సత్యోపదేశ మఠకన్యల సభకు, తెలుగు శ్రీసభకు ఎంతో గర్వించదగిన పర్వదినం.



## గోవా పీఠపు గురు రత్నం

# 17. పూజ్యులు ఆగ్నెల్ డి సూజ

**(1869-1927)**

బ్రదర్ దుర్గం వంశీ S.J.

ఆగ్నెల్ డి సూజ ఉత్తర గోవాకు చెందిన అంజునా గ్రామంలోని మిగువెల్ ఆర్కాంజో డి సూజ, మరియు సిన్ఫోరోసా పెర్పెతువ అను కతోలిక దంపతులకు జనవరి 21, 1869లో జన్మించాడు. వారిది చాలా పెద్ద కుటుంబం. వారికి ఎనిమిది మంది కుమారులు, ఒక కుమార్తె. అతడు ఆరవ సంతానం. అతని పూర్తి పేరు ఆగ్నెలో గుస్తావొ అడాల్ఫ్ డి సూజ. అందరూ అతనిని ఆగ్నెల్ అని పిలిచేవారు. అతడు బాల్యంనుండి కూడా వినయ విధేయతలతో, భక్తి విశ్వాసములతో, దైవ చింతనలో జీవించాడు. తండ్రి అతనిని మంచి క్రమ శిక్షణలో, తల్లి చక్కని దైవ భయంతో పెంచారు. అతనికి జ్ఞాపక శక్తి మెండు. అతడు దివ్య పూజా బలిలో వినిన ప్రసంగాలను జ్ఞాపకముంచుకుని, ఇతర పిల్లలకు పొల్లుపోకుండా చెప్పేవాడు. అతడు తన ఈడు వారికి, తన కంటే పెద్దవారికి సైతం సత్యోపదేశాన్ని నేర్పించేవాడు. ఆగ్నెల్ పదకొండేళ్ల వయస్సులో తల్లిదండ్రులిద్దరు ఒకరివెంట ఒకరు అకస్మాత్తుగా మరణించారు. ఆగ్నెల్ తల్లి మరియ చనిపోతూ, పిల్లలందరిని యేసుప్రభుని తల్లియైన మరియమాత సంరక్షణకు అప్పగించింది.

ఆగ్నెల్ అప్పటికే గురువైన తన అన్న మాన్యులీనొ ప్రోత్సాహంతో పరలోక రాజు ప్రత్యేక సేవ చేయాలని దైవ పిలుపునందుకున్నాడు. అతడు మపుసాలోని మైనర్ సెమినరీలో చేరి, లతీను భాషను చక్కగా నేర్చుకున్నాడు. అటు పిమ్మట రాచోల్ సెమినరీలో తత్వశాస్త్రం, వేదశాస్త్రం అభ్యసించి, తన మేధస్సుకు సానబెట్టి, బైబులు జ్ఞానంలో కొంత పాండిత్యం సంపాదించాడు. గురు విద్యార్థిగా నున్నప్పుడు అతని ఆరోగ్యం మెరుగుగా లేకున్నా, పెద్దలకు విధేయిస్తూ, కష్టపడి చదివి తన వేదాంత పరీక్షలో అత్యుత్తమ శ్రేణి పొందాడు. అతడు ఏదైనా గురువుల మఠంలో చేరాలనుకున్నా, 1835 నుండి పోర్చుగీసు వారి పాలనలో వలస రాజ్యాలలో గురువుల మఠాలను నిషేధించినందున అతని కోరిక నెరవేరలేదు. అతడు ఆ విషయమై మరింతగా ఆలోచించి, ప్రార్థించాడు. అప్పటికే గోవా మేత్రాసన పరిధిలో 1887లో ప్రభుత్వానికి తెలియకుండా రహస్యంగా మార్టిన్స్ గురువులు "సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ ఆఫ్ పిలార్ మేత్రాసన మిషనరీ సంస్థ"ను స్థాపించాడు. అతడు తన దైవ పిలుపులో కొన్ని ఆటు పోటులకు గురై, ఫాదర్ లూసియో వాస్ మార్గదర్శకత్వంలో నెల రోజుల ధ్యానం చేసి, తన శ్రేయోభిలాషుల సలహాలతో పిలార్ సంస్థలో చేరాడు. అందులో ఆగ్నెల్ జూలై 17,

1897న ప్రవేశం పొంది, డిసెంబరు 18, 1897న డీకను పట్టం పొందాడు. అతడు మే 22, 1898న ఆ మతసభలో అయిదేళ్లపాటు ప్రాథమిక సభ్యత్వం తీసుకుని, గోవా అతి మేత్రాణులు అంటోనియో హస్తాలమీదుగా సెప్టెంబరు 24, 1898న ఆగ్నెల్ గురు పట్టాభిషేకం పొందాడు. అప్పటికి అతని వయస్సు ముప్పయి ఏండ్లు.

ఆగ్నెల్ యువ గురువుగా 1898 నుండి 1908 వరకు పదేళ్లపాటు పిలార్ ఆశ్రమంలో ఆధ్యాత్మిక సేవలందించాడు. ఆ ఆశ్రమంలో కతోలిక విశ్వాసులకు వివిధ బృందాలలో ప్రార్థన, ఆధ్యాత్మిక విషయాలపై, బైబులుపై మూడు రోజులు లేక ఒక వారంపాటు పలు శిక్షణా కార్యక్రమాలు, సదస్సులు, ధ్యానములు నిర్వహించటంలో పూర్తిగా లీనమై, దైవరాజ్య స్థాపనకు గట్టి ప్రయత్నం చేశాడు. ఆ సంస్థలోనే తనకు చిన్నప్పటినుండి ఎంతో ప్రీతిపాత్రమైన సత్యోపదేశాన్ని క్రైస్తవుల కాగోరుచున్న అభ్యర్థులకు నేర్పించేవాడు. ఆ కాలంలో ఆగ్నెల్ భక్తి పారవశ్యంతో దివ్యసత్ప్రసాద ప్రభుని తదేక దీక్షతో గంటల తరబడి ప్రార్థించేవాడు. ఆగ్నెల్ ఆశ్రమంలో గురువులకు, డీకన్లకు ధ్యానాలిచ్చేవాడు. అదేవిధంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు, వైద్యులు, వ్యాపారులు, ప్రభుత్వాధికారులకు చిన్న చిన్న బృందాలలో మూడు రోజుల ప్రార్థనలు ఎంతో భక్తియుతంగా నిర్వహించి, అందరి అభిమానానికి ఆగ్నెల్ పాత్రుడయ్యాడు. ఆగ్నెల్ ముఖ్యంగా ప్రభుయేసుని శ్రమలు, మరణంపై చక్కని ప్రసంగాలిస్తూ, తన సుపీరియర్ ఫాదర్ లూసియో వాస్ నిర్వహించే ధ్యానాలలో సహాయపడేవాడు. పిలార్ సభలో ఆగ్నెల్ సెప్టెంబరు 8, 1908న శాశ్వత సభ్యుడయ్యాడు. అప్పటి పిలార్ మత సభలో 11 మంది మాత్రమే సభ్యులు. అప్పటినుండి షిరోడా గ్రామంలో నివసించాడు.

ఆగ్నెల్ గోవా పట్టణంలోని చాలా విచారణ దేవాలయాలలో ప్రార్థనలు నిర్వహించేవాడు. దైవప్రేమ, సోదర ప్రేమలకు వ్యతిరేకంగా చేసిన పాపములను ఒప్పుకుని, మంచి పాపసంకీర్తనం చేయమని తన ప్రసంగాలలో ప్రత్యేకంగా కోరేవాడు. అతడు తన బోధల అనంతరం ప్రజల పాపసంకీర్తనములు గంటల తరబడి వినేవాడు. ఒక పర్యాయము కాన్సా అను గ్రామంలో ప్రజలమధ్య వైషమ్యాలు సమసిపోవాలని ఎనిమిది రోజుల ప్రార్థన నిర్వహించాడు. అయినా ఏ వర్గం కూడా పట్టు వీడలేదు. ఆగ్నెల్ తొమ్మిదవ రోజు ఉదయం దివ్యబలిపూజ నిర్వహించి, తాను చాలా విచారంగా ఉన్నానని, ఎనిమిది రోజులు మీకోసం ప్రార్థించినా, ఎవరూ మారనందున చాలా బాధతో వెళ్తున్నానని చెప్పి, ప్రసంగ సమయంలో నిజంగానే ఏడ్చాడంట. వెంటనే ఆ రెండు వర్గాలలో చలనం కలిగి, మారు మనస్సు పొంది, ఒకరినొకరు క్షమించుకుంటూ కౌగిలించుకుని గ్రామమంతా ఐక్యమైందంట. అతడు గోవాలోని శాన్‌వొర్డెమ్‌లో కూడా విచారణ గురువుగా పనిచేశాడు. ఆగ్నెల్ 1910 నుండి 1917 వరకు ఏడేండ్లపాటు కార్వార్ దగ్గరలోగల కుమ్‌తలో గురువుగా, నిజమైన కాపరిగా అమూల్య సేవలందించాడు. ఆ కాలంలో అతడు దాదాపు 500 జ్ఞాన స్నానములిచ్చాడు. కొందరికి పిలార్ ఆశ్రమంలో నెలరోజుల పాటు సత్యోపదేశంలో శిక్షణనిచ్చి, నూతనంగా జ్ఞానస్నానమిచ్చాడు. అతడు

క్రైస్తవుల విద్యపట్ల శ్రద్ధ చూపి, ఎంతోమంది బాలబాలికలను వివిధ పాఠశాలలలో, క్రైస్తవ వసతి గృహములలో చేర్పించి విద్యాదానం చేశాడు. అతడు ఆధ్యాత్మికంగానే గాక ఆర్థికంగాను చాలా మందికి సహాయపడ్డాడు. ఒకసారి కట్నం కోసం ఓ అమ్మాయి పెళ్ళి ఆగిపోతే, అప్పు తీసుకొని వారికి సహాయం చేసి, ఆ కుటుంబాన్ని ఆదుకున్నాడు. మరోసారి ఇద్దరు త్రాగుబోతులు రాత్రివేళ తమకు దేవాలయ ఆదాయ వ్యయాలను చూపమని కోరగా, అతడు ఖర్చుల లెక్కల పుస్తకాన్ని బల్లపై పెట్టి "ఇది మీ డబ్బు. అది అలా ఖర్చు అయ్యిందో చూసే హక్కు మీకు ఉందని" సవినయంగా పలికాడంట. వారు ఆగ్నెల్ నిజాయితీని, వినయాన్ని చూచి, పశ్చాత్తాపపడి ఆగ్నెల్‌ను క్షమాపణ అడిగి, తిరిగి వెళ్లారంట. అతడు ఎక్కడ పనిచేసినా తన విచారణలోని గృహాలన్నింటిని సందర్శించేవాడు. ప్రజల అవసరాలు తెలుసుకుని, వ్యాధిగ్రస్తులపై ప్రార్థించి, ఆర్థికంగా సహాయపడేవాడు.

గోవా అతిమేత్రాణులు మత్తయాసు గారు, ఆగ్నెల్ గుణగణాలను, సామర్థ్యాలను గుర్తించి, రాచోల్ సెమినరీలో భావి గురువులకు ఆధ్యాత్మిక సలహాలివ్వడానికి అతనిని 1918లో ఆధ్యాత్మిక గురువుగా నియమించారు. అక్కడ గురు విద్యార్థులకు తల్లిలా, తండ్రిలా, గురువులా, మార్గదర్శకునిగా ఉండి, ఎన్నో విధాలుగా వారిని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దాడు. అక్కడ అతడు ఎంతో సమయం వ్యక్తిగత ప్రార్థనలో గడిపి, గురు విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. తన వినయ విధేయతలు, ప్రార్థనలు, త్యాగ క్రియలతో ఆగ్నెల్ అక్కడి ఆచార్యుల, గురు విద్యార్థుల అభిమానాన్ని పొందాడు. అతడు ప్రతినిత్యం ఎంతో సమయం దివ్య మందసం ముందు మోకాళ్లూని ప్రార్థించాడు. ఉపవాసాలుండటం, జపమాలను అనుదినం జపించటం అతనికెంతో ఇష్టం.

యేసు తిరుహృదయం పండుగ రోజైన నవంబరు 20, 1927న సెమినరీ దేవాలయమందు దివ్యసత్ప్రసాద ఆరాధన సమయంలో ఆగ్నెల్ ప్రభు ప్రేమను గురించి ప్రసంగించుచుండగా, ప్రసంగం చివరలో అకస్మాత్తుగా కుప్పకూలి పోయాడు. అయినా దివ్యసత్ప్రసాద ఆశీర్వాదం ముగిసేవరకు తనను అక్కడే ఉంచమని పట్టు బట్టి, ప్రభుని ప్రార్థించాడు. ఆ ప్రార్థన ముగిసిన తరువాతనే ఆగ్నెల్ ప్రశాంతంగా కన్ను మూశాడు. అతని అంత్యక్రియలకు ముందే ఆగ్నెల్ గదిలోనున్న చిన్న పాటి వస్తువులన్నీ అక్కడి గురువులు, బ్రదర్లు పునీతునికి గుర్తుగా భద్రపరచుకున్నారు. భూస్థాపన దివ్య బలిపూజలో విచారణ గురువు "మనమొక పునీతుని భూస్థాపనలో పాల్గొంటున్నామని" అతని పవిత్ర జీవితానికి సాక్ష్యం పలికారు. అతనిని రాచోల్‌లో భూస్థాపితం గావించారు. ఆగ్నెల్ భౌతిక అవశేషాలను జనవరి 10, 1939న పిలార్ ఆశ్రమానికి తెచ్చి, సమాధి చేశారు. 1947లో ఆగ్నెల్ పునీత పట్ట ప్రక్రియ ప్రారంభమైంది. అగ్నెలో డి సూజ ను రెండవ జాన్ పాల్ పాపుగారు నవంబరు 10, 1986న "పూజ్యులు"గా ప్రకటించారు. ప్రతి గురువారం పిలార్ ఆశ్రమంలోని ఫాదర్ ఆగ్నెల్ గారి సమాధి వద్దకు వేలాదిమంది భక్తులు తరలి వచ్చి, వారి మధ్యస్థంగా తమ తమ అవసరాల కోసం ప్రార్థించి, ఎన్నో మేలులు పొందుతున్నారు. వారి పవిత్ర జీవితం అందరికీ ఆదర్శప్రాయమైంది.



## బెతనీ మఠసభ వ్యవస్థాపకులు

# 18. దైవ సేవకులు రేమండ్ మస్కరేనస్

**(1875-1960)**

ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.

రేమండ్ మస్కరేనస్ కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు మహా నగరానికి చెందినవాడు. లాజరస్ మస్కరేనస్, జోనా కాస్టలీనో పుణ్య కతోలిక దంపతులకు కలిగిన 13 మంది సంతానంలో రేమండ్ ఏడవ వాడు. రేమండ్ కర్ణాటక లోని షిమోగా అను పట్టణంలో జనవరి 23, 1875 న జన్మించాడు. అతని తండ్రి లాజరస్ అక్కడి మున్సిపల్ కార్యాలయంలో పనిచేశాడు. షిమోగా లోని జేసు పవిత్ర దేవాలయంలో జనవరి 27న రేమండ్ కమిల్లస్ నామంతో జ్ఞానస్నానం పొందాడు. లాజరస్ పదవీ విరమణ చేసిన పిమ్మట, తన స్వస్థలమగు మంగుళూరులో భార్యాబిడ్డలతో కలిసి స్థిర నివాసమేర్పరచు కున్నాడు. రేమండ్ అక్కడే మిలాగ్రిస్ చర్చ్ పాఠశాలలో ప్రాథమిక విద్య నభ్యసించాడు. మిలాగ్రిస్ దేవాలయమందు 1885లో రేమండ్ ప్రథమ దివ్యసత్ప్రసాదము స్వీకరించాడు. రేమండ్ మంగుళూరులోని ప్రముఖ పునీత అలోషియస్ కళాశాలలో మెట్రిక్యులేషన్ పరీక్షనందు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు.

తదనంతరం యువకుడైన రేమండ్ ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని, వత్తిడులను అధిగమించి మంగుళూరులోని పునీత జోజప్పగారి గురు విద్యాలయంలో ఫిబ్రవరి 23, 1891న ప్రవేశించాడు. అప్పటికి అతని వయస్సు 16 సంవత్సరాలు. అతడు గురు విద్యాలయంలో చక్కని భక్తి ప్రపత్తులతో, వినయ విధేయతలతో జీవించి, ఆచార్యుల ప్రశంసలను, సహచర గురు విద్యార్థుల అభిమానాన్ని ఎంతో పొందాడు. రేమండ్ ఒక ఆదర్శ గురు విద్యార్థిగా, గురు శిక్షణాలయపు నియమ నిబంధనలన్నింటిని కడు శ్రద్ధతో పాటించాడు. గురు శిక్షణానంతరం రేమండ్ మంగుళూరు మేత్రాసన గురువుగా మార్చి 4, 1900న గురుపట్టాభిషేకం పొందాడు.

యువ గురువైన రేమండ్ మంగుళూరులోని మిలాగ్రిస్ దేవాలయంలో, కళ్యాణ్‌పూర్‌లోని మౌంట్ రోజరీ దేవాలయంలో, కళ్యాణ్‌పూర్ లోని మిలాగ్రిస్ దేవాలయంలో సహాయక గురువుగా సేవలందించాడు. పూవు పుట్టగానే పరిమళించునట్లు, రేమండ్ అతి తక్కువ సమయంలోనే గొప్ప బోధకునిగా, కార్యదక్షత కలిగిన వ్యక్తిగా అందరి మెప్పును పొందాడు. రేమండ్ తెలివితేటలకు, వాక్చాతుర్యానికి, విజ్ఞతకు విశ్వాసులంతా ముగ్ధులై, ముక్కున వేలు వేసుకునేవారు.

రేమండ్ 1903లో మంగుళూరు మేత్రాసనంలోని ఉద్యావర్ విచారణ గురువులుగా నియమింపబడ్డాడు. ఆ గురు మండలంలో ఎక్కువగా పేదలున్నారు. వారందరికి నిజమైన కాపరిగా, దయ కనికరములు చూపి, వారిని విశ్వాస పథంలో నడిపించాడు. ఆ విచారణలో విశ్వాసుల అవసరాల మేరకు బహు సుందర దేవాలయాన్ని నిర్మించాడు. ఆ దేవాలయ నిర్మాణంలో ఎన్నో ఆటు పోటులున్నప్పటికి, దేవుని మీద భారం వేసి, దానిని పూర్తి గావించాడు. దేవాలయ నిర్మాణ నిమిత్తం చేసిన అప్పులను తానే స్వయంగా రేమండ్ చెల్లించాడు. పిమ్మట అగ్రార్ విచారణకు బదిలీ అయి, అక్కడ కూడా నిస్వార్థంతో తన సేవలందించాడు. తరువాత 1914లో బెందూరును విచారణ కేంద్రంగా ప్రకటించి, ప్రజల కోరిక మేరకు రేమండ్ గురువులను ప్రప్రథమ విచారణ కర్తలుగా నియమించారు. అక్కడ ఉన్న సమయంలో ప్రజలకు కతోలిక విద్య చాలా అవసరమని గ్రహించి, బెందూరులో పునీత సెబాస్టియన్ పాఠశాలను, మార్గరెట్ మేరి పాఠశాలను, కంకనాడిలో పునీత జోసఫ్ పాఠశాలను స్థాపించి, బాల బాలికలకు విశ్వాసంతో కూడుకున్న చక్కని విద్యనందించాడు.

ఆనాటి సాంఘిక పరిస్థితుల దృష్ట్యా దైవ సేవలో ధనికులు, విద్యావంతులు మాత్రమే ఉండటం, పేదలకు ఆ అవకాశం లేకపోవటం, రేమండ్ మనసును కలచి వేసింది. దైవరాజ్య నిర్మాణంలో పేదలను కూడా భాగస్వాములను చేయాలని రేమండ్ గట్టిగా తలపోసి, జూలై 16, 1921 కార్మెల్ మాత పండుగనాడు స్థానిక పేద యువతుల కోసం "లిటిల్ ఫ్లవర్ ఆఫ్ బెతనీ" అను మఠకన్యల సభను స్థాపించాడు. ఈ సభ సభ్యులు బెతనీ మఠకన్యలుగా పిలువబడ్డారు. మంగుళూరు పీఠాధిపతులు పాల్ పెరినీ యస్.జె. గారి ప్రోత్సాహంతో, రేమండ్ బెందూరు విచారణలోని నలుగురు ఉపాధ్యాయురాండ్రతో నిరాడంబరంగా బెతనీ మఠకన్యల సభను ప్రారంభించాడు. ఈ మఠకన్యల తోడ్పాటుతో కతోలిక విశ్వాసాన్ని బలపరచటం, పేద బాలికలకు కతోలిక విద్య నందించటం, చక్కని ఉపాధ్యాయులను సమకూర్చటం, గ్రామీణ ప్రాంతాలలో సువార్తను బోధించటం వంటి పనులెన్నో రేమండ్ చేపట్టి, తిరుసభకు ఎనలేని సేవ చేశాడు.

రేమండ్ విశ్వాసపరంగా ఎంతో స్థిరత్వం, ఆధ్యాత్మికంగా ఎంతో ఎత్తు ఎదిగిన పవిత్ర గురువు. తన నిరంతర ప్రార్థన ద్వారా దేవునితో చక్కని బంధం ఏర్పరచుకుని, దైవ చిత్తాన్ని గ్రహించి, తదనుగుణంగా ఉదారంగా పేదల అవసరాలను తీర్చటంలో రేమండ్ ముందుండేవాడు. యువగురువుగా ఉన్నప్పటినుండే రేమండ్ సువార్త ప్రకటనకు, ఆత్మల రక్షణకు ఎంతో ఉత్సాహం చూపించేవాడు. రేమండ్ ఏ పనిలో ఉన్నా, ప్రార్థించటం మానలేదు. రేమండ్ ప్రార్థనయే తన శ్వాసగా, తన ఊపిరిగా జీవించాడు.

రేమండ్‌కు మరియమాత పట్ల అపార భక్తి ఉంది. క్షణం తీరిక దొరికినా జపమాల

చేతపట్టి, భక్తిగా జపించటం అలవాటు చేసుకున్నాడు. బెతనీ మత సంస్థలోని మఠకన్యలకు మరియమాత పట్ల భక్తిని పెంపొందించి, 'ఇదిగో! నేను ప్రభువు దాసిరాలను' అను పవిత్ర వాక్యమును, బెతనీ మఠసంస్థ ప్రధాన నినాదం చేశాడు. బెతనీ సభ రజిత జూబిలీ సందర్భంగా జూలై 16, 1946న ఆ సభను మరియమాతకు అంకితమొనర్చాడు. మరియమాత ఏడు వ్యాకులములను మఠకన్య లందరూ సర్వదా ధ్యానించేందుకుగాను, మదర్ జనరల్ నివాసపు దేవాలయంలో యేసు పవిత్ర దేహంతో శోక సముద్రంలో మునిగిన 'శోకమూర్తి మరియమాత' దివ్య స్వరూపాన్ని ప్రతిష్ఠించాడు.

రేమండ్‌కు యేసు తిరు హృదయంపైన, దివ్య సత్ప్రసాద ప్రభువుపైన భక్తి ప్రపత్తులు చాలా మెండు. ప్రభుని దివ్య మందసం ముందు గంటల తరబడి ప్రార్థించేవాడు. దివ్యసత్ప్రసాద ప్రభువును గౌరవించడానికి, ఏ చిన్న అవకాశం దొరికినా దానిని పూర్తిగా వినియోగించుకున్నాడు. బెతనీ మఠసభలో అక్టోబరు 25, 1935న "నిత్య ఆరాధన"ను నూతనంగా మొదలు పెట్టి, ఇరవై నాలుగు గంటలూ ప్రభుని సన్నిధిలో ప్రార్థించటం మఠకన్యలకు నేర్పించాడు. రేమండ్‌కు చక్కని జ్ఞాపకశక్తి, వాగ్ధాటి ఉన్నాయి. అతడు మాతృభాష కొంకణిలో, ఆంగ్లములో చక్కగా బోధించేవాడు. పరిశుద్ధ గ్రంథము నుండి ఏ చిన్న వచనాన్ని తీసుకుని అయినా, తన విశ్వాసుల హృదయాలను ప్రభువు పట్ల ప్రేమతో రగిలించగల నేర్పరి రేమండ్. రేమండ్ తనకు గల యేసుప్రభుని భక్తిపై, మరియతల్లి భక్తిపై ప్రఖ్యాత కొంకణి క్రైస్తవ వారపత్రిక 'రాక్నో'లో పలు వ్యాసాలు వ్రాసి, వేలాది మందిని విశ్వాసంలో ఎదిగేలా కృషి చేశాడు. తన రచనల ద్వారా దేవుని మహిమ పరచుటకు, ఆత్మల రక్షణకు రేమండ్ ఎంతో శ్రమించి, "ప్రసార మాధ్యమాల అపోస్తులుడు"గా పేరుగాంచాడు. తన చరమ దశలో పలు ప్రాంతాలకు వెళ్ళి, దైవవాక్య ప్రకటన చేయలేకున్నప్పటికి, తన కలానికి మాత్రం ఎన్నడూ విశ్రాంతి నివ్వలేదు. 1949లో నాలుగు సువార్త గ్రంథాలను, 1952లో నూతన నిబంధనను కొంకణి భాషలోనికి ప్రప్రథమంగా అనువాదం చేసి, దక్షిణ కెనరాలోని కతోలికులకు ప్రీతిపాత్రుడయ్యాడు. కతోలిక శ్రీసభ దక్షిణ కన్నడ ప్రాంతంలో ఆవిర్భవించిన 380 సంవత్సరాల తరువాత, కొంకణి భాషలో బైబులు గ్రంథం వెలువడడంతో, సామాన్య క్రైస్తవులెందరో అర్థవంతంగా ప్రార్థించటానికి వీలయ్యింది.

మంగుళూరు మేత్రాణులు విక్టర్ ఫెర్నాండెస్ గారు రేమండ్‌ను ఆగస్టు 15, 1931న మేత్రాసన వికర్ జనరలుగా నియమించారు. రేమండ్ "రోమన్ కతోలిక మూలనిధి" అధ్యక్షుడిగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, కతోలిక విద్యా సంస్థ వ్యవస్థాపకులుగా, ఉపాధ్యక్షులుగా, పీఠాధిపతుల వ్యక్తిగత సలహాదారుగా, దక్షిణ కన్నడ కతోలిక సంస్థ అధ్యక్షులుగా ఎన్నో పదవులు అలంకరించి, తమ అమూల్య సేవలందించి, కతోలిక శ్రీసభ పురోభివృద్ధికి శాయశక్తులా కృషి చేశాడు. రేమండ్ పిల్లలకు సత్యోపదేశం నేర్పిస్తూ, వ్యాధిగ్రస్తులను పరామర్శిస్తూ, గురువులకు, మఠకన్యలకు ఆధ్యాత్మిక విషయాలపై

సలహాలిస్తూ, వివిధ కతోలిక సంస్థలను విజ్ఞతతో, విశ్వాసంలో ముందుకు నడిపిస్తూ రోజంతా గడిపేవాడు.

రేమండ్ వికర్ జనరలుగా పదవీ విరమణ గావించిన పిమ్మట, బెతనీ మఠకన్యల సభ ఎదుగుదలకు, అభివృద్ధికి, మఠకన్యల శిక్షణకు తన శక్తి యుక్తులన్నీ వినియోగించి పనిచేసాడు. ఆ కాలంలో బెతనీ మఠసభ వేదవ్యాపక, సాంఘిక సేవ, విద్యా వ్యాసంగం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయటానికి, పూనా, గోవా, బెల్గాం, కాలికట్, మైసూరు మేత్రాసనాలలో పలు శాఖలు ఏర్పాటు చేయటానికి, రేమండ్ వారికి మార్గదర్శకత్వం వహించాడు. పేద బాలికలకు విద్యాబుద్ధులు అందించటానికి అగ్రతాంబూలం ఇచ్చి, వారి సమగ్ర అభివృద్ధికి పాటుబడే నిమిత్తం 1948లో "బెతనీ విద్యాసంస్థ" (ఎడ్యుకేషనల్ సొసైటీ)ను, "మెడలీన్ విద్యా సంస్థ" (ఎడ్యుకేషనల్ సొసైటి)ను ఏర్పరచి, బడుగు, బలహీన వర్గాల వారికి ఆలంబనగా రేమండ్ నిలిచాడు. రేమండ్ గురువు మత పరిచర్య, పేద బాలికల విద్యాబోధన, సంఘసేవ, ఆదర్శ జీవితం ఎంతో మెచ్చదగినవని ప్రశంసిస్తూ, మంగుళూరు మేత్రాణులు బేసిల్ పెరెస్ గారు రేమండ్‌కు 'డొమిస్టిక్ ప్రిలేట్' అను ఉన్నత హోదాను ఇవ్వవలసిందిగా జగద్గురువులను అర్థించారు. మేత్రాణుల విజ్ఞప్తిని మన్నించి, 12వ భక్తినాథ పాపుగారు 1955 జూన్ నెలలో రేమండ్‌కు 'డొమెస్టిక్ ప్రిలేట్' అను అధికార హోదాను కలుగ జేశారు.

రేమండ్ ప్రభువు పట్ల ప్రేమతో, పేద ప్రజల ఆలంబనగా నిలిచి, పూజాదికములతో బాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రభు ప్రేమకు సాక్షిగా, ప్రభువుకు ప్రజలకు మధ్య వారధిలా నిలిచాడు. ఈ విశ్వాస పయనంలో అతడు ఎన్నో అవాంతరాలను, అడ్డంకులను సైతం ఎదుర్కొన్నాడు. రేమండ్ ఆ బాధలను, కష్టాలను సిలువపై మరణించిన ప్రభుయేసుని బాధలలో ఏకం చేసి, ప్రభు ప్రియ శిష్యునిగా గణుతికెక్కాడు. రేమండ్ ఫిబ్రవరి 29, 1960న ప్రభువునకు కృతజ్ఞతలు చెల్లిస్తూ, తన వజ్ర జూబిలీ వేడుకలు ప్రజల మధ్య జరుపుకున్నాడు. అదే రోజు రేమండ్ పక్షవాతానికి గురయ్యాడు. చివరి రోజులలో రేమండ్ తన గదికే పరిమితం అయినప్పటికి, తనను దివ్య సత్ప్రసాద మందసం వద్దకు తీసుకు వెళ్ళమని బ్రతిమిలాడేవాడు. ఆ వృద్ధాప్య దశలో యేసు, మరియ పవిత్ర నామాలను జపిస్తూ, యేసుప్రభువునకు, మరియమాతకు మరింత దగ్గరయ్యాడు. డిసెంబరు 23, 1960న, రేమండ్ గురువులు ప్రశాంతంగా తన ఇహలోక యాత్రను చాలించి, పరలోక నిత్య నివాసం చేరుకున్నాడు. రేమండ్ భౌతిక దేహాన్ని తాను స్వయంగా నిర్మించిన బెందూరు విచారణ దేవాలయ ప్రధాన పీఠం ముందు అసంఖ్యాక విశ్వాసుల ప్రార్థనల మధ్య భూస్థాపితం చేసి, ప్రభువునకు అప్పగించారు. రేమండ్ ఫ్రాన్సిస్ కమిల్లస్ మస్కరేనస్ గురువులను మంగుళూరు పీఠాధిపతులు అలోషియస్ గారు రోమాపురిలోని 'పునీత పట్ట ప్రక్రియ అధికార సంస్థ' వారి సారథ్యంలో "దైవ సేవకులు"గా జూన్ 3, 2008న ప్రకటించారు.



## హోలీ ఫామిలీ మఠకన్యల సభ సంస్థాపకులు

# 19. పునీత మరియం త్రెసియా చిరమెల్

**(1876-1926)**

బ్రదర్ కాట్రు పళ్లంరాజు S.J.

త్రెసియా చిరమెల్ మంకిడియాన్ కేరళ రాష్ట్రమందలి త్రిస్సూర్ జిల్లాలోని పుతెంచిరలో తోమా మరియు తాండా అను పుణ్య దంపతులకు ఏప్రియల్ 26, 1876న జన్మించింది. ఆమె సిరో-మలబారు అర్చక సాంప్రదాయానికి చెందినది. వారికి కలిగిన అయిదుగురు సంతానంలో త్రెసియా మూడవది. ఆమెకు పునీత అవిలాపురి తెరేజమ్మగారి పేరిట త్రెసియాగా పునీత మరియమ్మ గారి దేవాలయంలో మే 3, 1876న జ్ఞానస్నాన మిచ్చి, నామకరణం చేశారు. అంతోని, అన్నమ్మలు ఆమె జ్ఞాన తల్లిదండ్రులు. వారిది ధనవంతుల కుటుంబం. కాని వారి తాత తన ఏడుగురు కూతుళ్లకు కట్నకానుకలిచ్చి, వివాహాదులు చేయించడంతో, వారి సంపదంతా హారతి కర్పూరంలా కరిగిపోయింది. త్రెసియా తండ్రి తోమాకు మొదటి భార్య మరియంకుట్టి. ఆమె 1872నందు ప్రసవ సమయంలో మరణించింది. త్రెసియాకు ఇద్దరు సోదరీలు, ఇద్దరు సోదరులు ఉన్నారు.

త్రెసియా బాల్యంలో చాలా భక్తిగా జీవించింది. ఆమె చిన్నప్పటినుండే ప్రార్థించటం అలవాటు చేసుకుంది. ఆమెకు ఉపవాసాలుండటం, జాగరణ ప్రార్థనలంటే ఎంతో మక్కువ. ఆమె తల్లి 1884లో ఉపవాసాలు, జాగరణ ప్రార్థనలు చేయవద్దని బ్రతిమిలాడినా, త్రెసియా తల్లి మాట వినలేదు. యేసుక్రీస్తు ప్రభువు అనిన ఆమెకు ఎంతో ఇష్టం. ప్రభు సన్నిధిలో మరింత ఎక్కువసేపు గడపాలని ఆమె కోరిక. త్రెసియా పన్నెండేళ్ళ వయస్సులో తల్లి తాండా మార్చి 2, 1888న పరమ పదించింది. దానితో ఆమె చదువు అర్థాంతరంగా ముగిసింది.

త్రెసియా తన తల్లి మరణానంతరం స్థానిక విచారణ దేవాలయంలో తన సమయాన్ని పూర్తిగా ధ్యానించటంలో గడిపింది. ఆమె దైవ ప్రేరణతో 1886లో జీవితాంతం కన్యగా ఉంటానని దేవునికి వ్యక్తిగతంగా మాట ఇచ్చింది. త్రెసియా దేవునికి మరింత ప్రియంగా జీవించాలని తలంచి, ఇంటినుండి బయటపడి కొండల మధ్య తపస్సుచేయాలని 1891లో ఓ పథకం ఆలోచించింది. కాని ఆ ప్రయత్నం మధ్యలోనే విరమించుకుని, తిరిగి ఇల్లు చేరుకుంది. ఆమె వయస్సు చిన్నదే అయినా దైవ సేవలో, దైవ ధ్యానంలో గడపాలని ఎంతో ఆశతో, ఎన్నో మార్గాలు అన్వేషించింది. 1904లో త్రెసియాకు కన్య మరియమ్మగారి దర్శనం కలిగింది. అప్పటినుండి త్రెసియా తన పేరుకు "మరియం"ను జోడించుకుని,

మరియం త్రెసియాగా నూతన నామధేయాన్ని స్వీకరించింది. త్రెసియా తన ఆత్మలో జరిగే ప్రతి చిన్న విషయాన్ని కూడా ఆధ్యాత్మిక గురువుతో పంచుకొని, వారి సలహాలను వినయ విధేయతలతో పాటించేది. ఆమె 1902 నుండి 1905 వరకు ఎన్నో పర్యాయాలు ఆత్మచే ఆవహించబడింది. స్థానిక పీఠాధిపతులు ఆమెను పరిశీలించి, ఆమెకు సహాయపడమని జోసఫ్ విదయాతిల్ గురువులను కోరారు. జోసఫ్ అప్పటినుండి ఆమె మరణించేంత వరకు, త్రెసియాకు ఆధ్యాత్మిక గురువుగా ఉన్నారు. త్రెసియా వ్రాసిన 55 లేఖలలో 53 లేఖలు తన ఆధ్యాత్మిక జీవనాన్ని గురించి సలహాలు కోరుతూ వ్రాసినవే.

త్రెసియాకు ముగ్గురు స్నేహితులున్నారు. ఆ నలుగురూ కలిసి దేవాలయాన్ని శుభ్రపరచి, పీఠాన్ని అలంకరించే వారు. ప్రభుయేసులా సేవ చేయాలని తలపోసి, ఆమె తన మిత్రులతో కలిసి పేదలకు సహాయపడటం, వ్యాధిగ్రస్తులను సందర్శించి, వారికి సపర్యలు చేసారు. వారంతా ఒక బృందంగా అవసరంలోనున్న వారికి సేవలందించారు. ఇంకా ప్రభుయేసుని ప్రియ శిష్యులుగా ప్రార్థనలు చేశారు. త్రెసియాకు జేసు మరియ జోజప్పల పరిశుద్ధ కుటుంబం అంటే ఎంతో గౌరవం. ఆమె పరిశుద్ధ కుటుంబ సహాయాన్ని అర్థించి, ప్రార్థించేది. పాపుల మారు మనస్సుకై ప్రార్థించేది. పరిశుద్ధ కుటుంబం తనకు పలుమార్లు దర్శనమైందని ఆమె చెప్పేది. ఆమె కఠిన ఉపవాసాలుండి, పాపుల కోసం ప్రార్థించేది. వారి కొరకు ప్రాయశ్చిత్తం చేసేది. ఆమె యవ్వన ప్రాయంలోనే దివ్యదృష్టితో భవిష్యత్తు గురించి చెప్పేది. కొన్ని రోగాలు నయం చేసేది. పునీత అవిలాపురి తెరేసమ్మగారి వలె త్రెసియా ఆత్మచే నింపబడేది. శుక్రవారాలలో త్రెసియా తన గదిలో పరిశుద్ధ సిలువ ఆకారంలో గాలిలోనికి ఎత్తబడి ఉండటాన్ని దర్శించటానికి పలువురు వచ్చేవారు.

మరియం త్రెసియా తన ముగ్గురి స్నేహితులతో కలసి ప్రార్థించటానికి ఒక ధ్యానకేంద్రం నిర్మించమని త్రిస్సూర్ అగ్రపీఠాధిపతులు జాన్ మెనచెరిని 1903లో అభ్యర్థించింది. దానికి పీఠాధిపతులు అంగీకరించక, త్రెసియాను ఏదైనా ఒక మఠకన్యల సభలో చేరమని, వీలైతే నూతనంగా స్థాపించబడిన ఫ్రాన్సిస్కన్ క్లేరిస్టుల మఠసభలో చేరి, మఠకన్య కమ్మని సూచించారు. కాని ఆమె దానికి అప్పుడు అంగీకరించలేదు. కొన్నేండ్లు గడచిన తరువాత, పీఠాధిపతుల సలహా పాటించి ఒల్లూరులోని ఫ్రాన్సిస్కన్ మఠసభలో నవంబరు 26, 1912న చేరింది. కాని అక్కడ కొన్నాళ్ళున్న పిమ్మట ఆ మఠకన్యల సభకు తాను పిలువబడలేదని గ్రహించి, త్రెసియా జనవరి 27, 1913న ఆ సభను వీడింది. చివరకు మెనచెరి పీఠాధిపతుల ఆశీర్వాదంతో 1913న పుతెంచిరలో ప్రార్థనా గృహాన్ని ఏర్పరచింది. మరియ త్రెసియా, ఆమె ముగ్గురు మిత్రులు అందులో చేరారు. అప్పటినుండి వారంతా అప్పటి కతోలిక సన్యాసులవలె కఠిన ఉపవాసాలుండి ప్రార్థన చేయడంలోను, రోగులకు, పేదలకు సేవలు జేస్తూ గృహ సందర్శనలలోను నిమగ్నమయ్యారు. గృహస్తుల పరిచర్యకు ఈ బృందం ఎంతో సహాయకారిగా ఉండగలదని మెనచెరి పీఠాధిపతులు భావించి, ఆ మఠసభకు మే 14, 1914న అధికారిక ముద్ర వేయడంతో “తిరుకుటుంబ మఠకన్యల సభ” ఏర్పడింది. ఆ సభ మఠశ్రేష్ఠురాలు

మరియం త్రెసియా ఆనాడే శాశ్వత మాటపట్టు తీసుకుని మఠకన్యల అంగీని ధరించింది. ఆ నూతన సభకు ఆమె ముప్వురు సహచరులు ప్రాథమిక శిక్షణా అభ్యర్థులుగా నమోదు చేసుకున్నారు. జోసఫ్ విదయాతిల్ గారు ఆధ్యాత్మిక గురువులుగా నియమితులయ్యారు.

ఈ నూతన సభకు పీఠాధిపతుల సహాయంతో మరియం త్రెసియా రాజ్యాంగం ఏర్పరచి, దానిని చక్కగా అమలు పరిచారు. మరియం త్రెసియా ఆధ్యాత్మిక జీవితం ఎందరికో మార్గదర్శకమైంది. కుల, మత, వర్గ విచక్షణ లేకుండా పేదలకు సహాయపడే ఆమె మనస్తత్వాన్ని ఎరిగి, ఆమె అడుగు జాడలలో పలువురు నడవటం ఆరంభించారు. అది మొదటి ప్రపంచ యుద్ధకాలం. దేశ ఆర్థిక వ్యవస్థ అంతా చిన్నాభిన్నమైన కాలం. అయినా ఆమె అకుంఠిత దీక్ష, ఉత్సాహం వలన వారి సభ మూడు పూవులు ఆరు కాయలుగా వృద్ధి చెందింది. ఆ సభ స్థాపించిన పన్నెండేళ్ళలోనే త్రెసియా మూడు క్రొత్త కాన్వెంటులు, రెండు పాఠశాలలు, రెండు వసతి గృహములు, పేద పిల్లల సంరక్షణాలయాలు ఏర్పరచింది. బాలికల విద్యనే తన ప్రధాన లక్ష్యంగా చేసుకుని, నిరుపేదలకు అండగా నిలిచింది. మరియం త్రెసియా సువిశేష విలువలకు అనుగుణంగా జీవించటం, కఠిన తపస్సు చేసి, ఉపవాసముండి ప్రార్థించటం, పేదలకు సాయం చేయటం, దేవాలయ పరిచర్య చేయటం ఆమెకు బాల్యం నుండి ఎంతో ఇష్టమైన పనులు. ఆమె మొట్టమొదటి సారిగా 1905లో ప్రభుని పంచ గాయాలు పొందింది. ఇంకను ఆమె ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలు, దైవ ప్రేరణలు పొందింది. కొన్నాళ్ళు పిశాచి శోధనలకు కూడా గురైంది. అయినా పవిత్రాత్మ దీవెనలతో ఆమె వాటిని జయించింది.

1926లో మరియం త్రెసియా కాలిపై ఒక వస్తువు పడి, తీవ్రగాయమైంది. ఆమెకు మధుమేహ వ్యాధి ఉండటంతో ఆ గాయం మరింత పెద్దదైంది. దాంతో ఆమెకు స్థానిక వైద్యశాలలో వైద్యం చేయించారు. కాని ఆమె పరిస్థితి విషమించడంతో ఆమెను ఎడ్లబండిపై తిరిగి తన కాన్వెంటుకు తెచ్చారు. అక్కడే ఆమెకు జూన్ 7, 1926న దివ్య సత్ప్రసాదం, వ్యాధిగ్రస్తుల అభ్యంగనమిచ్చారు. "జేసు, మరియ, జోజప్పా! నా ఆత్మను మీకు అప్పగించుచున్నాను" అని మరియం త్రెసియా పలికి జూన్ 8, 1926న రాత్రి పదిగంటలకు కుళికట్టుసెరిలో స్వర్గస్తురాలైంది. జూన్ 9న సకల మేర మర్యాదలతో, దివ్య పూజాబలి సమర్పించి ఆమె భౌతిక కాయాన్ని సమాధి చేశారు.

మరియం త్రెసియా యాభై యేండ్లు మాత్రమే జీవించింది. అప్పటికే ఆమె స్థాపించిన మఠసభలో 55 మంది మఠకన్యలు ఉండగా, ఇప్పుడు దాదాపు 1600 మంది మఠకన్యలు, 180 కాన్వెంట్లలో దేవుని సేవ, మానవ సేవ చేస్తున్నారు. మరియం త్రెసియా మరణానంతరం ఆమె ప్రార్థనా సహాయం ద్వారా పలు మేలులు, స్వస్థతలు జరుగు చున్నాయి. మరియం త్రెసియాను అక్టోబరు 5, 1973న "దైవ సేవకులు"గా ఇరింజల కుడలో ప్రకటించారు. ఆమెను రెండవ జాన్ పాల్ పాపుగారు రోమాపురిలో ఏప్రిల్ 9, 2000న "ధన్యులు"గా, ఫ్రాన్సిస్ జగద్గురువులు అక్టోబరు 13, 2019న రోము నగరంలో "పునీతులుగా" ప్రకటించారు. పునీత మరియం త్రెసియా పండుగ జూన్ 8.



సిరో-మలబారు మహిళారత్నం

# 20. పునీత యుఫ్రేసియా

**(1877-1952)**

పోకల మోజెస్ & కొండెపోగు అంతోని రాజు
(SJ Pre-Novices)

యేసుక్రీస్తు ప్రభుని శిష్యులలో పునీత తోమాసు వారు భారతదేశమందలి కేరళ ప్రాంతమునకు ఏతెంచి, ప్రభు రాజ్యాన్ని స్థాపించాడని చరిత్రకారుల భావన. యేసుప్రభుని శిష్యులతో కూడిన కేరళ కతోలిక సంఘం రెండు వేల సంవత్సరాలుగా మన భారతావనిలో కతోలిక మతానికి సాక్ష్యం పలుకుతుంది. యుఫ్రేసియా కేరళ నందలి సిరో-మలబారు అర్చక సంప్రదాయానికి కతోలిక సంఘానికి చెందిన ఎలువతింగల్ చెర్పుకరన్ అంతోని, కుంజేతి దంపతులకు త్రిసూరు జిల్లాలోని కత్తూరు అను గ్రామంలో అక్టోబరు 17, 1877న ప్రథమ సంతానంగా జన్మించింది. జన్మించిన ఎనిమిదవ రోజున ఎడతురితి దేవాలయంలో ఆమెకు 'రోసా' అను పేరిట జ్ఞానస్నానమిచ్చారు. వారిది ధనవంతుల కుటుంబం. చాలా భక్తి విశ్వాసాలున్న కుటుంబం. తండ్రియైన అంతోని చాలా పలుకుబడిగలవాడు. కొద్దిగా కోపిష్టి కూడా. తల్లి కుంజేతికి మరియమాతపై అపార భక్తి ఉంది. యుఫ్రేసియాకు చిన్న ప్రాయం నుండి యేసుప్రభువు అనిన చాలా ఇష్టం.

యుఫ్రేసియా బాల్యంనుండి ఇహలోక సంపదలపైన, భౌతిక సుఖాలపైన అయిష్టాన్ని చూపి, పరలోక సంపదల వైపు దృష్టి సారించింది. యుఫ్రేసియా తొమ్మిదేండ్ల ప్రాయంలోనే తన సర్వస్వాన్ని ప్రభువుకు అంకితం చేసి, జీవితాంతము కన్యగా ఉండాలని కోరుకుంది. అప్పుడే మరియమాత ఆమెకు దర్శనమైంది. లేత ప్రాయంలోనే ఆమెను ఒక ధనవంతుల కుటుంబంలో ఇచ్చి పెళ్ళి చేయాలని ఆమె తండ్రి చూశాడు. కాని తండ్రి మాటను వినకుండా "మఠకన్య అవుతాను" అని చెప్పగా, ఆమె తండ్రి రౌద్రుడై 'నిన్ను మాత్రం మఠకన్యగా పంపను. కావాలంటే నీ చెల్లి తెరెసాను పంపుతాను" అని నిరాకరించాడు. అకస్మాత్తుగా తెరెసాకు జబ్బుచేసి, చిన్న ప్రాయంలోనే మరణించింది. ప్రభువు పెద్ద కుమార్తెను కూడా తీసుకొని పోతాడేమోనని అంతోని భయపడి, బిడ్డ కోర్కెను అయిష్టంగానే అంగీకరించాడు. అనంతరం అంతోని యుఫ్రేసియాను కూనమ్మావులో కార్మెల్ మఠకన్యలు నడిపే వసతి గృహంలో అక్టోబరు 24, 1888లో చేర్చాడు. కార్మెల్ మఠకన్యల సభ మఠ స్థాపకులలో పునీత కురియాకోస్ చావరా గారు ఒకరు. అక్కడ ఆధ్యాత్మిక విషయాలపై ఆమె శ్రద్ధ వహించి ప్రార్థనలో ఎక్కువ సమయం గడుపుతూ, చాలా సంతోషంగా తమిళం, మళయాళం, ఇంగ్లీషు, గణితముతో బాటు,

చిత్రలేఖనం, కుట్టుపని లాంటి పనులను నేర్చుకుంది. చదువులలో ఆమె అంతగా రాణించకున్నా, ఆమె దస్తూరి చాలా అందంగా, గుండ్రంగా ఉండేది.

యుఫ్రేసియా ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉండేది. అందుచేత అక్కడి పెద్దలు ఆమెను ఇంటికి పంపుతారేమోనని భయపడేది. అప్పుడు మరియతల్లి వద్దకు వెళ్ళి కన్నీటి ప్రార్థన చేసి, తాను మఠకన్య కావటానికి మంచి ఆరోగ్యమిచ్చి, సహాయం చేయమని వేడుకుంది. ఒకసారి 1889లో ఆమె ఆరోగ్యస్థితి విషమంగా ఉండటంతో, ఆమెకు వ్యాధిగ్రస్తుల అభ్యంగనమిచ్చి, అక్కడి బాలికలు, మఠకన్యలు ఆమె కోసం ప్రార్థించారు. ఆ సమయంలో ఆమెకు తిరుకుటుంబం దర్శనమై, తనకు నూతన జీవాన్ని పోసారని వెల్లడించింది.

ప్రప్రథమ త్రిస్సూర్ పీఠాధిపతి జాన్ మెనచెరి మే 9, 1897న తన పీఠంలోని అంబళకాడు నందు ప్రప్రథమ మఠకన్యల మఠాన్ని పునీత జోజప్పగారి కాన్వెంట్ పేరిట ఆరంభించారు. దానిలో సభ్యులుగా ఉండటానికి నిత్యమాటపట్టు స్వీకరించిన సిస్టర్ రోస్ బియాట్రిస్, నలుగురు నోవిస్‌లు, మఠకన్యల ప్రాథమిక శిక్షణలో ఉన్న ఒకరు కూనమ్మావు నుండి వచ్చి చేరారు. ఇంకా కాన్వెంట్‌లో చేరటానికి వచ్చిన తొమ్మిదిమంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు కూడా కలిసి ప్రయాణించి అంబళకాడు చేరుకున్నారు. మఠాన్ని ప్రారంభించిన మరునాడు అనగా మే 10న, తొమ్మిదిమంది అభ్యర్థులకు మఠకన్యల అంగీలు ధరింపజేసారు. వారిలో యుఫ్రేసియా ఒకరు. అప్పటి వరకు రోసా గా ఉన్న ఆమె "సిస్టర్ యేసు పవిత్ర హృదయ యుఫ్రేసియా" గా నూతన నామాన్ని స్వీకరించింది. ఆ రోజు ఆమె సంతోషం చెప్పనలవికాదు. సాక్షాత్తూ యేసుప్రభువే తనను మఠంలోనికి స్వీకరించినట్లు సంబరపడింది. శిక్షణా కాలంలో తన సర్వాన్ని ప్రభువునకు సమర్పించుకుని, ప్రభు చిత్తాన్ని పాటించడంలో చాలా శ్రద్ధ వహించింది. తన హృదయంలో అప్పుడప్పుడు పొడసూపే మంచి చెడుల సంఘర్షణను పెద్దలకు వివరించి, వారి సలహా ననుసరించి ఆధ్యాత్మికంగా ముందుకు సాగింది. ఇక నుండి తనలో రెండు చిత్తాలుగా గాక, ప్రభుని చిత్తమే తనలో ఉండాలని, ప్రభునిలో తాను సంపూర్తిగా లీనమై, తన స్వంత వ్యక్తిత్వం కనుమరుగు కావాలని ఎంతో కోరుకుంది. దాని కోసమై సదా ప్రార్థించింది.

త్రిస్సూరు మేత్రాసనంలో మే 24, 1900న పునీత మరియమ్మగారి మఠకన్యల గృహాన్ని స్థాపించారు. అదే రోజున యుఫ్రేసియా పేదరికం, బ్రహ్మచర్యం, విధేయత అను మూడు వ్రతములు స్వీకరించి, ప్రభుయేసుని తన నిత్యవరునిగా స్వీకరించింది. దానితో యుఫ్రేసియా తన చిన్ననాటి కలను నిజం చేసుకుంది. సిస్టర్ బియాట్రిస్‌ను మొదటి సుపీరియర్‌గా నియమించారు. నూతనంగా మఠకన్యలైన నలుగురిలో పెద్దదైన సిస్టర్ రోసాకు నొవిస్‌ల తర్ఫీదు అధికారిణిగా భాధ్యతలు అప్పగించారు. బియాట్రిస్, రోసాలతో యుఫ్రేసియా చాలా ప్రేమ పూర్వకంగా, విధేయురాలుగా ఉంటూ,

ప్రభుసేవలో ఎదిగింది. ఆమె ఆదర్శ జీవితాన్ని గమనించిన పెద్దలు ఆమెను నోవిస్‌ల సహాయ శిక్షణాధికారిణిగాను, అనంతరం 1904లో నోవిస్‌ల శిక్షణాధికారిణి గాను నియమించారు. పవిత్రాత్మ ప్రేరణతో, ఆదర్శ మఠకన్యగా జీవిస్తూ, తన శిక్షణలో ఉన్న అభ్యర్థులను ప్రభుప్రేమలో, ప్రభు సేవలో చక్కగా తీర్చిదిద్ది, వారందరిని పవిత్రత నిండిన మఠకన్యలుగా రూపుదిద్దింది. మఠంలో గిల్లి కజ్జాలు పెట్టుకుని, ఒకరికొకరు ఎడమొగం పెడమొగంగా అస్సలు ఉండకూడదని, ఒకరినొకరు మన్నించుకుంటూ, అవసరమైతే వారి పాదాలను ముద్దిడి, తిరిగి సఖ్యతతో జీవించే ఉదాత్త మనస్సుతో, ఎంతో ఎత్తుకు ఎదిగే మఠకన్యలుగా తన శిక్షణలోని అభ్యర్థులు ఉండాలని ఆమె అభిలషించింది. ఆ మన్నింపు, క్షమాపణలనే వారి భూషణాలుగా చేసుకొమ్మని వారికి నూరిపోసింది. కొందరు నోవిస్‌లు, తమకు దైవ పిలుపు ఉందో, లేదోనని, అనుమానాలు వ్యక్తం చేసినపుడు, వారి పక్షాన నిలచి, వారి కోసం ప్రార్థించి, వారి గుండె జారిపోకుండా ధైర్యాన్ని కలుగజేస్తూ అభయాన్ని ఇచ్చేది.

1913లో యుఫ్రేసియా ఒల్లూరులోని పునీత మరియమ్మగారి కాన్వెంటుకు సుపీరియర్‌గా బాధ్యతలు చేపట్టింది.  ఆమెకు ఆ పదవి ఎంత మాత్రం ఇష్టంలేదు. అయినా స్వీకరించక తప్పలేదు. ఆమె యేసు తిరు హృదయంపై అమిత భక్తి ఉన్నందున, యేసు తిరు హృదయ స్వరూపాన్ని తన మఠంలో ప్రతిష్టించింది. రోజూ ఉదయం లేవగానే, మరలా రాత్రి నిద్రకు ముందు, స్వరూపం ముందు నిల్చుని, భక్తి విశ్వాసాలతో ప్రార్థించేది. తన సుఖ దుఖాలన్నీ యేసు దివ్య హృదయానికి సమర్పించి, నిండుగా సాంత్వనం పొందేది. ఆమెను ఆదర్శంగా తీసుకుని, ఇతర మఠకన్యలు కూడా గంటల తరబడి ప్రార్థించేవారు. ప్రార్థనతో సర్వం సమకూరుతుందని ఆమె విశ్వసించింది. ఒకసారి మఠకన్యలంతా భోజనశాలకు వెళ్ళినా, అక్కడ వెచ్చాలు నిండుకున్నందున ఏమీ వండలేదంట. అది గమనించిన యుఫ్రేసియా అందరిని దేవాలయానికి వెళ్ళి ప్రార్థించమని కోరిందట. అనూహ్యంగా కాసేపటికే మఠానికి దగ్గరగా ఉన్న ఓ కుటుంబం వారు వచ్చి, కొంత ఆహారాన్ని, అరటికాయలను దానంగా సమర్పించటంతో, అది ప్రభువిచ్చిన ప్రసాదంగా భావించి, మఠకన్యలంతా తమ ఆకలిని తీర్చుకున్నారంట. సుపీరియర్‌గా తన పదవీ కాలం ముగియడంతో యుఫ్రేసియాను ఏప్రిల్ 14, 1916న మనలూరు కాన్వెంటుకు బదిలీ చేశారు. అక్కడ ఆమె ఆరోగ్యరీత్యా పలు ఇబ్బందులు ఎదుర్కొంది. తీవ్ర జ్వరం రావటం, నోటివెంట రక్తం కారటం, కండరాలన్నీ బిగుసుపోవటం లాంటి పలు జబ్బులు ఆమెను పీడించాయి. అక్కడి వాతావరణం మూలంగా ఆమె ఆరోగ్యం కుదుట పడలేదని భావించిన మఠ పెద్దలు, ఆమెను ఆరు నెలల లోపే ఒల్లూరుకు తిరిగి మార్చారు.

యుఫ్రేసియాకు జాన్ పీఠాధిపతులు చాలాకాలం ఆధ్యాత్మిక గురువుగా ఉన్నారు. ప్రభుని అనుసరణలో మంచి చెడులను వారితో మనసు విప్పి చెప్పుకునేది. ఆధ్యాత్మికంగా

ఎదిగే సమయంలో, ప్రతి వ్యక్తికి అనేక కఠిన పరీక్షలు రావటం సహజమే. ప్రభుని అనుగ్రహం కరువైన ఆ రోజులను చీకటి రాత్రులుగా పరిగణిస్తారు. అట్టి ఆధ్యాత్మిక చీకటి రాత్రులతో యుఫ్రేసియా అప్పుడప్పుడు కలవర పడింది. ఆ సమయాలలో ఆధ్యాత్మిక గురువు సలహాలు, ఓదార్పు, ప్రోత్సాహం చాలా అవసరం. యుఫ్రేసియా తన కష్ట సుఖాలను చెప్పుకుంటూ, తన చీకటి రాత్రులను వివరిస్తూ, తన ఆధ్యాత్మిక గురువుకు 1900 నుండి 1919 వరకు 79 సుదీర్ఘ ఉత్తరాలు వ్రాసింది. వారి సలహాలు పాటించి, ప్రార్థన అనే ఆయుధంతో సాతాను శోధనలను జయించి, ఆధ్యాత్మిక జీవితంలో ఆమె ఎంతో ఉన్నత స్థాయికి చేరింది.

యుఫ్రేసియా దాదాపు 48 సంవత్సరాలు పునీత మరియమ్మగారి కాన్వెంట్‌లో గడిపింది. ఆమె పవిత్ర జీవితాన్ని గమనించిన స్థానికులు ఆమెను ''ప్రార్థించే తల్లి''గా, తన శాంత చిత్తాన్ని, నిబ్బరాన్ని, సంపూర్ణతను చూసిన సహచర మతకన్యలు ''చలిత దివ్య మందసం''గా ముద్దుగా పిలిచేవారు. ఆమె వినమ్రతకు, విధేయతకు, సామాన్య జీవితానికి పెట్టింది పేరు. ఆమె చేతులలో ఎప్పుడూ జపమాల ఉంటుంది. దాని సాయంతో మరియతల్లి ప్రాపకాన్ని, ప్రార్థనా సహాయాన్ని కోరేది. తన వయస్సు పెరిగే కొలదీ, తాను ప్రార్థించే సమయాన్ని కూడా పెంచుకుంటూ వెళ్ళింది. మరియతల్లి స్వరూపం వంక తదేకంగా చూస్తూ, తన చుట్టు ప్రక్కల ఉన్న వారందరి కోసం ప్రార్థించేది. అందరి వద్ద 53 పూసల జపమాల ఉంటే, ఆమె వద్ద 153 పూసల జపమాల ఉండేది. పూర్తి జపమాల చెప్పటంలో ఆమెకెంతో సంతోషముంది. అందరిని కూడా పూర్తి జపమాలను జపించమని కోరేది. జపమాల ప్రార్థనలతో ఆమె ఉత్తరించు స్థలములో ఉన్న ఆత్మలకు విముక్తి కలిగించి, ఆ ఆత్మలు మోక్షం చేరుకునేలా సహాయపడేది. జపమాలను ఒక పదునైన ఖడ్గంతో పోల్చి, దానితో సాతానును జయించవచ్చునని గాఢంగా విశ్వసించి, పాపుల కొరకు నిరంతరం ప్రార్థనలు చేసింది.

ఒకసారి యుఫ్రేసియా దేవాలయంలో ప్రార్థనలు చేస్తుండగా, నోవిస్ యైన గస్పార్, చేతిలో కొన్ని దుస్తులతో దేవాలయానికొచ్చింది. ఆమె ముఖంలో కలవరపాటును, ఆవేదనను గమనించి, యుఫ్రేసియా వివరాలు అడిగింది. అప్పుడు గస్పార్ 'రోగిగా ఉన్న నన్ను ఈ సభను విడిచి పెట్టి వెళ్ళమన్నారు. మా అన్నయ్య, డాక్టర్ నన్ను తీసుకొని వెళ్ళటానికి వచ్చారు. అంగీని తీసివేసి, ఈ దుస్తులు ధరించమన్నారు. వెళ్ళేముందు ప్రభువుకు, మీకు చెప్పి వెళ్దామని వచ్చాను'' అని చెప్పింది. యుఫ్రేసియా, గస్పార్‌ని ఓదారుస్తూ, ''నీవు వెళ్లి మత శ్రేష్ఠురాలు ముందు మోకరించి, నాకు తొమ్మిది దినాలు సమయమివ్వండి. అప్పటి కల్లా జబ్బు తగ్గితేసరి. లేదంటే, నా వాళ్ళను పిలిపించి, నేనే స్వయంగా వెళ్తాను'' అని చెప్పమంది. కాని గస్పార్‌కు చెప్పటానికి ధైర్యం చాలలేదు. వారి ఆధ్యాత్మిక గురువు వద్దకు వెళ్ళి, తన పరిస్థితి వివరించింది. గురువును తోడు

తీసుకుని, మఠపెద్ద వద్దకు వెళ్ళి, యుఫ్రేసియా చెప్పినట్లే మోకరిల్లి, చెప్పాల్సిన విషయం చెప్పింది. దానికి సభాధినేత సమ్మతించటంతో, తనను ఇంటికి తీసుకువెళ్ళటానికి వచ్చిన అన్న, డాక్టర్ తిరుగు ప్రయాణం కట్టారు. గస్పార్ గొంతు సంబంధ వ్యాధితో ఏమీ తినలేకపోయింది. ఆమె అన్నవాహిక సన్నబడింది. ఘన పదార్థం ఏదీ మింగలేక పోయింది. గస్పార్ వెంటనే యుఫ్రేసియా వద్దకు పరుగెత్తికొని వెళ్ళి, జరిగిన విషయం చెప్పగానే, ‘‘ఈ తొమ్మిది రోజులు మరియతల్లికి నవదిన ప్రార్థనలు చెప్పు. నీవు సంపూర్ణంగా స్వస్థురాలు అవుతావు’’ అని లాలనగా చెప్పింది. అప్పటికే ఎన్నో మందులు తిన్నది. అయినా గండం గట్టెక్కలేదు. గస్పార్, ఆమెతో బాటు యుఫ్రేసియా మరియతల్లి ద్వారా యేసు ప్రభుని ప్రార్థించారు. నాలుగవ రోజుకల్లా గస్పార్ కొద్దిగా గంజి త్రాగగలిగింది. ఎనిమిదవ రోజు కల్లా గొంతు నొప్పి మటుమాయమైంది. ఆమె గొంతుకు అసలు ఏ జబ్బు వచ్చినట్లు ఆనవాళ్ళు కూడా లేవని వైద్యుడు ధృవీకరించాడు. ఈ అద్భుతం నిజంగా యుఫ్రేసియాకు మరియమాతపై ఉన్న గాఢ విశ్వాసానికి ప్రతిఫలమని చెప్పక తప్పదు. ఆమె ప్రార్థనలతో అద్భుత విధంగా పలువురికి అనేక రకాల స్వస్థతలు జరిగినట్లు ఎంతో మంది సాక్ష్యం చెప్పారు.

యుఫ్రేసియా వయస్సు మీద పడుతున్నా విశ్రాంతి తీసుకొనక, కాన్వెంట్ పరిసరాలన్నీ చీపురు పట్టుకుని ఊడ్చేది. మరుగుదొడ్లు శుభ్రపరిచేది. వంట పనిలో సహాయపడేది. శరీరశ్రమ చేయటానికి ఏమాత్రం వెనుకాడేది కాదు. దేవాలయంలో పవిత్ర దివ్య మందసం ముందు కూర్చుని ప్రార్థించేది. తన గదిలో సిలువను పట్టుకుని, ప్రభుని ప్రేమను, త్యాగాన్ని గంటల తరబడి ధ్యానించేది. ఆమెకు యేసుప్రభువే బలం, ఊపిరి. ఆ ప్రభుని యందు ఏకం కావటం, తాదాత్మ్యం చెందటానికి ఆమె ఉబలాట పడింది. తహతహలాడింది. ఆమె ఎల్లప్పుడు శ్రీసభ సంక్షేమం కొరకు ప్రార్థించింది. జగద్గురువులు, పీఠాధిపతులు, గురువులు, మఠవాసులందరి కొరకు ఎంతో ప్రార్థించేది. వారి కొరకు ఎన్నో ప్రాయశ్చిత్తాలు చేసేది. ఎవరే చిన్న సహాయం చేసినా, ‘‘నేను చనిపోయినా, నీ సహాయాన్ని గుర్తు పెట్టుకుంటాను’’ అని చెప్పి, వారి కొరకు ప్రార్థించేది. యుఫ్రేసియా చక్కని కతోలిక విశ్వాసిగా, మంచి మఠకన్యగా, ఉత్తమ శ్రీసభ బిడ్డగా జీవించి, అందరిని తనవారిగా భావించి, అందరి కొరకు ప్రార్థిస్తూ ఆగస్టు 29, 1952న ప్రభు యేసునిలో లీనమైంది. యుఫ్రేసియాను 1987లోనే ‘‘దైవ సేవకులు’’గా ప్రకటించారు. యుఫ్రేసియాను రెండవ జాన్ పాల్ పాపుగారు 2002లో ‘‘పూజ్యులు’’గా ప్రకటించారు. యుఫ్రేసియాను డిసెంబరు 3, 2006న పదహారవ బెనెడిక్టు జగద్గురువులు ‘‘ధన్యులు’’గాను, ఫ్రాన్సిస్ పాపుగారు నవంబరు 23, 2014న రోమాపురిలో ‘‘పునీతులు’’గా పట్టం కట్టారు. ఆమె పునీత పట్టం నిజంగా అఖిల భారత శ్రీసభకు, కార్మెల్ మఠకన్యల సభకు, కేరళ శ్రీసభకు గొప్ప గుర్తింపుగా అభివర్ణించవచ్చు.



తమిళ క్రైస్తవుల ఆత్మ బంధువు

# 21. దైవ సేవకులు లూయి లెవె

**(1884-1973)**

**ఫాదర్ పాము విద్యాసాగర్, S.J.**

లూయి మరియ లెవె ఫ్రాన్సు దేశమందలి రెనె కతోలిక పీఠంలోని లైల్ అను గ్రామంలో ఏప్రిల్ 6, 1884 మ్రానికొమ్మల ఆదివారం నాడు జోసఫ్ లెవె, జూలియాన అను పుణ్య దంపతులకు పదవ సంతానముగ జన్మించాడు. లూయి పుట్టగానే బ్రతకడని భయపడి, అతనికి అదే రోజు జ్ఞానస్నానం ఇప్పించారు. అతని జ్ఞాన తల్లిదండ్రులైన లూయి, మరియ దంపతుల పేర్లను కలుపుతూ శిశువుకు లూయి మరియ లెవె అని నామకరణం చేశారు. లూయి, ఐదుగురు అన్నలు, నలుగురు అక్కలకు ముద్దుల తమ్ముడు. తల్లిదండ్రులు వ్యవసాయదారులు. మంచి విశ్వాసపరులు. కనుక తమ సంతానాన్ని వారు చక్కని కతోలిక విశ్వాసంలో పెంచారు.

లూయి తల్లిదండ్రులు తమ పదిమంది సంతానాన్ని ఏ కొరత లేకుండా పోషించటానికి రోజంతా కష్టపడి పనిచేసేవారు. ప్రతి సాయంత్రం కుటుంబమంతా కలిసి ప్రభుని భక్తిగా ప్రార్థించేది. జూలియాన ఆదర్శ జీవితం, దేవునిపై భక్తి ప్రపత్తులు, ప్రార్థనలోని ఆసక్తిని గమనించిన పిల్లలంతా, తల్లి అడుగుజాడలలో నడిచి, భక్తియుతంగా ప్రార్థించేవారు. లూయి తండ్రి జోసఫ్‌కు గుండెజబ్బు వచ్చింది. దానితో కొంతకాలం బాధపడి, జోసఫ్ తన 54వ యేట కన్ను మూశాడు. అప్పటికి లూయి వయస్సు ఏడేండ్లే. తన మరణానికి ముందు, తన బిడ్డలందరిని చేరబిలిచి, ‘‘మీరంతా అమ్మను గౌరవించండి. ఆమె మాటలు పూర్తిగా వినండి. అమ్మ పడే బాధను మీ ప్రేమానురాగాలతో తొలగించండి’’ అని జోసఫ్ ఉపదేశం చేశాడు. వారి సంతానం తండ్రి మాటలకు ఎంతో విలువ నిచ్చి, తమ తల్లి కనుసన్నలలో బాధ్యతాయుతంగా ఎదిగారు. మరికొంత కాలానికే లూయి పెద్దన్నయ్య కూడా ప్రమాదవశాత్తు మరణించాడు. ఎదిగివచ్చిన కొడుకు మరణించటంతో జూలియాన బాధపడింది. కరుణామయుడైన యేసుని పైన తమ కుటుంబ భారాన్ని మోపి, జూలియాన ఆత్మస్థైర్యంతో, భక్తివిశ్వాసాలతో ముందుకు నడచింది.

అక్క విక్టోరియా లూయి కంటే ఏడేండ్లు పెద్దది. ఆమె అంటే లూయికి చాలా ఇష్టం. విక్టోరియా, తమ్ముడైన లూయిని మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న దేవాలయానికి తీసుకుని వెళ్ళేది. అక్కతో కలిసి దివ్యసత్ప్రసాద మందసం ముందు

కూర్చుని లూయి ప్రార్థించేవాడు. వారిద్దరు శుక్రవారాలలో ప్రభుని శ్రమలను స్మరిస్తూ పదునాలుగు స్థలములు భక్తితో జపించేవారు. లూయిని గురువు కమ్మని అక్క ఎంతో ప్రోత్సహించింది. అప్పటికి లూయికి గురువంటే పూర్తి అవగాహన లేదు.

లూయి పన్నెండేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడు ఓ గురువు వద్ద పాప సంకీర్తనం చేశాడు. తరువాత గురువు "నీ దైవ పిలుపు ఏమిటి?" అని లూయిని ప్రశ్నించాడు. లూయికి దైవ పిలుపు అనే మాటకు అర్థం పూర్తిగా తెలియలేదు. లూయి తనను దైవ పిలుపు గురించి గురువు అడిగినట్లు తన తల్లికి చెప్పాడు. లూయి పదునాలుగేళ్ళ వయస్సులో ఉండగా గురువు కావాలనే దైవ పిలుపు తన అంతరంగంలోనే స్వయంగా వచ్చింది. ఆ విషయం తన తల్లి జూలియాన తో పంచుకున్నాడు. జూలియాన లూయిని వెంటబెట్టుకుని విచారణ గురువుతో ఆ విషయాన్ని చర్చించింది. గురువు ఎంతో సంతోషించి, లతీను భాషను నేర్చుకొమ్మని, ఒక లతీను వ్యాకరణ పుస్తకాన్ని లూయి చేతిలో పెట్టాడు. ఆ వ్యాకరణాన్ని నేర్చుకోవాలని, కంఠతా పట్టాలని ఎంతో ప్రయత్నించినా, అది లూయికి మింగుడు పడలేదు. దానితో విచారణ గురువు తన సహాయక గురువుకు లూయిని అప్పగించి, లతీను భాషను నేర్పమన్నాడు. లూయి తన పదహారేళ్ళ వయస్సులో అనగా 1900లో విత్రె పట్టణంలోని పునీత పరిశుద్ధ సిలువ పాఠశాలలో ఉన్నత చదువులు అభ్యసించటం ఆరంభించాడు.

లూయి నాలుగు సంవత్సరాలు ఉన్నత విద్యను విత్రెలో పఠించాడు. అనంతరం 1904లో రెనె పట్టణమందలి సెమినరీలో చేరాడు. ఒక రోజు ఫ్రాన్సు నందలి తులూస్ మండలానికి చెందిన జోయెల్ అను జేసుసభ గురువు భారతదేశమందలి మధురై మండలం గురించి, అక్కడ జరుగుతున్న వేద వ్యాపక కార్యక్రమాల గురించి సవివరంగా గురు శిక్షణలో ఉన్నవారినుద్దేశించి ఉపన్యసించాడు. పునీత ఫ్రాన్సిస్ శౌరివారు, పునీత జాన్ డి బ్రిట్టోల వలె తాను కూడా పనిచేసి, ప్రభురాజ్యాన్ని విస్తరించాలని నిర్ణయించుకున్నాడు. లూయి తన నిర్ణయాన్ని నీరుపోసి, పెంచి, వృద్ధిపరచమని పునీత శౌరి వారి నవదిన ప్రార్థనలు, రెనె పట్టణమందలి అద్భుత మరియమాతకు తీర్థయాత్రలు చేసి, పూర్ణ మనస్సుతో ప్రార్థించాడు. భారతదేశానికి వేద ప్రచారక గురువుగా వెళ్ళాలన్న ఆశయాన్ని సాఫల్యం చేసుకోవటానికి, మొదటి మెట్టుగా ఫ్రాన్సు దేశమందలి తులూస్ జేసుసభ మండలంలో లూయి చేరి, అక్కడ లాటిన్, ఫ్రెంచి, గ్రీకు, ఇంగ్లీషు భాషలను నేర్చుకోవటం ఆరంభించాడు. అప్పటి తులూస్ మండలం భారతదేశమందలి మధురై మండలం యొక్క మాతృ మండలం. వారే మధురై మండలంలో వేద ప్రచార బాధ్యతను స్వీకరించి, శ్రీసభ వ్యాప్తికి తమ శాయశక్తులా తోడ్పడుచున్నారు.

లూయి మరియ లెవె బెల్జియం దేశపు లింబుర్గ్ మండల నవ సన్యాసుల శిక్షణా కేంద్రంలో అక్టోబరు 6, 1906 లో చేరాడు. అక్కడ నొవిషియేట్‌లో నీటిలోని చేప

పిల్లలా చాలా సంతోషంగా ఉన్నానని లూయి చెప్పుకున్నాడు. రెండు సంవత్సరాల శిక్షణను ముగించి, లూయి మూడు వ్రతముల ద్వారా తన్ను తాను దేవునికి సమర్పించుకున్నాడు. లూయి భారతదేశమందలి మధురై మండలంలో వేదప్రచారకునిగా తనను పంపమని, తన మరణ పర్యంతం అక్కడే సేవ చేస్తానని సభ పెద్దలకు విన్నవించుకున్నాడు. లూయిలోని ఆసక్తిని గమనించిన సభాధిపతులు, లూయి విజ్ఞప్తిని మన్నించటంతో, అతని ఆనందానికి అవధులు లేవు. తన శిక్షణానంతరం, ఈ విషయం తెలపటానికి, చివరిసారిగా తన స్వగ్రామం చేరుకున్నాడు. "నీవు పునీత ఫ్రాన్సిస్ శౌరివారు, పునీత జాన్ డి బ్రిట్టో వారిలా భారతదేశం వెళ్ళటం మాకెంతో గర్వకారణం" అని అక్క విక్టోరియా ఎంతో మురిసిపోయి, తమ్ముడైన లూయిని ఎంతో ఆప్యాయంగా ముద్దాడింది. తల్లి తన కడగొట్టు కొడుకు తనను వీడిపోతున్నాడని కన్నీళ్ళు పెట్టుకుంది. అది దైవచిత్తంగా భావించి, కుటుంబ సభ్యులు, స్నేహితులు లూయికి వీడ్కోలు పలికారు. అదే లూయి చివరి శాశ్వత వీడ్కోలు.

లూయి, ఫ్రాన్సు నందలి మర్సెయిల్స్ నుండి పన్నెండు మంది జేసుసభ సహచరులతో కలిసి 1908 సెప్టెంబరులో ప్రయాణమయ్యాడు. దారిలో లూర్దునగరంలోని మరియమాత ప్రార్థనా సహాయాన్ని కోరాడు. సుదీర్ఘ నౌకాయానం చేసి బొంబాయి ఓడరేవుని అక్టోబరు 14న చేరుకున్నాడు. అక్కడ నుండి దక్షిణ భారతదేశంలోని మధురై మండలం ప్రయాణించాడు. కొడైకెనాల్ కొండలలోని షెంబగనూరు చేరుకుని, అక్కడి యేసు పవిత్ర హృదయ కళాశాలలో తత్వశాస్త్రాన్ని అభ్యసించాడు.

పిమ్మట లూయి 1912 నుండి 1916 వరకు పాలయంకోట్టైలోని పునీత ఫ్రాన్సిస్ శౌరివారి ఉన్నత పాఠశాలలో బ్రదరుగా నాలుగేండ్లు బోధించటం, వసతి గృహ విద్యార్థుల ఆలనా పాలనా చూస్తూ, వారిని శ్రద్ధగా చదివించటం లాంటి పనులతో క్షణం తీరుబాటు లేకుండా పనిచేశాడు. విద్యార్థుల తెలివితేటలను సానబెడుతూ, వారిని దైవమార్గంలో లూయి నడిపించాడు. లూయి విద్యార్థులతో కలిసిమెలసి ఉండటం వలన, తమిళభాషను త్వరగా నేర్చుకున్నాడు. లూయి వేదాంత విద్య నభ్యసించటానికి బెంగాలులోని హిమాలయ పర్వత ప్రాంతమందలి కర్సియాంగ్ చేరుకుని, అక్కడే నాలుగేళ్ళు బైబులు జ్ఞానంలో, దైవశాస్త్రంలో శిక్షణపొంది, జనవరి 13, 1920న గురు పట్టాభిషేకం పొందాడు. తదనంతరం రాంచి పట్టణంలో లూయి లెవె జేసుసభ రాజ్యాంగమును, ఇన్యాశివారి ఆధ్యాత్మికతను గురించిన ఆత్మ సంబంధ చదువులను భక్తియుతంగా పూర్తిచేసి, 1921లో మధురై మండలం చేరుకున్నాడు.

దక్షిణ తమిళనాడులో ఉన్న కొంతభాగాన్ని మరవనాడు, మరవరాజ్యం అని అంటారు. ఆ ప్రాంతంలో 1542లో పునీత ఫ్రాన్సిస్ శౌరివారు, 1693 లో వేద సాక్షి మరణం పొందిన పునీత జాన్ డి బ్రిట్టో మున్నగు పూజ్య గురువులెందరో వేద ప్రచారం

చేశారు. అక్కడ వర్షాలు తక్కువ. ఎండలు ఎక్కువ. కనుక కరువు కాటకాలతో ప్రజలంతా సతమతమయ్యేవారు. అది అక్షరాస్యత అంతగాలేని ప్రాంతం కూడా. జేసుసభ అధినేతలు లూయి లెవెను ఆండావరుని విచారణ గురువుగా నియమించారు. లూయి యువ గురువుగా తన తెలివి తేటలపై గాకుండా, దేవునిపై సంపూర్ణ భారం వేసి, తన యాజకత్వాన్ని ఆరంభించాడు. ఆ విచారణ గురించి లూయి తన కుటుంబ సభ్యులకు ఈవిధంగా లేఖ వ్రాసాడు. 'ఇక్కడ నా ఆధ్వర్యంలో 40,000 మంది క్రైస్తవులు, 20,000 మంది హిందువులు ఉన్నారు. నేను వారందరిని చూసుకోవాలి. నా బాధ్యత చాలా పెద్దది. దానికి నా శక్తి చాలదు. దానికి మీ ప్రార్థనా సహాయం నాకెంతో అవసరం.'' అది నిజంగా యువ గురువుకి పెద్ద బాధ్యతే. దానికి దాదాపు 70 విచారణ గ్రామాలు ఉన్నాయి. కొన్ని చాలా దూరంలో ఉన్నాయి. వాటికి రహదారి కాని, రవాణా సౌకర్యాలు కాని లేవు. కాని లూయి మండుతున్న ఎండలలో, గంటల కొలది కాలినడకన ఆ గ్రామాలకు వెళ్ళేవాడు. అక్కడే రోజంతా ఉండి, వృద్ధులను, రోగులను పరామర్శించేవాడు. క్రైస్తవులందరిని విశ్వాసంతో కష్టాలనెదుర్కొనమని బోధించేవాడు. దూరంగా ఉన్న గ్రామాలకు ఎద్దుల బండిలో వెళ్ళి, దివ్యబలి పూజలు చేసేవాడు.

అండావరుని గ్రామంలో వేరువేరు వర్గాలకు చెందిన క్రైస్తవులున్నారు. గ్రామ ఉత్తరాన ఒక దేవాలయం, దక్షిణాన ఒక దేవాలయం ఉన్నాయి. వారి మధ్యలో ఉన్న విభేదాలను రూపుమాపి, వారందరిని ఏకతాటిపై నిలపాలని, గ్రామమధ్యలో ఒక పెద్ద దేవాలయాన్ని నిర్మించాలని, లూయి లెవె పూనుకున్నాడు. దేవాలయ నిర్మాణం కోసం తన మాతృదేశంలోని బంధుమిత్రులకు, ఇతరులకు వ్రాసి, ధనం సేకరించి, దాదాపు ఆరేండ్లపాటు శ్రమించి 1928లో దేవాలయ ప్రతిష్ఠ చేసి, ''కనికరమాత దేవాలయం''గా నామకరణం చేసాడు. అందలి మరియమాత స్వరూపాన్ని ఫ్రాన్సు దేశ మిత్రులు బహూకరించారు. లూయికి బాలలంటే ఎంతో ప్రీతి. ఆ గ్రామ బాలలు లూయితో చాలా ప్రేమ పూర్వకంగా ఉండేవారు. దేవాలయంలో లెవె ఒంటరిగా ప్రార్థించే సమయంలో కూడా కొందరు బాల బాలికలు వచ్చి, అతనిని అనుకరిస్తూ దేవుని ప్రార్థించేవారు. ఆ పిల్లల భవిష్యత్తు కోరి లూయి ఒక చిన్నపాకలో పాఠశాల ఏర్పాటు చేసి, వారికి విద్యాబోధ చేయనారంభించాడు. కొన్ని సంవత్సరాల అనంతరం, బాలబాలికలకు వేరు వేరుగా పాఠశాలలు ఏర్పరచి, బాలికల పాఠశాలను స్థానిక మఠకన్యలకు, బాలుర పాఠశాలను తిరు హృదయ సహోదరులకు అప్పగించాడు. అక్కడే 1937లో అనాథలు, పేద పిల్లలకోసం 'కారుణ్య నిలయం' అను వసతి గృహాన్ని ఆరంభించి, ఎందరినో ఉచితంగా చదివించి, వారిని ప్రయోజకులను చేశాడు.

ఆ కాలంలో అంటువ్యాధులు సోకి, మనుష్యులు పిట్టల్లా రాలిపోటం జరిగేది. అట్టి విపత్కర పరిస్థితులలో సైతం లూయి మరణానికి భయపడక, ఇంటింటికి వెళ్ళి,

సహాయం చేసేవాడు. 1925లో లూయి ఇలా వ్రాశాడు: “నేను 1500 మంది జనాభా ఉన్న గ్రామంలో ఉన్నాను. కలరా వలన అతికొద్ది రోజులలో 66 మంది మరణించారు. కలరా వ్యాధి సోకిన రోగులను నేలపై పరుండబెట్టేవారు. ఆ రోగం తమ్ము అంటుకుంటుందేమోనని కుటుంబ సభ్యులెవరూ రోగి వద్దకు వెళ్ళరు. ఆ సమయాలలో నేను అన్ని మతాల వారి గృహాలను సందర్శించి, రోగులపై తీర్థం చల్లి, వారి కోసం ప్రార్థించేవాణ్ణి”. కాబట్టి లూయిని ప్రజలంతా “నడుస్తున్న పునీతుడు” అని ముద్దుగా పిలుచుకునేవారు. లూయి మనుషులపైనే గాక, రోగాల బారిన పడిన పశువులపైన కూడా ఆశీర్వదించిన తీర్థం చల్లితే, రోగం మటుమాయమై, అద్భుతంగా అటు మనుషులు, ఇటు జంతువులు కోలుకునేవి. ఆ ప్రాంత ప్రజలంతా వ్యవసాయదారులు. కొన్నిసార్లు వర్షాలు పడక, పొలాలు ఎండిపోయేవి. ఒకసారి ప్రజలు వర్షం కొరకు ప్రార్థించమని కోరితే, లెవె మిట్ట మధ్యాహ్నపు ఎండ వేడిమిని లెక్క చెయ్యకుండా ఒక పొలం మధ్యకు వచ్చి, అక్కడే మోకరించి, ఆకాశం వైపు చేతులు ఎత్తి, మిక్కిలి భక్తితో ప్రార్థించటం మొదలుపెట్టాడు. కొంతసేపటికే ఆకాశమంతా కారుమబ్బులు క్రమ్మి, అద్భుతంగా కుండపోత వర్షం కురిసింది. ఆ ప్రాంతంలో పంటలకు చీడ పీడలు వచ్చినపుడు, వ్యవసాయదారులు లూయి దరిచేరి, ప్రార్థించమని కోరేవారు. లూయి తాటి ఆకులపై ప్రార్థనలు వ్రాసి, వాటిని సిలువలుగా మలచి, పొలం మధ్యలో నాటమని చెప్పేవాడు. తరువాత లూయి స్వయంగా ఆ పొలాలు వెళ్ళి, తీర్థం చల్లి ప్రార్థించేవాడు. ఆయన ప్రార్థనా శక్తికి, కీటకాలన్నీ నశించి, పంటలు సురక్షితముగా నుండేవి. ప్రజలంతా ఆయనలో ఒక గొప్ప దైవభక్తుని గాంచారు. అందుచేత ఆయన ప్రార్థనల కోసం సర్వ మతాలకు చెందిన పండిత, పామరులు వచ్చి, ప్రార్థనలు చేయించుకునేవారు.

1929లో ఓరియారు గ్రామం అండావరుని విచారణకు అనుబంధ గ్రామమైంది. అది ఆరు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఓరియారులోనే జాన్ డి బ్రిట్టో గారు వేదసాక్షిగా మరణించాడు. అండావరుని క్రైస్తవుల విశ్వాసాన్ని మరింత గట్టి పరిచే ప్రయత్నంలో భాగంగాను, బ్రిట్టోగారి పునీత పట్టం త్వరగా జరగాలనే సత్సంకల్పంలో భాగంగా, అండావరుని క్రైస్తవులను ఉత్సాహపరచి, ఓరియూరుకు మొట్టమొదటిసారి పాదయాత్రను నిర్వహించాడు, అక్కడే ఉపవాసముండి రోజంతా ప్రార్థనలో గడిపి, దివ్య పూజాబలి సమర్పించాడు. వారు చూపించిన బాటలోనే ఆనాటి నుండి ఈనాటి వరకు పలు గ్రామాలనుండి, ఓరియూరుకు ప్రతి సంవత్సరం ఎందరో విశ్వాసులు పాదయాత్రగా వచ్చి, ప్రార్థించటం ఒక క్రైస్తవ సంప్రదాయంగా మారింది. దానికి శ్రీకారం చుట్టింది లూయి గురువులే.

లూయి ఆండావరునిలో 22 ఏండ్లపాటు సేవలందించిన మీదట, అతనిని 1943లో రామనాథ పురంనకు బదిలీ చేశారు. అప్పటికి లూయికి అరవైయేండ్లు. మరవ రాజ్యానికి

రామనాథ పురం రాజధాని పట్టణం. అలసి, సొలసిపోయిన లూయి శరీరానికి అక్కడ కొంత విశ్రాంతి లభిస్తుందని పెద్దలు భావించారు, అయినా లూయి మాత్రం రామనాథ పురం, దానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పరిసర సముద్రతీర గ్రామాలన్నీ కలియ దిరిగి, దివ్య బలిపూజలు సమర్పించేవాడు. ఆ ప్రాంతంలో పునీత శౌరి వారిచే స్వయంగా జ్ఞానస్నానం పొందిన వారి సంతతికి పూజాదులు సమర్పించటం తన మహద్భాగ్యంగా లూయి భావించాడు. రామనాథ పురంలో రాజవంశానికి చెందిన ఓ మహిళ ఎంతోమంది వారిస్తున్నా వినకుండా, ఒక క్రొత్త బంగళాను లూయికి అందజేసింది. ఆ బంగళాలో లూయి ఒక పాఠశాలను స్థాపించి, విద్యాదానం చేయటం ప్రారంభించాడు. పిమ్మట ఆ పాఠశాలను యేసు తిరుహృదయ సహోదరులకప్పగించాడు. అటులనే మధురైలో బాలికల అభ్యుదయం కోసం ఒక బాలికల పాఠశాలను స్థాపించి, దానిని స్థానిక అమలోద్భవి మాత మఠకన్యలకు అందజేశాడు.

లూయి తన విచారణ క్రైస్తవులందరి బాగోగులను, క్షేమాన్ని కోరుతూ, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడు. లూయి, విద్య నేర్చిన ఎందరో యువకులకు ఉద్యోగాలు సంపాదించి ఇచ్చాడు. పేద మత్స్యకారులకు చేపల వలలను, పడవలను కొనటానికి సహాయం చేశాడు. రామనాథ పురంలోని విద్యార్థులకు ఒక చక్కని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాడు. నీడలేని నిరుపేదలకు ఇళ్లు కట్టించాడు. ఎండైనా, వానైనా లూయి తన విశ్వాసుల మధ్యలో ఉంటూ, వారి సమగ్ర అభివృద్ధికోసం నిత్యం పాటుపడేవాడు. లూయి వృద్ధుడయ్యేకొలది, అతని ముఖంలో తేజస్సు, కాంతి మరింత ఎక్కువ కాసాగింది. కావున అతని ఆశీస్సుల కోసం కతోలికులు, ఇతర క్రైస్తవ శాఖలవారు, హిందువులు, ముస్లిములు ఎందరో ఎగబడి వచ్చేవారు. అయినా లూయి ఓపికగా వారందరిపై ప్రార్థించేవాడు. వారి చక్కని భవిష్యత్తు కోసం సలహాలిచ్చేవాడు. కృతజ్ఞతగా ధనవంతులిచ్చే ధనాన్ని, కానుకలను, ఉదారంగా పేద ప్రజలకిచ్చి, వారికి సహాయపడేవాడు. మత్స్యకారులు, లూయి తమ వెంట ఉంటే చేపలు బాగా ఎక్కువ పడతాయని విశ్వసించేవారు. లూయి వారి విన్నపాన్ని కాదనకుండా, వారివెంట చిన్న చిన్న పడవలలో అప్పుడప్పుడు చేపల వేటకు వెళ్ళేవాడు. నిజంగా ఆ రోజు వారికి చాలా ఎక్కువ చేపలు పడతాయి. క్రైస్తవుల కోసం గ్రామాలలో ప్రార్థనా సదస్సులు నిర్వహించి, కరుణామయుడైన ప్రభుని సువార్తను విపులంగా బోధించాడు. కరువు కాటకాలు వచ్చినపుడు, అక్కడి పేద ప్రజలతో మమేకమై, వారిని ఓదార్చేవాడు. ప్రభుని ప్రేమను, కరుణను పేదలకు పంచుతూ, లూయి క్రమక్రమంగా చిక్కి శల్యమయ్యాడు.

1956లో లూయిని సరుగని విచారణలో ఆధ్యాత్మిక గురువుగా బదిలీ చేశారు. అప్పటికి లూయి అండావరునిలో 22 సంవత్సరాలు, రామనాథ పురంలో 13 సంవత్సరాలు ప్రభుని సేవలో, ప్రజల సేవలో పనిచేశాడు. డెబ్బై రెండేళ్ళ వయస్సులో ఎవరైనా కొంచెం

పని తగ్గించి, విశ్రాంతి తీసుకోవాలని భావిస్తారు. కాని లూయి మాత్రం విశ్రాంతి తీసుకొనడానికి ఏ మాత్రం అంగీకరించడు. రాత్రయినా, పగలైనా, ఎండయినా, వానయినా ప్రభుసేవలో ఉండటమే అతనికి తెలుసు. తన అవసరం ఉందని తెలిస్తే, ఏ అర్ధరాత్రయినా కతోలిక విశ్వాసుల ఇంటికి చేరుకుని, ప్రార్థిస్తాడు. విద్యుచ్ఛక్తి లేని ఆ కాలంలో, కంటి చూపు తరుగై, అక్షరాలు సరిగా కనపడకున్నా, లాంతరు దగ్గర పెట్టుకుని తన రోజువారి ప్రార్థనలను దేవాలయంలో ప్రతిరాత్రి చెప్పుకునేవాడు. పగలల్లా పనిచేసినా, రాత్రి పదకొండు గంటల వరకు మోకాళ్ళూని ప్రార్థించి, దేవుని ఆశీర్వచనం పొందేవాడు. తనకు బాల్యంనుండి మరియతల్లి అంటే ఎనలేని గౌరవం. వల్లమాలిన అభిమానం. మరియతల్లి ద్వారా తనకు దేవుని ఆశీస్సులు సమృద్ధిగా వచ్చాయని అతని గట్టి నమ్మకం. ఆ నమ్మకాన్ని మరియతల్లి ఏనాడు వమ్ము చేయలేదు. అటులనే లూయికి జేసుసభలో చేరిన 1906 నుండి చిన్న తెరేజమ్మగారి "చిన్న బాట" అంటే ఇష్టం. ఆమె వలె తాను కూడా దేవునికి ప్రీతికరమైన చిన్ని చిన్ని కార్యాలు చేయాలని, నిరంతరం ప్రయత్నించాడు.

లూయి సరుగనిలో మొత్తం 17 ఏండ్లు గడిపాడు. అక్కడి ప్రజల ఆధ్యాత్మికతను పెంచటానికి అతడెన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాడు. లూయి ఏడాదికి ఒకసారి ఊరంతా దివ్యసత్ప్రసాద ప్రదక్షణ చేసి, ఊరంతటికి ప్రభుని ఆశీస్సులు లభించేలా చూసేవాడు. చేతికర్ర సహాయంతో నడుస్తూ, గ్రామాలకు వెళ్ళి పాప సంకీర్తనాలు విని, పూజలు సమర్పించి వచ్చేవాడు. అతడు నిజంగా మంచి కాపరి. చెదరిన గొర్రెలను వెదకి, వారి విశ్వాసాన్ని స్థిరపరచి, తిరిగి సంఘంతో ఐక్యపరిచేవాడు. తన ఓర్పుతో, సంయమనంతో, విశ్వాసంలో బలహీనపడిన కతోలికులకు అండగానుండి, తన మంద కొరకు నిత్యం ఎంతో పాటుబడేవాడు.

లూయి మరియ లెవె తన చుట్టూ వున్న పేద క్రైస్తవుల ఉన్నతి కోసం, వారి ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఎంతో తపించాడు. తన వద్దకు పేదలైనా, దళితులైనా, ధనవంతులైనా ఎవరు వచ్చినా వారిని సంతృప్తి పరచి, దీవించి పంపేవాడు. లూయి తన గురు జీవితంలో దాదాపు ముప్పయి చిన్న దేవాలయాలను, ఒక్క పెద్ద దేవాలయాన్ని, కొన్ని పాఠశాలలను, కొన్ని మఠకన్యల మఠాలను కట్టించి, శ్రీసభకు ఎనలేని సేవలందించాడు. పేదల కోసం భిక్షమెత్తటానికి అతడు ఎప్పుడూ వెనకాడలేదు. తాను మాత్రం తలదాచుకోవటానికి తావులేని క్రీస్తు ప్రభుని అనుసరించటంలో ముందుండేవాడు. అతని ప్రార్థనా జీవనాన్ని, అణకువను చూచిన సోదర జేసుసభ యువ గురువులు, లూయిని ఆదర్శంగా తీసుకునేవారు. లూయి ఎల్లప్పుడు తనకోసం కాకుండా, తన కప్పగింపబడిన మంద కోసం ప్రార్థించేవాడు.

1970 జనవరి 13న లూయి గురుత్వ బంగారు జూబిలీని ప్రజలంతా చాలా వేడుకగా జరిపి, లూయి పట్ల తమకున్న ఆదరాభిమానాలను వెల్లడించారు. ఆ జూబిలీ వేడుకలు

దాదాపు సంవత్సరంపాటు జరిగాయి. వాటిలో పాల్గొనటానికి ఫ్రాన్సు దేశము నుండి లూయి అన్న ఫిలియెర్ట్ కూతురు సిస్టర్ మరియ డి జేసు వచ్చింది. ఆమె రాకడ లూయికి ఎంతో సంతోషమైంది. లూయి తన అన్న కూతురికి తాను పని చేసిన ప్రతి ప్రాంతాన్ని, ప్రతి గ్రామాన్ని త్రిప్పి చూపించాడు. తన పెద్దనాన్న చేసిన వేద ప్రచారాన్ని కళ్ళారా చూచిన సిస్టర్ మరియ మనసు ఎంతో పులకించింది. తన కుటుంబంలో అంత చక్కని గురువునిచ్చినందుకు భగవంతునికి ఆమె ఎంతో కృతజ్ఞతలు తెలుపుకుంది. సిస్టర్ మరియ తన పెద్దనాన్నతో రెండు నెలలు గడిపి, తన స్వదేశం వెళ్ళిపోయింది.

1973 ఫిబ్రవరిలో లూయి లెవె ఆరోగ్యం క్షీణదశకు చేరుకుంది. లూయిని దేవాలయంలో దివ్యబలిపూజ సమర్పించటానికి కుర్చీలో మోసుకు వెళ్ళేవారు. తన మరణం ఆసన్నమైనదని గ్రహించి, దానికై లెవె సంపూర్తిగా సంసిద్ధపడ్డాడు. లూయి తన సమాధి స్థలమును సైతం, ముందే ఎంపిక చేసుకున్నాడు. 1973, మార్చి 20న లూయి ఎంతో కష్టం మీద తన చివరి దివ్య బలిపూజ సమర్పించాడు. లూయి ఆరోగ్య పరిస్థితి విషమించటంతో, లూయిని మూడు కిలోమీటర్ల దూరంలో వున్న ఆరోగ్యమాత వైద్యశాలకు తరలించారు. తన మరణం సరుగని లోనే సంభవించాలని కోరిన మీదట, లూయిని తాను నివసించే సరుగని గ్రామానికే తీసుకుని వచ్చారు. మార్చి 21న మధ్యాహ్నం రెండు గంటలకు లూయి వ్యాధిగ్రస్తుల అభ్యంగనం స్వీకరించాడు. తన అనుంగు బిడ్డలైన క్రైస్తవులు, మతకన్యలు, సోదర గురువులు ప్రార్థించుచుండగా, లూయి సాయంత్రం అయిదు గంటలకు తన ఆత్మను ప్రభువునకు అప్పగించాడు. 1973 మార్చి 22 సాయంత్రం మధురై అతి మేత్రాణులగు జస్టిన్ ద్రవ్యం, మధురై జేసుసభ మండల అధిపతులైన ఫాదర్ గార్డన్‌ల ఆధ్వర్యంలో దివ్య బలిపూజ సమర్పించి, వేలాదిమంది కన్నీటి ప్రార్థనతో లూయి మరియ లెవె భౌతికకాయాన్ని సరుగని దేవాలయంలోని పీఠం ముందు భాగంలో భూస్థాపితం చేశారు. అప్పటినుండి సరుగని దేవాలయంలోని లూయి లెవె సమాధి చెంత ఎందరో విశ్వాసులు ప్రార్థన చేస్తున్నారు. లూయి గురువుల వేడుదల మూలంగా ఎన్నో అద్భుతాలు, స్వస్థతలు జరుగుతున్నాయి. ఇప్పుడది ఒక గొప్ప పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది. లూయి మరియ లెవె పుణ్య జీవితమును శ్రీసభ గుర్తించి సరుగనిలో ఆగస్టు 9, 2016న శివగంగై పీఠాధిపతులైన సూసై మాణిక్కమ్ గారు లూయి మరియ లెవెను "దైవ సేవకులు"గా ప్రకటించారు.





# J.M.J. వైద్య మణిరత్నం

# 22. దైవ సేవకులు మేరి గ్లోరి

**(1887-1857)**

ఫాదర్ బుల్లా రమేష్ బోస్కో, S.J.

మేరి గ్లోరి ఆస్ట్రేలియా దేశమందలి విక్టోరియా రాష్ట్రములోని బిర్రెగుర్ర లో 1887 జూన్ 23న ఎడ్వర్డ్, మార్గరెట్ గ్లోరి పుణ్య దంపతులకు జన్మించింది. ఆ దంపతుల తొమ్మిది మంది సంతానంలో మేరి మూడవ సంతానం. ఆమె చిన్ననాటి నుండే యేసునాథుని తిరుహృదయం యెడల ఆపార భక్తి, మరియమాత పట్ల ఎనలేని గౌరవము కలిగి ఉంది. ఆమెకు తన అక్క లూసీ, చెల్లెలు ఎలీజా లంటే చాలా ప్రేమ. బాల్య దశలో ఉన్నప్పుడు ఆమెకు డిప్తీరియా వ్యాధి సోకి, చాలా రోజులు బాధపడింది. మరియమాత వేడుదల వలన ఆమె స్వస్థత పొందింది. చిన్నప్పుడు మేరిని కుటుంబ సభ్యులంతా 'బబ్స్' అని ముద్దుగా పిలిచేవారు. ఎడ్వర్డ్ కుటుంబ పోషణకు మిక్కిలి కష్టపడి, అందరిని చక్కగా పోషించాడు. అతడు ముందుగా చిన్న కిరాణా అంగడిని నడిపాడు. అతడిని ఒక స్నేహితుడు నమ్మక ద్రోహం చేయడంతో, చాల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. మేరి పుట్టిన కొన్ని నెలలకే ఎడ్వర్డ్, కుటుంబంతో గర్వోక్ నకు, ఆ తరువాత వాచెమ్ నకు వలస వెళ్ళారు.

మేరి గ్లోరి కుటుంబం భక్తిగల కుటుంబం. వారి కుటుంబంలో ప్రేమానురాగాలు నిండుగా తొణికిసలాడాయి. వారి కుటుంబాన్ని ఎన్ని ఆర్థిక సమస్యలు చుట్టు ముట్టినా, యేసు ప్రభుని ఆశీస్సులతో ఆ ఇబ్బందుల నుండి గట్టెక్కారు. ప్రభుని యందలి విశ్వాసమే వారిని సదా కాపాడుతూ వచ్చింది. కుటుంబమంతా కలిసి ఆదివారాలలో దేవాలయం వెళ్ళి, దివ్యపూజా బలిలో భక్తిగా పాల్గొనేవారు. కుటుంబమంతా మరియతల్లి పూజిత మాసమైన మే నెలలో మరియు ప్రతిదినం జపమాల జపించేవారు. ఆ ప్రార్థనలో గురువుల కోసం, వైద్యుల కోసం ప్రత్యేకంగా వారు ప్రార్థించేవారు. జూన్ నెలలో వారు జేసు తిరుహృదయమును గౌరవిస్తూ, తిరుహృదయ ప్రార్థనలు భక్తితో చెప్పుకునేవారు. మేరి తన ఏడవ యేట తన జీవితమును యేసు తిరు హృదయమునకు సంపూర్తిగా సమర్పించుకున్నది. "నేను దేవుని చిత్తమును పాటించుటలో విజయము సాధిస్తే, నేను పాపములను విడచిపెట్టటం మాత్రమే కాకుండా, దేవునికి ఏది సంతోషాన్ని కలుగజేస్తుందో దానిని మాత్రమే చేస్తానని" మేరి చిన్నతనములోనే తన మనస్సులో నిర్ణయించుకుంది. ఆ పవిత్రత కోసం ఆమె ప్రయాసపడింది. ఎడ్వర్డ్ వాచెమ్‌లో ఉన్నప్పుడు ఒక కతోలిక కుటుంబమునకు, వారితోబాటు మరి కొందరు విద్యార్థులకు కూడా చదువు చెప్పాడు.

విద్యార్థుల సంఖ్య క్రమేణా పెరగటంతో, విద్యాబోధనను విచారణ ప్రాంగణానికి మార్చాడు. తరువాత అది ఒక పాఠశాలగా ఊపిరిపోసుకుంది. అప్పటికి మేరి వయస్సు ఏడేండ్లు మాత్రమే. ఆ పాఠశాలలోని హారి గిల్ అను ఒక ఉపాధ్యాయుడు మేరిని ఎంతో ప్రభావితం చేశాడు. మేరి గ్లొరి చిన్న వయస్సులోనే తన తమ్ముడు జోసఫ్‌ను కోల్పోయింది.

మేరి గ్లొరి తన తొమ్మిదవయేట తన ప్రథమ దివ్యసత్ప్రసాదమును, భద్రమైన అభ్యంగనమును స్వీకరించింది. మేరి చిన్ననాటి నుండే చదువులో చక్కగా రాణించింది. పిట్ట కొంచెం కూత ఘనమన్నట్లు, మేరి మంచి మార్కులతో ఉత్తీర్ణురాలై, అందరి ప్రశంసలను పొందింది. తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలిసి, కష్టపడి పోటీ పరీక్షలలో నెగ్గి, ఉపకార వేతనము సంపాదించింది. మేరి 1900లో విక్టోరియా ప్రభుత్వ ఉపకారవేతన పరీక్ష వ్రాసింది. ఆ పరీక్ష వ్రాసిన 800 మందిలో ఆమె ముచ్చటగా మూడవ ర్యాంకు పొంది, చదువుకోవటానికి ఉపకారవేతనం పొందింది. తన ఉపాధ్యాయుడు హారి గిల్ ప్రోత్సాహముతో 1901 నుండి 1904 వరకు ఆమె దక్షిణ మెల్‌బోర్న్ కళాశాలలో చదివింది. ఆ సమయంలో మేరి, ‘‘అల్బర్ట్ పార్క్’’లో ఉన్న గుడ్ షెపర్డ్ కాన్వెంట్ వసతి గృహంలో ఉంది. ఆ కళాశాల మొదటి సంవత్సరం చివరలో మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన ఉపకారవేతన పోటీ పరీక్షలలో మరోమారు గెలుపొంది, విశ్వవిద్యాలయంలో ఉచితంగా చదువుకొనటానికి అర్హత సాధించింది. కాని యూనివర్సిటిలో చేరేందుకు వయస్సు చాలనందున, దక్షణ మెల్‌బోర్న్ కళాశాలలోనే మూడేండ్లపాటు లాటిన్, గ్రీకు, చరిత్ర, ఆంగ్లము, గణితములు పాఠ్యాంశములుగా చదివి, కళాశాల ఉపాధ్యాయుల మన్ననలను, ప్రశంసలను పొందింది. గ్లొరి, కాన్వెంట్‌లో ఉండి చదవటంతో మఠకన్యల జీవితంపై ఆసక్తి, గౌరవం కలిగాయి.

1905 నాటికి మేరి మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలోని ఆర్మండ్ కళాశాలలో బి.ఎ. మొదటి సంవత్సరం ముగించింది. తదనంతరం తండ్రి ఎడ్వర్డ్ ప్రేరణతో వైద్యశాస్త్రము చదువుటకు నిశ్చయించుకుని, వైద్య విభాగ చదువులకు మార్చుకుంది. వైద్యశాస్త్రం కడు కష్టతరమైనప్పటికి, మేరి గ్లొరి అయిదేళ్ళు ఇష్టంగా చదివి 1910లో వైద్యశాస్త్ర పట్టా పొందింది. పిమ్మట కొంతకాలం ఆమె న్యూజిలాండ్‌లోని క్రైస్ట్ చర్చ్ వైద్యశాలలో శిక్షణా వైద్యురాలుగా సేవలందించింది. తరువాత మెల్‌బోర్న్ తిరిగివచ్చి, అక్కడి విక్టోరియా రాణి స్మారక వైద్యశాలలో కొన్నాళ్ళు, వేరొక వైద్యశాలలో కన్ను చెవి విభాగాలలో మరి కొన్నాళ్ళు, పునీత విన్సెంట్ వైద్యశాలలో వైద్య సలహాదారుగా వేరు వేరు విభాగాలలో రోగులకు సేవలందించటంలో మేరి చక్కని అనుభవం గడించింది.

1915 అక్టోబరులో మేరి గ్లొరి జీవితంలో ఒక మరపురాని సంఘటన జరిగింది. ఆగ్నెస్ మక్‌లారెన్ అను స్కాట్లాండ్ దేశపు వైద్యురాలు మతప్రచారకులుగా భారతదేశానికి వెళ్ళి, విశిష్ట వైద్య సేవలందించటం గురించి, ఆమె జీవితం గురించి, ఒక కరపత్రంలో చదివింది. భారతదేశంలో పురిటిలోనే ఎందరో శిశువులు చనిపోతున్నారని, మహిళా

వైద్యుల అవసరత ఎంతో ఉందని అందులో చదివింది. ఆ విషయం సున్నిత మనస్కురాలు, వైద్యురాలైన మేరి గ్లోరి హృదయంలో సూటిగా నాటుకుంది. తానెందుకు భారతదేశం వెళ్ళి, వైద్యసేవలు చేయకూడదని మేరి గ్లోరి తనను తాను ప్రశ్నించుకుంది. ఆ తలంపుతో భారతదేశం గురించి సమాచారం సేకరించటం గ్లోరి మొదలు పెట్టింది. మద్రాసు-మైలాపూరు పీఠాధిపతులగు ఆలెన్ గారు భారతదేశానికి వైద్యుల నాహ్వానిస్తున్నారని, ఆ విషయాన్ని గురించి "అమెరికా" అను వార్తాపత్రికలో చదివానని గ్లోరి మిత్రుడైన రైడీ అను గురువు ఆమెకు తెలిపాడు. ఆలెన్ గారి ఆహ్వానంతో డచ్చిదేశపు జేసు, మరియ, జోజప్పల సభ మతకన్యలు గుంటూరు సీమలో విద్య, వైద్య సేవలందిస్తున్నారని గ్లోరి విషయ సేకరణ చేసి, రూఢి పరచుకుంది. కాని మొదటి ప్రపంచ యుద్ధం వలన వెంటనే భారతదేశం రాలేక పోయింది.

1916 అక్టోబరులో "కతోలిక మహిళల సామాజిక మండలి"ని రెండువేల మంది సభ్యులతో గ్లోరి ఏర్పాటు చేసింది. మేరిని దానికి ప్రథమ అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. అధ్యక్ష హోదాలో ఆమె ఆనాటి మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదుర్కొనే పలు సమస్యల గురించి ఉపన్యసించింది, పలు పత్రికలకు వ్యాసాలు వ్రాసింది. 1919 వరకు మేరి కతోలిక మహిళలను సమైక్యపరచి. ఉత్తేజపరచి, వారిని ఆత్మ గౌరవంతో సమాజసేవ వైపు మరలించి, తన నాయకత్వ ప్రత్యేకతను చాటుకుంది.

1915-1919 వరకు రాయల్ విక్టోరియన్ కంటి, చెవి వైద్యశాల నందు నాలుగేళ్ళు పని చేసింది. అనుభవజ్ఞులైన పురుష వైద్యులంతా మొదటి ప్రపంచ యుద్ధ క్షతగాత్రులకు సేవలందించ యుద్ధ సీమలకు వెళ్ళగా, వారు లేని లోటును మేరి తీరుస్తూ, వైద్యశాల అన్ని విభాగాలలో అలుపెరగక పనిచేసి, అందరి తలలో నాలుకలా ఉంటూ, రోగులకు ప్రత్యక్ష దైవమైంది. అదే సమయంలో అనగా 1919లో మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో మాతాశిశు సంరక్షణ, కంటి వైద్య శాస్త్రంలో ఉన్నత విద్య సభ్యసించి, వైద్యశాస్త్రంలో మాస్టర్స్ పట్టా పొందింది. మేరి గ్లోరి ఒకవైపు వివిధ వైద్యశాలలలో వైద్య సేవలందిస్తూ, మరియొక వైపు ఉన్నత విద్య సభ్యసిస్తూ ఉన్నప్పటికి, తన భవిష్యత్ జీవితం గురించి ఆలోచించటం, దైవ చిత్తాన్ని తెలుసుకోవటాన్ని మాత్రం మరచిపోలేదు. దైవ చిత్తాన్ని తెలుసుకోవటానికి ప్రార్థనయే ఏకైక మార్గమని తన తల్లి చెప్పిన మాటను మదిలో నుంచుకుని, మేరి తరచుగా ప్రార్థించడం మొదలుపెట్టింది. ప్రార్థనలో ప్రభువు చూపే బాటను సుస్పష్టంగా తెలుసుకోవాలంటే, ఒక ఆధ్యాత్మిక గురువు సలహా అవసరం. కావున 1916లో మేరి జేసుసభకు చెందిన విలియం లాకింగ్‌టను అను గురువును ఆధ్యాత్మిక గురువుగా స్వీకరించింది. ఆ గురువు ప్రోత్సాహంతోనే 'కతోలిక మహిళా మండలి'ని మేరి స్థాపించింది. మేరిలోని తెలివితేటలు, వైద్యవృత్తిలో అంకితభావం చూసిన ఆ గురువు, మతకన్యగా గాకుండా ఒక సాధారణ వైద్యురాలుగా భారతదేశం వెళ్ళి సేవలందించమని సూచించాడు. కాని దానికి మేరి సుతరామూ అంగీకరించలేదు.

భారతదేశం వెళ్ళి, మత కన్యగా సేవలందించాలని మేరి పట్టుదల. కాని కతోలిక శ్రీసభ చరిత్రలో అప్పటి వరకు ఏ మఠకన్యకూడా వైద్యులుగా సేవలందించలేదు. అందుకు జగద్గురువులు ఏ మఠకన్యనైనా, ఏ దేశంలో కాని వైద్య వృత్తి చేయ అనుమతించలేదు. అది తెలిసే తన ఆధ్యాత్మిక గురువు మేరి గ్లోరిని మఠకన్య కాకుండానే, వైద్యసేవలందించి, ప్రభుని బాటలో నడవమన్నాడు.

భారతదేశంలో మఠకన్యగా వైద్యసేవ చేయాలన్నది దైవ చిత్తమని నమ్మిన మేరి గ్లోరి, దేవునిపై సంపూర్ణ భారం వేసి, తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు వీడ్కోలు పలికి, 1920, జనవరి 21న మెల్‌బోర్న్ పట్టణాన్ని విడచి భారతదేశమునకు సముద్ర మార్గాన పయనమైంది. 1920, ఫిబ్రవరి 11న లూర్ధుమాత మహోత్సవం నాడు మేరి గ్లోరి మద్రాసు పట్టణం చేరుకుంది. ఫిబ్రవరి 12న జేసు మరియ జోజప్పల మఠసభ కేంద్రమైన గుంటూరు పట్టణం చేరింది. అక్కడి కన్యాస్త్రీలు ఆమెను ఎంతో ఆదరాభిమానములతో ఆహ్వానించారు, ఆమెను ముందుగా దేవాలయమునకు తోడుకొనిపోయి, మేరిని ప్రభువున కర్పించి, ఆమె కోసం ప్రార్థించారు. అది పునీత ఆగ్నేసు వారి దేవాలయం. ఆ దేవాలయంలో ఉన్న యేసు తిరుహృదయ స్వరూపం ఆమెను ఎంతగానో ఆకర్షించింది. ఆ స్వరూపం క్రింద లతీను భాషలో లిఖించబడియున్న "నీ యజమాని ఇక్కడ ఉండి, నిన్ను పిలుస్తున్నారు" అను చిన్న వాక్యము మేరి గ్లోరికి తన దిశను, కర్తవ్యాన్ని ప్రభువే స్వయంగా, సూటిగా తనతో చెప్పినట్లు భావించింది. ఇక అప్పటి నుండి గుంటూరు ఆమె సేవాజీవితానికి కేంద్ర బిందువైంది.

మద్రాసు పీఠాధిపతులు ఆలెన్, మఠకన్యలు వైద్యులుగా పనిచేయటం వేద ప్రచారానికి దోహద పడుతుందని తెలుపుతూ, రోమాపురిలోని కతోలిక పెద్దలకు 1920లో సవివరంగా లేఖ వ్రాసారు. దరిమిలా మేరి గ్లోరి మఠకన్యగా ఉంటూ వైద్యవృత్తిని నిర్వహించ పదకొండవ భక్తినాథ పాపుగారి ప్రత్యేక అనుమతి లేఖను నవంబరు 28న ఆలెన్ పొందారు. దానితో మఠకన్యలు వైద్యవృత్తిని నిర్వహించటానికి ఉన్న అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. మేరి గ్లోరి వెంటనే జేసు మరియ జోజప్పల మఠకన్యల సభ నొవిషియేట్‌లో చేరింది. ఎన్నో ఉన్నత చదువులు చదివిన మేరి, తనకంటె పిన్న వయస్సులోని శిక్షణాభ్యర్థులతో కలిసి, మఠసభ ఆధ్యాత్మికతలో మంచి తర్ఫీదు పొందింది. అక్కడే ఆమె తెలుగు భాషను చక్కగా నేర్చుకుంది. ఆనాటి మఠకన్యల పుణ్య జీవితం ఆమెనెంతో ప్రభావితం చేసింది. తన నవ సన్యాస శిక్షణ అనంతరం నవంబరు 29, 1921న తాత్కాలిక వ్రతాలు ప్రభుయేసునకు సమర్పించి, మఠకన్యగా "మేరి ఆఫ్ ది సేక్రెడ్ హార్ట్" అను నామధేయాన్ని స్వీకరించింది. కతోలిక శ్రీసభ చరిత్రలో "ప్రప్రథమ మఠకన్య వైద్యులు"గా మేరి గ్లోరి పేరు చిరస్థాయిగా నిలిచింది. ఆమె నిత్యమాటపట్టు నవంబరు 29, 1924న గుంటూరులో వైభవంగా జరిగింది.

ముప్పయి రెండేళ్ళ వయస్సులో మేరి తన చక్కని వైద్యవృత్తిని, తన ప్రేమగల

కుటుంబాన్ని, తనకెంతో ఇష్టమైన మెల్‌బోర్న్‌ని విడచి భారతదేశ దీన, హీన, నిరుపేదలలో ప్రభు యేసుని గాంచి, మఠకన్యయై ముప్పయి ఆరు సంవత్సరాలు నిరంతరాయంగా ప్రజల సేవ చేసింది. గుంటూరు నందు ప్రారంభదశలో తన గది ముందలి వసారాను వైద్య కుటీరముగా మార్చుకుని, రోగులకు వైద్యసహాయం అందించింది. తన వద్దనున్న కొద్ది మాత్రలతో, తనకు లభించిన రసాయనాలతో, తాను స్వయంగా చేసిన మందులతో, రోగులకు ఉపశమనం కలిగించేది. మేరి ప్రతిదినము గుంటూరు పట్టణ పరిసర పల్లెలకు వెళ్ళి, రోగులను పరామర్శించి, అవసరమైన మందుబిళ్ళలు ఇచ్చేది. తనతోబాటు కొందరు స్త్రీలను కూడా తీసుకెళ్ళి, వారికి ప్రథమ చికిత్సలో,రోగులకు సహాయపడే విధానాన్ని వివరంగా నేర్పించేది. గుంటూరులో కాలక్రమేణా వైద్యసహాయం కోరి వచ్చే రోగులు పెరిగారు. తన తాత్కాలిక వైద్య కుటీరము అందుకు సరిపోలేదు. కనుక ఒక పెద్ద వైద్యశాల నిర్మించటానికి జేసు మరియ జోజప్పల మఠం ముందుకు వచ్చింది. 1925లో పునీత జోజప్పగారి వైద్యశాలగా నామకరణం చేసి, నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అనతి కాలంలోనే వైద్యశాల ఎంతో మంది బయట రోగులకు, ఆవాస రోగులకు వైద్యాన్ని అందించే స్థాయికి ఎదిగింది. వైద్యశాల నిర్వహణతో బాటు వైద్యశాల నిర్మాణ బాధ్యతలు కూడా ఆమె చేపట్టింది. 1929 నాటికి సువిశాలమైన ఆసుపత్రి నిర్మాణం, 1930లో వైద్యసేవికల శిక్షణా పాఠశాల స్థాపన జరిగింది. శిక్షణా కేంద్రానికి మేరి ప్రిన్సిపాలుగా ఉంటూ, వైద్య సేవికలకు జీవశాస్త్రంలో పాఠాలు బోధించింది. 1929 లోనే రోగుల సంఖ్య రమారమి నలభై వేలకు చేరింది. ఆ వెనుకబడిన కాలంలో సరియైన వసతులు లేనప్పటికి, మేరి తన శాయశక్తులా రోగులపట్ల ప్రేమానురాగాలతో, వారికి శ్రేష్టమైన వైద్యసేవలు అందించి "మంచి డాక్టరమ్మగారి"గా పేరు సంపాదించింది. ఆమె ఎంతో చాకచక్యంగా, తన తెలివితేటలతో, వైద్య అనుభవంతో ఎన్నో శిశుమరణాలను ఆపగలిగి, పేదలపాలిట ప్రత్యక్ష దైవమైంది. గర్భిణీ స్త్రీలకు సులభంగా కాన్పులు చేసేది. భయంకర, దీర్ఘకాలిక రోగాలకు పలు ప్రాంతముల నుండి అత్యుత్తమ, నాణ్యమైన మందులను తెప్పించి, వారికి రోగ నివారణ చేసేది. వైద్యశాస్త్రం చాలా ఖర్చుతో కూడుకున్నది అయినందున పేద భారతదేశంలో వైద్యులు చాలా తక్కువ మంది ఉండేవారు. కాని రోగులేమో చాల ఎక్కువ. కావున వారందరికి మేలైన, చౌక అయిన వైద్యం అందించటం బహు కష్టం. అయినా దానిని మేరిగ్లోరి ఎంతో సమర్థవంతంగా నిర్వహించి, గుంటూరు, పరిసర ప్రాంతాలలో 'మంచి హస్తవాసి కలిగిన వైద్యులు'గా పేరు ప్రఖ్యాతులు పొంది, ఎందరికో ఆమె పరమ వైద్యుడైన అపర క్రీస్తుగా, ప్రేమపూర్వక సేవలందించింది.

మేరి గ్లోరి ఉదయాన్నే లేచి దివ్యబలిపూజలో పాల్గొనేది. ఆమె ఉదయ కాల ప్రార్థనలు చేసి, ఆనాటి పనులన్నింటిని ప్రభువునకు సమర్పించి, తనపై ప్రభుని దీవెనలు కోరుకునేది. రోజంతా ఆసుపత్రిలో రోగుల పర్యవేక్షణ, వైద్యసేవికలకు బోధించడం, కొన్ని మందులు స్వయంగా తయారు చేసి రోగులకు ఇవ్వడం చేసేది. వీటితో బాటు

ఎంతో కష్టమైనా ఎద్దుల బండిలో, గతుకుల రోడ్డులో సమీప గ్రామములకు వెళ్ళి, వైద్యసేవలు ఎంతో ఇష్టంగా చేసేది. భారత దేశ వైద్య అవసరాలు, శిశు మరణాలు, అంటురోగాలు, మఠకన్యల సేవా జీవితం గురించి ఆస్ట్రేలియాలోని తన మిత్రులకు, లాకింగ్‌టన్ గురువులకు, తాను స్థాపించిన కతోలిక మహిళా మండలికి ఎన్నో లేఖలు, వ్యాసాలు వ్రాసేది. వారు ఆ వ్యాసాలను ఆస్ట్రేలియాలోని పలు వార పత్రికలలో అచ్చు వేయించి, భారతదేశ అవసరతలను పాఠకులకు తెలియజేసేవారు. తన వైద్యసేవల గురించి మేరి వ్రాసిన పలు వ్యాసాలు ఇంగ్లండులో, అమెరికా దేశాలలోని పత్రికలలో ప్రచురించారు. వానిని చదివి పలువురు క్రైస్తవ వైద్యులు, ఆసియా, ఆఫ్రికా ఖండ దేశాలలో ఉచితంగా వైద్యసేవలు అందించటానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. డాక్టర్ ఎతెల్ ఫిట్ తనతో పాటు మెల్‌బోర్న్‌లో చదువుకుంది. తన మిత్రురాలైన మేరి చేస్తున్న సేవలను విన్న ఎతెల్ ఫిట్ 1934లో భారతదేశానికి వచ్చి, తాను కూడా జేసు మరియ జోజప్పల మఠ సభలో చేరింది. ఆమె తన శిక్షణానంతరం సిస్టర్ వెరోనిక అను నామకరణం స్వీకరించి, మేరిగ్లోరికి తోడుగా పునీత జోజప్పగారి వైద్యశాల నందు సేవలందించింది.

మేరి ఎల్లప్పుడు ప్రభుని దీవెనలతో, వృద్ధాప్యంలో గర్భం దాల్చిన ఎలిజవేతమ్మకు సేవలందించ వడివడిగా పర్వత ప్రాంతమునగల పట్టణమునకు పోయిన మరియమాతను ఆదర్శంగా తీసుకుని, విస్తృత సేవలందించింది. అధిక జనాభా, పేదరికముతో తల్లడిల్లుతున్న గ్రామీణ భారతదేశానికి నాణ్యమైన వైద్య సేవలందించటానికి శ్రీసభ ధ్యేయాలకు అనుకూలంగా, క్రైస్తవ విలువలతో కూడిన ఒక మంచి కతోలిక వైద్య కళాశాలను స్థాపించమని హాలెండ్ నందలి జేసు మరియ జోజప్ప మఠకన్యల శ్రేష్ఠురాలికి 1931 లోనే లేఖ వ్రాసి, వైద్య కళాశాల కోసం కృషి చేసింది. మేరి గ్లోరి రోము నగరంలో కూడా ఒక కతోలిక వైద్య కళాశాల అవసరమని తొమ్మిదవ భక్తినాథ పాపుగారికి విన్నవించగా, వారు వైద్య కళాశాల నిమిత్తం భూమిని కేటాయించారు. కాని అంతలోనే రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభం కావడంతో, వైద్య కళాశాల స్థాపన నిలిచిపోయింది.

మేరి గ్లోరి భారతదేశంలో వైద్య సేవలందిస్తున్న కతోలిక సంస్థలన్నింటిని ఏకం చేయాలని కలలుగన్నది. అది ఎంత కష్టమైనా మేరి నడుం కట్టింది. ఎందరో మఠకన్యలకు, వారి పెద్దలకు వైద్య సమాఖ్య అవసరతను గురించి సవివరంగా ఉత్తరాలు వ్రాసి, వారినందరిని ఒక్క త్రాటిపైకి తీసుకుని వచ్చింది. ఆమె కృషితో ''భారత కతోలిక వైద్యశాల సమాఖ్య'' (CHAI-Catholic Hospital Association of India) మొట్ట మొదటి సమావేశం 1943, జూలై 29 గురువారం రోజున పదహారుమంది మఠకన్యలతో గుంటూరులో జరిగింది. గుంటూరు పీఠానికి పీఠాధిపతులుగా ఎంపిక కాబడిన ముమ్మిడి ఇగ్నేషియస్ గారు ఆ సమావేశానికి అధ్యక్షత వహించారు. మేరి గ్లోరి ఆ సమాఖ్యకు పర్యవేక్షకురాలిగా నియమితులై, 1951 వరకు ఆ పదవిని ఎంతో సమర్థవంతంగా నిర్వహించి, విశాల భారతదేశం నలుమూలలా తిరిగి, కతోలిక వైద్యశాల లన్నింటిని సంఘటితపరచి, 'భారత

కతోలిక వైద్యశాలల సమాఖ్య'ను ఒక బలీయమైన శక్తిగా తీర్చిదిద్దింది.

మేరి గ్లోరి తండ్రి 1942లో, తల్లి 1947లో, 1949 లో తన ముద్దుల చెల్లి ఎలీజా మరణించారు. అయినా ఆమె ఎప్పుడూ తన స్వంత దేశమైన ఆస్ట్రేలియాకు తిరిగి వెళ్ళలేదు. 1952లో జేసు మరియ జోజప్పల మఠానికి నూతన మఠసారథిని ఎన్నుకునే నిమిత్తం మేరి హాలెండు దేశం వెళ్ళింది. అక్కడే ఆమెకు శస్త్ర చికిత్స చేసి కడుపులో పెరుగుతున్న గడ్డను తీసివేసారు. మార్గమధ్యంలో ఐర్లాండు దేశం మరియు రోము నగరం వెళ్ళింది. ఆమె ఆరోగ్య పరిస్థితి కొద్ది కొద్దిగా క్షీణిస్తూ వచ్చింది. 1953లో, 1955లో మేరికి మరో రెండు శస్త్ర చికిత్సలు జరిగాయి. అయినా వైద్యురాలిగా తన వైద్యసేవలు ఏ రోజుకూడ నిలపలేదు. ఆమెకు తోడుగానున్న మరొక డాక్టరుతో కలిసి, 1955లో వేలమంది అసుపత్రి ఆవాస రోగులకు, లక్షల మంది బయట రోగులకు వైద్య సపర్యలు చేసింది. మేరి గ్లోరికి కలిగిన వ్యాధి ఎముకల కాన్సర్‌గా రూఢి అయ్యింది. దానితో బాధపడుతూనే, మేరి రోగులను పరామర్శించేది. కాన్సర్ వ్యాధి బాగా వ్యాపించడంతో, మేరి చివరి దిశలో మంచానికే పరిమితమయ్యింది. రోజంతా విపరీతంగా నొప్పులున్నా, ఆమె ప్రార్థనలోను, అధికారిక లేఖలను అనువదించటంలోను గడిపింది. గుంటూరు ఎండలు మేరికి ప్రాణసంకటంగా ఉండటంతో, ఆమెను 1956లో బెంగుళూరు నగరం మార్చారు. తనకెంతో ప్రీతిపాత్రమైన గుంటూరును విడచిపెట్టడం ఆమెకు బాధాకరమైనా, పెద్దల మాటను విధేయించింది.

మేరి గ్లోరిని కాన్సర్ మహమ్మారి కబళిస్తున్నా, మేరీ మాత్రం దైవ కుమారుడైన యేసుక్రీస్తుతో ఐక్యమై, ప్రార్థనలు చేసేది. మరియమాతపై భక్తి ప్రపత్తులతో జపమాల ఎప్పుడూ చేతిలో నుంచుకుని, సదా జపించేది. పునీత జోజప్పగారి వేడుదల ద్వారా ప్రార్థించడం అంటే ఆమెకెంతో ప్రీతి. కాబట్టి ఆమె పెదాలపై జేసు మరియ జోజప్పల నామస్మరణ ఎప్పుడూ జరుగుతుంది. మేరి ఆరోగ్యం క్షీణించడంతో, మే 2 పవిత్ర శనివారం సాయంత్రాన వ్యాధిగ్రస్తుల అభ్యంగనం ఇచ్చారు. ఆ సాయంత్రమే బెంగుళూరు ఆర్చిబిషప్ పొతకమూరి తోమాసు గారు ఆమెను సందర్శించారు. 1957 మే నెల 5, మంచి కాపరి పండుగ రోజున "జేసు మరియ జోజప్పా", "నా జేసువా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని ఉచ్చరిస్తూ, సిలువను ముద్దాడి మేరి గ్లోరి తన ఆత్మను మంచి కాపరియైన యేసు ప్రభువుకు అప్పగించింది. అప్పటికి ఆమె వయస్సు 69 యేండ్లు. గుంటూరు మేత్రాసన మాజీ కాపరి, బెంగుళూరు అతిమేత్రాణులు పొతకమూరి తోమాసు గారు మేరి గ్లోరి భూస్థాపన దివ్యపూజా బలిని నిర్వహించి, 'మేరి దేవుని ప్రత్యేక సృష్టి', 'సర్వ విశ్వాన్ని నిండుగా ప్రేమించిన వ్యక్తి' యని ఆమెను మిగుల ప్రశంసించారు. గుంటూరు మేత్రాణులు గాలి బాలి గారు ఫిరంగిపురం బాలయేసు దేవాలయంలో మేరి గ్లోరిని మార్చి 27, 2013న "దైవ సేవకులు" గా ప్రకటించి, పునీత పట్టపు ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రకటన గుంటూరు పీఠానికి, JMJ సభకు, ఆంధ్ర శ్రీసభకు ఎంతో సంతోషించదగిన విషయం.





# 23. దైవ సేవకులు జోసఫ్ తంబి

**(1890-1945)**

ఫాదర్ నాగోతు శౌరి కిశోర్ కుమార్, S.J.

జోసఫ్ తంబి తల్లిదండ్రులు శవరిముత్తు తంబి, రోస్‌మల్లి మరియ (అన్నమ్మాళ్). వీరి స్వస్థలం ఫ్రెంచి కాలనీయైన పాండిచ్చేరి సమీపములోని కారైకాల్ అను గ్రామము. వీరు వెల్లాల అను అగ్రవర్ణమునకు చెందినవారు. ఉపాధి నిమిత్తమై శవరిముత్తు తన భార్యను తీసుకొని అప్పటి ఫ్రెంచి కాలనీ మరియు ప్రస్తుత వియత్నాం దేశమందలి సైగాన్‌కు వలస వెళ్లాడు. ఈ సైగాన్ పట్టణం ప్రస్తుతం 'హో చి మిన్'గా పిలువబడుచున్నది. వారు అచట ఉన్నప్పుడు జోసఫ్ తంబి నవంబరు 11, 1890న జన్మించాడు. వారు ఆ బిడ్డకు పెట్టుకున్న పేరు 'రాయప్ప జోసఫ్ శౌరి'. జోసఫ్ తంబికి రెండేళ్ల వయస్సున్నప్పుడు అనగా 1892లో వారు భారతదేశమునకు తిరిగి వచ్చారు. అతని తమ్ముని పేరు మైకెల్ దైరియాను. జోసఫ్ తంబి ఏడేండ్ల వయస్సునందు 1897లో అతని తల్లి మరణించింది. కనుక శవరిముత్తు రెండవ వివాహం చేసుకున్నాడు. వారిద్దరికి కలిగిన సంతానం మేరి. జోసఫ్ తంబి చిన్ననాటినుండి ప్రతిదినం దేవాలయంలో జరుగు దివ్య బలిపూజకు, జపమాల ప్రార్థనకు క్రమం తప్పకుండా వెళ్ళేవాడు. జోసఫ్ తన పన్నెండేళ్ళ ప్రాయంలో తన ఈడువారితో కలిసి ప్రథమ దివ్య సత్ప్రసాదము, భద్రమైన అభ్యంగము స్వీకరించాడు. అతని సవతి తల్లి ఆ దివ్య సంస్కారములను స్వీకరించుటకు అభ్యంతరాన్ని వ్యక్తపరిచింది. అయినా అతడు చక్కగా ప్రార్థనలు నేర్చుకుని, వానిని స్వీకరించాడు. తదనంతరం అతని సవతి తల్లి పెట్టు హింసలకు తాళలేక, జోసఫ్ ఇల్లు వదలి, దూరంగా కేరళ రాష్ట్రమునకు వెళ్ళాడు. అతని తమ్ముడైన మైకెల్ దైరియాను సైగానులో మరియ తెరెసాను వివాహమాడగా, వారికి ముగ్గురు మగ బిడ్డలు, గాబ్రియేలు తెరెసా అను బాలిక జన్మించినది. గాబ్రియేలు తెరెసా పాండిచ్చేరిలోని కార్మెల్ సభలో చేరి మఠకన్యయై చాలాకాలం జీవించింది. అతని తమ్ముడు మైకెల్ 1935లో మరణించాడు.

కేరళ రాష్ట్రం చేరుకున్న జోసఫ్ తంబి ఒక ధనవంతుల కుటుంబంలో ఆశ్రయం పొందాడు. ఆ ఇంటి యజమానురాలు అతనిని శ్రద్ధగా చూసుకుంది. బహూశా వారింట్లో పనిపాట్లు చేస్తూ, అతడు కొంతవరకు పాఠశాలలో చదివాడు. అతడు ఆ కుటుంబం వారితో కలసి, యేసుప్రభుని అనునిత్యం ఆరాధించాడు. వారి సాహచర్యంలో ప్రభు గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంటూ, ప్రభుని శిష్యునిగా తంబి ఎదుగుతూ

వచ్చాడు. జోసఫ్ తంబి యుక్త వయస్సులో ఉన్నప్పుడు, అప్పుడప్పుడు కేరళ నుండి తన స్వంత ప్రాంతమునకు వచ్చేవాడు. అతడు భిక్షగానిగా దుస్తులు ధరించి, తన ప్రాంతంలో భిక్షమెత్తేవాడు. అందుచేత అతడిని ఎవరూ గుర్తు పట్టేవారు కాదు. ఒకసారి తన సొంత తండ్రి శవరిముత్తు, తన కొడుకు జోసఫ్‌ను గుర్తించకుండా కొన్ని చిల్లర నాణెములను ధర్మముగా వేశాడంట. 1928లో జోసఫ్ తంబి ఒక బంధువు భూస్థాపిత కార్యక్రమములో పాల్గొన్నపుడు, అతని నాయనమ్మ మాత్రం అతడిని గుర్తు పట్టింది. అతడు పునీత ఫ్రాన్సీసు వారి తృతీయ సభకు చెందిన అంగీని ధరించి, సన్యాసి వలె సంచరించేవాడు.

జోసఫ్ తంబి దైవసేవ చేయాలని చిన్ననాటి నుండి కలలు గన్నాడు. అందుకోసమై అప్పటి దైవసేవకులు, మఠవాసులు నేర్చుకున్నట్లే లతీను, ఆంగ్ల భాషలు నేర్చుకున్నాడు. అప్పటికే అతడు తన మాతృభాషయైన తమిళం, తమ ప్రాంత అధికారభాషయైన ఫ్రెంచి, తనను పెంచి పెద్దచేసిన రాష్ట్ర భాష మళయాళం మాట్లాడతాడు. కేరళలోని కొల్లం లో గురు విద్యార్థుల  నిలయమైన పునీత అంతోని వారి ఆశ్రమం 1931లో నిర్మాణంలో ఉంది. ఫ్రెంచి దేశపు కపూచియన్ గురువైన సింఫోరియన్ ఆఫ్ పారిస్ ఆ ఆశ్రమ నిర్మాణాన్ని చేపట్టి, దానిని 1932లో ప్రారంభోత్సవం గావించారు. బహూశా జోసఫ్ తంబి 1931లో గాని, 1932లో గాని కొల్లం లోని కపూచియన్ సభలో చేరి ఉండవచ్చు. ఆనాటి సంప్రదాయంలో భాగంగా, ఫ్రాన్సిస్ సభలో చేరు అభ్యర్థులు ముందుగా ఫ్రాన్సిస్ వారి తృతీయ సభలో చేరి, టోపి లేని అంగీని, నడుమునకు తాడు, జపమాలను ధరిస్తారు. తరువాతనే వారు నొవిషియేట్‌లో చేరి, శిక్షణానంతరం మూడు వ్రతాలను తీసుకుని, పరిపూర్ణ శాశ్వత సభ్యులుగా కపూచియన్ సభలో సేవలందిస్తారు. ఆ విధంగా అతడు కపూచియన్ సభలో చేరుటకు ప్రయత్నం చేశాడు. కాని అప్పటికే అతని వయస్సు దాదాపు 45 సంవత్సరాలైనందున, అతనిని సభలో తీసుకోక పోయి ఉండవచ్చు.

జోసఫ్ తంబి కపూచియన్ సభలో అడుగు పెట్టకపోయినా, అతడు ఫ్రాన్సిస్ వారి తృతీయ సభలో సభ్యుడు. ఫ్రాన్సీస్ వారి ఆధ్యాత్మికతను, పేదరికాన్ని ఎంతో ప్రేమించిన జోసఫ్ తంబి, తాను ఎక్కడకు వెళ్ళినా ఫ్రాన్సిస్ వారి తృతీయ సభకు చెందిన అంగీని, ఎంతో ప్రీతిపాత్రంగా ధరించాడు. ఆ సభకు చెందిన అభ్యర్థిగా ప్రభురాజ్యాన్ని విస్తరించటానికి, ఫ్రాన్సిస్ వారి తృతీయ సభను ప్రాచుర్యంలోనికి తీసుకురావడానికి శతధా ప్రయత్నించాడు. 1932 అక్టోబరు 14న తన తమ్ముడు మైకెల్ కూతురు గాబ్రియేల్ మరియ తెరెసా, కార్మెల్ మఠంలో శాశ్వత మాటపట్టు నిచ్చే దివ్యబలి పూజలో పాల్గొని, మరియ తెరెసా కొరకు ప్రార్థించాడు. మాటల సందర్భంలో తంబి తాను కొల్లం నుండి వచ్చానని తెరెసాకు తెలిపాడు.ఆనాడు జోసఫ్ తంబి, ఫ్రాన్సిస్‌వారి తృతీయ సభకు చెందిన అంగీలో ఉన్నట్లు తెరెసా తెలిపింది. గాబ్రియెల్ మరియ తెరెసా మఠకన్యగా చాలాకాలం

జీవించి 1985 లో పాండిచ్చేరి నందు మరణించింది.

1933లో జోసఫ్ తంబి కుంభకోణం మేత్రాసనం నందలి తంజావూరు జిల్లాలోని మనత్తిడల్ గ్రామం చేరుకున్నాడు. అక్కడ ఒక మంచి సన్యాసి వలె ఆదర్శ జీవితం జీవించి, అక్కడి కతోలికులకు జపతప ధ్యానములలో, ఉపవాస ప్రార్థనలలో శిక్షణ నిచ్చాడు. పునీత ఫ్రాన్సిసు వారి జీవితము, వారి సభను గూర్చి వారికి తెలియజెప్పి, ఆ గ్రామంలో ఫ్రాన్సిస్ వారి తృతీయ సభకు చెందిన శాఖ నొకదానిని ఏర్పరచాడు. అక్కడ అతడు ఒక చిన్న గుడిసెలో ఉంటూ, చాలా భక్తితో జీవించాడు. అతనికి అన్నపానాదులు ఆ గ్రామ ప్రజలే సమకూర్చారు. జోసఫ్ తంబి తిరుచిరాపల్లికి సమీపాన ఉన్న పచ్చమలై గ్రామానికి 1936లో చేరుకున్నాడు. అక్కడ కొంతకాలం అక్కడున్న గిరిజనులకు క్రైస్తవ మత సత్యాలను బోధించాడు. అక్కడి పేదలతో కలసిపోయి, వారి అభివృద్ధికై కృషి చేశాడు. పాండిచ్చేరి వెళ్ళి, తనకు తెలిసినవారి వద్దనుండి దుస్తులు, ధనం సేకరించి గిరిజనులకిచ్చేవాడు. వారి పిల్లల విద్యకై సహాయపడ్డాడు. తనకు తెలిసిన మూలికలతో వారికి వైద్యం చేసాడు. వారికి దేవాలయం నిర్మించటానికి అవసరమైన భూమిని కూడా కొన్నాడు. కాని అక్కడి గిరిజనుల మధ్య శ్రీసభ నిర్మాణం బహు కష్టమని తలచిన గురువులు, ఆ భూమిని అమ్మివేశారు. దాంతో అతడు పచ్చమలైని విడిచి పెట్టాడు.

జోసఫ్ తంబి పిమ్మట కేరళ ప్రాంతానికి తరలి వెళ్ళాడు. అక్కడ అతడు జనవరి 28, 1939న జోసఫ్ చుంగత్ గురువులను కలుసుకున్నాడు. వారిద్దరూ క్రమేణా మంచి స్నేహితులయ్యారు. నడతార కాన్వెంట్‌లో తపస్కాల శుక్రవారం నాడు జోసఫ్ తంబికి జేసుప్రభుని పంచగాయాలు కావటం, దానితో తంబి విపరీతంగా బాధపడటం ఫాదర్ జోసఫ్ కళ్ళారా చూచారు. ఆ విధంగా జోసఫ్ తంబికి అయిదుసార్లు పంచగాయాలు కావటం తాను చూసానని ఫాదర్ జోసఫ్ తన డైరీలో వ్రాశారు. 1939 నుండి అతని మరణం వరకు జోసఫ్ తంబికి ప్రభుని పంచగాయాలు కావటాన్ని గురించి పలువురు గురువులు, మఠవాసులు, సాధారణ క్రైస్తవులు సాక్ష్యం పలికారు. పంచగాయాలతో అతని చేతులలో, కాళ్ళలో, నుదిటిపై రక్తం కారటం, ఆ రక్తాన్ని దూదితో, గుడ్డతో తుడిచి, శుభ్రం చేశామని రూఢిగా తెలిపారు. కేరళలో ఉన్నప్పుడు, అతడు కూలి పనులు చేసి, భిక్షమెత్తి, డబ్బులు సంపాదించి, విజయవాడలోని పేదలకు పంపేవాడు.

1937లో జోసఫ్ తంబి కేరళ నుండి నెల్లూరు మేత్రాసనములోని బిట్రగుంటకు చేరి, అక్కడ ఎనిమిది నెలలపాటు తమిళులగు రైల్వే ఉద్యోగులకు దైవవాక్యాన్ని ప్రబోధించాడు. వారితో కలసిమెలసి ప్రార్థించి, అక్కడి కతోలికుల అభిమానాన్ని చూరగొన్నాడు. తదనంతరం 1937 చివరలో విజయవాడ సమీపాన ఉన్న కేసరపల్లిలో అడుగుపెట్టాడు. అక్కడే అతడు కొద్దిగా తెలుగు భాష నేర్చుకున్నాడు. తంబి ప్రజలందరిని ప్రోగుచేసి జపమాలను జపించడం, విచారణ కేంద్రమైన పెద్ద అవుటుపల్లికి తీసికెళ్ళి,

దివ్యపూజా బలిలో పాల్గొనేలా చేసేవాడు. ప్రతినిత్యం దివ్యపూజా బలిని గాంచి, ప్రభుని భోజనము స్వీకరించటానికి వీలు ఉంటుందని 1939 సంవత్సర ప్రారంభంలో తంబి తన మకామును పెద్ద అవుటుపల్లికి మార్చాడు. కల్దరారొ గురువులు సెప్టెంబరు 14, 1927 నుండి పెద్ద అవుటుపల్లి విచారణ కర్తలుగా సేవలందిస్తున్నారు.

అవుటుపల్లిని కేంద్రంగా చేసుకొని జోసఫ్ తంబి తన సువార్తా పరిచర్యను కొనసాగించాడు. చుట్టు ప్రక్క గ్రామాలైన ఉప్పులూరు, మానికొండ, వట్లూరు, కేసరపల్లి, అజ్జంపూడి, తోట్ల వల్లూరుపాలెంలో క్రీస్తు వాక్యాన్ని కడునిష్టతో బోధించాడు. గుంటూరు సీమలోని పాతరెడ్డి పాలెం గ్రామాన్ని సందర్శించి, క్రైస్తవులలో ప్రభునిపట్ల భక్తి భావాన్ని పెంపొందింప జేసాడు. తంబి ప్రభుని బాధలలో ఏకమై, పంచగాయాలు ప్రతి శుక్రవారం పొందేవాడు. సుదీర్ఘ ప్రార్థనలు, ఉపవాస ప్రార్థనలు, ఒకే సమయంలో రెండు చోట్ల కనబడటం, మనోపరివర్తన కొరకు పాపుల పాదాలు పట్టుకొని బ్రతిమలాడి పాపక్షమాపణ కోరటం, లోక వ్యామోహంలో పడిన యువతను మారు మనస్సుతో ప్రభువు వద్దకు నడిపించటం, రోగాల బారిన పడిన వ్యక్తులకు పూర్ణ స్వస్థతను అందించటం, భవిష్యత్తులో జరుగబోవు విషయాలను దివ్యదృష్టితో ముందుగనే ప్రవచించి, స్పష్టంగా తెలియజేయటం మున్నగు సులక్షణాలు, పుణ్యక్రియలు ఎన్నో అతనిలో కలగలిపి ఉన్నాయి. జోసఫ్ తంబి అవుటుపల్లి విచారణ గురువులైన కల్దరారొ గారికి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సాయపడేవాడు. కల్దరారొ, పగానో, జార్జి మున్నగు గురువులు తంబి మంచి భక్తిపరుడని, ప్రభుని అతి సన్నిహితంగా సేవించాడని సాక్ష్యం పలికారు.

జోసఫ్ తంబి పెద్ద అవుటుపల్లిలోని బోయపాటి బసవయ్య, సీతారామమ్మ దంపతుల గృహములో ఉంటూ, కతోలిక వేదాన్ని బోధించాడు. వారు హిందువులైనా తంబికి ఆశ్రయమిచ్చి, అతనిని ఆదరాభిమానాలతో చూసుకున్నారు. వారికి పరస్పరము ఒకరిపట్ల మరొకరికి గౌరవము, నమ్మకము క్రమేణా వృద్ధి అయింది. చివరికి ఆ హైందవ కుటుంబము, యేసు భగవానుని స్వీకరించి, త్రియేక దేవుని మహిమగల నామములో జూలై 22, 1939న జ్ఞానస్నానం పొంది, ఫ్రాన్సిస్, క్లారమ్మలుగా నూతన జీవనానికి నాంది పలికారు. ఆ బోయపాటి వారి గృహములో అస్సీసీపుర ఫ్రాన్సిస్ వారి పేరిట ఒక పూజా పీఠాన్ని తంబి స్వయంగా నిర్మించాడు. ఆ పీఠం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. బోయపాటి వారి కుటుంబం కతోలిక ధర్మం స్వీకరిస్తే, వారికి మగపిల్లవాడు జన్మిస్తాడని జోసఫ్తంబి దివ్యదృష్టితో ప్రవచనం చెప్పాడు. అతడు ప్రవచించినట్లే జ్ఞానస్నానం స్వీకరించిన పదవ నెలలో అనగా మే 6, 1940లో క్లారమ్మ పండంటి మగశిశువుకు జన్మనిచ్చింది. అతడు తలదాచుకోవటానికి తావైనా లేని ప్రభుయేసుని అడుగు జాడలలో నడుస్తూ, దైవరాజ్యాన్ని బోధిస్తూ, తాను బోధించిన సత్యాలను స్వయంగా ఆచరిస్తూ, నియమ నిష్ఠలతో జీవించాడు. అందువలన అతని ఆదర్శంతో పెద్ద అవుటుపల్లి గ్రామంలో 30 కుటుంబాలకు పైగా కతోలిక క్రైస్తవులయ్యారు.

జోసఫ్ తంబి తన మరణానికి మూడు నెలల ముందే, తన మరణ ఘడియలను ప్రవచించాడు. అప్పటినుండి తంబి మరింత ఎక్కువ సమయం ప్రార్థనలో గడిపాడు. అతడు స్వల్పాహారం మాత్రమే తీసుకుంటూ, రోజంతా ఉపవశించేవాడు. ప్రార్థించేవాడు. అతడు సువార్తా పరిచర్య చేసిన కేసరపల్లి, ఉప్పులూరు, మానికొండ, వట్లూరు గ్రామాలకు క్రమం తప్పకుండా, తన మరణానికి ఒక వారం ముందు వరకు వెళ్ళి, ప్రజలతో కలిసి ప్రార్థించాడు. తంబి 1944 క్రీస్తు జయంతి పర్వదినము ముగియగానే, మానికొండ వెళ్ళాడు. అక్కడ సువార్త సేవ చేస్తుండగా, అతనికి తీవ్ర జ్వరం వచ్చింది. కనుక జనవరి 6, 1945న అవుటుపల్లి చేరుకున్నాడు. జోసఫ్ తంబి గ్రామాలలోని పేదలతో సహజీవనం, ఆయన తరచుగా చేసే ఉపవాసాలు, ఎండవేడిమిలో సైతం కాలి నడకన గ్రామ గ్రామాలు తిరిగి, కతోలికులను పరామర్శించటం మున్నగు నిరంతర పరిచర్యతో అతని శరీరం చిక్కి శల్యమైంది. జోసఫ్ తంబి ఆరోగ్య పరిస్థితి జనవరి 15కల్లా మరింతగా క్షీణించింది. తనకు ఎంతో ప్రీతి పాత్రులు, ఆధ్యాత్మిక బిడ్డలైన బోయపాటి వారి కుటుంబసభ్యుల మధ్య చివరి శ్వాస నూదాలని జోసఫ్ తంబి చివరి కోరిక. ఆ కోరికకు అనుగుణంగా, బోయపాటి వారి కుటుంబ సభ్యులు, అతని భక్తగణం, స్నేహితులు, ఆప్తులు తంబి చుట్టూ గుమికూడి యుండగా, ప్రభుయేసు నామాన్ని ఉచ్చరిస్తూ జనవరి 15, 1945న జోసఫ్ తంబి ప్రభుని సన్నిధి కేగాడు. అతని అంత్యక్రియలను జనవరి 16న అశేష జనవాహిని మధ్యలో నిర్వహించారు.

ఇక అప్పటి నుండి జనవరి 15న జోసఫ్ తంబి మరణ వర్ధంతి కార్యక్రమాలను, పెద్ద అవుటుపల్లిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు విశ్వాసంతో వాటిలో పాల్గొని, జోసఫ్ తంబి ఆదర్శ కతోలిక జీవితాన్ని స్మరిస్తూ, ప్రభుని స్తుతిస్తూ తిరిగి వెళ్ళేవారు. కులమత భేదం లేకుండా పలువురు




భక్తులు, తంబి సమాధి వద్దకు వచ్చి, వారి మధ్యవర్తిత్వ ప్రార్థనల ద్వారా యేసు భగవానుని ప్రార్థించి, పలు మేలులను పొందుతున్నారు. జోసఫ్ తంబి ఆదర్శ, భక్తియుత ప్రార్థనా జీవితాన్ని గుర్తించిన శ్రీసభ, అతని పునీత పట్టా ప్రక్రియను ప్రారంభించింది. అప్పటి విజయవాడ మేత్రాసన కాపరి మల్లవరపు ప్రకాశ్ పీఠాధిపతులు గారు జూన్ 24, 2007న దైవజనుల సమక్షంలో జోసఫ్ తంబిని "దైవ సేవకులు"గా ప్రకటించారు.



దళితుల ఆప్త మిత్రుడు

# 24. ధన్య అగస్టిన్ తేవరపరంబిల్

**(1891-1973)**

ఫాదర్ గోగులపాటి అవినాష్, S.J.

అగస్టిన్ తేవరపరంబిల్ కేరళ రాష్ట్రమందలి పాల పట్టణ సమీపంలోని రామాపురంలో సిరో-మలబారు కతోలిక క్రైస్తవ దంపతులైన ఇట్టి వైపె (మణి), ఎలీష్వా దంపతులకు ఏప్రిల్ 1, 1891న జన్మించాడు. ఆ దంపతులకు కలిగిన అయిదుగురు సంతానంలో అగస్టిన్ చిన్నవాడు. అతడు పుట్టిన ఏడు రోజులకు, తమ విచారణ పాలక పునీతుల పేరిట, అగస్టిన్ అను నామకరణముతో జ్ఞానస్నానమిచ్చారు. అగస్టిన్ తన ప్రాథమిక విద్యను ట్రావన్కూరు ప్రభుత్వంచే నడుపబడుచున్న పాఠశాలలో చదివాడు. అతడు మంచి కతోలిక విశ్వాసములో పెరిగాడు. వారి కుటుంబం ప్రార్థనకు, జపమాల జపించటానికి చాలా ప్రాధాన్యత ఇచ్చింది. కావున అగస్టిన్ బాల్యం నుండియే తల్లిదండ్రుల నుండి చక్కని భక్తి భావాన్ని, మంచి క్రైస్తవ విలువలను నేర్చుకున్నాడు.

అగస్టిన్ తన ఉన్నత పాఠశాల చదువులను మన్ననం లోని పునీత ఎఫ్రాయీము గారి పాఠశాలలో అభ్యసించాడు. అగస్టిన్ దగ్గరి బంధువులు జోసఫ్, తోమాసులు గురువులయ్యారు. వారే అగస్టిన్‌ను గురువై, ప్రభుసేవ చేయమని ప్రోత్సహించారు. ఆ విషయమై అగస్టిన్ కూడ ప్రార్థించి, దైవపిలుపును అందుకున్నాడు. అతడు కాలినడకన ప్రయాణించి, చంగనాచెరిలోని పునీత తోమాసు వారి సెమినరీలో చేరాడు. అగస్టిన్ తన ప్రాథమిక గురుశిక్షణను అక్కడ ముగించి, వరాపుళ లోని గురు విద్యాలయం ప్రవేశించాడు. అక్కడ గురువిద్యార్థిగా ధరించవలసిన అంగీని జూలై 16, 1915న స్వీకరించాడు. ఆ సెమినరీ నందు తత్వ, వేదాంత శాస్త్రాలు ఆరు సంవత్సరాల పాటు పఠించి, తనను తాను గురు పదవికి ఆయత్తం చేసుకున్నాడు. అందలి గురుశిక్షణనిచ్చే గురువులకు గౌరవ మర్యాదలు చూపి, వినయ విధేయతలతో అందరి మెప్పు పొందాడు. తదనంతరం అగస్టిన్ డిసెంబరు 21, 1921న గురు పట్టాభిషేకం పొందాడు. అగస్టిన్ తన ప్రథమ దివ్య బలిపూజను స్వంత ప్రాంతమగు రామాపురమందలి పునీత అగస్టిన్ వారి దేవాలయంలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రాదుల మధ్య సంతోషంగా అర్పించి, ప్రభుయేసుకు వందన స్తుతులు చెల్లించాడు. అతడు పొట్టి వాడైనందున 'చిన్న గురువు'

గా సంబోధిస్తూ, అగస్టిన్‌ను "కుంజచ్చన్" అనే పేరుతో పిలవడం ఆరంభించారు.

అగస్టిన్ తాను పుట్టి పెరిగిన రామాపురం నందే సహాయక గురువుగా బాధ్యతలు చేపట్టి, ప్రజల ఆధ్యాత్మిక బాగోగులు బాగా చూసుకున్నాడు. అగస్టిన్ బైబులు పఠనాలను చక్కగా చదివి, ప్రసంగం తయారు చేసుకొని, మంచి ప్రసంగాలు ఇచ్చాడు. తన వ్యక్తిగత ప్రార్థనా జీవితము ద్వారా క్రైస్తవ బిడ్డలకు ఆదర్శంగా ఉండి, విచారణ ప్రజలను ప్రభువు వద్దకు ఆకర్షించాడు. 1923లో కడనాడు నందు సహాయక గురువుగా పనిచేశాడు. అక్కడి ప్రజలంతా వ్యవసాయదారులు. పైరు పంటలకు చీడ పీడలు వచ్చినప్పుడు, అగస్టిన్ గురువులను తమ పొలాలకు తీసుకుని వెళ్లి, పవిత్ర తీర్థజలముతో ఆశీర్వదించమని వ్యవసాయదారులు కోరేవారు. అగస్టిన్ ప్రార్థించి, తీర్థజలం చీడపట్టిన పైరుపై చల్లినప్పుడు, అద్భుతంగా పొలంలోని పురుగంతా మటుమాయమయ్యేది. అగస్టిన్ జబ్బున పడటంతో కడనాడు నుండి తిరిగి రామాపురం వచ్చాడు.

రామాపురం నందు దళితుల స్థితిగతులు, చాలా శోచనీయంగా ఉండటం అగస్టిన్ గమనించాడు. సంఘంలో వారిపట్ల ఎంతో వివక్షత ఉంది. వారి కెవరూ గౌరవ మర్యాదలు ఇవ్వక పోవటాన్ని గుర్తించాడు. కనుక అప్పటి నుండి ఆగస్టిన్ దళితుల పక్షం వహించి, వారి ఉద్ధరణకు ఎంతో కృషి చేశాడు. వారికి ఎంతో ఉదారంగా ధనసహాయం చేశాడు. దళితులలో యేసు ప్రభుని గాంచి, వారికి పూర్తిగా అంకితమై, ఆర్థిక చేయూతనిచ్చి, విద్యాదానం చేసి, వారికి సమాజంలో సమాన హోదా వచ్చేందుకు తీవ్రంగా కృషిచేశాడు. అగస్టిన్ మాటలకన్నా, చేతల మనిషిగా నిరూపించుకుని, దళితులకు అండగా నిలబడ్డాడు. అందువలననే దాదాపు 5000 మంది దళితులు అగస్టిన్ గురువుల పవిత్ర హస్తాల మీదుగా జ్ఞానస్నానం పొంది, క్రీస్తు ప్రభుని రాజ్యంలో అడుగుపెట్టారు. భారతదేశంలోని మిషనరీలలో దళితుల సముద్ధరణకై పాటుబడిన వారిలో అగస్టిన్ పేరు ఎప్పుడూ శాశ్వతంగా నిలుస్తుందని చెప్పటంలో ఎటువంటి సందేహంలేదు. దేవాలయాలలో, ఇతర స్థలాలలో అగస్టిన్ పెద్ద ఉపన్యాసాలేమి ఇవ్వకపోయినా, అతని మంచి మనసు చూచి, అనేకమంది దళితులు క్రీస్తు ప్రభుని వైపు ఆకర్షితులయ్యారు.

చంగనాచెరి పీఠాధిపతులైన మార్ తోమాస్ దళితులపట్ల ఎంతో సుహృద్భావాన్ని కలిగి, వారి అభివృద్ధికి స్వయంగా ఎన్నో ప్రణాళికలు రచించి, దళితుల సమానత్వం కోసం పాటుబడ్డాడు, మార్ తోమాస్ తన మేత్రాసనంలోని గురువులకు 1916లో, "గురువులు డబ్బు సంపాదించడంలోనో, పదవులకోసం ప్రాకులాడటంలోనే మనసును లగ్నం చేయక, ఆత్మల రక్షణకై తహతహ లాడండి. సర్వసుఖాలను త్యాగం చేసిన క్రీస్తు ప్రభుని ఎల్లప్పుడు ఆదర్శంగా తీసుకుని, ముందుకు నడవండి" అని లేఖ వ్రాసాడు.

పేదలను హృదయాలకు హత్తుకుని, వారికి సమాజంలో సమానస్థానం కల్పించి, దైవ వాక్కును బోధించమని విజ్ఞాపన చేశాడు. మేత్రాసనంలో వేదవ్యాపక పరిచర్యను పీఠాధిపతులు, హిలారియస్ గురువులకు అప్పగించగా, అతడు గ్రామగ్రామాలు తిరిగి బోధిస్తూ, పలువురు దళితులకు క్రైస్తవ మతంలోకి ప్రవేశం కల్పించాడు. 1926లో అతడు రామాపుర కతోలికులకు ప్రార్థనాకూటములు జరిపి, ధనికులకు ప్రోత్సహించి, వారికి సేవలు చేసే దళితులకు జ్ఞానస్నానం ఇచ్చారు. అప్పటి ప్రార్థనల చివరి రోజున దాదాపు రెండు వందల మంది దళితులు జ్ఞానస్నానం స్వీకరించారు.

జ్ఞానస్నానం పొందిన దళితులలో ఏ ఒక్కరికి కొద్ది భూమి కూడా లేదు. వారంతా పరాయివారి స్థలాలలో పాకలు వేసుకుని నివశిస్తున్నారు. వారికి చదువులు లేవు. తిండి గింజలకే ఇబ్బంది పడేవారు. వారి పిల్లలను పాఠశాలలో చేర్చుకునేవారు కాదు. వారి పేదరికానికి కారణం చదువు లేకపోవడమే అని అగస్టిన్ గ్రహించి, ముందుగా వారికి చదువు చెప్పించాలనుకున్నాడు. కనుక వెంటనే వారి నివాస ప్రాంతాలలో చిన్న చిన్న పాకలు వేసి, పాఠశాలలు మొదలుపెట్టాడు. ఆ పాఠశాలలలో దళితులు ఉచితంగా చదువుకుని, క్రమంగా అభివృద్ధి బాట పట్టారు. క్రైస్తవ గృహాలను, ముఖ్యంగా దళితుల గృహాలను అతడు తప్పక సందర్శించేవాడు. అగస్టిన్‌కు ప్రార్థన ఎంత ముఖ్యమో, దళితుల గృహ సందర్శన కూడా, అంత ముఖ్యంగా భావించాడు. అతని భక్తి తత్పరతలు, ప్రేమ వాత్సల్యాన్ని గమనించిన దళితులు క్రైస్తవ సంఘంలో చేరటానికి ముందుకు వచ్చారు. అగస్టిన్ వద్ద ఒక్క పుస్తకం ఉంటుంది. అందులో తాను సందర్శించే కుటుంబంలోని సభ్యులందరి పేర్లు వివరంగా వ్రాసుకుంటాడు. ఏ కుటుంబానికి ఏది అవసరమో అందులో వ్రాసుకుంటాడు. అగస్టిన్ అవసరంలో ఉన్న వారికి, అన్ని రకాల సహాయాలు చేసేవాడు.

దళితుల మధ్య మద్యపాన అలవాటు ఎక్కువగా ఉండటం చూశాడు. కొందరు స్త్రీలు కూడా ఈ వ్యసనానికి బానిసలే. త్రాగుడుకే కూలి డబ్బులన్నీ అయిపోయేవి. అటువంటి వారిని మద్యపానం మానివేయమని ప్రబోధించి, బ్రతిమిలాడి, పలువురిని ఆ అలవాటు నుండి తప్పించాడు. ఎక్కడ ఎవరు జబ్బుగా ఉన్నా, పగలయినా, రాత్రయినా వారిని సందర్శించి, వారికై ప్రార్థించి, ఓదారుస్తాడు. మందులతోపాటు, అతని ప్రార్థనలకు కూడ రోగాలు నయమౌతాయి. ఆనాటి దళిత స్త్రీలు జాకెట్లు ధరించేవారు కాదు. దళితులైనందున అప్పటి సంఘంలో జాకెట్లు ధరించ కూడదనేది అప్పటి దురాచారం. కాని దళితులు క్రైస్తవులైన పిమ్మట, అగ్రవర్గాలతో సమానంగా దుస్తులు ధరించమని, మహిళలను జాకెట్లు ధరించమని చెప్పి ఆ చెడు సంప్రదాయాన్ని

రూపుమాపుతూ సమానత్వం కోసం శ్రమించాడు. అగస్టిన్ తన అంగీలు కుట్టగా మిగిలిన ముక్కలను, మహిళలకు జాకెట్లు కుట్టివ్వమని సిస్టర్‌ను ప్రోత్సహించాడు. పేదలు, దళితులు స్వయంసమృద్ధి చెందాలని, వారిని చిన్న చిన్న సంఘాలుగా చేసి, ప్రతి సంఘానికి నాయకులుగా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారులను ఏర్పరచి, వారి ఐక్యతకు, ఆర్థిక స్వావలంబనకు, స్వయంపాలనకు గట్టి పునాదులు వేశాడు.

అగస్టిన్ వ్యక్తిగత జీవితంలో ప్రార్థనకు అగ్రస్థానమిచ్చాడు. ఉదయం లేవగానే భక్తిగా గంటసేపు ధ్యానం చేస్తాడు. తరువాతనే పూజాబలి సమర్పిస్తాడు. అతనికి పునీతుల చరిత్రలు ప్రతిరోజూ చదవటం, గురువుగా పట్టాభిషేకం పొందినప్పటి నుండి ఒక చక్కని అలవాటుగా పెట్టుకున్నాడు. అగస్టిన్‌కు పాపసంకీర్తనమంటే ప్రాణం. తన తప్పులకు ఇతర గురువుల వద్ద పాప సంకీర్తనం చేయటమే గాక, ప్రతిరోజు దివ్యబలిపూజకు ముందు, పూజ ముగిసిన పిమ్మట, పాపసంకీర్తనా స్థలంలో కూర్చుని, ప్రజలకు ప్రభుని పేరిట మన్నింపునిస్తాడు. అతని భక్తిగల జీవితాన్ని చూచి, ఎంతోమంది సామాన్య ప్రజలు, పేదలు అతని ఆశీస్సుల కోసం వచ్చినప్పుడు, వారితో నింపాదిగా మాట్లాడి, దీవెనలందజేసి పంపడం, అగస్టిన్ నిత్యకృత్యం. అతడు తినటం చాలా తక్కువ. పైపెచ్చు తరచుగా ఉపవాసాలుంటాడు. కాబట్టి అగస్టిన్ ఎంతో బలహీనంగా కనబడతాడు. అతడు పవిత్రాత్మచే ప్రేరేపితుడై, దళితుల శ్రేయస్సు కోసం ముందుకు వచ్చాడు. కాబట్టి ధనవంతులు, సంపన్నులు, ఇతర గురువులు అతనిని ఎంత విమర్శించినా, అగస్టిన్ దళితుల కోసం పనిచేయటం ఏమాత్రం మానలేదు. వారు కూడా దేవుని బిడ్డలే. వారిలో దైవాన్ని చూసి, మనస్ఫూర్తిగా సేవలందిస్తే, దళితులు తమ చెడు అలవాట్ల నుండి, పేదరికం నుండి బయటపడి, దైవ రాజ్యంలో భాగస్తులవుతారని అగస్టిన్ దృఢంగా నమ్మాడు. వారి కోసం, వారి అభ్యుదయం కోసం నిస్వార్థంగా పనిచేశాడు.

అగస్టిన్‌కు 1959లో విషజ్వరం సంక్రమించింది. దానితో అతని ఆరోగ్యం చాలా క్షీణించింది. వైద్యంతో ఆరోగ్యం కొంత కుదుటబడినా, జ్వర ప్రభావం జీవితాంతం వరకు అతనిని బాధించింది. అగస్టిన్ గురువుగా 50 సంవత్సరాలు పూర్తి అయినప్పుడు, అతని ప్రియమిత్రులు, స్థానికులు బలవంతంగా డిసెంబరు 22, 1971న రామాపురంలో "గురుత్వ బంగారు జూబిలీ" జరిపారు. అతడు బలహీనంగా ఉన్నందున, ఇతర గురువులే దివ్యబలిపూజ చేసి, దేవునికి కృతజ్ఞతలు, వందనాలు తెలిపారు. వృద్ధులైన అగస్టిన్ పీఠం దగ్గర కూర్చుని, కృతజ్ఞతా బలిపూజలో పాల్గొన్నాడు. పూజానంతర సన్మాన సభలో ఎందరో ప్రముఖులు అతని వ్యక్తిత్వం గురించి, అతని సేవల గురించి ఎన్నో ప్రశంసలు, పొగడ్తలు అందజేసినా, అవి అగస్టిన్‌కు ఏమాత్రం రుచించలేదు. అగస్టిన్ ఎదురు చూసింది, శ్రమించింది, మానవమాత్రుల పొగడ్తలు కోసం కాదు, దేవుడు పరలోకంలో

అందించే మోక్షమనే నిత్య బహుమానం కోసం. పేదల, దళితుల అభివృద్ధి కోసం అగస్టిన్ జీవించాడు. వారికోసమే తనకున్న సంపదనంతా, తన సమయాన్నంతా వెచ్చించాడు. అగస్టిన్ తన వీలునామాలో "నాకు ఏ విధమైన భూములు, డబ్బు లేదు. నా మరణానంతరం నా అంత్యక్రియలు సాదాసీదాగా జరగాలి. 1926 నుండి నేను దళిత క్రైస్తవులతో జీవించాను. నా మరణానంతరం నేను వారితోనే ఉంటాను. నా దేహాన్ని కూడా దళిత క్రైస్తవులను పాతిపెట్టే చోటే భూస్థాపితం చేయండి" అని దళిత బిడ్డలలో తనను ఒకరినిగా చేసుకుంటూ, తన చివరి కోరికను స్పష్టంగా తెలిపాడు.

అగస్టిన్ అనారోగ్యంతో, వృద్ధాప్య సమస్యలతో నీరస పడిపోయాడు. ఇతరులపై ఆధారపడ వలసిన పరిస్థితి రాగా, అతనిని స్వంత ఇంటికి చేర్చారు. దాదాపు యాభై యేండ్లు దేవాలయ ప్రాంగణంలో జీవించిన పిమ్మట, తన ఇంటికి రావడంతో, ముందు కొద్దిగా ఇబ్బంది పడ్డాడు. ఆ తరువాత సర్దుకుని, వారితో కలిసిపోయాడు. ఆ సమయంలో అతని బంధుమిత్రులు ఎందరో వచ్చి పరామర్శించారు. క్రమేణా అతనికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. అగస్టిన్‌ను పలకరించటానికి సెమినరీలో అతనితో కలిసి చదివిన సెబాస్టియన్, అబ్రహాము అను గురువు లిద్దరు అక్టోబరు 16, 1973న అతని ఇంటికి వచ్చారు. ఆ సమయంలో అతని పరిస్థితి మరింత విషమించింది. వెంటనే ఆ గురువులు అగస్టిన్ పై ప్రార్థనలు చేస్తుండగా, అతడు అంతిమ శ్వాస వదలి, పరమనాథుడైన క్రీస్తు ప్రభుని సన్నిధి చేరాడు. అతని భౌతిక దేహాన్ని రామాపురం దేవాలయానికి కొనివచ్చి, అక్టోబరు 17న, తానెంతగానో ప్రేమించిన దళిత క్రైస్తవ, బంధుమిత్రాదుల ప్రార్థనలతో, దివ్యపూజాబలి సమర్పించి మేర మర్యాదలతో, గౌరవ ప్రపత్తులతో భూస్థాపితం చేశారు. పీఠాధిపతుల ప్రతినిధిగా ఉప పీఠాధిపతులైన మార్ జోసఫ్ పూజాబలి సమర్పించి, "మనకు ఇప్పుడు మోక్షంలో ఒక నూతన మధ్యవర్తి ఉన్నారు. మనమంతా ఒక పునీతుని భూస్థాపన కార్యక్రమంలో పాల్గొంటున్నామ"ని ప్రవచించారు. వారు ప్రవచించినట్లే శ్రీసభ అగస్టిన్ గురువులను అగస్టు 11, 1987లో "దైవ సేవకులు"గా, రెండవ జాన్ పాల్ జగద్గురువులు జూన్ 22, 2004న "పూజ్యులు" గా ప్రకటించారు. పునీత ప్రకటనకు ముందు జరగవలసిన అద్భుతాన్ని నిర్ధారించిన పిమ్మట, పదహారవ బెనెడిక్టు పాపుగారి అనుమతితో సిరో-మలబారు అర్చక సాంప్రదాయానికి చెందిన కార్డినల్ వర్కీ గారు ఏప్రిల్ 30, 2006న అగస్టిన్ పుట్టి, పెరిగి, గురువై, యాజక పరిచర్య చేసి, అసువులు బాసిన రామాపురంలోనే అగస్టిన్‌ను "ధన్యులు"గా ప్రకటించారు. ధన్యులైన అగస్టిన్ తేవరపరంబిల్ గారి పండుగను ప్రతియేటా అక్టోబరు 16న రామాపురం నందు కతోలిక విశ్వాసులు ఎంతో ఆనందంగా, విశ్వాసంగా, వైభవంగా జరుపుతారు.



సర్వసంగ పరిత్యాగి

# 25. దైవ సేవకులు పీటర్ రెడ్డి

**(1895-1958)**

ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.

పీటర్ రెడ్డి పూర్తి పేరు పాల్ చిన్నప్ప రెడ్డి. అతడు "పరదేశి పీటర్"గా చాల మందికి తెలుసు. అతడు తమిళనాడులోని మధురై జిల్లా నందలి పేరైయూర్ అమ్మాపేటలో ఏప్రిల్ 30, 1895న జన్మించాడు. పీటర్ రెడ్డి తల్లిదండ్రులు లూథరన్ క్రైస్తవులు. వారికి గల ఆరుగురు సంతానంలో పీటర్ ఆఖరివాడు. పీటర్ ఏడేండ్ల ప్రాయంలో తండ్రి మరణించాడు. తదనంతరం వారు మధురై పట్టణం చేశారు. తల్లి ప్రోత్సాహంతో పీటర్ రెడ్డి పదవయేట ట్రాంక్‌బారు లోని లూథరన్ పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత విద్యను అభ్యసించాడు. అతడు మధురై నందలి అమెరికన్ కళాశాలలో ఇంటర్మీడియట్, తిరుచ్చిరాపల్లి లోని సెయింట్ జోసఫ్స్ కళాశాలలో డిగ్రీ (ఆనర్స్) చదివాడు. అతడు తమిళ, ఇంగ్లీషు భాషలతో పాటు తెలుగు, సంస్కృతం మళయాళం, ఇటాలియన్, జర్మన్, ఫ్రెంచి భాషలు నేర్చుకున్నాడు.

పీటర్ రెడ్డి తన కళాశాల చదువులలో బహుముఖ ప్రజ్ఞ కనబరచాడు. అతడు ఆటపాటలలో, చిత్రలేఖనంలో, నాటకాలలో చక్కగా రాణించాడు. పునీత జోజప్పగారి కళాశాలలో చదివే సమయంలో రోమను కతోలికుల పట్ల తనకున్న అపోహలు ఒక్కొక్కటిగా తొలిగిపోయి, సదభిప్రాయం ఏర్పడింది. 1913లో పీటర్ రెడ్డి పాల్గొన్న "స్టూడెంట్ క్రిస్టియన్ మూవ్‌మెంట్" (క్రైస్తవ విద్యార్థి ఉద్యమ సంఘం) సదస్సులో ఓ రోమన్ కతోలిక గురువు పునీత అసిస్సీపుర ఫ్రాన్సిస్ వారి ఆదర్శ జీవితం గురించి సోదాహరణంగా వివరించాడు. ఫ్రాన్సిస్ పేదలను ప్రేమించి, పేదరికాన్ని వరించి, నిరాడంబరంగా జీవించటం, తపఃక్రియలను ఆచరిస్తూ పవిత్ర జీవితం గడపడం అతనిని ఎంతో ఆకర్షించింది. పీటర్ తాను కూడా ఫ్రాన్సిస్ వారివలె జీవించి, ప్రభుని శిష్యరీకం చేయాలని భావించాడు. అతడు ఆధ్యాత్మికంగా ఎదిగే దశలో ఎన్నో అవరోధాలు, మానసిక సంఘర్షణ, సాతాను శోధనలు, అతనిని చుట్టు ముట్టాయి. ఒక దశలో తాను ఆధ్యాత్మికంగా పరాజితుణ్ణి అయ్యాననే భావన అతనికి జీవితంపై విరక్తి పుట్టించింది. ఘోర పాపాలు చేసే బదులు, ఆత్మహత్యతో ఈ లోకానికి స్వస్తి చెప్పాలని ఆలోచించాడు. మరో జన్మ క్రైస్తవ మత సత్యాలకు విరుద్ధమైనప్పటికీ, మరు జన్మలోనైనా మంచి మనిషిగా పుడదామని భావించాడు. క్షణికావేశంలో 1918 క్రిస్మస్‌రాత్రి కత్తితో పొడుచుకుందామని

సిద్ధమయ్యాడు. ఆ క్షణంలో పీటర్ రెడ్డి చూపులు తన గదిలో ఉన్న ప్రభువు పటంపై పడ్డాయి. అది సిలువపై వ్రేలాడుతున్న యేసు, పునీత అసిస్సీపుర ఫ్రాన్సిస్ వారిని ఆలింగనం చేసుకుంటున్న పటం. "నేను నీ కోసం మరణించాను. నీ పాపాలకు నా మరణంతో పరిహారం చెల్లించాను. నా శాంతిని నీకు ప్రసాదిస్తున్నాను. రా... వచ్చి నన్ను అనుసరించు" అని స్వయంగా ప్రభువే ఆయనతో పలికిన అనుభూతి పొందాడు పీటర్ రెడ్డి. పిమ్మట అతనిలో ఏకాంతంగా తపోజీవితం గడపాలనే కోరిక రోజు రోజుకు బలపడింది.

పీటర్ రెడ్డి ఎం.ఎ. పరీక్షలు వ్రాసి, ఉత్తీర్ణుడైన పిమ్మట గుంటూరులోని ఆంధ్రా క్రిష్టియన్ కళాశాలలో చరిత్ర, భౌగోళిక శాస్త్ర ప్రధానాచార్యులుగా ఒక సంవత్సరం పనిచేసి రాజీనామా చేశాడు. కొంతకాలం వై.ఎం.సి.ఎ. విద్యార్థి విభాగ కార్యదర్శిగా పనిచేశాడు. ప్రొటెస్టాంటు క్రైస్తవ శాఖలలోని పరస్పర విరుద్ధ విశ్వాసాలు, ఆధిపత్య పోరు పీటర్ రెడ్డిని అయోమయంలో ముంచెత్తాయి. దానితో ఆ పదవిని విడిచిపెట్టి, మరలా ఎ.సి. కళాశాలలో ఆచార్యులుగా చేరాడు. పీటర్ నిత్యాన్వేషి. అతని విశ్వాస యాత్రలో ఎన్నో అనూహ్య మలుపులు. అతని అన్వేషణలో భాగంగా పీటర్ రెడ్డి కతోలిక శ్రీసభలో చేరాలనే దృఢ నిశ్చయానికి వచ్చాడు. అతడు 37 ఏళ్ళ ప్రాయంలో తిరుచ్చిరాపల్లి పట్టణమందలి జేసుసభకు చెందిన పునీత జోజప్పగారి కళాశాలలోని పునీత లూర్ధుమాత దేవాలయము నందు 1922 సంవత్సరపు పవిత్ర శనివారం నాడు జ్ఞానస్నానం పొందాడు. తరువాత ఆంధ్ర క్రైస్తవ కళాశాల (గుంటూరు)లో రాజీనామా చేసి, హిమాలయ యాత్రకు శ్రీకారం చుట్టాడు. మానస సరోవరం మరో వందమైళ్లు ఉందనగా ఆరోగ్యం సహకరించక ఆ యాత్రను నిలిపాడు. 1922లో తన తిరుగు ప్రయాణంలో గోవా వెళ్లి, పునీత ఫ్రాన్సీసు శౌరి వారి భౌతిక దేహాన్ని సందర్శించాడు. పీటర్ కతోలిక శ్రీసభలో చేరడాన్ని వారి కుటుంబ సభ్యులు ఎవరూ ఇష్టపడలేదు. దానితో అతడు శ్రీలంక వెళ్లి, 1923, 1924 సంవత్సరాలలో నావలపిటియా, బదుల్లా పట్టణాలలోని కతోలిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేశాడు.

పీటర్ రెడ్డి 1924 ఏప్రిల్‌లో తిరిగి మధురై వచ్చినపుడు, తనకు వరుసకు సోదరుడు అతనిని సాదరంగా ఆహ్వానించి, తన ఇంటికి తీసుకు వెళ్లాడు. అనంతరం సోదరుని సహాయంతో పీటర్ తిరుచ్చిరాపల్లిలోని పునీత జోజప్పగారి కళాశాలలో ప్రస్తుత బి.ఇడికి సమానమైన ఎల్.టి. కోర్సు ముగించాడు. అనంతరం కూనూరులోని పునీత అంతోని వారి పాఠశాలలో, 1926లో చిత్తూరులోని బోర్డు హైస్కూలులో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి విద్యార్థుల మన్ననలను పొందాడు. అతడు పాలయంకోట్టైలో జేసుసభ గురువులు నిర్వహిస్తున్న సెయింట్ జేవియర్స్ కళాశాలలో 1927 నుండి ప్రొఫెసర్‌గా పని చేశాడు. అతడు రాజనీతి శాస్త్రం బోధించాడు. అతని పాఠాలంటే విద్యార్థులకు చాలా ఇష్టం.

పీటర్ రెడ్డి చరిత్ర, రాజనీతిశాస్త్రం, ఆర్థిక శాస్త్రంలలో ఏ పాఠ్యాంశం బోధించినా, వాటితో బాటు జీవిత పరమార్థాన్ని, నైతిక, మానవీయ విలువలను కలగలిపి బోధించేవాడు. కొన్నిసార్లు పాఠ్యాంశాల కంటే, ఆధ్యాత్మిక ప్రబోధాలే ఎక్కువగా చెప్పేవాడు. అయినా విద్యార్థులు మాత్రం పరీక్షలలో ఘన విజయం సాధించి, అతని విమర్శకుల నోళ్లు మూయించేవాళ్లు. పీటర్ రెడ్డి యువకులకు సత్యప్రబోధన చేసి, జ్ఞానమార్గంలో నడిపించి, జ్ఞానోదయం కలిగించటం తన బాధ్యతగా భావించాడు. పీటర్ రెడ్డి విషయ పరిజ్ఞానం, భావ స్పష్టత, చక్కని వ్యక్తీకరణ, పాఠ్యాంశాలతో సమకాలీన జీవన స్థితిగతులను అన్వయం చేసి, విషయాలను విశ్లేషించి, విద్యార్థులను ఆలోచింపజేసేవాడు. అతడు అరుదైన మేధావుల కోవకు చెందినవాడని చెప్పవచ్చు. ఈ మధ్యకాలంలో తనను ఆదరించిన సోదరుడు మరణించాడు. అప్పటినుండి ఆ సోదరుని కుటుంబానికి పీటర్ రెడ్డి ఆదరువుగా నిలిచాడు. పీటర్ రెడ్డి ఆదర్శ జీవితంతో అతని సోదరుని భార్య, ఇద్దరు పిల్లలు కూడా కతోలిక జ్ఞానస్నానం పొందారు. అప్పటి మధురై విచారణ గురువులగు గోమ్స్ S.J. గారి సలహా మేరకు పీటర్ రెడ్డి వితంతువైన తన సోదరుని భార్యను వివాహమాడాడు. కాని ఆమె కొన్ని సంవత్సరాలకే మరణించింది. అతని సోదరుని కుమారులలో ఒకరు కతోలిక గురువుగా అభిషేకం పొందగా, మరొకరు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాడు.

పీటర్ రెడ్డి ఉదారత, దాన గుణం ఎంతో ఆదర్శప్రాయం. అతడు ఉద్యోగం చేసే కాలంలో తన స్వంత ఖర్చులకు ఒక భాగం వాడుకుని, మిగతా మూడు భాగాలు, పేద విద్యార్థులకు, దీన జనులకు దానం చేసేవాడు. అతని దానగుణం వలన ఎందరో పేద విద్యార్థులు, అనాథలు, రోగులు, వృద్ధులు, గురు విద్యార్థులు, మఠవాసులు లబ్ధి పొందారు. 'విన్సెంట్ డి పాల్ సొసైటీ' మున్నగు కతోలిక సేవా కేంద్రాలకు ఆర్థిక సహాయం చేయడమే కాక, తాను కూడా వారి సేవా కార్యక్రమాలలో స్వయంగా పాల్గొనేవాడు. అతని ఆదాయానికి పరిమితులున్నాయేగాని, అతని ఔదార్యానికి పరిమితులు లేవు. "క్రీస్తు ప్రభువు తన సర్వస్వాన్ని మనకోసం సమర్పించినపుడు, క్రైస్తవులైన మనం మనకున్న సర్వస్వాన్ని మన సాటివారితో పంచుకోవటం తప్పెలా అవుతుంది. అదే మన జీవన గమ్యం కదా" యని నిండు మనస్సుతో పీటర్ రెడ్డి దానం చేసేవాడు. పీటర్ రెడ్డి, పునీత అసిస్సీపుర ఫ్రాన్సిస్ వారి పట్ల, వారి జీవించిన జీవన విధానంపట్ల ఎంతో అభిమానాన్ని, ఇష్టాన్ని పెంచుకున్నాడు. అదే విధంగా (పునీత) అల్ఫోన్సమ్మ గారి సామాన్య జీవితమంటే కూడ అతనికి మక్కువ ఎక్కువ. వారివలె తాను కూడా పేదలతో, పేదల మధ్య జీవించాలన్న అభిప్రాయం అతనిలో కలిగింది. దైవచిత్తాన్ని తెలుసుకొనే నిమిత్తం, అతడు ప్రార్థన చేసాడు. అతనికి పవిత్ర దివ్యబలిపూజ అనిన ఎంతో ఆసక్తి, మరియమాతపై అపార గౌరవం ఉన్నాయి.

పీటర్ రెడ్డి తిరుచ్చిరాపల్లిలోని 'అమల ఆశ్రమం'లో మూడు రోజుల ధ్యానంలో పాల్గొన్నాడు. ఆ ధ్యానంలో "ఏమి తినెదమా? ఏమి త్రాగుదమా?.... అని కలత చెందకుడు" అను పరిశుద్ధ వాక్యము (మత్తయి 6:25) ప్రభునిపై సంపూర్ణ విశ్వాసముంచేలా అతనిని పురిగొల్పింది. ఆ ధ్యాన సమయంలో ఈ లోకాన్ని అంతటిని త్యజించి, ఒక సాధువుగా జీవిస్తూ, సువార్తను ప్రకటించాలని పీటర్ రెడ్డి గట్టి నిర్ణయానికి వచ్చాడు. ఫ్రాన్సిస్కన్ గురువు, కేంబ్రిడ్జి యూనివర్సిటిలో చదివిన ఆంగ్లేయుడగు ఫాదర్ ఉర్బానో గారిని పీటర్ రెడ్డి ట్యుటుకోరిన్‌లో అనుకోకుండా కలుసుకున్నాడు. వారి పరిచయం ఆధ్యాత్మిక అనుబంధంగా, గురుశిష్య సంబంధంగా పరిణతి చెందింది. పీటర్ రెడ్డి ఆధ్యాత్మిక తృష్ణను అత్యంత సన్నిహితంగా పరిశీలించి, విశ్లేషించిన మీదట, 1944 పెద్ద శుక్రవారంనాడు "కళాశాల ఆచార్యత్వానికి స్వస్తి పలికి, సంపూర్ణ పేదరిక నియమాన్ని పాటిస్తూ, సంచార యోగిలా జీవనం ఆరంభించండి. అందులో ఎదురయ్యే పరిణామాలకు స్పందిస్తూ, మీ జీవన యాత్రను కొనసాగించండి" అని ఉర్బానో గారు లేఖ వ్రాశారు. దానిని దైవాదేశంగా భావించి, అతడు సర్వసంగ పరిత్యాగి అయ్యాడు. పునీత శౌరివారి కళాశాలలోని తన ఆచార్య పదవికి వెంటనే రాజీనామా సమర్పించాడు. తన సంపదనంతా పేదలకిచ్చి, తాను నిరుపేదలలో ఒకడయ్యాడు.

పీటర్ రెడ్డి ఈ లోకాన్ని, ఈ లోక సంపదలను, పేరుప్రఖ్యాతులను తృణప్రాయంగా భావించి, ప్రభు యేసుకు, ప్రభు సువార్తకు తన జీవితంలో అగ్ర తాంబూలమిచ్చాడు. 1944లోనే ఫ్రాన్సిస్ వారి తృతీయసభలో సభ్యునిగా చేరాడు. సకల ఐశ్వర్యాలను కాలదన్ని, పునీత ఫ్రాన్సిస్ వారు ఏ విధంగా ప్రభువుపైన సంపూర్తిగా ఆధారపడి నిరుపేదగా జీవించారో, ఆ విధంగా తాను కూడా జీవించడం మొదలుపెట్టాడు. అతడు తాను నమ్ముతున్న బైబులును, సువార్తను తుచ తప్పకుండా పాటించటానికి ముందుకొచ్చాడు. బైబులును యేసుప్రభుని మాతృ భాషలో చదివి, దాని మూల భావాన్ని సమగ్రంగా తెలుసుకోవాలని అరమాయిక్ భాషను, అదే విధంగా బైబులు మూల భాషలైన హీబ్రూ, లతీనులను ఎంతో కష్టపడి నేర్చుకున్నాడు. అప్పటికే ఆయన వయస్సు యాభై దాటినా, ఆ పురాతన భాషలు నేర్చుకోవటానికి తన వయస్సు ఏ మాత్రం అడ్డంకి కాలేదు.

పీటర్ రెడ్డి, నివసించటానికి నీడైనా లేని క్రీస్తుప్రభుని ఆధ్యాత్మికంగానే గాక, భౌతికంగా, సంపూర్ణంగా అనుసరించటం, ప్రభుని శిష్యులవలె దశదిశలా వెళ్ళి సువార్తను బోధించటం, తనను తాను ఏమిలేని వానిగా, నిరుపేదగా చేసుకుని, ప్రభువొసగే అన్నపానాదులపై ఆధారపడి జీవించటం, జేసు ప్రభుని మరియు శ్రీసభ పిలుపు మేరకు వినయాత్మ కలిగి ఉండటమే తన ఆధ్యాత్మికతగా చేసుకుని జీవించాడు. పీటర్ రెడ్డి సంచార సువార్త ప్రచారకుడుగా ట్రావన్కూరు, కొచ్చిన్, దక్షిణ కెనరా (మంగుళూరు) ప్రాంతాలలో 1944 నుండి 1955 వరకు వేలాది సమావేశాలలో పాల్గొని, ఆంగ్లం, మలయాళ భాషలలో అనర్గళంగా ఉపన్యసించాడు. దక్షిణ భారతదేశంలోని కతోలిక

పీఠాధిపతులు తమ తమ మేత్రాసనాలలో సువార్త ప్రబోధం చేయటానికి ఆయనకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చారు. పీటర్ రెడ్డి ప్రసంగించే సభలకు ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చేవారు. కతోలికులతోబాటు, హైందవ మిత్రులు, ప్రొటెస్టాంటు సోదరులు సైతం గణనీయ సంఖ్యలో వచ్చేవారు. ఆయన ముక్కుసూటిగా ప్రభుని శిష్యరికం గురించి మాట్లాడేవాడు. అతడు క్రైస్తవ జీవన విధానంలోని తప్పులను ఎండగట్టేవాడు. ఇహలోక సంపదలపై మమకారం పెంచుకొనక, అసలు సిసలు క్రైస్తవులుగా గట్టి విశ్వాసంతో జీవించమని ప్రజలను చైతన్యపరిచేవాడు. బహిరంగ సమావేశాలు, ప్రార్థనా సదస్సులు లేనపుడు, పీటర్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి, భిక్షాటన చేస్తూ జీవించేవాడు. చెట్ల నీడనే విశ్రమించేవాడు. అతడు బైబులును సంవత్సరానికి ఏడుమార్లు పూర్తిగా చదివేవాడు. ఖాళీ సమయమంతా బైబులు పఠించేవాడు. ఫ్రాన్సిస్కను ప్రార్థనలు భక్తితో చెప్పుకునే వాడు. సాధువైన పీటర్ రెడ్డి లోతైన ఆధ్యాత్మికత కోసం, తన శక్తికి మించి ప్రయత్నించాడు.

పీటర్ రెడ్డి కళాశాలలో తన ఉద్యోగాన్ని వదులుకున్న మీదట, ఆయన వద్ద ఏ ఆస్తి పాస్తులు ఉంచుకోలేదు. రెండే రెండు ముఖ్యమైనవి తన సంచిలో ఉంచుకున్నాడు. ఒకటి ఆధ్యాత్మిక జీవనానికి అవసరమైన బైబులు. మరొకటి తన భౌతిక జీవనానికి అవసరమైన భిక్షగాని పళ్లెం మాత్రమే. అతడు ఎంతో పేరు ప్రఖ్యాతులున్న కళాశాలలో చక్కని ఆచార్యులు, విద్వత్తు కలిగిన ప్రొఫెసర్. అయినా ప్రభుని సువార్త ప్రకటన నిమిత్తం, బిచ్చగాండ్రతో, సామాన్య ప్రజలతో, కులమత, ధనిక, పేద అను భేదభావాలు లేకుండా, సహపంక్తిలో కూర్చుని వారితో కలిసి భుజించాడు. వారికి ప్రభుని కరుణ గురించి బోధించాడు. పీటర్ రెడ్డి ఎన్నుకున్న ఈ సంచార భిక్షకుని జీవనం ఎంతో కష్టతరం. అయినా ఆయన ఈ మార్గంలో ఎన్నడూ ఒంటరివాడు కాలేదు. ప్రేమగల క్రీస్తుప్రభువు ఆయన వెన్నంటే ఉన్నారు. "మొదట దేవుని రాజ్యమును, నీతిని వెదకుడు. అప్పుడు అవి అన్నియు మీకు అనుగ్రహింపబడును" అని సువార్త (మత్తయి 6:33)లో ఉన్నది ఉన్నట్లుగా విశ్వసించాడు. ప్రభునిపై సంపూర్ణ భారం వేసి నిశ్చింతగా జీవించాడు. సంచార జీవితంలోని అస్థిరత, అభద్రత, దీనత మున్నగునవన్నీ అతనికి ఆత్మానందాన్ని కలిగించే సాధనాలుగా మారాయి. "పీటర్‌రెడ్డి పలుకులు" అను రచనలో తన ఆత్మానంద సాధనలోని వివిధ దశలను వివరించాడు. పీటర్ కొన్నాళ్లు కపూచిన్ సభకు చెందిన గోధుమ రంగు అంగీని ధరించి, తన నడుముకు తాడును కట్టుకున్నాడు. తరువాత కొంత కాలం కాషాయ రంగు వస్త్రాలను, మరికొంతకాలం తెల్లని వస్త్రాలను ధరించాడు.

పీటర్ రెడ్డి పండితులలో పండితుడు, పామరులలో పామరుడుగా జీవించాడు. పీటర్ విద్య నేర్చిన పండితునిగా, మూల భాషలో బైబులును చదివి, బైబులు అసలు సిసలు అర్థాన్ని గ్రహించిన సాహితీ వేత్తగా, బహు భాషలు నేర్చుకున్న తులనాత్మక శాస్త్రవేత్తగా పలు రచనలు చేసాడు. అతడు మొత్తం తొమ్మిది గ్రంథాలు వ్రాసాడు. పీటర్ రెడ్డి శ్రీసభ విశ్వాస సత్యాలను కూలంకషంగా చర్చిస్తూ వ్రాసిన "హోమ్ టు

రోమ్'' అను గ్రంథం అతని అత్యుత్తమ రచనగా పేర్కొనవచ్చు. శ్రీసభ సమైక్యతా అష్ట దినోత్సవాల సందర్భంగా పీటర్ చేసిన ఉపన్యాసాలు ఒక సంపుటిగా ''చరిత్ర ఇచ్చిన తీర్పు'' పేరిట ప్రచురితమైంది. 'ఒక భిక్షకుడి పలుకులు', 'నవీన చరిత్ర', 'ద హిస్టరీ ఆఫ్ ఇండియన్ కల్చర్' అనునవి అతని ఇతర రచనలు. తన భక్తి సాహిత్య గ్రంథాలను చదివి, ఏ ఒక్కరు రక్షణ పొంది క్రైస్తవుడైనా తన శ్రమకు తగిన ఫలితం లభించినట్లేనని పీటర్ రెడ్డి తరచుగా చెప్పేవాడు. పీటర్ భక్తిమార్గంలో నాలుగేళ్లు నడచిన పిమ్మట, పునీత ఫ్రాన్సిస్ వారి జీవితాన్ని తన ఆధ్యాత్మిక వికాసాన్ని అక్షరబద్ధం చేస్తూ, స్వీయ అనుభవంతో సంగీత రూపకంగా పీటర్ రెడ్డి తమిళంలో వ్రాసిన ''పునీత అసిస్సీపుర ఫ్రాన్సిస్ జీవిత యాత్ర'' చాలా ప్రసిద్ధ రచన. ఇందులో పీటర్‌రెడ్డి రచించి, సంగీతం సమకూర్చిన యాభై తమిళ భక్తి గీతాలు ఉన్నాయి. కేరళకు చెందిన పుణ్యాత్మురాలు అల్ఫోన్సా చిత్రపటాన్ని ముందుంచుకుని, ఆమె ప్రార్థనా సహాయంతో ఎనిమిది రోజులలోనే ఈ రచనను పూర్తి చేశాడు. ఈ సంగీత రూపకాన్ని అల్ఫోన్సా గారికే అంకితమిచ్చాడు.

పీటర్ ప్రభువు కోసం, ప్రభువు మాదిరిగా ఉండటం కోసం యాచకునిగా మారాడు. దైవ రాజ్యాన్ని గురించి బోధిస్తూ గ్రామ గ్రామాలూ తిరిగాడు. సువార్తను తన బోధనల ద్వారా, తన జీవితం ద్వారా, తన రచనల ద్వారా ప్రజలకు ప్రకటించాడు. అతడు దక్షిణ భారతదేశమంతా కలయ దిరిగి, యేసుక్రీస్తుని బోధలను ధైర్యంగా బోధించాడు. పీటర్ ధరించిన దుస్తులను బట్టి, పెరిగిన వెంట్రుకలు, గడ్డాన్ని చూచిన పిల్లలు, అతడిని పిచ్చివానిగా భావించి, హేళన చేశారు, అతనిపై రాళ్లు విసిరి గాయపరచారు, కట్టెలతో కొట్టారు. కాని అతడు వధించటానికి తీసుకొని వెళ్ళే గొఱ్ఱెపిల్లలా, సౌమ్యంగా, చిరునవ్వుతో ఉంటూ, మరణ దండనకు గురైన యేసుక్రీస్తు తన వీపును సైనికులకప్పగించినట్లు మారుమాటాడకుండా అవన్నీ మౌనంగా భరించాడు. ''నన్ను హింసించే వారిలో మానవ మాత్రుణ్ణి నేను చూడను. ఆ మానవుని వెనుక ఉన్న యేసుని గుర్తిస్తాను. తనను అవహేళన చేసినప్పుడు, యేసుప్రభువెలా ఆ నిందలను భరించాడో, నేను కూడా ప్రభుని అనుకరిస్తూ, ఆ నిందలను భరిస్తాను'' అని పీటర్ రెడ్డి పలికేవాడు. దానినే అతడు అక్షరాలా అమలుపరుస్తూ, ఎన్నోసార్లు హింసించబడినా, గాయపరచబడినా అతడు పల్లెత్తి మాట్లాడలేదు. ప్రభుని శ్రమలలో తనకు భాగస్వామ్యం కలిగిందని, ఆ హింసలను, నిందలను స్వీకరించాడే తప్ప, ఎప్పుడూ ఆ చిన్న పిల్లలను దండించలేదు, శపించలేదు.

పీటర్ రెడ్డి ''తెలుగు కతోలికుల పుట్టినిల్లు''గా పేరు పొందిన అనంతపురం జిల్లాలోని కృష్ణాపురం గ్రామం పలు పర్యాయములు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. 18వ శతాబ్దంలో ఫ్రెంచి జేసుసభ గురువులు పాండిచ్చేరి కేంద్రంగా చేసుకుని తెలుగు ప్రాంతాలలో ప్రభు సువార్తను ప్రకటించారు. 1701లో పుంగనూరు, 1703లో కృష్ణాపురం తదితర గ్రామాలలో తమ నివాస స్థావరాలను ఏర్పరచుకుని, ఫ్రెంచి జేసుసభ గురువులు వేద వ్యాపకం చేశారు. ఆ కృష్ణాపురం గ్రామంలోనే భీమిశెట్టి రంగప్ప, తుమ్మా రాయపరెడ్డి

కతోలిక జ్ఞానస్నానం పొంది, తెలుగు శ్రీసభకు పితామహులయ్యారు. అక్కడే ప్రజల సేవలో మరణించిన సంజీవనాథ స్వామి, శౌరినాథస్వామి, దివ్యనాథ స్వామి వారల పవిత్ర సమాధులు ఉన్నాయి. పీటర్ రెడ్డి తెలుగు క్రైస్తవుల చరిత్రను పఠించి, జేసుసభ గురువుల విశిష్ట సేవలు గుర్తించి, ఆ పూజ్య గురువులకు నివాళులు సమర్పించి, వారివలె సువార్తను ప్రకటింప స్ఫూర్తిని, చైతన్యాన్ని పొందటానికి కృష్ణాపురం తరచుగా వచ్చాడు. అక్కడున్న ముప్వురి జేసుసభ గురువుల పవిత్ర సమాధుల వద్ద రోజుల తరబడి ప్రార్థించాడు. ఆ సమాధుల మధ్యలో మఠం మానుల నీడన కూర్చుని, రోజంతా బైబులు చదివేవాడని, ఎవ్వరితో ఎక్కువగా మాట్లాడని, మౌనంగా ధ్యానం చేసుకుంటాడని అక్కడి ప్రజలు చెప్పారు. అప్పటికింకా కృష్ణాపురం యొక్క ప్రాశస్త్యం మన తెలుగు కతోలికులకు తెలియదు. ఆ గ్రామస్తులంతా హిందువులే. కృష్ణాపురం చరిత్ర చాలా గొప్పదని, ఇక్కడ భూస్థాపితం చేయబడిన గురువులు చాలా పవిత్రులు, పుణ్యమూర్తులని, ఈ సమాధులకు భవిష్యత్తులో గొప్ప వెలుగు వస్తుందని అక్కడి వారికి పీటర్ రెడ్డి గట్టిగా చెప్పేవాడు.

పీటర్ రెడ్డి 1956లో జూన్ 4 నుండి డిసెంబరు 2 వరకు అనారోగ్యంతో వైద్యశాలలో ఉన్నాడు. ఆ అంత్య దశలో తన శరీరాత్మలలో కలిగిన మార్పులు, అనుభవాలను, తనతో దేవుడెంత సన్నిహితంగా మెలిగేవారో, దేవుడేవిధంగా తన దేహ వాంఛలను అదుపు చేస్తూ, తనను ఆత్మీయునిగా స్వీకరిస్తానని ప్రభువు వాగ్దానమిచ్చారో "మంచం మీద ఆరు నెలలు" అను పుస్తకంలో పీటర్‌రెడ్డి పొందుపరిచాడు. పీటర్ రెడ్డి చాలాకాలం భిక్షువుగా జీవించటంతో అతని జీర్ణ వ్యవస్థ పూర్తిగా బలహీనపడింది. అతనికి అప్పుడప్పుడు విపరీతమైన దగ్గు వచ్చి, ఊపిరి ఆడేదికాదు. అతని రెండు కళ్లకు శుక్లాలు వచ్చాయి. ఆపరేషన్ చేయగా, ఒక కన్ను బాగైంది. మరో కన్ను వాచి, చీము పట్టి, భరింపరాని నొప్పి కలుగగా, అతడు ఆసుపత్రిలో చేరాడు. ఈ జబ్బులకు తోడు మలేరియా జ్వరం తిరగబెట్టింది. ఆ సమయంలో బ్రదర్ వర్కీ, ఇతర సన్నిహితులు అతనికి సపర్యలు చేయగా, పీటర్ రెడ్డి ఆరోగ్యం కుదుట పడి మరో రెండేళ్ళు జీవించాడు. పీటర్ రెడ్డి పాలయంకోట్టైలో జూన్ 21, 1958న ప్రభుని సన్నిధి చేరాడు. అతనిని అక్కడే పలువురు విశ్వాసుల సమక్షంలో భూస్థాపితం చేశారు.

పీటర్ రెడ్డి సత్యాన్ని వెదకుతూ, సత్యమూర్తియైన యేసుని కనుగొని, ఆ ప్రభుని త్రికరణ శుద్ధిగా అనుసరిస్తూ, తన సుఖాన్ని వీడి, పేదలపాలిటి పెన్నిధియైన ప్రభుయేసు వలె యోగిలా జీవిస్తూ, సువార్తను ప్రకటించి, తన పుణ్యజీవితం ద్వారా శ్రీసభ ఆదర్శ విశ్వాసులలో ఒకడయ్యాడు. పీటర్ రెడ్డి పుణ్య జీవితాన్ని గుర్తించిన పాలయంకోట్టై మేత్రాసనం, అతని పునీత పట్ట ప్రక్రియను ఆరంభించింది. పీటర్ రెడ్డిని శ్రీసభ అధికార ప్రతినిధియైన పాలయంకోట్టై పీఠాధిపతులు జ్యూడ్ జెరాల్డ్ పౌలు రాజు గారు అక్టోబరు 9, 2008 న వేలాది కతోలిక విశ్వాసుల మధ్య 'దైవ సేవకులు'గా ప్రకటించారు.



## ఈశాన్య భారతదేశ సువార్తా సేవకులు

# 26. పూజ్యులు స్టీఫెన్ ఫెర్నాండో

**(1895-1978)**

**ఫాదర్ వట్టి జోజి రెడ్డి S.J.**

స్టీఫెన్ ఫెర్రాండో ఇటలీ దేశమందలి జెనోవా పట్టణ సమీపానగల రొస్సిగ్లియోన్ అను గ్రామమునందలి పుణ్య దంపతులు అగస్టిన్ ఫెర్రాండో, జోసఫిన్ సాల్వీలకు సెప్టెంబరు 28, 1895న జన్మించాడు. ఆ దంపతులకు గల ముగ్గురు సంతానంలో స్టీఫెన్ పెద్దవాడు. తల్లిదండ్రులిద్దరూ చాలా భక్తిపరులు. కనుక వారు స్టీఫెనును దైవ ప్రేమలో, దైవ భయంతో పెంచారు. అతడు తన గ్రామమందే ప్రాథమిక విద్యను అభ్యసించాడు. అతడు తన ప్రాథమికోన్నత చదువులను డాన్ బోస్కో సభ గురువులు నిర్వహిస్తున్న ఫొన్సానొ లోని బోర్డింగు పాఠశాలలోను, వల్డొక్కొ పాఠశాలలోను చదివాడు.

యువకుడైన స్టీఫెన్ డాన్ బోస్కో సభ గురువుల జీవన శైలికి ఆకర్షింపబడి, వారి సభలో అక్టోబరు 24, 1907న ప్రవేశించాడు. అక్కడ అధ్యాపకుల ద్వారా జాన్ బోస్కో గారి ఆధ్యాత్మికతను, పుణ్య మార్గాన్ని చక్కగా గ్రహించి, ఆ పునీతుని గుణ గణాలలో, ప్రార్థనా జీవితంలో ఎదిగాడు. అతడు చాలా ఉత్సాహంతో, మంచి గురువు కావాలని గట్టి ప్రయత్నం చేశాడు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. ఇటలీ దేశమందలి యువకులంతా మాతృదేశ రక్షణ నిమిత్తం నిర్భంధముగా దేశ సైన్యంలో చేరి దేశ సేవ చేయాలి. కనుక స్టీఫెన్ గురుశిక్షణ అర్థాంతరంగా ఆగిపోయింది. అతడు నాలుగేళ్లపాటు (1914-1918) సైన్యంలో భాగమై, యుద్ధంలో పాల్గొన్నాడు. అతని శక్తియుక్తులను, వీరోచిత సేవలను మెచ్చి, ఇటలీ ప్రభుత్వం, ఇటలీ సైన్యం, జెనోవా అధ్యక్షుడు ఎన్నో పతకాలు, ప్రశంసా పత్రాలు అతనికి బహూకరించారు.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత 1918లో స్టీఫెన్ తిరిగి తన మాతృ సంస్థయైన డాన్ బోస్కో సభలో చేరి, ప్రభుని సేవ చేయటానికి తనను తాను సంసిద్ధం చేసుకున్నాడు. స్టీఫెన్ చాలా సాదాసీదాగా, మౌనంగా ఉంటాడు. కాని మంచి క్రమశిక్షణ, చక్కని అలవాట్లు, వినయ విధేయతలు కలిగి, ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటాడు. అతడు తన గురు విద్యను ముగించి మార్చి 18, 1922న గురుపట్టాభిషేకం పొందాడు. అప్పటినుండి అతడు ఒక సువార్త బోధకునిగా, పేదలకు సేవ చేయాలని ఉవ్విళ్లూరాడు. అతడు తన ఆశయాన్ని సభ పెద్దలకు తెలియజేయగా, అతనిని, మరో ఎనిమిది మంది గురువులతో కలిపి భారతదేశమందలి షిల్లాంగ్ పంపారు. వారంతా డిసెంబరు 2, 1923న వెనిస్ నగరం నుండి బయలు దేరి, డిసెంబరు 23న షిల్లాంగ్ చేరుకున్నారు. అక్కడ అతనిని డాన్‌బోస్కో సభ నోవిస్‌లకు శిక్షణ నిచ్చే గురువుగా నియమించారు. మంచి

గురువుగా స్టీఫెన్ ఫెర్రాండో అనేకమంది యువకులను డాన్ బోస్కోగారి భక్తి మార్గంలో నడిపించి, వారికి మంచి ఆదర్శాన్ని ఇచ్చాడు. అక్కడే కొంతకాలం రెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి, అందరి ప్రశంసలను పొందాడు. అతడు ఆ పదవిలో ఉన్నప్పుడు బెంగాలులోని కృష్ణనగర్ పీఠాధిపతులుగా 1934లో ఎంపిక చేయబడ్డాడు. స్టీఫెన్ ఫెర్రాండో కృష్ణనగర్ పీఠాధిపతులుగా నవంబరు 10, 1934న అభిషేకం పొంది, పీఠ బాధ్యతలు స్వీకరించాడు.

అక్కడ ఒక సంవత్సరంపాటు బిషప్‌గా సేవలందించిన పిమ్మట, షిల్లాంగ్ పీఠమునకు రెండవ పీఠాధిపతిగా, స్టీఫెన్‌ను నవంబరు 26, 1935న పాపుగారు బదిలీ చేశారు. అప్పటి షిల్లాంగ్ మేత్రాసనం చాలా పెద్దది. ఈశాన్య భారతదేశమంతా ఆ మేత్రాసనంలోని భాగమే. షిల్లాంగ్ ప్రాంత క్రైస్తవులు పర్వత ప్రాంత గిరిజనులు. వారి పేదరికాన్ని అతడు కళ్లారా చూశాడు. ఆ పేదలకు సేవలు చేయ గురువుల అవసరత ఎంతో ఉందని అతడు గురువుగా, బిషప్‌గా ఇటలీలోని తన సభ పెద్దలకు పలు లేఖలు వ్రాసి, ఎందరో యువ గురువులను అస్సాంలో దైవరాజ్య స్థాపనకు ఆహ్వానించాడు. అప్పటి సాంఘిక పరిస్థితులలో సువార్త బోధకుల వలన మాత్రమే తమ జాతి, తమ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని స్థానికులు విశ్వసించారు. అందువలన తమ ప్రాంతాలకు గురువులను, మఠకన్యలను, వైద్యులను, ఉపాధ్యాయులను పంపమని ఆసోం, ఖాశి, ముండా, కర్బి, తివా, బొడొ తెగల వారు, మణిపూర్, గారొ, నాగా జాతి ప్రజలు తమ ప్రతినిధి బృందాలను స్టీఫెన్ పీఠాధిపతుల వద్దకు పంపి అభ్యర్థించేవారు. వారి విన్నపాలకు తగినట్లు స్టీఫెన్ ప్రతిస్పందించి, తమ మిషనరీ గురువులను, మఠకన్యలను పంపి, ఆ తెగల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేశాడు. దైవరాజ్యాన్ని స్థాపించటానికి వచ్చిన మంచి అవకాశాన్ని పోగొట్టుకుంటే, అది తిరిగి మనకు అందని ద్రాక్ష కావచ్చని అతడు భావించి, తన మేత్రాసన పరిధిలో ఉన్న అనుభవజ్ఞులైన మిషనరీ గురువులకు ఆ పనిని అప్పగించేవాడు.

స్టీఫెన్ ఫెర్రాండో షిల్లాంగ్ బిషప్ కాగానే అక్కడి బిషప్ బంగళా కాలిపోయింది. కనుక బిషప్ బంగళా, నిత్య సహాయమాత కతెడ్రల్ దేవాలయం, దాని ప్రక్కనే పునీత చిన్నప్పగారి గురు శిక్షణా కేంద్రం, మిషనరీ గురువుల విశ్రాంతి నిలయం, నజరేత్ వైద్యశాల, ఒక్కొక్కటిగా గురుపీఠానికి అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చాడు. 1937 నుండి మేత్రాసన పరిధిలోని వివిధ గ్రామాలను సందర్శించి, జ్ఞానస్నాన తర్ఫీదు పొందిన వారికి జ్ఞానస్నానం, కొందరికి భద్రమైన అభ్యంగములు ఇవ్వసాగాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో (1939-45) భారతదేశమందలి ఇటలీ, జర్మన్ దేశ మిషనరీలను కొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. మరికొందరిని దేశ బహిష్కరణ చేశారు. అందువలన షిల్లాంగ్ మేత్రాసనం మొత్తంలో ముప్పయిమంది విచారణ గురువులు, ఇరవైమంది ఇతర గురువులు మాత్రమే మిగిలారు. దానితో సువార్త బోధ, క్రైస్తవుల పరిచర్య చాలా వరకు కుంటు పడింది. గురువుల కొరతను పూడ్చి, దానికి

ప్రత్యామ్నాయంగా క్రైస్తవులను సందర్శించి, వారికి ప్రార్థనలు నిర్వహించి గురువులకు సహాయ పడటానికి అక్టోబరు 24, 1942న "మిషనరీ సిస్టర్స్ ఆఫ్ మేరి, హెల్ప్ ఆఫ్ క్రిస్టియన్స్" (MSMHC) అను మఠకన్యల సభను గౌహతిలో ఆరంభించాడు. ఆ మఠకన్యలు స్టీఫెన్ మార్గదర్శకత్వంలో మారు మూల గ్రామాలకు వెళ్లి బోధించటం, సత్యోపదేశం నేర్పించటం, విద్య వైద్య సదుపాయాలు కల్పించటం, బాలికలకు సంరక్షణాలయాలు, వృత్తి శిక్షణా కేంద్రాలు, సంచార వైద్య శాలలు, వికలాంగులను, దివ్యాంగులను ఆదుకోవటం మొదలగు పనులెన్నో చేసి, శ్రీసభకు చక్కని పునాదులు వేశారు. ఎనిమిది మంది మఠకన్యలతో ఆరంభమైన నిత్య సహాయమాత మఠసభ డాన్ బోస్కోగారి ఆధ్యాత్మికతను చేపట్టి, ప్రభుని రాజ్యంలో క్రమేణా ఫలిస్తూ, నేడు ఈశాన్య భారతమే కాకుండా దేశ నలుమూలలా, ఇంకను కొన్ని విదేశాలలో శ్రీసభకు విశిష్ట సేవలందించుచున్నారు.

స్టీఫెన్ ఫెర్రాండో ఈశాన్య భారత దేశంలోని వివిధ తెగల సంస్కృతి, సంప్రదాయాలను ఎంతో గౌరవించాడు. వారి భాషలలో సువార్తా బోధలు జరిగేలా చూశాడు. స్థానిక తెగల ప్రజలను సువార్తా సేవకు గురువులు, మఠకన్యలుగా ప్రోత్సహించాడు. 1969లో భారత ప్రభుత్వం విదేశీ మిషనరీలను తమ దేశాలకు వెళ్ళి, స్థానికులే శ్రీసభను నిర్వహించుకునేలా ప్రోత్సహించమని ఆదేశమిచ్చింది. దానిని శిరసావహించి, ఆరవ పాల్ పాపుగారికి తన రాజీనామాను జూన్ 26, 1969న సమర్పించి, స్థానిక భారతదేశ పౌరుని పీఠాధిపతిగా నియమించమని అతడు అభ్యర్థించాడు. బిషప్‌గా తన 35 యేళ్ల పాలనలో అతడు భారతదేశాన్ని తన మాతృభూమిగా భావించి, ప్రభువుపై గట్టి విశ్వాసం, మరియమాతపై ఎనలేని భక్తి, స్థానిక తెగల పురోభివృద్ధి అను ముఖ్య స్తంభాలపై చక్కని శ్రీసభను నిర్మించాడు. తన తదనంతరం షిల్లాంగ్ మేత్రాసనాన్ని అగ్రపీఠ స్థాయిని చేర్చాడు. అతడు బిషప్‌గా ఉన్నపుడు, పదవీ విరమణ తరువాత కూడా అస్సాం శ్రీసభ అభివృద్ధి గురించి పలు క్రైస్తవ పత్రికలలో వ్యాసాలు వ్రాసేవాడు.

స్టీఫెన్ ఫెర్రాండో తన వృద్ధాప్యమును ఇటలీలోని జెనోవాలో జెనోవా క్వార్తో అను సలేషియన్ సంస్థలో గడిపి, 82 ఏళ్ళ వయస్సులో జూన్ 21, 1978న పరమ పదించాడు. అతడిని రొస్సిగ్లియోన్‌లోని తమ కుటుంబ సమాధిలో భూస్థాపితం చేశారు. వారి భౌతిక అవశేషాలను ఇటలీనుంచి షిల్లాంగ్‌నందలి పునీత మార్గరెట్ కాన్వెంట్ దేవాలయంలో డిసెంబరు 12, 1987న భద్రపరిచారు. అప్పటినుండి సమాధిని దర్శించి, ఫెర్రాండో గారి మధ్యవర్తిత్వం ద్వారా ప్రార్థించటానికి, నిత్యం వందలాది విశ్వాసులు వస్తున్నారు. వారి పవిత్ర జీవితాన్ని కొనియాడుతూ రెండవ జాన్ పాల్ పాపుగారు స్టీఫెన్ ఫెర్రాండోను ఏప్రిల్ 23, 2003న "దైవ సేవకులు"గా, ఫ్రాన్సిస్ జగద్గురువులు మార్చి 3, 2016న "పూజ్యులు"గా ప్రకటించారు. స్టీఫెన్ ఫెర్రాండో గారి పుణ్య జీవితం, సువార్తా బోధలు ఎందరో జీవితాలకు స్ఫూర్తిదాయకమైంది. డాన్ బోస్కో గారి సభ చరిత్రలో, భారత శ్రీసభ చరిత్రలో అతడు ఒక మంచి ఆణిముత్యమై, తన ఆధ్యాత్మిక సంపదలను అందరికి ఆప్యాయంగా స్వర్గం నుండి అందిస్తున్నారు.



## అభాగ్యుల అమృతవల్లి

# 27. పునీత మదర్ తెరెసా

**(1910-1997)**

ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.

ప్రేమ, దయ, కరుణ, వాత్సల్యములకు మారుపేరు మదర్ తెరెసా. కుల, మత, వర్గ, వర్ణ, దేశమనే హద్దులను చెరపి మానవత్వానికి నడకలు నేర్పి, విశ్వ మానవమూర్తిగా, విఖ్యాతి గాంచిన మాతృమూర్తి మదర్ తెరెసా. అల్బేనియా దేశమందలి మాసిడోనియా రాష్ట్రములోని స్కోపె అను పట్టణంలో నికోలా, డ్రానాఫైల్ అను కతోలిక దంపతులకు కలిగిన నలుగురి సంతానంలో చివరిదిగా మదర్ తెరెసా ఆగస్టు 26, 1910లో జన్మించింది. తల్లిదండ్రులు బిడ్డకు ఆగస్టు 27న జ్ఞానస్నానమిచ్చి, ఆగ్నెస్ అని నామకరణం చేశారు. ఆమె తల్లిదండ్రులిద్దరూ చాలా భక్తిపరులు. వారు తమ బిడ్డలను చక్కని కతోలిక విశ్వాసంలో పెంచారు. తండ్రి నికోలా భవన నిర్మాణ కాంట్రాక్టర్‌గా, మందుల వ్యాపారిగా ఉంటూ, కుటుంబాన్ని పోషించాడు. నికోలాకు స్వదేశాభిమానం చాలా ఎక్కువ. దేశ రాజకీయాలలో కొంచెం ప్రవేశముంది.

నికోలా తనకు ఉన్నంతలో ఇతరులకు సేవ చేసేవాడు. ఆగ్నెస్ ఎనిమిదేళ్ల ప్రాయంలోనే అనగా 1919లో జబ్బుచేసి, ఆకస్మాత్తుగా మరణించాడు. తండ్రి మరణంతో ఆగ్నెస్, తల్లికి దగ్గరయ్యింది. తల్లి డ్రానా చాలా దయా సంపన్నురాలు. వారంత స్థితిమంతులు కానప్పటికి, డ్రానా పేదలను పిలిచి, వారికి తన భోజన బల్ల వద్ద అన్నం వడ్డించేది. ''ఇతరులకు పెట్టకుండా, నీవు ఏది తినవద్దమ్మా'' అని డ్రోనా తన చిన్నారి బిడ్డ ఆగ్నెస్‌కు చిన్నప్పుడే నూరిపోసింది. తమతో భోజనం చేస్తున్న వారిని ఆగ్నెస్ చూపించి, ''వీరెవరమ్మా?'' అని తల్లిని అమాయకంగా అడిగినపుడు, ''వాళ్లలో కొద్ది మందే మన బంధువులు. కాని వారందరూ మన మనుష్య జాతికి చెందినవారే'' అని డ్రానా ఆకలిగొన్న వారందరిని తన స్వంత వారిగా భావించి, వారి ఆకలిని తీర్చింది. ఆగ్నెస్‌కు తన తల్లి సేవాభావం ఎంతో నచ్చింది. ఎంతో ఆదర్శప్రాయమైంది. ఆ సేవా గుణం ఆగ్నెస్‌కు తల్లిదండ్రులనుండి చిన్నప్పటినుండే వారసత్వంగా వచ్చింది.

ఆగ్నెస్ తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని క్రైస్తవ మఠకన్యల పాఠశాలలో ఆరంభించి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగించింది. బాల్యం నుండి ఆగ్నెస్‌కు ప్రభుయేసునిపై భక్తి ప్రపత్తులు మెండు. ప్రతిదినం ఆగ్నెస్ దివ్య పూజాబలిలో పాల్గొనేది. ఆ దేవాలయపు పాటల బృందంలో సభ్యురాలై చక్కని గొంతుతో పాటలు పాడేది. ఆగ్నెస్ పన్నెండేళ్ల

ప్రాయంలో లెట్నిస్ నందున్న "నల్ల మరియమ్మగారి పుణ్యక్షేత్రం"నకు తన విచారణ క్రైస్తవులతో బాటు వెళ్లింది. ఆ తీర్థయాత్రలో ఆగ్నెస్‌కు మఠకన్య కావాలనే తలంపు మొదటిసారిగా కలిగింది. ఆ లేత ప్రాయంలో కొందరి మిషనరీల జీవిత గాథలు చదివింది. తాను కూడా వారివలె మిషనరీగా సేవలందించాలని, ఆగ్నెస్ కలలు కన్నది.

ఆగ్నెస్ పదునెనిమిదేండ్ల వయస్సులో అనగా 1928లో ప్రభుసేవ చేయ సంకల్పించి ఇల్లు వదిలింది. ఐర్లాండ్ దేశంలోని లొరెట్టో మఠకన్యల సభలో చేరింది. మిషనరీగా పనిచేయాలంటే ఆంగ్ల భాష నేర్చుకోవటం తప్పనిసరి. కనుక ఆగ్నెస్ ఐర్లాండులో ఇంగ్లీషు భాషను చక్కగా నేర్చుకుని, మిషనరీగా భారతదేశం వెళ్ళటానికి తనను తాను సిద్ధపరచుకుంది. తన ప్రాథమిక శిక్షణానంతరం ఆగ్నెస్ ఐర్లాండ్ వీడి 1929లో భారతదేశంలో అడుగుపెట్టింది. ఆగ్నెస్ తన తల్లిని, అక్కను ఆ తరువాత మరెన్నడూ చూడలేదు. హిమాలయా పర్వతాలకు దగ్గరగానున్న బెంగాలులోని డార్జిలింగ్ నందు ఆగ్నెస్ తన నొవిషియేట్ శిక్షణను ఆరంభించింది. లొరెట్టో మఠకన్యల ఆధ్యాత్మికతలో తర్ఫీదు పొంది, మే 24, 1931న తన మొదటి మాటపట్టును స్వీకరించింది. ఆనాడే మిషనరీలకు పాలక పునీతులైన చిన్న తెరేసమ్మగారి పేరిట తెరెసాగా నూతన నామధేయాన్ని చేపట్టింది. నొవిషియేట్ శిక్షణలోనే బెంగాలీ భాషను అభ్యసించి, అందులో మంచి పట్టు సాధించింది.

తెరెసా మఠకన్యగా కలకత్తా నగరమందలి ఎంటల్లి లోని పునీత మరియమ్మగారి పాఠశాలలో 1931 నుండి ఉపాధ్యాయురాలిగా బాలికలకు బోధింప నారంభించింది. అక్కడ సేవలందించే సమయంలో మే 14, 1937న తెరెసా శాశ్వత వ్రతాలను లొరెట్టో మఠసభలో స్వీకరించి, ప్రభుయేసుకు సంపూర్ణంగా అంకితమైంది. ఆ పాఠశాల లోనే 1944లో ప్రధానోపాధ్యాయురాలై, పాఠశాల అభివృద్ధికి తన శాయశక్తులా పాటుబడి, ఎందరో బాలికల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసింది. ఆ కాలంలో తమ పాఠశాలకు దగ్గరగా ఉన్న మురికివాడలలోని పేదల దీనావస్థను, వారి ఆకలిదప్పులను గమనించి, ఆమె హృదయాంతరంగం కొద్దిగా చలించసాగింది. 1943లో బెంగాలు నందు కరవు రక్కసి ఎందరో అభాగ్యులను కబళించింది. కలకత్తా నగరమంతా అన్నార్తుల ఆకలి కేకలు, పసి మొగ్గల ఆక్రందనలు, నిస్సహాయ మహిళల మౌనరోదనతో, బక్కచిక్కిన బడుగులతో, అనాథ శవాలతో కడు దయనీయంగా ఉండేది. మరో వైపు 1946లో దేశ విభజన సమయంలో హిందూ ముస్లింల మారణ హోమాల మధ్య 'బ్రతుకు జీవుడా' యని కట్టుబట్టలతో ముస్లిములంతా తూర్పు పాకిస్తాన్, హిందువులంతా భారతదేశం వలస వెళ్లారు. ఈ విపత్కర పరిస్థితులలో పేదల పరిస్థితి మరింత దుర్భరమైంది. ఆ దయనీయ సంఘటనలు, హృదయ విదారక దృశ్యాలు ఆమెను ఎంతో కదలించాయి.

తెరెసా తన వార్షిక ఎనిమిది రోజుల ప్రార్థన నిమిత్తం సెప్టెంబరు 10, 1946న

కలకత్తా నుండి డార్జిలింగ్‌నకు రైలులో ప్రయాణమైంది. ఆ ప్రయాణంలో తెరెసా "తన పిలుపులో మరో పిలుపు"ను పొందింది. ఆ పిలుపే ఆమె జీవితాన్ని మరువలేని మరో మలుపు త్రిప్పింది. పేదల, దీనుల, రోగుల, అనాధల సేవలో లీనమై, ఆ పేదలలో ఒకరిగా సహ జీవనం చేయమని యేసు ప్రభుని ప్రత్యేక పిలుపు పొందింది. లొరెట్టో మతకన్య జీవితాన్ని వీడి, పూర్తిగా పేదల సేవలో తరించమని ప్రభుని ఆజ్ఞ. కాబట్టి దానికి సంపూర్ణంగా విధేయించడమే తన తక్షణ కర్తవ్యంగా తెరెసా భావించింది. ప్రభుని పిలుపును, ప్రేరణను తన లొరెట్టో మతకన్య సభ పెద్దలకు, జేసుసభకు చెందిన ఆధ్యాత్మిక గురువుకు వివరించింది. దానిపై మరింత ప్రార్థించి, పెద్దల అనుమతితో 1948లో లొరెట్టో కాన్వెంట్‌ను వీడింది. అప్పటికి ఆమె వయస్సు 38 యేండ్లు.

తెరెసా 1948 ఆగస్టు నెలలో లొరెట్టో కాన్వెంట్ ధవళ వస్త్రములు వీడి, సనాతన భారత సంప్రదాయంలో నీలి రంగు అంచుతో నున్న తెల్లని నేత చీరెను ధరించి మురికివాడలలో నున్న కడుపేదలకు సేవలు చేయనారంభించింది. ఆమె ఆరు నెలల పాటు పాట్నాలోని హోలి ఫామిలీ వైద్యశాలనందు ప్రాధమిక చికిత్సలో శిక్షణ పొందింది. పిమ్మట కలకత్తా నగరమందలి మురికివాడలను సందర్శించి, నిరుపేదలతో మమేకమైంది. అక్షర జ్ఞానంలేని పిల్లలను చెట్టు క్రింద చేర్చి, అక్షరాభ్యాసం చేసింది. ఎవరికీ అక్కర బట్టని, ఎవరి ప్రేమకూ నోచుకోని, ఎవ్వరూ సేవలందించని అభాగ్యులను తెరెసా తన స్వంతవారిగా భావించి, ప్రేమానురాగాలను పంచింది. అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించి, శిథిలమైన, పాత కాళీమాత దేవాలయాన్ని సంపాదించి, అందులో మరణించనున్న వారి శరణాలయాన్ని మొదలు పెట్టింది. అదే తెరెసా స్థాపించిన మొదటి సేవా నిలయం. దాని పేరు "నిర్మల హృదయ్". ఇప్పుడు కలకత్తా నగరంలో మదర్ తెరెసా నిర్మల హృదయ్ తెలియని వారుండరు. ఆ విధంగా తెరెసా పేదలకు, అన్నార్తులకు, దిక్కులేని వారికి కన్నతల్లిలా సహాయపడసాగింది. ఆమె నిస్వార్థ సేవను గమనించి, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, నిధులు సమకూర్చసాగారు. తనతో లొరెట్టో పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాళ్లు, తన పూర్వ విద్యార్థులు మురికి వాడలలో పేదలకు, రోగులకు సేవలందించ తమ సంసిద్ధతను తెలిపి, చేయూత నందించారు. ఆ విధంగా తెరెసా దైవ కృపతో ఒక సేవా బృందాన్ని ఏర్పరచుకుంది.

తెరెసా "మిషనరీస్ ఆఫ్ చారిటీ" అను మతకన్యల సభను అక్టోబరు 1950లో పేదల సేవకై స్థాపించింది. అందులో ప్రథమ సభ్యులు ఎక్కువగా తన సహచర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులే. తెరెసా ఎప్పుడూ తన సహచరులకు మార్గదర్శకంగా ఉంటూ, పేదలలో ప్రభుని దర్శించి, నిండు మనస్సుతో సేవలర్పించమని కోరేది. "అందరూ గొప్ప గొప్ప కార్యాలు చేయలేక పోవచ్చు. కాని చేసే ఏ చిన్న పనినైనా, ఎంతో ప్రేమతో చేయవచ్చున"ని తెరెసా తన అనుయాయులకు దిశానిర్దేశం చేసింది.

“నిర్మల్ హృదయ్”లో చేరిన వృద్ధులంతా ఎవరికీ పట్టని అభాగ్యులు, బుద్ధిమాంద్యులు, వికలాంగులు, కుష్ఠరోగులే. వారంతా ఒకప్పుడు రోడ్ల వెంట జీవచ్ఛవాలుగా, పశువుల్లా జీవించిన వాళ్లు, ఇప్పుడు తెరెసా చేతిలో వైద్యం పొంది, దేవదూతలవలె హాయిగా, నవ్వుతూ, సంతృప్తితో మరణిస్తుండటం కలియుగంలో జరుగుచున్న అద్భుతంగా అందరూ భావించారు. అంతటి ప్రేమాప్యతలు పంచటం ఆమెకే చెల్లింది. మరణించిన వారి అంత్య క్రియలు, వారి మత సాంప్రదాయాలనుబట్టి చాలా నిష్ఠగా జరిపేవారు. కుష్ఠరోగులకు శాంతినగర్‌గా పిలువబడే శరణాలయం కలకత్తాలోనే ప్రారంభించింది. కలకత్తా నగరమంతా సంచార కుష్ఠరోగుల వైద్యశాలలు స్థాపించి, కుష్ఠరోగులందరి గాయాలకు ప్రతి దినం కట్లు కట్టి, మందు బిళ్లలు ఇచ్చేది. ఎందరో అనాథ బాలలను అక్కున జేర్చుకుని, వారి కొరకు “నిర్మల్ శిశు భవన్” స్థాపించింది. తెరెసా పేదల పాలిటి పెన్నిధియై, భారతదేశమంతా అనేక అనాథ శరణాలయాలు, కుష్ఠరోగుల కేంద్రాలు, మరణించువారికి ఆశ్రమాలు, దివ్యాంగుల సంరక్షణాలయాలు ఎన్నో స్థాపించ సాగింది.

1965లో వెనెజులాలో, 1968లో రోము, టాంజానియా, ఆస్ట్రేలియాలలో శరణాలయాలు స్థాపిస్తూ, అంతర్జాతీయంగా తన సేవలను విస్తరించింది. 1970 కల్లా పలు దేశాలలో మిషనరీస్ ఆఫ్ చారిటీ మఠకన్యలు సేవలు అందించసాగారు. ఆ మఠకన్యల జీవితం వేకువ ఝామున ప్రార్థనతో మొదలవుతుంది. వారంతా దివ్య పూజా బలిలో పాల్గొని, ప్రభుని ఆశీస్సులు స్వీకరించి, ప్రభువొసగిన బలంతో రోజంతా పేదల, అనాథల, రోగుల సేవలు చేస్తారు. ప్రతి మఠకన్యకు రెండు జతల బట్టలు మాత్రమే ఉంటాయి. “నిరు పేదలకు మనస్ఫూర్తిగా ఉచిత సేవ చేస్తానని” ప్రతి మఠకన్య పేదరికము, విరక్తత్వము, విధేయత అను మూడు సాధారణ వ్రతములతో బాటు నాలుగవ ప్రత్యేక ప్రతిజ్ఞ చేస్తుంది. దానిని సభలోని మఠకన్యలంతా తుచ తప్పక పాటిస్తారు. తెరెసా పేదలను పోషించటానికి, రోగుల వైద్య ఖర్చులకు ఎందరినో యాచించింది. ఉదారంగా ఇచ్చేవారు కొందరైతే, చీదరించుకునేవారు మరికొందరు. తన సేవా జీవిత ఆరంభంలో ఆమె ఎన్నో కష్టాలు, బాధలు, అవమానాలు పడింది. అయినా ఆమె పేదల కోసం, అనాథల కోసం, ఎయిడ్స్, కుష్ఠరోగుల కోసం ఆ అవమానాలన్నీ దిగమింగింది. 1965లో ఆరవ పాల్ జగద్గురువులు తెరెసా స్థాపించిన “మిషనరీస్ ఆఫ్ చారిటి” సంస్థకు అంతర్జాతీయ హోదాను కల్పించారు.

ఓనాడు అనాథ పిల్లల కడుపు నింపటానికి శరణాలయంలో ఏ ఆహార పదార్థాలు లేవు. తెరెసా నిండు మనస్సుతో పిల్లల ఆకలి తీర్చమని ప్రభుని ప్రార్థించింది. అనంతరము కలకత్తా నగర వీధులలో యాచించటం మొదలుపెట్టింది. ఓ వ్యాపారి వద్ద ఆకలిగొన్న వారికి, పేదలకు ఏదైనా ఇమ్మని ఓ వ్యాపారి వద్ద చేయి చాచింది. అతడు ఆమెను

ఛీదరించుకుని, ఆమె చేతిలో ఉమ్మి వేశాడు. అప్పుడు నిబ్బరంగా చేతిని తన చీరెకు తుడుచుకుని, చిరునవ్వుతో "మీకు వందనాలు. మీరు నాకు చేసిన ఈ చీత్కారానికి వందనాలు. కాని.. ఆకలితో నున్న నా పేద పిల్లలకు ఏదైనా ఇవ్వండి" అని తెరెసా అడిగింది. దానితో ఆ వ్యాపారస్థునికి తల కొట్టేసినట్లయింది. తెరెసాలోని ఓర్పును, సౌమ్యతను, అంకిత భావాన్ని చూచి, ఆ వ్యాపారి మనసు మార్చుకున్నాడు. అతడు చేసిన పనికి, సిగ్గుపడ్డాడు. పశ్చాత్తాప పడ్డాడు. తలదించుకున్నాడు. అప్పటినుండి తెరెసాకు సహాయం చేస్తూ, ఆమెకు తోడుగా, బాసటగా నిలిచాడు. ఆమె ఇటువంటి హేళనలెన్నింటినో ప్రభుని పేరిట, పేదల మోములలో ఆనందాన్ని చూచి, భరించింది. ఆమె నమ్మిన యేసు భగవానుని, నిరుపేదలలో, కుష్ఠ రోగులలో, అనాధలలో, దిక్కులేని వారిలో చూసింది. వారికి చేసిన ఉపచారాలు, సపర్యలు సాక్షాత్తూ ప్రభునికి చేసినట్లేనని భావించింది. "నేను ఆకలి గొనినపుడు, మీరు ఆహారము ఒసగితిరి. దప్పిక గొనినపుడు, దాహము తీర్చితిరి. రోగినై ఉన్నపుడు, నన్ను పరామర్శించితిరి" అను యేసు ప్రభుని బోధలను అక్షరాలా పాటించి, పేదలను సేవించి, ప్రభుయేసు అడుగు జాడలలో తెరెసా నిరంతరం నడిచింది.

తెరెసా మానవ సమాజంలోని బాధలను, కష్టాలను, నొప్పిని, పేదల నిస్సహాయతను చూచి అచేతనంగా ఉండక, తన వంతు పాత్రను నిర్వహించి, అన్నార్తుల ఆకలి తీర్చింది. రోడ్ల వెంట మరణిస్తున్న వారికి సేవలు చేసి, వారికి అమ్మను మించిన అమ్మ అయింది. అనాధలను అక్కున చేర్చుకుంది. కుష్ఠరోగుల గాయాలు కడిగి, హృదయానికి హత్తుకుంది. ఆమె తన చిన్న జీవితంలో దేవునికి ఒక గొప్ప అందమైన బహుమతి ఇవ్వాలని కోరుకుంది. దానికోసం ప్రయత్నించింది. ఈ ప్రయాణంలో ఆమె దుఖాన్ని, మానసిక క్షోభను కూడ అనుభవించింది. లొరెట్టో కాన్వెంట్‌లో ఉన్న భద్రత, సంతోషకర జీవితంను విడనాడి, పేదల కోసం అష్టకష్టాలు పడే తరుణంలో, పేదల పరిచర్యను వీడి, తిరిగి లొరెట్టో కాన్వెంట్‌లో చేరిపొమ్మని ఆమెకు ఆదిలో ఎన్నో సాతాను శోధనలు కలిగాయి. ప్రార్థనా బలంతో తెరెసా వాటిని చక్కగా అధిగమించింది. ఆమె ప్రార్థనను ఏనాడు విడనాడలేదు. ప్రతి ఉదయం దివ్య బలిపూజలో పాల్గొని, దివ్యసత్ప్రసాద ప్రభుని స్వీకరించేది. తన సేవనంతా, తన దాతలందరిని, తన మఠకన్యలందరిని ప్రభుపాద సన్నిధి చేర్చి ప్రతిదినం ప్రార్థించేది. అదే విధంగా మధ్యాహ్నం మూడు గంటలనుండి నాలుగు గంటల వరకు అనునిత్యం ప్రార్థించేంది. మరియమాతను, జపమాలను ఎపుడూ విడిచేదికాదు. ఆమె పునీత ఫ్రాన్సిస్‌గారి పేదరికాన్ని మాతృకగా చేసుకుని జీవించింది. శాంతిని, ప్రేమను, మన్నింపును, ఐక్యతను, విశ్వాసాన్ని, ఆశను, సంతోషాన్ని దయ చేయమని ఫ్రాన్సిస్‌వారి ప్రార్థనను ఆమె తరచుగా ధ్యానించేది. తెరెసా తన విశ్వాస జీవితంలో ఎన్నో చీకటి రాత్రులను సైతం గడిపింది. ఆమె ఎంతో ప్రేమతో సేవిస్తున్న యేసు భగవానుని చెలిమి,

ప్రసన్నత, అనుభూతి దూరమై, కొంతకాలం బాధపడింది. అయినా తన మనో నిగ్రహాన్ని, విశ్వాసాన్ని కోల్పోలేదు. ఆమె తన నిత్య వరుడైన యేసుని నిండుగా, విశ్వాసంతో కొలిచింది. ఆరాధించింది. ఆ ప్రభువునికి ఎంతో ప్రీతిపాత్రులై, నమ్మిన బంటుగా మహోన్నత సేవలందించింది.

మిషనరీస్ ఆఫ్ ఛారిటీ మఠకన్యల సేవలు, తెరెసా ఆధ్వర్యంలో ప్రపంచ నలుమూలలా వేగంగా వ్యాపించాయి. అనేక దేశాలలో వారి సంస్థలు వెలిశాయి. 1971లో అమెరికాలోని న్యూయార్కు నగరంలో, 1982లో లెబనానులోని బీరూట్‌లో, ఎన్నో ఆఫ్రికా దేశాలలో ఆమె సేవలు ఆరంభమయ్యాయి. ఆమె నిస్వార్థ సేవలను పలువురు గుర్తించి, ఆమెకు పలు అవార్డులు బహూకరించారు. 1962లో రామన్ మెగసెసె అవార్డు, పద్మశ్రీ అవార్డు, 1979లో నోబెల్ శాంతి బహుమతి, 1980లో భారతరత్న పురస్కారం లభించాయి. 1963లో ఆమె ఆధ్యాత్మికతకు ముచ్చటపడి, ఆమె మార్గదర్శకత్వంలో "మిషనరీస్ ఆఫ్ చారిటీ బ్రదర్స్" అను మరో సేవా సంస్థ, 1976లో "సర్వధా ధ్యానించే మఠకన్యల సభ" ఏర్పడ్డాయి. ఆమె సేవలను కళ్ళారా గాంచిన ఎందరో విదేశీయులు, స్థానికులు స్వచ్ఛంద సేవకులుగా ఆమెతో చేతులు కలిపి, సమాజంలోని నిస్సహాయులకు సేవలందించారు. ఆమె కీర్తి బావుటా ఎంత ఎత్తు ఎదిగినా, గర్వం ఆమె తలకెక్కలేదు. ఆమె ఎప్పుడూ సౌమ్యురాలుగా, వినమ్రతతో, ఒదిగి ఉండి, ప్రభుయేసు బిడ్డగా భాసిల్లింది. "నేను పుట్టుకతో అల్బేనియన్‌ని. పౌరసత్వంతో భారతీయురాలిని. విశ్వాసంలో కతోలిక సన్యాసిని. పిలుపులో ప్రపంచ పౌరురాలిని. నా మనస్సు, హృదయం మాత్రం యేసుప్రభుని దివ్య హృదయానికి చెందినది" అని తెరెసా తన గురించి సవినయంగా తెలుపుకుంది. అందుకే సకల విశ్వానికే అమ్మగా నిలిచి, మదర్ తెరెసాగా, కలకత్తాపురి తెరెసాగా పేరు బడసింది.

మదర్ తెరెసా మిషనరీస్ ఆఫ్ చారిటీ సభ ప్రభుని దీవెనలతో నిండుగా దీవించబడింది. ఆమె అనుయాయులు కూడా గొప్ప సేవాభావంతో, త్యాగ నిరతితో పేదలను సేవిస్తారు. మదర్ తెరెసాకు తెలుగు నేలకు అవినాభావ సంబంధముంది. ఆమె ఎన్నో పర్యాయములు స్థానిక బిషప్‌ల ఆహ్వానం మేరకు వచ్చి, స్వయంగా సేవలందించారు. మొట్ట మొదట నెల్లూరు పీఠాధిపతులు తుమ్మా శౌరి గారు 1972లో ఆహ్వానించగా వచ్చి, వృద్ధులు, శరణార్థుల కోసం నిర్మల హృదయ భవన్‌ను స్థాపించింది. 1974 జూన్ నెలలో గుంతకల్లులో సేవాసదనం వెలిసింది. విజయవాడలో 1976లో కలెక్టర్ వేణుగోపాల్ గారు కేటాయించిన స్థలంలో వృద్ధులకు నిర్మల హృదయ భవనం ఆరంభించింది. 1977 దివిసీమ ఉప్పెన బాధితుల సహాయక చర్యలలో మదర్ తెరెసా పాల్గొని, స్వయంగా మృత దేహాలను దహనం చేసింది. ఆ మృత దేహాలు దహనమవుతుండగా, ఆమె మోకాళ్లమీద ఉండి ప్రార్థించేది. "విపత్తుల బాధలు

అధిగమించటానికి ఒకరికొకరు తోడుగా నిలవాలి. ప్రేమ, కరుణలతో ఆ బాధలు త్వరగా సమసిపోతాయని" మదర్ తెరెసా గాఢంగా విశ్వసించింది. నల్గొండ మేత్రాణులైన మాత్యూ చెరియన్ కున్నెల్ గారు దైవ ప్రేరణతో తన మెడలోని బంగారు గొలుసును గుట్టు చప్పుడు గాకుండా మదర్ చేతికి అందించారు. వరంగల్ పీఠాధిపతులు తుమ్మా బాల గారు సేవా కేంద్ర స్థాపన నిమిత్తం మదర్‌కు ఫాతిమా నగర్ చూపగా, ఆమె నిరాకరించి, నిరుపేదలుండే ప్రాంతం చూపించమని కోరింది. దానితో తుమ్మా బాల బిషప్ గారు పూరిపాకలు, గుడిసెలు, మురికి వాడలుండే కాశీబుగ్గలోని అప్పిస్సీ విచారణ చూపించారు. విశాఖ సందర్శనలో జ్ఞానాపురంలోని బిషప్ కాగితపు మరియదాసు గారి తల్లిని సందర్శించి ఇద్దరికి ఒకరి భాష ఒకరికి తెలియక పోయినా, ఎంతో సేపు ప్రేమ భాషలో ముచ్చటించుకున్నారు. మదర్ తెరెసా హైదరాబాదు నగరానికి అగ్రపీఠాధిపతులు సామినేని అరుళప్పగారి ఆహ్వానంతో చేరుకుని, 1978లో రెబెల్లో దానం చేసిన ఇంటిలో అనాథ బాలికా నిలయాన్ని ఆరంభించింది. వారి సంస్థలు కడప, ఏలూరు, తిరుపతి, శ్రీకాకుళం, గుంటూరు మున్నగు పట్టణాలలో అనాథలకు, అభాగ్యులకు, అలసిసొలసిన ఒంటరి జీవులకు, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు, దివ్యాంగులకు విరివిగా విశిష్ట సేవలందిస్తున్నాయి.

మదర్ తెరెసాకు గురువుల పట్ల అపార భక్తి, ప్రేమ ఉన్నాయి. ఆమె వారికోసం తన దైనందిన జపాలలో నిత్యం ప్రార్థించేది. గురువులు తాము చేసే ప్రతి దివ్య బలిపూజను అదే మొదటి పూజ అన్నంత భక్తి విశ్వాసములతో, అదే తమ చివరి పూజ అన్నంత పూజ్య భావంతో చేయాలని ఉద్భోదించింది. ఆమెకు కలకత్తాలోని జేసుసభ గురువులంటే ఎనలేని గౌరవం. ఆమె లొరెట్టో పాఠశాలలో పనిచేసే కాలం నుండి అనగా 1944 నుండి వాన్ ఎగ్జెమ్ అను జేసుసభ గురువు ఆమెకు ఆధ్యాత్మిక గురువుగా ఉన్నారు. ఆ గురువుతో తెరెసా తన అంతరంగాన్ని పంచుకుని, ఎంతో ఊరటను, శక్తిని పొంది, దైవ చిత్తాన్ని పసిగట్టి, ఆచరించటానికి ప్రయత్నించింది. వాన్ ఎగ్జెమ్ గురువులే 1950లో మిషనరీస్ ఆఫ్ చారిటికి రాజ్యాంగం, నియమ నిబంధనలు లిఖించి, 1955లో దానికి పాపుగారి ఆమోదం పొందాడు.

మదర్ తెరెసా చక్కని తిరుసభ బిడ్డ. ఆమె జగద్గురువులు, కార్డినళ్లు, బిషప్‌లను పలుమార్లు కలిసి, పేదల సేవలను ఆశీర్వదించమని, తమ మఠకన్యలకు సహాయపడమని అర్థించేది. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను, భ్రూణ హత్యలను ఆమె బహిరంగంగా నిరసించి, ఖండించింది. జన్మించటం తల్లి గర్భంలోని శిశువు హక్కు అని, మరణించటం దేవునిలో పునర్జన్మయని తలపోసి, మానవ జాతి వినాశకర వైపరీత్యాలకు అడ్డుగా నిలిచింది. ప్రకృతి సిద్ధ కుటుంబ నియంత్రణను పాటించమని, అవాంఛిత గర్భ ధారణను సాంఘిక అన్యాయంగా భావించి, తన సేవా కేంద్రాలలో అట్టి గర్భిణీలకు ఆశ్రయం కల్పించి ప్రసవాలు చేయించింది ధీర వనిత తెరెసా.

మదర్ తెరెసా తన వార్ధక్యాన్ని, ఆరోగ్య స్థితిని దృష్టిలో నుంచుకుని మఠకన్యల సభ శ్రేష్ఠురాలి పదవికి మార్చి 13, 1997న రాజీనామా సమర్పించింది. అప్పటికల్లా 4000 మంది మిషనరీస్ ఆఫ్ చారిటీ మఠకన్యలు, 300 మంది బ్రదర్లు, 123 దేశాలలో, 610 సంస్థలలో నిర్విరామంగా పేదలకై శ్రమిస్తున్నారు. 1983లో తెరెసాకు మొదటిసారి గుండెపోటు వచ్చింది. ఆరేండ్ల తరువాత రెండవసారి రాగా, సక్రమంగా గుండె కొట్టుకోవటానికి ఒక నియంత్రణా యంత్రాన్ని అమర్చారు. నిరుపేదల సేవలో ఆమె శరీరం అలసిపోయింది. వృద్ధాప్యంతో పలు రుగ్మతలు ఆమెను చుట్టు ముట్టాయి. చివరకు 87 ఏండ్ల వయస్సులో మదర్ తెరెసా తన ఇహలోక యాత్రను సెప్టెంబరు 5, 1997న చాలించి, ప్రభు సన్నిధికి చేరింది. సకల ప్రభుత్వ లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. కార్డినల్ ఆంజెలో సొడానొ గారి దివ్యపూజాబలి ప్రార్థనతో, పలు దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు, చక్రవర్తుల సమక్షంలో, అశేష భారత జనావళి కన్నీళ్లతో సెప్టెంబరు 13, 1997న ఆమె భౌతిక కాయాన్ని, కలకత్తా నగరమందు భూస్థాపితం చేశారు.

మదర్ తెరెసా భౌతికంగా మరణించినా, ఆమె ఆత్మ భారతదేశంలో, సర్వ సృష్టిలో సజీవంగా, పదిలముగా ఉంది. ఆమె ప్రార్థనల ద్వారా, వేడుదల ద్వారా ఎందరో స్వస్థులగుచున్నారు. ప్రార్థించే పెదవులతో పాటు సాయం చేసే చేతుల అవసరతను విశ్వవ్యాప్తంగా తెలియజెప్పి, భారతదేశ సంస్కృతిలో భాగమైన మదర్ తెరెసాను రెండవ జాన్ పాల్ పాపుగారు రోమాపురిలో అక్టోబరు 19, 2003న ''ధన్యులు''గా, ఫ్రాన్సిస్ జగద్గురువులు సెప్టెంబరు 4, 2016న ''పునీతులు''గా ప్రకటించారు. మదర్ తెరెసా పండుగను సెప్టెంబరు 5న విశ్వ శ్రీసభ జరుపుతుంది.






ప్రథమ భారతీయ మహిళా పునీతులు

# 28. పునీత అల్ఫోన్సా

**(1910-1946)**

ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.

అల్ఫోన్సా కేరళ లోని చంగనాచెరి మేత్రాసనంలోని కుడమాలూరు గ్రామంలో జోసఫ్ ముట్టతుపడతు, మరియు పుదుకరి అను పుణ్య దంపతులకు నాలుగవ సంతానంగా 19 ఆగస్టు 1910లో జన్మించింది. పుట్టిన ఎనిమిదవ దినమున అనగా ఆగస్టు 27న సిరో-మలబారు కతోలిక సంప్రదాయంలో జోసఫ్ చకలాయిల్ గురువుల పవిత్ర హస్తాల మీదుగా "అన్నకుట్టి" అను పేరిట జ్ఞానస్నానం పొందింది. అల్ఫోన్సా తల్లిగర్భంలో ఉన్నపుడు ఒక భయానక సంఘటన జరిగింది. ఓ రాత్రి ఆమె తల్లి నడుముకు ఒక సర్పము చుట్టుకుంది. నిద్ర నుండి లేచి, ఆమె దానిని గమనించి, వెంటనే దానిని విదిలించింది. ఆ సర్పం తన శరీరానికి చుట్టుకున్నందున, ఆమె శరీరం భయంతో భీతిల్లింది. ఆమె చాలా వణికిపోయింది. ఆ భయంతోనే ఆమె రోజులు గడువక ముందే, ఎనిమిదవ నెలలోనే అల్ఫోన్సాకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం మరియు మూడు నెలలకే మరణించడంతో, అల్ఫోన్సా తల్లిలేని బిడ్డ అయ్యింది.

అల్ఫోన్సా పెంపకం ఆమె తల్లి సోదరియైన అన్నమ్మ చేపట్టింది. ఆమె బాల్యమంతా ఎలుపరంబిల్‌లోని తాతయ్య గృహంలో గడచింది. అక్కడ అల్ఫోన్సా చాలా సంతోషంగా, కతోలిక బిడ్డగా జీవించింది. ఆమె అమ్మమ్మ చాలా భక్తి పరురాలు. బీదా బిక్కిపైన ఆమె కడు దయను చూపించేది. అయిదు సంవత్సరాల వయస్సులోనే సిరో-మలబారు కుటుంబ సంస్కృతిలో భాగమైన కుటుంబ ప్రార్థనలో అల్ఫోన్సా భక్తి శ్రద్ధలతో పాల్గొనేది. ఆ లేత వయస్సులోనే ఆమె కుటుంబ ప్రార్థన నిర్వహించటం నేర్చుకుంది.

అన్నకుట్టి తొన్నన్‌కుళి ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి వరకు చదువుకుంది. ఆ సమయంలో హిందూ ధర్మానికి చెందిన లక్ష్మికుట్టి మొదలగు బాలికలు ఆమెకు స్నేహితులయ్యారు. ఆమె అమ్మమ్మ ఆమెకు మరియమాతపై భక్తిని, పునీతుల పట్ల అనురక్తిని కలిగించింది. ఆమె పునీతుల గాథలను, ముఖ్యంగా అవిలాపురి తేరేసమ్మ, చిన్న తేరేసమ్మగారల జీవితములను అన్నకుట్టికి వివరంగా చెప్పడంతో, ఆమెలో దైవభక్తి పెరిగింది. అన్నకుట్టి నవంబరు 27, 1917న నూతన దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించింది. అన్నకుట్టి తన తండ్రిని చూచి అనేక త్యాగపూరిత ప్రాయశ్చిత్త క్రియలు నేర్చుకుంది. అమ్మమ్మ ఆదర్శం, తండ్రి భక్తి ప్రపత్తులను చూచిన ఆమెలో, చిన్నతనం నుండే

పునీతురాలు కావాలన్న సంకల్పం మొదలయ్యింది. అన్నకుట్టి నాలుగవ తరగతి నుండి ఆరవ తరగతి వరకు పెద్దమ్మ అగు అన్నమ్మ సంరక్షణలో ముట్టుచిర లో అభ్యసించింది. అన్నమ్మ చాలా నిబద్ధత గల వ్యక్తి అయినందున అన్నకుట్టిని తల్లిలేని బిడ్డ యని గారాబం చేయక, చక్కని క్రమశిక్షణలో వినయ విధేయతలతో పెంచి పెద్ద చేసింది. ఆ సమయంలో అన్నకుట్టి ఇంటి పనులన్నీ చేయటం అలవోకగా నేర్చుకుంది. అన్నకుట్టి సమీపంలోని కార్మెల్ ఆశ్రమ మతకన్యల భక్తిభావం చూచి, ఆ మత జీవనం పట్ల ఆకర్షితురాలైంది. అక్కడే సిలువ చెంత మోకరిల్లి అన్నకుట్టి సుదీర్ఘ ప్రార్థనలు చేసేది. కాని అన్నమ్మ మాత్రం, మతకన్య కావాలనే ఆమె తలంపును లెక్కచేయక, ఆమెకు త్వరగా పెళ్లిచేసి, సాగనంపాలని కంకణం కట్టుకుంది.

అన్నకుట్టి మతకన్య కావాలనే ఆశయాన్ని తన కుటుంబీకులకు చెప్పి చూసింది. అయినా అది వారి చెవి కెక్కలేదు. అన్నమ్మ, వారి బంధువులు ఆమె ఆశయాన్ని కాలరాసి, ధనవంతుడు మరియు అందమైన ఓ యువకునకు ఇచ్చి వివాహం చేయాలని ప్రయత్నాలు ఆరంభించారు. అన్నమ్మ చక్కని పరపతి గలిగిన యువకునితో అన్నకుట్టికి వివాహం నిశ్చయించింది. అది అన్నకుట్టికి సుతరాము ఇష్టంలేదు. అన్నకుట్టి తన పెద్దనాన్నను ఈ విపత్తు నుండి తప్పించమని కాళ్ళ వేళ్ళాపడింది. బ్రతిమాలింది. కాని తన ప్రయత్నాలన్నీ చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లే అయింది. తన పెద్దమ్మ మాత్రం తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళన్నట్లుగా తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. పైపెచ్చు అన్నకుట్టి నిశ్చితార్థానికి తారీఖు కూడా నిశ్చయించింది. దానితో అన్నకుట్టి ఖిన్నురాలైంది. శోక సముద్రంలో మునిగిపోయింది. తన మనస్సేమో సిలువపై కొట్టబడిన యేసు భగవానునికి ఏనాడో సమర్పించుకుంది. ఆ ప్రభువునే తన నవ వరుని గా స్వీకరించింది. మరి ఇక్కడేమో పెళ్ళి ప్రయత్నాలు. అన్నకుట్టికి ఏమి చేయాలో పాలుపోలేదు. ఆ క్లిష్ట సమయంలో ఆమెకు ఒక వింత ఆలోచన వచ్చింది. వచ్చిందే తడవుగా, దానికి ముందు వెనుక ఏమి ఆలోచించకుండా అమలు చేయ నిశ్చయించుకుంది. తమ ఇంటి ముందు ధాన్యపు పొట్టు, తాలు గింజలు కాల్చటానికి ఒక నిప్పుల కొలిమి ఉంది. అందులో కాళ్ళు పెట్టి తన పాదాలు కొంత కాల్చుకుంటే, తన బలవంతపు పెళ్ళి ఆగిపోతుందని భావించింది. అన్నకుట్టి నిప్పుల కొలిమిలో పాదాలు పెట్టింది. కొద్దిగా కాల్చుకుంటే చాలు అని అనుకుంది. కాని తన తలంపులకు భిన్నంగా, ఆమె కాలు జారి ఆ నిప్పుల కొలిమిలో పూర్తిగా పడిపోయింది. శరీరమంతా ముఖ్యంగా పాదాలు కాలిపోయి, మాంసం ముద్దగా తయారయ్యాయి. కాలివ్రేళ్లు పూర్తిగా ఒకదానికొకటి అతుక్కుని పోయాయి. వైద్యుడు ఎంతో శ్రమించి, వాటిని విడదీసి, కట్లు కట్టాడు. ఆ దెబ్బనుండి కోలుకోవటానికి అన్నకుట్టికి దాదాపు సంవత్సరం పట్టింది. ప్రభుని నవ వధువుగా అన్నకుట్టి చేసిన త్యాగాన్ని గమనించిన కరుణామయుడు, ఆమెకు

అద్భుత విధంగా స్వస్థత నిచ్చాడు.

అన్నకుట్టి తన పాదాలు కాల్చుకోవటం, స్వస్థతకు ఒక సంవత్సరం పట్టడంతో అన్నమ్మ తన సాకుడు కూతురికి పెండ్లి చేయాలనే తలంపు విరమించుకుంది. అన్నకుట్టి మఠకన్యక కావటానికి తన సమ్మతిని తెలిపింది. అన్నకుట్టి ఆధ్యాత్మిక గురువు జేమ్సు మురికన్ సలహా మేరకు పునీత ఫ్రాన్సిస్ వారి ఆధ్యాత్మికతను, పేదరికాన్ని పాటిస్తున్న 'ఫ్రాన్సిస్కన్ క్లారిస్ట్' మఠసభలో చేర నిశ్చయించుకొంది. అన్నకుట్టి, తన తండ్రి వెంటరాగా, పవిత్రాత్మ పండుగ పర్వదినమైన 24 మే 1927న భరణం జ్ఞానంలోని మఠకన్యల శిక్షణాలయంలో అడుగుపెట్టింది. అక్కడ పాఠశాలలో మళయాళ మాధ్యమంలోని ఏడవ తరగతిలో చేరింది. పునీత అల్ఫోన్స్ లిగోరిని ఆదర్శంగా చేసుకొని, "అల్ఫోన్సా ఆఫ్ ఇమ్మాక్యులేట్ కన్సెప్షన్" అను నామధేయాన్ని స్వీకరించి, అగస్టు 2, 1928న తన శిక్షణను ఆరంభించింది. అల్ఫోన్సా 1929లో ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు వ్రాసి, మంచి మార్కులతో ఉత్తీర్ణురాలైంది.

అల్ఫోన్సా 19, మే 1930 న జేమ్సు కలచెరి పీఠాధిపతుల సమక్షంలో మఠకన్యల అంగీలను స్వీకరించింది. ఆనాడే సిస్టర్ అల్ఫోన్సా ఒక స్థిర నిర్ణయం చేసుకుంది. అదేమనగా "నేను పునీతురాలని కావాలని ఎన్నో అడ్డంకులను, ఒడుదుడుకులను అధిగమించి మఠకన్యల సభలో చేరాను. నేను పునీతురాలని కాకపోతే నా జీవితమే వ్యర్థం" అని పుణ్యాత్మురాలుగా జీవించాలని, త్రికరణశుద్ధిగా కోరుకుంది. అల్ఫోన్సా 1930 నుండి 1935 వరకు వివిధ రకాల రుగ్మతలతో, అస్వస్థతలతో బాధపడింది. అల్ఫోన్సా తనను తాను ప్రభుప్రేమకు బాధితురాలుగా సమర్పించుకుంది. ఆమె జీవితం పూలపాన్పు గాక, శారీరక, మానసిక వేదనలతో కూడుకున్న జీవితమైంది. ఆ కాలంలో ఆమెకు విపరీత రక్తస్రావం జరిగింది. దానితో ఆమె ఏ పని కూడా చేయలేక పోయింది. ఆమె 1932లో మాత్రం ఆరోగ్యం సహకరించటంతో వాకక్కాడులోని పాఠశాలలో ఒక సంవత్సరం బోధించింది. ఆమె శారీరకంగా బలహీనురాలైనందున ఉపాధ్యాయులకు, ఉపదేశికి సహాయం చేయటంలో నిమగ్నమైంది. ఆమె దస్తూరి చక్కగా ఉండటం మూలాన, సభాధినేతకు వ్యక్తిగత కార్యదర్శిగా పలు అధికారిక లేఖలు వ్రాయడంలో ఆమె సహకారమిచ్చింది.

క్లారిస్టుల మఠసభలో అధికార పూర్వక నొవిషియేట్‌ను మొట్ట మొదట 1934లో ప్రారంభించారు. ఆమె ఆరోగ్యం సరిగా లేనందున, ఆమె ఆ సంవత్సరం అందులో చేరలేకపోయింది. ఆల్ఫోన్సా చివరకు అగస్టు 12, 1935న నొవిషియేట్‌లో ఆధ్యాత్మిక శిక్షణ నిమిత్తం చేరింది. అక్కడ ఆమె ఒక్క వారం రోజులకే అస్వస్థురాలైంది. ఆమె తీవ్ర రక్తస్రావంతో బాటు, కాలిపైన పెద్ద కురుపు ఏర్పడి, పెద్దగా కదలలేకపోయింది. సభ పెద్దలు ఆమెను భరణంజ్ఞానం పంపివేయాలని ఆలోచింపసాగారు. ఆ విషయమై వారు

తమ పీఠాధిపతి సలహా కోరారు. పీఠాధిపతులు ఆమెను స్వయంగా సందర్శించి, అల్ఫోన్సాను నొవిషియేట్ లోనే కొనసాగించ నిర్ణయించారు. అల్ఫోన్సాను నోవిషియేట్ నుండి వెనుకకు వేరే చోటుకు తరలించే బదులు, అక్కడే ఉంచి, అదే ప్రభు చిత్తమైతే, మరణించడమే మేలని పీఠాధిపతులు భావించారు.

అల్ఫోన్సా పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. ఆమె పలుమాసాల పాటు శారీరక అస్వస్థతతో విపరీతంగా బాధ పడింది. అల్ఫోన్సా అనారోగ్యం నుండి కోలుకోవాలని, వారికి శిక్షణనిచ్చే గురువైన లూయిస్ గారి సలహా మేరకు, ధన్యుడైన కురియాకోస్ ఎలియాస్ చావరా గారికి అక్కడి నవ సన్యాసులంతా నవదిన జపములు చెప్పటం ప్రారంభించారు. ఆ నవదిన జపములలోని చివరి దినమున కురియాకోస్ ఎలియాస్ చావరా గారు స్వయంగా అల్ఫోన్సాకు ప్రత్యక్షమై, ఆమెను తాకి, ఆశీర్వదించి ఈ విధంగా పలికారు: "నీవు సంపూర్తిగా ఈ రోగము నుండి స్వస్థరాలవయ్యావు. నీకు మరలా ఈ జబ్బు అస్సలు రాదు. కాని నీవు ఎల్లప్పుడు ఇతర బాధలు భరించాల్సి ఉంటుంది". ఆ విధంగా ఆనాడు ఆమె అద్భుత రీతిలో సంపూర్ణ స్వస్థత పొందింది.

అల్ఫోన్సా పునీత క్లేర్ గారి పండుగ రోజైన ఆగస్టు 12, 1936న తన మఠ సభలో శాశ్వత మాటపట్టు నిచ్చింది. పన్నెండేళ్ళ పసి హృదయంలో ప్రభువును తన నిత్య వరునిగా స్వీకరించిన అల్ఫోన్సా మది ఆనాడు ఎంతో పులకించింది. ఆమె అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందింది. అల్ఫోన్సా తన మాటపట్టు తరువాత భరణంజ్ఞానంనకు వచ్చి, ఇతర మఠకన్యలతో నివసించటం మొదలు పెట్టింది. అటు పిమ్మట కొన్ని వారములలోనే ఆమె తీవ్ర జ్వరంతో ఆరు నెలలపాటు బాధపడింది. అది క్షయవ్యాధి యని అనుమానపడ్డారు. అల్ఫోన్సా ఈ వ్యాధిని ప్రభువు ప్రసాదితముగా భావించి, ప్రభు శ్లీవలోని బాధలలో ఒకటిగా చేర్చి, దానిని సంతోషంతో భరించింది. తన ప్రియమైన వరుడగు క్రీస్తుని నిమిత్తం ఈ కష్టాలను, బాధలను భరించానని అల్ఫోన్సా తన దినచర్య పుస్తకంలో వ్రాసుకుంది. అల్ఫోన్సాకు స్వస్థత నిమ్మని పునీత చిన్న తేరేసమ్మగారికి, కురియాకోస్ చావరా గారికి తన మఠంలోని మఠకన్యలంతా నవదిన జపములు సమర్పించారు. వారి ప్రార్థనా సహకారముతో ఆమె శారీరక రోగములు అద్భుతంగా మటు మాయమయ్యాయి. అల్ఫోన్సా మఠ పెద్దలు ఆ స్వస్థత గురించి ఆమెను గుచ్చి గుచ్చి అడుగగా, కార్మెల్ మఠానికి చెందిన ఒక మఠకన్య తన చెంతకు వచ్చి, తనను తాకి, తనకు స్వస్థతనిచ్చిందని వెల్లడించింది. అల్ఫోన్సాను పలు చిన్న చిన్న రోగాలు చుట్టుముట్టేవి. ప్రభుని శ్రమలలో తాను కూడా ఐక్యం కావాలని బహూశా ఆమె ప్రార్థనలు చేసేది కావచ్చు. ఆమె పగలు మామూలు పనులు చేసినా, రాత్రులు నిద్రించక సుదీర్ఘముగా ప్రార్థించేది. ప్రభుని శ్రమలలో భాగం పంచుకునేది.

గోరుచుట్టూ రోకలిపోటు అన్నట్లు కష్టాలు, కడగండ్లు, రోగాలు అల్ఫోన్సాను

అంటిపెట్టుకొని, ఒక దాని వెంట ఒకటి వచ్చేవి. ఆమెకు మరలా తీవ్ర జ్వరం వచ్చింది. అది ముదిరిన లేక తిరుగబెట్టిన చలి జ్వరంగా వైద్యుడు నిర్ధారించాడు. తన సోదర మతకన్యల ఆలనపాలన, ప్రార్థనలతో అల్ఫోన్సా ఆరోగ్యం కుదుట పడింది. ఆమె రోగముల నుండి కోలుకునే సమయంలో అనగా అక్టోబరు 18, 1940న ఒక దొంగ ఆమె గదిలో ప్రవేశించాడు. అది చూచి ఆమె చాలా కలవరపాటుకు గురైంది. మనసు చెదిరింది. ధైర్యం సన్నగిల్లింది. చిన్న పిల్లల్లా ప్రవర్తించటం మొదలు పెట్టింది. అల్ఫోన్సా తన జ్ఞాపక శక్తి  ఆసాంతం కోల్పోయింది. కనీసం చదవటం గానీ, వ్రాయటం గానీ చేయలేక పోయింది. కాని తన ప్రభుని పట్ల ప్రేమను మాత్రం ఆమె మరచిపోలేదు. ప్రార్థించటం మానలేదు. ఆ షాక్ నుండి కోలుకోవటానికి ఆమెకు దాదాపు ఒక సంవత్సరం పట్టింది. అట్టి బాధాకర నరాల బలహీనత నుండి పుంజుకోగానే, వేరొక రోగం ముంచుకొచ్చింది. ఆమె పొత్తి కడుపులో ఒక గడ్డ లేచింది. దానివల్ల ఆమెకు భరించలేని నొప్పి కలిగింది. ఏమీ కూడా ఆమె తినలేక పోయింది. దానితో ఆమె ఆరోగ్యం ఇంకా క్షీణించింది. మరణం తథ్యమని భావించిన మత పెద్దలు, వ్యాధిగ్రస్తుల అభ్యంగనం ఆమెకు ఇప్పించారు. కాని అల్ఫోన్సా ఆ గండాన్ని గట్టెక్కింది. పునీత చిన్న తెరెసమ్మ గారి వర్ధంతి అయిన సెప్టెంబరు 30న అల్ఫోన్సాకు స్వస్థత చేకూరింది.

అల్ఫోన్సా తన జీవితమంతా ఎన్నో శ్రమలపాలయ్యింది. అయినా వాటి గురించి పల్లెత్తి మాట్లాడలేదు. ఆమె చూపరులకు ఒక అందమైన రోజా పుష్పంలా కనిపించేది. కాని ఆ అందం చాటున ఎన్నో ముండ్లు, ఎన్నో బాధలు దాగి ఉన్నాయి. ఆమె తన కష్టాలను మనసులోనే దాచుకొని, ప్రభుని కోసం ఎల్లప్పుడూ చిరునవ్వుతో తిరిగేది. అల్ఫోన్సా కష్టాలకు ఎన్నడూ భయపడలేదు. తనకు ఇంకా కష్టాలను అనుగ్రహించమని ప్రార్థించేది. ప్రభువు కూడా ఆమె ప్రార్థనలను మన్నించి,ఆమె మోయగలిగినన్ని కష్టాలు, బాధలనిచ్చారు.

అల్ఫోన్సాకు 1945 జూలైలో విపరీతమైన కండరాల నొప్పి వచ్చింది. దానితో ఆమె శరీరం పూర్తిగా బిగుసుకుని పోయింది. ఆమెకు ఆగకుండా వాంతులయ్యాయి. ఆమె సుమారు ఆరేడు గంటలు దానితో బాధపడింది. తరువాత ఆమెను పూర్తిగా నిస్సత్తువ ఆవరించి, ఆమె బలహీన పడసాగింది. ఒకసారి ఆమెకు పూర్తిగా చెమటలు పోసి, మరణపు అంచుల వరకు వెళ్ళింది. ఇటువంటి బాధాపూరిత కండరాల నొప్పి ఆమె మరణించే దాకా పలుమార్లు కలిగింది. అల్ఫోన్సా ప్రభుక్రీస్తుపై ప్రేమతో ఎంత బాధనైనా నిండు మనస్సుతో భరించేది. "బాధలతో కూడిన సంపూర్ణ అర్పణను సమర్పించాలని ప్రభువు తనను ఆదేశించాడు. కనుక నేను బాధలు లేకుండా ఉన్న రోజు పూర్తిగా వ్యర్థమని నేను భావిస్తాను" అని అల్ఫోన్సా పలికేది. తన సహచర సిస్టర్ తెరెసియమ్మకు  మరియు పీఠాధిపతులకు మలేరియా జ్వరం సోకింది. వారి సేవా  కార్యక్రమాలకు భంగం

కలుగకుండా, ఆ మలేరియా జబ్బు వారిని విడచి, తనకు రావాలని అల్ఫోన్సా ప్రార్థించింది. ఆమె ప్రార్థించినట్లే వారిద్దరి మలేరియా జ్వరం పూర్తిగా తగ్గిపోయి, అల్ఫోన్సాకు రావటం సంభవించింది.

అల్ఫోన్సా బాధలు దాదాపు ఒక సంవత్సర కాలం కొనసాగాయి. తన నాధుడైన యేసుని కలుసుకోవటానికి సమయం ఆసన్నమైనదని అల్ఫోన్సా గ్రహించింది. ఫాదర్ రోములస్ మరియు మదర్ ఉర్సులా గారలను తన మరణం కోసం ప్రార్థించటానికి అల్ఫోన్సా అనుమతి కోరింది. అల్ఫోన్సా జూలై 16, 1946న తన మఠశ్రేష్ఠురాలు మదర్ బెర్నదత్తు గారికి "గరుడపక్షి కోడి పిల్లలను తన్నుకుపోయినట్లే, ప్రభువు కూడా తనను హఠాత్తుగా తీసుకొని వెళ్తారు" అని లేఖ వ్రాసింది. ప్రభువును ముఖాముఖి కలుసుకుంటున్నాననే సంతోషంతో ఆమె పెదాలపై చిరు దరహాసపు మొగ్గ తొడిగింది. భరణంజ్ఞానం లోని ఫ్రాన్సిస్కన్ క్లేరిస్ట్ కాన్వెంటు నందు జూలై 28, 1946 న అల్ఫోన్సా తన నిత్య వరుడైన యేసు భగవానుని పరలోకంలో కలుసుకోవటానికి తన ఇహలోక యాత్రను చాలించింది. మరుసటి రోజు ఆమె భౌతిక కాయాన్ని సమాధి చేశారు. అల్ఫోన్సా 36 సంవత్సరాలే జీవించింది. అయినా ఆమె జీవన పరిమళం నేడు భారతావని యంతటా వ్యాపించింది. ఆమె మధ్యవర్తిత్వ ప్రార్థనల వలన పలు అద్భుతాలు జరిగాయి. ఇంకనూ జరుగుతున్నాయి.

సిస్టర్ అల్ఫోన్సాను రెండవ జాన్ పాల్ పాపుగారు ఫిబ్రవరి 8, 1986న కురియాకోస్ ఎలియాస్ చావరా గారితోబాటు కేరళ రాష్ట్రంలోని కొట్టాయంలో "ధన్యులు"గా ప్రకటించారు. ఆమెను పదహారవ బెనెడిక్టు జగద్గురువులు అక్టోబరు 12, 2008న రోమాపురిలో "పునీతుల" శ్రేణిలో నిలిపారు. పునీత అల్ఫోన్సా గారి పునీత పట్ట ప్రకటనను స్మరిస్తూ, ఆమె గౌరవార్థం నవంబరు 9, 2008న భరణంజ్ఞానంలో జరిగిన వేడుకలలో అప్పటి భారత రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ గారు పాల్గొనటం చాలా సంతోషించదగిన ఘట్టం. కతోలిక శ్రీసభలో భారతదేశంలో పుట్టి, పెరిగిన మొట్టమొదటి మహిళా పునీతురాలైన అల్ఫోన్సా పుణ్యజీవితానికి నివాళులు సమర్పిస్తూ, భారతదేశ ప్రభుత్వం అల్ఫోన్సా ముఖ చిత్రంతో అయిదు రూపాయల తపాలా బిళ్ళను నవంబరు 16, 2008న విడుదల చేసింది. అల్ఫోన్సా గారి శత జయంతి వత్సర ఆరంభ సందర్భంగా భారత ప్రభుత్వం ఆగస్టు 23, 2009న నూరు రూపాయల నాణెంను, అయిదు రూపాయల నాణెంను అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా విడుదల చేసి, భారతదేశ ముద్దుబిడ్డయైన అల్ఫోన్సాను గౌరవించింది. పునీత అల్ఫోన్సా గారి పండుగ జూలై 28న విశ్వవ్యాప్తంగా, ఘనంగా జరుగుతుంది.



దీన సేవన సభ స్థాపకులు

# 29. దైవ సేవకులు పేత్రా మ్యోనిగ్మాన్

**(1924-1976)**

ఫాదర్ వట్టి జోజి రెడ్డి, S.J.

'దయార్థ్ర దేవత'గా పేరెన్ని గాంచిన 'దైవ సేవకులు' సిస్టర్ పేత్రా మ్యోనిగ్మాన్ 20వ శతాబ్దిలో జన్మించి, జీవితాన్ని సార్థకం చేసుకున్న దేవుని ప్రియమైన పుత్రిక. ఆమె జర్మనీ దేశంలో జన్మించి, భారతావనిలో వికసించి, కేరళ రాష్ట్రంలోని ప్రజలకు తన పవిత్ర సుగంధ పరిమళాలను పంచిపెట్టింది. జూన్ 1, 1969న కేరళలో దేశీయ మహిళలతో 'దీన సేవన సభ' ను (D.S.S.) స్థాపించి, సభ వ్యవస్థాపికగా చరిత్రలో నిలిచింది.

పేత్రా మ్యోనిగ్మాన్ కుటుంబం, పశ్చిమ జర్మనీ దేశం మున్‌స్టర్ నగర సమీపంలోని 'ఓల్డే' అనే చిన్న పట్టణంలో నివసించింది. దైవభీతి కలిగిన బెర్నార్డ్, పౌలా దంపతులకు మూడవ సంతానంగా జూన్ 14, 1924న పౌలా జన్మించింది. ఆ పుణ్య దంపతులకు మొత్తం ఆరుగురు సంతానం. మొదటి బిడ్డకు తండ్రి పేరుకు కొనసాగింపుగా బెర్నార్డ్ అని, రెండవ బిడ్డకు జోసెఫా అని, ఆ పిదప కుమార్తెకు తల్లి పేరుకు కొనసాగింపుగా పౌలా అని, ఆ పిదప ఎర్నెస్ట్, రుడాల్ఫ్, అగత అని మిగిలిన ముగ్గురు బిడ్డలకు నామకరణం చేశారు. దురదృష్టవశాత్తు, ఆమె మూడు నెలల ప్రాయంలోనే ఎర్నెస్ట్ మరణించాడు.

పేత్రాకు జూన్ 18, 1924న 'ఓల్డే'లోని పునీత బప్తిస్మ యోహాను దేవాలయంలో జ్ఞానస్నానం ఇచ్చారు. బెర్నార్డ్, పౌలా దంపతులు తమ సంతానాన్ని విశ్వాసంలో పెంచాలని, మంచి క్రైస్తవులుగా మలచాలని పరితపించారు, దానికి అనుగుణంగా శ్రమించారు. అందుకే పౌలా, ఓవైపు తల్లిగా తన గురుతర కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే, మరోవైపు తన చిన్నారి పౌలాకి సత్యోపదేశ సంక్షేమ బోధకురాలుగా, విశ్వాస వికాస ఉపాధ్యాయినిగా, జీవన ప్రమాణాలు పెంపొందించే దిక్సూచిగా నిలచింది. క్రీస్తు విలువలను పాటిస్తూ, శ్రీసభకు అత్యంత విశ్వాస పాత్రురాలుగా జీవించే విద్యావంతురాలిగా పౌలాను తయారుచేసింది. దైవంపై గల గట్టి విశ్వాసం, పరలోకతండ్రి కటాక్షము, పౌలా జీవితానికి స్ఫూర్తినిచ్చాయి.

పౌలా రెండు సంవత్సరాల ప్రాయంలోనే విద్యాభ్యాసం ఆరంభించింది.

పసిప్రాయము నుండే ఎంతో ఉషారుగా, ఉత్సాహంగా ఉండి, అందరికి ఆనందాన్ని, సంతోషాన్ని పంచింది. అందుకే తన ఉపాధ్యాయులకు, సహచరులకు ఆ బాలిక అంటే అత్యంత ప్రీతి. ఓ వైపు సరదాలను ఆస్వాదిస్తూనే, అవసర సమయాలలో చాలా ఖచ్చితంగా, ఖరాఖండిగా కూడా ఉండేది. పౌలా బాధలలో, కష్టాలలో ఉన్నవారికి ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, ఇష్టంతో వారికి చేతనైనంత సహాయం చేసేది.

వ్యక్తిగతంగా పౌలా ఎంతో సాహసోపేతమైన ధీశాలి. తన విద్యాభ్యాస సమయము నుండే ఎన్నో ఉన్నతమైన విలువలను పాటిస్తూ, ఎంతో అసాధారణమైన స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేసుకున్నది. కొంగ్రొత్త ఆలోచనలకు సిద్ధపడుతూనే, పొరపాట్లను సరిదిద్దుకునేందుకు ఎల్లప్పుడూ సుముఖత చూపేది. తన వ్యక్తిత్వం ద్వారా, తన స్వభావం ద్వారా, తన ప్రవర్తనా సరళిద్వారా ఆమె ఎవరినైనా వెంటనే ఆకట్టుకునేది. ఒక్కమాటలో చెప్పాలంటే, శాంతి సమాధానం, ఆనందం అనే సుగుణాల మేళవింపుతో ఆమె అసాధారణ ప్రతిభ కలిగి ఉన్నప్పటికి, అతి సాధారణంగా జీవించింది.

జర్మనీ దేశంలోని అప్పటి ప్రత్యేక రాజకీయ పరిస్థితుల కారణంగా, ఎంతో ముఖ్యమైన యవ్వన దశలో పౌలా తన ఎదుగుదలలో తీవ్రమైన సంక్షోభానికి, ఒత్తిడికి లోనయ్యింది. అదే తరుణంలో ప్రారంభమైన రెండవ ప్రపంచ యుద్ధంతో జర్మనీ దేశ ప్రజలందరు ఉహించని కష్టాలు, ఇబ్బందుల పాలయ్యారు. మతపరమైన వ్యవహారాల పైన నాజీ పాలనా యంత్రాంగం విధించిన ఆంక్షల వలన కలిగిన బాధలను కూడా పౌలా అనుభవించింది. అయినా అది తన వ్యక్తిగత భక్తికృత్యాల ఆచరణలో పౌలాను నిరోధించలేక పోయింది. న్యాయం, సోదరభావం, సంఘీభావం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, పెద్దపీట వేసింది. అసత్యాన్ని వ్యతిరేకించింది. పేదల, పీడిత ప్రజల అభ్యున్నతికై తన స్థానిక గురుపీఠ కార్యక్రమాలలో పౌలా పూర్తిగా నిమగ్నమయింది.

అది 1946వ సంవత్సరం. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసి అప్పుడప్పుడే మరల శాంతి కుసుమాలు విరిశాయి. పౌలా తన 22 ఏళ్ళ యుక్తవయసులో ఆధ్యాత్మిక ధ్యానం చేసేందుకు 'వెర్ల్' పట్టణానికి వెళ్ళింది. ఆధ్యాత్మిక ధ్యాన సమయంలో దైవం పౌలా ఆంతరంగిక నేత్రాలను తెరచి, ఆమె భవిష్యత్తుకై ఏర్పరచిన బృహత్తర ప్రణాళికను ఆవిష్కరించారు. పౌలా చాలా సమయం ప్రార్థించి, దానిపై దీర్ఘంగా ఆలోచించిన పిదప, దైవం తనకు సూచించినట్లుగా 'ఉర్సులైన్' మఠవాస సభలో చేరాలని నిర్ణయించుకుంది. తదనుగుణంగా అక్టోబర్ 15, 1946న 'వెర్ల్'లోనే ఉన్న ఉర్సులైన్ కాన్వెంటులో చేరింది.

ఆ పిదప ప్రాథమిక శిక్షణలో భాగంగా జూన్ 8, 1952న మఠవాస పవిత్ర వస్త్రాలను స్వీకరించడం, ఆగష్టు 28, 1954న 'ఉర్సులైన్' సభలో తన మొదటి మాటపట్టు ద్వారా సభ్యులవ్వటం, సెప్టెంబరు 29, 1957న 'మరియ పేత్రా ది హోలీ క్రాస్' గా తన పేరు మార్చుకొని నిత్యమాటపట్టు తీసుకోవడం వడివడిగా జరిగిపోయాయి. విలువలతో కూడిన

జీవితాన్ని ఆలవరచుకున్న పేత్రా తన విశ్వాసంలో, తన కర్తవ్య నిర్వహణలో ఆ విలువలను సంపూర్ణంగా నిత్యం ప్రతిబింబింపజేసేది. ఆమె మంచి బోధకురాలుగా, చక్కని కార్య నిర్వాహకురాలుగా నిరూపించుకుంటూ, 'నెహెయిం'లోని ఉన్నత పాఠశాలలో 1966 వరకు ఉపాధ్యాయురాలుగా విద్యాబోధ చేసింది.

పేత్రాలో మిషనరీ స్ఫూర్తి తన స్వీయ జీవితానుభవాల నుండే ఉదయించిందని చెప్పుకుంది. ''కుష్ఠరోగంతో వికృత రూపుదాల్చి, రెండు చేతులు కోల్పోయిన ఓ చిన్నారి చిత్రపటం నన్ను అమితంగా కలచివేసింది. అదే తరుణంలో పేద దేశాలలోని ప్రజలు, మరీ ముఖ్యంగా చిన్నారులు పౌష్ఠికాహార లోపంతో జీవితాలు ఎలా దుర్భరంగా తయారవుతున్నాయో, ప్రసార సాధనాలద్వారా గ్రహించి నేను ఎన్నో నిదురలేని రాత్రులు గడిపాను. పదేపదే అవే ఆలోచనలు నన్ను చుట్టుముట్టి దహించివేస్తుంటే, నేను ఒక దగ్గర కుదురుగా నిలువలేక ఎంతో కలత చెందాను. ఆ సమయంలో 'అత్యల్పులైన ఈ నా సోదరులలో ఏ ఒక్కరికి నీవు ఇది చేయనియెడల, అది నాకునూ చేయనట్లే' అనే పవిత్ర గ్రంథ వాక్యాలు నా చెవులలో మారుమ్రోగాయి'' అని డైరీలో వ్రాసుకుంది. ఈ అంశాలు సిస్టర్ పేత్రా మఠవాస జీవితంలో ముఖ్య మలుపునకు కారణమయ్యాయి.

భారతావనిలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పేత్రా ఎంతగానో ఆశించింది. అయితే అందుకు తన మతపెద్దల అంగీకారం దొరకలేదు. అలాంటి తరుణంలో నిరాశా నిస్పృహలకు లోనుగాక, భగవంతునిపై భారంవేయగా, తనకు అదృష్టం మరోరూపంలో ప్రత్యక్ష్యమయ్యింది. కేరళ రాష్ట్రంలోని కొట్టాయం మేత్రాసన బిషప్ నుండి 'తెల్లకాం' ప్రాంతంలో 'కారితాస్ లౌకిక సంస్థ'లో మూడు సంవత్సరాలు బోధకురాలుగా సేవ చేసేందుకు ఆహ్వానం అందుకుంది. ఆ ఆహ్వానం పేత్రా జీవనగమనాన్ని సమూలంగా మార్చేసింది. తను ఎంతోకాలంగా కలలు గంటున్న భారతావనిలో జూన్ 26, 1966న కాలుమోపింది. భారతదేశంలో అడుగిడిన నాటినుండే నిస్సహాయ కుష్ఠరోగులకు, పేదలకు, నిర్భాగ్యులకు, తిరస్కరణకు గురైన వారందరికి సేవ చేయాలనే తలంపులు, ఆలోచనలు పేత్రా మనసును తొలిచివేయడం ఆరంభించాయి. తన కలలను, ముఖ్యంగా దైవం తనకై రచించిన ప్రణాళికను కార్యరూపంలో పెట్టాలంటే, తన బోధనా వృత్తి ఎందుకూ పనికి రాదని తొలినాళ్ళలోనే పేత్రా గ్రహించింది.

ఒకసారి కేరళ రాష్ట్రం పర్వత ప్రాంతంలోని 'మూనార్' పరిసరాలకు సెలవుల నిమిత్తం వెళ్ళింది. అక్కడి పేదరికం, ప్రజల దుర్భర జీవనం ఆమె కళ్ళకు కట్టినట్లు కనిపించింది. ఆ దృశ్యాలు పేత్రాను అమితంగా కలచివేశాయి. ఆమె అంతరంగం మాత్రం ''ధనికుడవైన నీవు సమృద్ధిగా భోజనబల్ల వద్ద భుజిస్తుంటే, కడుపేద లాజరు నీ ద్వారము వద్ద దీనాతిదీనంగా కూర్చొని, నీవు నీ కుక్కలకై విసిరే రొట్టెముక్కలకై ఎదురు చూస్తున్నాడు'' అనే ప్రభువు వాక్యాలు ఆమెను నిలదీశాయి. ఆ సువార్త వచనాలు

పేత్రా జీవితాన్ని గొప్ప మలుపు తిప్పాయి. ఇక తన శేష జీవితం భారతదేశంలోని పేదప్రజల సేవలోనే గడపాలని పేత్రా దృఢంగా నిశ్చయించుకుంది.

పేత్రా 'కురిసుమల'లోని 'సిస్టర్సియన్' ధ్యానాశ్రమానికి వెళ్ళి జ్ఞానవడకం చేసింది. అక్కడ, ఆ పవిత్ర పర్వతంపైన దైవం తన దైవిక ప్రణాళికను మరోమారు పేత్రాకు తెలియపరచగా, తన మఠవాస పిలుపులోని మరో ఉన్నతమైన పిలుపును గ్రహించింది. తనకు కలిగిన దైవదర్శనపు వెలుగులో సహాయం కొరకు ఎదురుచూస్తున్న పేదలు, వారి నివాసాలు కళ్ళకు కట్టినట్లు కనిపించాయి. ఆ తరుణంలో ప్రత్యేకంగా కడుపేదలకు సేవ చేసేందుకు మహిళలచే కూడిన ఓ మఠవాస సభను ఏర్పరచాలని సంకల్పించు కుంది. ఆమె సంకల్పం కార్యరూపు దాల్చేందుకు కాలికట్ మేత్రాసన ఆధ్యాత్మిక కాపరి బిషప్ పత్రోని S.J. ఎంతగానో సహకరించి, మారుమూల పల్లెటూరు 'పట్టువం'లో క్రొత్తగా ఏర్పడిన 'చిరక్కల్ క్రైస్తవ సంఘం' చెంతకు ఆమెను నడిపించాడు.

పేత్రా అక్కడ నివసించే పేదప్రజల చెంతనే తన సేవా కార్యక్రమాలు ప్రారంభించాలని సంకల్పించుకుంది. సుదీర్ఘ కాలం ప్రార్థన చేసి, ఫిబ్రవరి 2, 1969 'ఉర్సులైన్' మఠవాస జీవనము నుండి విడుదల చేయమని పేత్రా విన్నవించుకుంది. రెండు మాసాలలోనే అనగా ఏప్రిల్ 1969లో రోమాపురిలోని జగద్గురువుల నుండి ఆ అనుమతి లభించింది. వెనువెంటనే పేత్రా ఎనిమిది మంది యువ మహిళా అభ్యర్థులతో జూన్ 1, 1969న 'దీన సేవన సభ' అను నూతన మఠ సంస్థను నెలకొల్పింది. 'దైవ ధ్యానం, పేదల పట్ల కనికరం' అనే రెండు ప్రధాన ఆశయాలు ఈ నూతన మఠసంస్థకు గట్టి పునాదులయ్యాయి. "పేదలకు సువార్తను బోధించు. పేదలలాగే జీవించు. పేదల మధ్యనే జీవించు. మీకున్న సకలాన్ని పేదలకే వెచ్చించు" అనునవి ఈ సభ మూల సూత్రాలుగా పేత్రా నిలిపింది.

పేత్రా యేసు ప్రభువులోని పేదరికాన్ని, నిరాడంబరతను, కఠోర శ్రమను, తండ్రి దేవుని పైననే సంపూర్ణంగా ఆధారపడే సుగుణాలకు సాక్షిగా నిలవాలని, వానిని తన నూతన సంస్థ జీవన విధానంగా ఎంచుకుంది. స్వతహాగా తాను నిత్యం పేదల పక్షపాతిగా, పేదలను ప్రేమించి, సేవలు అందించే సేవకురాలుగా ఉంటూ, తన మఠసంస్థలో చేరిన యువతులకు, మఠకన్యలకు తన జీవితంద్వారా అనేక పాఠాలు నేర్పించింది. నిత్యం పేదలతోనే ఉంటూ, పేదల కొరకే బ్రతుకుతూ, పేదల వలెనే జీవిస్తూ ఎల్లప్పుడు క్రీస్తుకు ప్రియులుగా జీవించాలని సెలవిచ్చింది. 'దయతో కూడిన ఔదార్యం, పేదరికం లోనే సేవ' అనే విధానాన్ని పేత్రా తన జీవనశైలిగా మలచుకొంది. దీని ద్వారానే తన వ్యక్తిగత పవిత్రతను పెంచుకుంటూ, తన అనుచరులు కూడ నిష్ఠతో వానిని ఆచరించేందుకు మార్గం సుగమం చేసింది. ఈ ప్రత్యేకత ఆమెలోని దైవ ప్రసాదిత ఆకర్షణశక్తి, ఆధ్యాత్మికత, జీవన విధానం నుండే పెంపొందింది. అది క్రీస్తు ప్రభువు

శిష్యరికంపైన బోధించిన ఆ ప్రాథమిక సూత్రం 'మీలో ఎవడు మొదటివాడు కాగోరునో, వాడు అందరిలో చివరివాడై, అందరికి సేవకుడుగా ఉండవలెను' (మార్కు 9:35) మరియు 'నేను మీ మధ్య ఒక సేవకుని వలె ఉన్నాను' (లూకా 22:27) అను సువార్తలోని దివ్యవచనాలపైననే పూర్తిగా ఆధారపడి ఉంది.

పేత్రా ప్రత్యేకంగా పేదల సేవ కోసం దీన సేవన సభను స్థాపించినప్పుడు, అది అంత సులభతరం కాలేదు. తాను స్థాపించిన నూతన మఠసభకు ముందుగా శ్రీసభ గుర్తింపు కావాలి. ఆ అనుమతి కొరకు ఆమె చేసిన ప్రయత్నాలకు సభ లోపల నుండి, బయటనుండి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నది. తమ సభ యొక్క ఉనికి, మనుగడ 'ఆధునిక ప్రపంచంలో నూతన ఒరవడిలో శ్రీసభగా జీవించడంలో ఉందని' పలు పర్యాయాలు, పదేపదే తన సహచరులకు తెలిపింది. గొప్ప గొప్ప కార్యాలు చేయడం ద్వారా లేదా గొప్పగొప్ప సంస్థలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా జీవితంలో పవిత్రతను పొందలేమని, అది సంపూర్తిగా క్రీస్తు సత్యసభకు సంపూర్ణ విధేయులై జీవించడంలోనే ఇమిడి ఉన్నదని ఆమె గ్రహించింది. ఆమెలోని ఉత్తమమైన, సర్వోన్నతమైన, ఆధ్యాత్మిక జీవనం దీన సేవన సభలో చేరిన మఠవాసులందరిని పవిత్ర శ్రీసభకు, దాని అధికారులకు ఎల్లప్పుడు తలయొగ్గి జీవిస్తూ, శ్రీసభకు సంపూర్ణంగా సేవలందించేలా ఉండాలని వారికి నూరిపోసింది.

ఒక క్రైస్తవురాలుగా, మఠవాసిగా, పేత్రాలోని ప్రత్యేక లక్షణాలు ఆమె జీవితంలో ప్రతినిత్యం కనిపిస్తాయి. ఒక నిర్దిష్టమైన ప్రయోజనం కొరకు దైవం ఆమెను ప్రత్యేకంగా ఎంపిక చేశాడు. ఆమె క్రైస్తవ జీవనం, మఠవాస ప్రయాణం మానవీయ విలువలతో నిండిఉంది. అష్ట భాగ్యాలనే మూల స్థంభాల పైననే తన మఠవాస జీవనాన్ని, తన సేవా నిరతిని నెలకొల్పింది. దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాదం తన జీవితంలో అద్వితీయమైన శక్తిగా విశ్వసించి, ఆ దివ్య సత్ప్రసాద ప్రభువు ప్రేరణతోనే తన జీవిత సర్వస్వాన్ని పేదల సేవకై అంకితం చేసింది. దైవమందసంలో నిరతం వాసమై యుండే దివ్యనాథుడు యేసుప్రభువు ఆశీస్సులతో పేత్రా పరుల సేవలో తన జీవితాన్ని సంపూర్తిగా సమర్పించింది.

దైవ ప్రేమలో, సోదర సేవలో మరీ ముఖ్యంగా నిరుపేదల సేవలో తరిస్తూ, తనలోని వీరోచిత పవిత్రతను చాటి చెప్పింది. ప్రార్థన, ధ్యానం ద్వారా, యేసుప్రభుని తన వ్యక్తిగత అనుభవాల ద్వారా తన ఊపిరిగా చేసుకుని పేత్రా పవిత్రతకే వన్నె తెచ్చింది. తన మఠవాస జీవితమంతా 'దైవాన్ని సంపూర్ణంగా ఆరాధించడం, పేదలకు నిస్వార్థంగా సేవచేయడం' అనే రెండు బృహత్తర ఆశయాలపైననే నిర్మించింది. తాను ఎల్లప్పుడు ప్రభు యేసు పొత్తుగానే భావించింది. అలాగే జీవించింది. నిరతం క్రీస్తు శరీరంతో కలసి, తనను తాను తండ్రి దేవునికి సమర్పించుకుంటూ, అందరి కొరకు

మరీ ముఖ్యంగా కడుపేదలు, ఆవసరంలో ఉన్న వారికొరకు క్రీస్తువలె జీవితాన్ని ధారబోయడం అలవరచుకుంది.

పేత్రా మఠవాస జీవన ఆరంభం నుండే ఆమె ఒక 'బాధామయ సేవకురాలు'గా మారింది. ఆమె శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రమలను ఎన్నో అనుభవించింది. ఆమె జీవితంలో అనుభవించిన శ్రమలు, కష్టాలు, బాధలన్నీ, పీడిత, అణగారిన, నిర్భాగ్యుల, రోగుల, అనాదరణకు గురైన ప్రతి ఒక్కరికి ప్రేమను పంచి, సేవానిరతిని పెంపొందించాయి. ప్రతిరోజు ఎన్నో శ్రమలు అనుభవిస్తూనే, 'నేను చనిపోకముందు నా జీవితంలో ఒక్క రోజైనా ప్రశాంతంగా నిద్రించగలనా?' అని సందేహించేది. అయినా వెంటనే 'నా చిత్తం కాదు, ప్రభు చిత్త ప్రకారమే జరగాలి' అని పలుకుతూ ఆ బాధలను పేత్రా స్వీకరించేది.

కేరళ రాష్ట్రం లోని కన్నూర్ జిల్లా సమీపంలో కూతుపరంబ - నెడింపోయి రోడ్డుమీద జూన్ 5, 1976లో జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదంలో పేత్రా తీవ్రంగా గాయపడింది. పేత్రా తన చివరి క్షణాలలో, 'దైవం తనకు అప్పగించిన కార్యాలను ముగించానని, దైవనిర్ణయం ప్రకారమే అంతా జరిగిందని' చెప్పి తుదిశ్వాస విడిచి, దైవసాన్నిధ్యం చేరుకుంది. ఆమె చివరి కోరిక మేరకు కేరళలోని 'పట్టువం'వద్ద ఉన్న దీన సేవన సభ ఆశ్రమ ప్రార్థనా మందిరంలో ఆమెను భూస్థాపితం చేశారు. 'మఠవాస జీవితం పేదలకొరకే' యని గాఢంగా నమ్మిన పేత్రాను కతోలిక శ్రీసభ గౌరవిస్తూ కన్నూరు పీఠాధిపతులు వర్గీస్ చకలాకల్ గారు పట్టువంలో పేత్రాను జూన్ 14, 2009న ''దైవ సేవకులు''గా ప్రకటించారు.





ప్రథమ భారతీయ మహిళా వేదసాక్షి

# 30. ధన్య రాణి మరియ

**(1954-1995)**

ఫాదర్ బూరుగు సుధాకర్, S.J.

రాణి మరియ కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్ ప్రాంతమందలి పుల్లువళి అను గ్రామంలో జన్మించింది. ఆమె వట్టలిల్ కుటుంబానికి చెందిన పెయిలి, ఎలీష్వా అను పుణ్య దంపతులకు జనవరి 29, 1954న రెండవ సంతానంగా జన్మించింది. ఆమెకు ఫిబ్రవరి 5న మేరి అను నామంతో జ్ఞానస్నానమిచ్చారు. ఆమెకు ఇద్దరు సోదరులు, నలుగురు సోదరీమణులున్నారు. మేరి చిన్నప్పటి నుండి దైవభక్తి కలిగి దేవాలయానికి వెళ్ళి, ప్రార్థనలో పాల్గొనటానికి ఎంతో ఆసక్తి చూపేది. అమె సౌమ్యురాలు. ఎంతో వినయ విధేయతలు కలిగి, మంచి విశ్వాసంతో జీవించింది. మేరి 1966లో ప్రథమ దివ్యసత్ప్రసాదాన్ని, భద్రమైన అభ్యంగనాన్ని పుల్లువళిలో పొందింది. మేరి తన ప్రాథమిక విద్యను, ప్రాథమికోన్నత విద్యను తన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. మేరి తమ దేవాలయంలో జరిగే ప్రార్థనలకు, తన కుటుంబ సభ్యులతో కలసి వెళ్ళేది. ప్రార్థనలు చేయటంలో, జపమాలను జపించటంలో మేరి ఎప్పుడూ ముందుండేది. మేరి చదువులలోను, ఆటలలోను చక్కగా రాణించింది.

మేరి తన చదువులతోపాటు ఇంటిపనులు కూడా చేసేది. తల్లిదండ్రులకు వ్యవసాయ పనులలో సహాయం చేసేది. మేరి ఉన్నత పాఠశాల వార్షిక పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలైంది. అందుచేత తండ్రి ఆమెను ఉన్నత చదువుల నిమిత్తం త్రిప్పునితురలో మఠకన్యలు నడుపుచున్న పునీత జోజప్పగారి జూనియర్ కళాశాలలో చేర్చాడు. అక్కడి మఠకన్యల జీవితం ఆమెను ఎంతగానో ఆకర్షించింది. ఆ మఠకన్యల మార్గదర్శకత్వంలో మేరి పలు ఆధ్యాత్మిక విషయాలు నేర్చుకుని, ప్రార్థనా జీవితంలో ఎదిగింది. ఆ కళాశాలలో చదువుతుండగా ఆమె దైవ పిలుపును పొంది, మఠకన్య కావాలని నిర్ణయించుకున్నది. ఆ దైవ పిలుపు విషయాన్ని తన బంధువైన సెసిలీతో పంచుకొంది. ఆమె కూడా మేరితో కలిసి, ఫ్రాన్సిస్కన్ క్లారిస్ట్ సభలో చేర నిర్ణయించుకుంది. వేసవి సెలవులలో మఠకన్య కావాలన్న తలంపును మేరి, తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. తన తోబుట్టువులంతా మేరి మఠకన్య కావటం ఇష్టంలేదని ఆమెను నిరుత్సాహ పరిచారు. మేరి తండ్రి పెయిలి, అమ్మమ్మలు మాత్రం 'దైవ పిలుపు అందరికి రాదు కదా! ఆ దైవ పిలుపును ఆపటానికి మనమెవరు?'' అని మేరి నిర్ణయాన్ని సమర్థించి, ఆమెను ఆశీర్వదించారు. మేరి, సెసిలీలు ఇద్దరూ కలిసి ఫ్రాన్సిస్కన్ క్లారిస్ట్ మఠసభలో

1972లో చేరారు. మేరి ప్రాథమిక శిక్షణ అనంతరం మే 1, 1973న నొవిషియేట్‌లో చేరింది. అక్కడ మేరి ప్రార్థనా జీవితంలో ఎదిగింది. మేరి మే 1, 1974న అంగామలి దేవాలయంలో 'రాణి మరియ' అను నూతన నామాన్ని పొంది, క్లారిస్టు సభలో మఠకన్యల అంగీని స్వీకరించి, మూడు మాటపట్టుల ద్వారా సంపూర్తిగా ప్రభునికి సమర్పించుకుంది.

"ప్రభుని ఆత్మ నాపై ఉన్నది. పేదలకు సువార్తను బోధించుటకై ఆయన నన్ను అభిషేకించెను" (లూకా 4:18) అను బైబులు వచనం ఆమె నెంతో ప్రేరేపించింది. ఉత్తర భారతదేశంలో పేదల మధ్య పనిచేస్తున్న మఠకన్యల గాథలను చదివి, తాను కూడా అదే రీతిలో నిరుపేదల సేవలు చేయాలని, రాణి మరియ కలలు కన్నది. ఉత్తరావనిలో బడుగు వర్గాలమధ్య పనిచేయాలన్న తన ఆశయాన్ని మఠ పెద్దలకు తెలుపుతూ రాణి మరియ లేఖ వ్రాసింది. అదే సమయంలో బిజ్నూరు పీఠాధిపతులైన గ్రేసియన్ తన మేత్రాసన పరిధిలో సంఘ సేవ చేయ, ఇద్దరు మఠకన్యలను పంపమని ఎర్నాకుళంలోని మఠ శ్రేష్ఠురాలికి విజ్ఞప్తి చేశారు. దానికోసమై సిస్టర్ రాణి మరియ, సిస్టర్ అన్నా జాన్‌లను ఎంపిక చేశారు. రాణి మరియ కుటుంబీకులు, ఆమె తమకు దూరంగా వెళ్తుందని బాధపడ్డారు. రాణి మరియ తన స్వయిష్టంతో ప్రభుని ద్రాక్షాతోటలో పనిచేయ కోరుకున్నదని గ్రహించి, అయిష్టంగానే ఆమెకు వారు వీడ్కోలు పలికారు.

రాణి మరియ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రమందున్న బిజ్నూరులోని పునీత మరియమ్మగారి మఠకన్యల గృహాన్ని డిసెంబరు 24, 1975న చేరుకుంది. ఆ ప్రాంతంలోని మారుమూల పల్లెలకు వెళ్ళి, పిల్లలకు చదువు సంధ్యలలో శ్రద్ధ కలిగించి, విద్యాబుద్ధులు నేర్పించటం తన పని. బీడు భూములలో పశువుల కాపలా కాస్తున్న బాలలను సమీకరించి, చెట్లకింద వారిని కూర్చోబెట్టి, ఎంతో ప్రేమగా వారికి చదవటం, వ్రాయటం నేర్పించింది. ఆ గ్రామాలలో రాణి మరియ ఎంతో కష్టపడి, ప్రాథమిక విద్యాభ్యాసానికి కావలసిన వనరులను సమీకరించి, గ్రామీణ బాల బాలికల విద్యా వికాసానికి దోహదపడింది. బాలలతోపాటు, మహిళలకు, వయోజనులకు కూడా విద్యాగంథం అందించ, రాణి మరియ నడుం కట్టింది. తాను పిన్న వయస్కురాలైనా ఆయా గ్రామాలలో ఎంతో అనుభవమున్న సంఘ సేవకురాలివలె పనిచేసి, అనతి కాలంలోనే గృహ నిర్మాణం, రోడ్లు వేయించటం, నీటి సరఫరా, విద్యుచ్ఛక్తి సదుపాయం మున్నగు పనులెన్నో చేపట్టి, అక్కడి పేదల, గ్రామీణుల సమగ్ర అభివృద్ధికై శక్తి వంచన లేకుండా కృషి చేసింది. విజయం సాధించింది. అందరి మన్ననలను, ప్రశంసలను పొందింది. "భయపడవలదు నేను నీతో ఉన్నాను" అని యేసు భగవానుడే అభయమిచ్చి తనను ధైర్యంగా ముందుకు నడిపించాడని ఆత్మ విశ్వాసంతో రాణి మరియ చెప్పుకుంది. రాణి మరియ ఎండనక, వాననక, దుమ్ము ధూళితో నిండిన రోడ్లలో పల్లె పల్లెకు తిరిగి, పేదల ఎదుగుదల కోసం నిర్విరామంగా పనిచేసింది. ఇంకా పాతికేళ్ళైనా నిండని యవ్వనవతియైన రాణి, ప్రభుని ఆశీస్సులతో ఎన్నో గొప్ప కార్యాలు చేసింది. పేదల గృహాలలో నవ్వులు పూయించి,

దైవరాజ్య విలువలతో, ఆర్థిక స్వావలంబనతో, సంతోషంగా జీవించేలా ఆమె పాటు పడింది. ఆమె బిజ్నూరు ప్రాంతంలో ఇరవై గ్రామాలలో ఎనిమిదేండ్లపాటు ఎంతో ఉత్సాహంతో, శ్రద్ధాసక్తులతో పేదల, గ్రామీణుల, వ్యవసాయ కూలీలతో కలసిపోయి నిండు మనస్సుతో పనిచేసింది. ఆమె ప్రార్థనా బలంతో, మరియతల్లి సహాయంతో, అస్సిసీపుర ఫ్రాన్సిస్ గారి ఆదర్శ జీవితంతో చైతన్యం పొంది, ఇన్ని గొప్ప మంచి పనులు చేయగలిగిందని, ఆమెతో కలసి పనిచేసిన కొట్టూరు గురువులు సెలవిచ్చారు. 1980లో రాణి మరియ అలువలో ప్రభువుకు శాశ్వత మాటపట్టు నిచ్చింది. 1982లో భోపాల్ విశ్వవిద్యాలయమందు సామాజిక శాస్త్రం చదివి, డిగ్రీ పట్టా పుచ్చుకుంది.

రాణి మరియ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సత్నా మేత్రాసనమందలి ఓడగడి అను పర్వతప్రాంతానికి 1983లో బదిలీ అయింది. అక్కడి ప్రజలు చాలా వెనుకబడినవారు. మోటువారు. చదువు సంధ్యలు అంతగా లేనివారు. వారిలో రాణి క్రీస్తు ప్రభువుని గాంచింది. వారికి సానబెడితే, విలువగల వజ్రాల్లా తయారౌతారని ఆమె గ్రహించింది. వారి స్థితిగతులు బాగుపడాలంటే ఉడుకు రక్తంతో ఉన్న యువత సహకారం అవసరమని గుర్తించి, యువతను చేర దీసింది. వారికి పలు విషయాలలో శిక్షణా సదస్సులు నేర్పాటు చేసి, పలు బృందాలుగా విభజించి, వేరు వేరు బాధ్యతలను వారికి అప్పగించింది. యువతలో, మహిళలలో, వయోజనులలో నిద్రాణమైయున్న శక్తిని బహిర్గతం చేసి, ఆ సమాజాన్ని బల సంపన్నులను చేసింది. అంతవరకు తమ ఆర్థిక అవసరాలకు భూస్వాములపైన, వడ్డీ వ్యాపారస్థులపైన ఆధారపడి, వారి అడుగులకు మడుగులొత్తి, బానిసలుగా బతికేవారు. ఇప్పుడు రాణి మరియ వారికి సహకార సంఘాల నేర్పరచి, బ్యాంకులలో ఋణాలు పొందేలా శిక్షణ ఇచ్చింది. ఓడగడి, దాని పరిసర గ్రామాలలోని పేద ప్రజలకు తలలో నాలుకగా ఉంటూ, చేపల పెంపకం, కుట్టుపని, అల్లికలు మున్నగు కుటీర పరిశ్రమలవైపు, బ్యాంకులలో డబ్బు పొదుపు చేయటం, అవసర సమయాలలో బ్యాంకు ఋణాలు పొందేలా శిక్షణ ఇచ్చి నడిపించింది. బీడు భూములలో బావులు త్రవ్వించి, నీటి సదుపాయం ఏర్పరచింది. నీటి కొరతను తీరుస్తూ, చిన్నపాటి చెరువు కట్టలను కట్టించి, నీటి పొదుపు నేర్పించింది. మహిళా మండళ్ళు ఏర్పరచి, పొదుపు కట్టడం, ఋణాలు పొందటం అలవాటు చేసి, మహిళా సాధికారతకు నాంది పలికింది. బాల బాలికలను చదువులలో ప్రోత్సహించింది. ఈ విధంగా వారిలో ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంచి, పేదలను ఒక మహత్తర శక్తిగా సంఘటిత పరచింది.

రాణి మరియ పేదల పక్షపాతిగా నిలబడి చేస్తున్న మంచి పనులు అక్కడి ధనిక వర్గాలకు కన్నెర్ర అయ్యింది. రాణి మరియ మత మార్పిడి చేస్తున్నారని అపవాదు వేశారు. తమ పరపతితో ధనవంతులు పేదలకు సహాయం చేస్తున్న ప్రభుత్వ అధికారులను, ఋణాలు అందిస్తున్న ప్రభుత్వ బ్యాంకుల సిబ్బందిని బెదిరించి, లొంగదీసుకున్నారు. దానితో అధికారులు పేదల అభివృద్ధికై ఋణాలివ్వటం, ఇతర సహాయాలు చేయటం

మానుకున్నారు. బ్యాంకు ఋణాల దరఖాస్తులను తిరస్కరిస్తూ వచ్చారు. అది తెలిసి అధికారుల వద్దకు నిర్భయంగా వెళ్ళి, తన మెడలోని సిలువను చేతితో పట్టుకుని "సర్! ఇదిగో మేము క్రీస్తు ప్రభుని కొరకు ఈ జీవితాన్ని స్వీకరించింది, మా తల్లిదండ్రులు పేదవారని కాదు, మా తల్లిదండ్రులు గతిలేక మమ్ము ఇంటి నుండి గెంటివేసారని కాదు. చూడండి! ఈ నిరుపేదలలో క్రీస్తు ప్రభుని చూసి, నిండుగా వారిని సేవించటానికే ఈ త్యాగపూరిత మఠజీవితానికి వచ్చాం" అని బల్లగుద్ది రాణి మరియ, ఆ అధికారులను పేదలకు సహాయపడమని సవాలు విసిరింది. ఆమెలోని నిజాయితీని, నిస్వార్థాన్ని, అంకిత భావాన్ని గమనించిన ప్రభుత్వాధికారులు, ఆమెకు క్రమక్రమంగా సహకరించి, పేదల అభ్యున్నతికై తమ వంతు సహాయాన్ని అందించారు. రాణి మరియ 1989లో రేవా విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్రం చదివి, అందులో మాస్టర్స్ డిగ్రీ పొంది, సమాజ సేవలో మెలుకువలు తెలుసుకుని, సాధికారితతో సేవలు చేసింది.

రాణి మరియ ఓడగడిలో తొమ్మిదేండ్లు సేవలందించిన పిమ్మట, బదిలీ మీద, మే 16, 1992న ఇండోర్ పీఠంలోని ఉదయ్‌నగర్ చేరుకుంది. ఇక్కడ ప్రజలంతా ఆదివాసీలే. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ప్రజలు వీరు. రాణి మరియ నిరుపేదల సంక్షేమంలో ఇప్పుడు చాలా అనుభవం గడించింది. ఏ కార్యక్రమాలు చేపడితే పేదలు చైతన్యవంతులౌతారో, ఆర్థికంగా బలం పుంజుకుంటారో ఇప్పుడు ఆమెకు స్పష్టంగా తెలుసు. యువతీ యువకులను, మహిళలను ఐక్యపరచి, చిన్న చిన్న బృందాలలో వారికి అభివృద్ధి గురించి, విద్య గురించి, పొదుపుల గురించి శిక్షణనిచ్చి, అమాయక గిరిజనులను అభివృద్ధి బాటలో నడిపించింది. గొర్రెల పెంపకం, తేనె సేకరణ, సాంబ్రాణి కడ్డీల తయారీ, గోనె సంచులు కుట్టటం, సవుడు భూములను సేద్యం చేయటం, బాలబాలికల విద్యకు పాఠశాలలు ఏర్పరచటం, తెలివిగల విద్యార్థులను ఉన్నత విద్యలకు పంపటం మున్నగు వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఆరంభించి, గిరిజనుల వెన్నంటి ఉండి, ఆ కార్యక్రమాల నిర్వహణలో ఎదురయ్యే సాధక బాధకాలను పరిష్కరించి, గిరిజనుల పాలిటి అమ్మలా, అమృతమూర్తిలా, వారిని ఆదుకుంది. వారి అభివృద్ధిలో ప్రభుని రూపం చూసుకుంది. రాణి మరియ కృషి ఫలితంగా అమాయకులైన గిరిజనుల జీవనంలో అనేక పెనుమార్పులు సంభవించాయి. వారు భూస్వాముల ఇళ్లల్లో, వ్యవసాయ భూములలో వెట్టి చాకిరీ చేయటం మానుకుని, తామే స్వయంగా చిన్న చిన్న వ్యవసాయ కమతాలలో వ్యవసాయం చేయటం నేర్చుకున్నారు. ఆర్థిక స్వావలంబన సాధించే దిశలో ప్రభుత్వ బ్యాంకుల నుండి తక్కువ వడ్డీకి ఋణాలు తీసుకోవటం, తిరిగి సకాలంలో చెల్లించటం ఆరంభించారు. ఈ విధంగా రాణి మరియ సేవా కార్యక్రమాల వలన, శిక్షణా సదస్సుల వలన ఉదయనగర్, ఇండోర్ పరిసర గ్రామాలలోని పేద గిరిజనులు ఆర్థికంగా ఎదుగుతూ, తమ కాళ్ళపై తాము నిలబడగలిగే స్థితికి చేరుకున్నారు. ఈ పేదల అభివృద్ధి, స్వావలంబన, అక్కడి వడ్డీ వ్యాపారస్తులకు,

భూస్వాములకు మింగుడు పడలేదు. దీనికంతటికీ కారణకర్త సిస్టర్ రాణి మరియ. కాబట్టి ఆమెను తుదిముట్టించాలి. అప్పుడే తమ ఆటలు సాగుతాయి. అప్పుడే గిరిజనులు తమ చెప్పు కింద తేలులా, బానిసలుగా పడి ఉంటారనే భావనకు వచ్చారు.

రాణి మరియలోని ఆధ్యాత్మికత మరింత వృద్ధి చెందింది. ఆమె పేద ప్రజలలో ప్రభుని సందర్శించి, పరిపూర్తిగా వారి సేవలో తలమునకలైంది. ఆదివాసీలు, వారి పిల్లలు రాణి మరియ ఆప్తులయ్యారు. ఆమె వారందరికీ తల్లీ, సోదరీ అయ్యింది. రాణి మరియ గిరిజనులతో సంపూర్తిగా మమేకమైంది. గిరిజనుల భవితవ్యంలో తన ఆనందాన్ని చూసుకుని, రాణి మరియ ఎంతో సంతృప్తి పడింది. వారి అభివృద్ధి కోసం రాణి ఎంతో తపనపడి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే, వారి శ్రేయస్సుకై అనునిత్యం కరుణామయుడైన యేసునాథుని ప్రార్థించేది. ప్రజల సేవలో ప్రభువు ఇచ్చే రక్షణ బహుమానం కోసం ఎదురు చూసిందే కాని, తమ మత పెద్దలు ఇచ్చే పదవులకోసం ఆమె ప్రాకులాడలేదు, ఆశపడలేదు.

ఉదయనగర్ ప్రాంతపు భూస్వామి అయిన జీవన్‌సింగ్, రాణి మరియ తన కంటిలో నలుసులా ఉందని, ఆమెను హతమార్చాలని పన్నాగం పన్నాడు. అతడు సమందర్‌సింగ్ అను యువకునికి డబ్బు ఆశ చూపి, సిస్టర్ రాణి మరియను హత్య చేయాలని పురమాయించాడు. రాణి మరియను చంపాలని అవకాశం కోసం ఎదురు చూస్తున్న వారిద్దరికి, మంచి అవకాశం రానే వచ్చింది. రాణి మరియ కేరళకు వెళ్ళనున్నారని తెలిసి, తమ హత్యాపథకం అమలు పరచటానికి వారు పూనుకున్నారు. అది ఫిబ్రవరి 25, 1995. ఆమె ఇండోర్, భోపాల్ మీదుగా కేరళ రాష్ట్రానికి వెళ్ళవలసిన రోజు. ఉదయాన్నే లేచిన రాణి మరియ తన ప్రాతఃకాల ప్రార్థనలను ముగించి, అల్పాహారం తీసుకుంది. తదుపరి దేవాలయానికి వెళ్ళి బైబులు గ్రంథాన్ని తెరచింది. "భయపడవద్దు. నిన్ను నేను నా అర చేతులలో చెక్కి యున్నాను", అను దైవ వాక్యాన్ని చదువుకుని స్నేహసదన్ మఠం నుండి బయలుదేరింది. రాణి మరియకు తోడుగా సిస్టర్ రీనా రోస్ బస్టాండ్ వరకు వచ్చింది. రాణి మరియ వెళ్ళవలసిన బస్సు ఆ రోజు రద్దు చేయబడింది. తరువాత బస్సులో వెళ్ళాలని భావించి, కాన్వెంటుకు తిరిగి వెళ్ళే క్రమంలో ఓ బస్సు కండక్టర్ కనిపించాడు. తెలిసిన వ్యక్తి కావటంతో బస్సులో ఒక సీటు సిస్టర్‌కు కేటాయించమని రీనా రోస్ కోరింది. దానికి అతడు అంగీకరించి, "మీ కాన్వెంట్ ముందే, సమయానికి నిలబడండి. నేను బస్సు ఆపి, సిస్టర్‌ని ఎక్కించుకుంటాను" అని చెప్పాడు. ఆ కండక్టర్ తాను చెప్పినట్లే కాన్వెంట్ ముందు బస్సు ఆపి, రాణి మరియను బస్సు ఎక్కించుకున్నాడు.

మఠకన్యలకు సాధారణంగా ముందు వరసలో సీటు కేటాయిస్తారు. దానికి భిన్నంగా ఆనాడు వెనుక సీట్లో వెళ్ళి రాణి మరియను కూర్చోమని కండక్టర్ చెప్పాడు. వెనుక సీట్లో అప్పటికే ముగ్గురు మగవారు ఉన్నారు. ఆ ముగ్గురిలో ఒకరు ఆ ప్రాంత భూస్వామి జీవన్ సింగ్. తనకు పరిచయమున్న వ్యక్తి కావటంతో, రాణి మరియ ఏమీ శంకించకుండా

వెళ్ళి, వారి మధ్యలో కూర్చుంది. ఆ ముగ్గురే తనను హత్య చేయబోతున్నారని ఆమెకు తెలియదు. నాచనబోరు కొండ సమీపానికి ఆ బస్సు చేరుకోగానే, తెల్ల దుస్తులలో ఉన్న సమందర్ సింగ్, బస్సు ఆపి, కిందకు దిగాడు. అక్కడ ఒక కొబ్బరికాయ కొట్టి, బస్సు ఎక్కి కొబ్బరి ముక్కలను అందరికి నవ్వుతూ పంచాడు. అందులో ఒక చిన్నముక్క రాణి మరియకు ఇవ్వబోతున్నట్లు చేయి చాచి, రాణి మరియ అందుకోబోయే లోపే, ఆట పట్టిస్తున్నట్లుగా తన చెయ్యి వెనక్కి లాగేసుకున్నాడు. అది చూచిన జీవన్ సింగ్, మరో యువకుడు హేళనగా నవ్వారు. అప్పుడు రాణి మరియ "ఎందుకు అంత సంతోషంగా ఉన్నావ"ని సమందర్ సింగ్‌ను అడిగింది. అతడు దానికి ప్రత్యుత్తరంగా "ఇందుకే నేను సంతోషంగా ఉన్నాను" అంటూ తన చేతితో కత్తి పట్టుకుని, రెప్పపాటులో రాణి మరియ పొట్టలో పొడిచాడు. వెంటనే రక్తం ఉబికింది. "యేసువా!" అంటూ రాణి మరియ పెద్దగా అరిచింది. అతని చేతిలోని కత్తిని పట్టుకోవాలని ప్రయత్నించింది. హాహాకారాలు చేస్తూ ఇతర ప్రయాణీకులు భయంతో బస్సు ఆపి, బస్సు దిగారు. అతడు కత్తితో పొడుస్తూనే వున్నాడు. తనకు తెలిసిన జీవన్ సింగ్, రాణి మరియను చంపమని హంతకుని ప్రోత్సహిస్తున్నాడని ఆమెకు అర్థమైంది. ఒకరిద్దరు ప్రయాణికులు హంతకులను ఆపాలని ప్రయత్నించినా, కత్తి చూపి వారిని బెదిరించడంతో, వారు ఆమెను కాపాడలేక పోయారు. ఆమెను బస్సు నుండి కర్కశంగా కాళ్ళు పట్టి క్రిందికు లాగి, రోడ్డుపైన పడవేశాడు. ఆమె ముఖాన్ని చిద్రం చేసాడు. అతడు కత్తితో దాదాపు యాభై పోట్లు పొడిచాడు. ఆమె బాధతో అరచింది. మూలిగింది. ఆమెను రోడ్డు మీద పడవేసిన తరువాత, బస్సు డ్రైవర్ని బస్సుతో ఆమెను త్రొక్కించమని బెదిరించాడు. కాని దానికి డ్రైవరు అంగీకరించలేదు. ఆ బస్సులో ఆమెకు తెలిసినవారు, ఆమె సహాయం పొందినవారు కొందరు ఉన్నారు. కాని వారు ఆమెను కాపాడలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. "యేసువా! యేసువా!" అంటూ రాణి మరియ తుది శ్వాస విడిచింది.

రాణి మరియ భౌతిక దేహాన్ని ఇండోర్ కతెడ్రల్‌కు తీసుకునివచ్చి, జార్జి పీఠాధిపతులు దివ్య పూజాబలి సమర్పించారు. తరువాత ఫిబ్రవరి 27, 1995న ఉదయ్‌నగర్‌లోని మీర్జాపూరు నందలి తిరు హృదయ దేవాలయ ప్రాంగణంలో దివ్య పూజాబలి సమర్పించి, దాదాపు 1200 మంది ప్రజల రోదనతో సిస్టర్ రాణి మరియను భూస్థాపితం చేసారు. సిస్టర్ రాణి మరియ ఆధునిక కాలంలో కతోలిక విశ్వాసం కోసం ఉత్తర భారత దేశంలో రక్తం చిందించిన ప్రప్రథమ మహిళ. సిస్టర్ రాణి మరియ ఎంతో వీరోచిత క్రైస్తవ ఆదర్శాన్ని కనబరచింది. బడుగు, బలహీన వర్గాల స్వరమై నిలిచింది. ఆమె గౌరవార్థం ఎర్నాకుళంలో ఒక మ్యూజియం ఏర్పాటు చేసి, ఆమె వేదసాక్షి మరణాన్ని సిరో-మలబారు క్రైస్తవులు గౌరవముతో స్మరించుకుంటున్నారు. ఆమె పునీత పట్టా ప్రక్రియ 2003లో ప్రారంభమైంది. ఆమెను జూన్ 29, 2005న 'దైవ సేవకులు'గా ప్రకటించారు. సిస్టర్ రాణి మరియను ఫ్రాన్సిస్ జగద్గురువులు నవంబరు 4, 2017న రోమాపురిలో "వేదసాక్షి ధన్యులు"గా ప్రకటించారు.

# దైవ సేవకు జేసుసభ ఆహ్వానం

ప్రియమైన కతోలిక యువకుల్లారా!

పునీత ఇగ్నేషియస్ లొయోలా గారు, పునీత ఫ్రాన్సిస్ శౌరి, పునీత పీటర్ ఫేబరు మొదలగు పారిస్ యూనివర్సిటీ సహచర విద్యార్థులతో జేసుసభను 1540లో స్థాపించారు. జేసుసభ సభ్యులందరూ ఏది చేసినా, ఎప్పుడు చేసినా "సర్వము సర్వేశ్వరుని సర్వోన్నతి కొరకే" చేస్తూ, జగద్గురువుల కనుసన్నలలో, సుశిక్షితులైన ప్రత్యేక సైన్యంగా మెలుగుతూ శ్రీసభను, విశ్వాసులను సంపూర్ణంగా సేవించాలని స్థాపకుడైన ఇగ్నేషియస్ లొయోలా గొప్ప ఆశయం. ఇగ్నేషియస్ తన అనుచరులను ప్రపంచ నలుమూలలా పంపి క్రైస్తవ మతం ఎంతో విస్తరించటానికి నాంది పలికాడు. అందులో భాగంగా పునీత ఫ్రాన్సిస్ శౌరివారు మన భారతదేశం ఏతెంచి, వివిధ ప్రాంతాలలో లక్షలాది మందికి జ్ఞానస్నాన భాగ్యం కల్పించారు. శౌరివారి అడుగు జాడలలో ఎందరో జేసుసభ గురువులు, బ్రదర్లు, మన దేశం వచ్చి, ఎంతో శ్రమించి, క్రీస్తు ప్రభుని రాజ్యాన్ని దేశమంతా స్థాపించి, మనకు ప్రభుని రక్షణను ప్రసాదించారు. వారిలో కొందరిని కతోలిక శ్రీసభ పునీతులుగా, ధన్యులుగా, పూజ్యులుగా, దైవ సేవకులుగా గుర్తించింది. పునీత ఫ్రాన్సిస్ శౌరి, ధన్య రుడాల్ఫ్ అక్వవీవా, పునీత జాన్ డి బ్రిట్టో, దైవ సేవకులు కాన్‌స్టంట్ లీవెన్సు, దైవ సేవకులు లూయి లెవె, రాబర్ట్ డి నొబిలి, మన తెలుగు శ్రీసభ స్థాపనకు ముఖ్యులైన పూజ్య గురువులు సంజీవనాథ స్వామి, సత్య బోధ స్వామి సంక్షిప్త జీవిత గాథలు ఇతర భారతీయ పునీతుల జీవిత చరిత్రలతోపాటు ఈ పుస్తకంలో పొందుపరచాం.

ఈ పునీతుల వలె నీవు కూడా పవిత్ర శ్రీసభ కొరకు శ్రమించి, జీవితం సమర్పించ సిద్ధంగా ఉన్నావా? పరుల కొరకు జీవిస్తూ, దైవ రాజ్యం స్థాపించ సిద్ధంగా ఉన్నావా? ప్రజలందరిని ప్రభుని చెంతకు నడిపించాలనే కోరిక ఉందా? పేదలతో కలిసి నడుస్తూ, సమాజంలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలా నడిపించాలనే దృఢ సంకల్పం నీలో ఉందా? యువతీ యువకుల బంగారు భవిష్యత్తు కోసం, యువతతో కలిసి పయనించాలనే ఆశయం ఉందా? భూమాత సంరక్షణలో క్రియా పూర్వకంగా పాల్గొనాలని ఉందా? దైవసేవ, మానవ సేవ చేయాలనే ఆలోచనతో ఉన్న నీలాంటి యువకుల కోసం జేసుసభ ద్వారాలు ఎప్పుడూ తెరచే ఉంటాయి. నేడు జేసుసభ 112 దేశాలలో 16,500 సభ్యులతో పై ఆశయాల సాధన కోసం నిరంతరం శ్రమిస్తోంది. నీ కలలను నిజం చేసుకుంటూ మా జేసుసభలో చేరమని ఆహ్వానిస్తున్నాము. దైవ రాజ్య స్థాపనలో నీ చేయి కలిపి, శ్రీసభ కొరకు ఉత్సాహంగా మా జేసుసభతో కలసి పనిచేయి.

**జేసుసభ గురించి మరిన్ని వివరాలకు ఈ చిరునామాలోగాని, మీకు సమీపంలో ఉన్న జేసుసభ గురువును గాని సంప్రదించండి.**

**Fr. Vocation Promoter, Ananda Jyothi, Nagarjuna Nagar, Guntur-522 510, A.P. Cell : 8919821562**



కరుణామయుడు క్రీస్తు ప్రభువు



మరియగిరి మాత



మరియగిరి పుణ్యక్షేత్ర ఉత్సవాలు



శ్రీ సంజీవనాథ స్వామి మఠం



పుణ్యక్షేత్రంలో వృద్ధులకు నిత్యాన్నదానం



పూజ్యులు శ్రీ సంజీవనాథ స్వామి సమాధి

# మరియగిరి మాత పుణ్యక్షేత్రం

కృష్ణాపురం - 515159, అనంతపురం జిల్లా

- తెలుగు క్రైస్తవుల పుట్టినింట కృతజ్ఞతగా వెలసిన మరియతల్లి పుణ్యక్షేత్రం.
- పుణ్యక్షేత్ర పండుగ ప్రతి సంవత్సరం జనవరి 14, 15 లలో జరుగును.
- వృద్ధులకు, భక్తులకు నిత్యాన్నదానం కలదు. కొద్ది మంది భక్తులకు వసతి సౌకర్యం కలదు.
- ప్రతి శని, ఆదివారాలు పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు కలవు.

- పుణ్యక్షేత్ర డైరెక్టర్ : 8688980051



'నా తండ్రిచే దీవింపబడిన వారలారా! రండు.
ప్రపంచ ప్రారంభము నుండి మీకై సిద్ధపరుపబడిన
రాజ్యమును చేకొనుడు.
ఏలయన
నేను ఆకలి గొనినపుడు మీరు ఆహారము నొసగితిరి,
దప్పిక గొనినపుడు దాహము తీర్చితిరి.
పరదేశినై ఉన్నప్పుడు నన్ను ఆదరించితిరి.
నేను వస్త్రహీనుడనై యున్నపుడు వస్త్రములను ఇచ్చితిరి.
రోగినై యున్నపుడు నన్ను పరామర్శించితిరి,
చెరసాలలో ఉన్నపుడు నన్ను దర్శింప వచ్చితిరి'.

- మత్తయి 25:34-36






